ఆర్ష విద్యా తరంగిణి

# ఈశావాస్యోపనిషత్

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

**EESAVASYOPANISHAD**



ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్

## స్వామి పరమార్థానంద

## బోధనల స్ఫూర్తితో, వారి ఆశీస్సులతో

## తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

**EESAVASYOPANISHAD**
First Edition - Sankara Jayanthi 2023
1000 copies

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP - Sri S Rajendra Kumar 98661 15622

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222
Price Rs. 150

# బ్రహ్మయజ్ఞం

శ్రీ తిరుమలశెట్టి వెంకట రామమోహనరావు గారి గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంకోవిధంగా చూస్తే చెప్పనవసరం లేదు కూడా. జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేలా?

ఆన్‌లైన్ క్లాసులకు శ్రీకారం చుట్టిన వెంటనే దానికి సంబంధించిన విషయాలు తెలుసుకుని, ఎమ్మెస్ టీమ్స్ ఏర్పాటు చేశారు. అంతేనా! దాదాపు 500 సభ్యులకు ఒక్కొక్కరికి విడిగా, ఆన్ లైన్ క్లాస్‌కు ఎలా అటెండ్ అవాలో, చాలా ఓపికగా నేర్పారు.

ఇదొక్కటే కాదు! మేము చేపట్టిన ఏ బృహత్కార్యం కూడా ఆయన సహాయసహకారాలు లేనిదే ముందుకు సాగలేదు. వేదాంత శిబిరాలు పెడితే, సమస్త ఏర్పాట్లు చేస్తూ, వాటి సమాచారం, జమా ఖర్చులు ఎక్సెల్ షీట్స్ వేసి మరీ అడుగడుగునా సభ్యులతో చర్చిస్తూ, దిగ్విజయంగా ముగిసేలా చేస్తున్నారు. ఆర్షవిద్యా తరంగిణి ట్రస్టుకు సంబంధించిన అనేక అంశాలు నిశితంగా చూస్తున్నారు.

సత్సంగ్ సభ్యులకు వివేకచూడామణిమీద పూర్తి అవగాహన కలిగేలా మననానికి ఒక వాట్స్ అప్ వేదిక ఏర్పాటు చేసి మననం చేయిస్తున్నారు.సభ్యులను ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళుతున్నారు. మనం ప్రచురించే పుస్తకాలకు ప్రూఫ్‌రీడింగ్ కూడా చేస్తున్నారు. పేరులో రాముడున్నాడు గాని హనుమంతుడిలా భక్తిప్రపత్తులతో, ఎనలేని అంకితభావంతో, సేవ చేస్తారు.

శ్రీరామమోహనరావుగారిని మా దంపతులమే కాక, ఇంతకు ముందు వారి జీవితాన్ని ప్రభావితం చేసిన గురువులు– ప్రకృతి వైద్యశిరోమణి మంతెన సత్యనారాయణ రాజు గారు, ఇంకా యోగాసనాలు నేర్పిన నిస్వార్థ నిరపేక్ష నిరుపమాన గురువులు హఠయోగి నిఖిల్ గురూజీ (అంబికా యోగ కుటీర్, థానే). వీరిని సదా గౌరవంతో స్మరిస్తూ ఉంటారు.

ఆయన సతీమణి వసుంధరగారు, భక్తిప్రపత్తులకు పెట్టింది పేరు. ఆమె మన భగవద్గీతను అధ్యయనం చేస్తున్న తొలిరోజుల్లోనే ఈ బ్రహ్మయజ్ఞానికి నడుంకట్టారు.

ఈశావాస్యోపనిషత్ పుస్తకప్రచురణ అనే బ్రహ్మయజ్ఞానికి ఈ దంపతులు ఇతోధికంగా ఆర్థిక సహాయం చేశారు.

**శ్రీ తిరుమలశెట్టి వెంకట రామమోహనరావు గారికి, శ్రీమతి తిరుమలశెట్టి వసుంధరగారికి, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి కలుగచేయాలని ఆ భగవంతుణ్ణి వేదుకుంటున్నాము.**

**– రాఘవ రావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 03 |
| 2. | మున్నుడి | 05 |
| 3. | పరమార్థానంద స్వామీజీ ఆశీస్సులు | 09 |
| 4. | కంచి కామాక్షీదేవి కురిపించిన ఆనందవర్షాలు | 10 |
| 5. | దొరకునా ఇటువంటి సేవ! | 14 |
| 6. | పూర్వపీఠిక | 17 |
| 7. | ఈశావాస్యోపనిషత్ మంత్రాలు | 20 |
| 8. | ఈశావాస్యోపనిషత్ – ఉపోద్ఘాతం | 22 |
| 9. | శాంతిపాఠం | 37 |
| 10. | శ్రీ శంకర భగవత్పాదుల ఉపోద్ఘాతం | 44 |
| 11. | ఈశావాస్యోపనిషత్ – విహంగవీక్షణం | 49 |
| 12. | ఈశావాస్యోపనిషత్ – వివరణ | 53 |
| 13. | జ్ఞానకర్మ సముచ్చయ భాష్యం | 61 |
| 14. | శంకరాచార్యులవారి అవతారిక | 83 |
| 15. | ఉపనిషత్ తాత్పర్యనిర్ణయ భాష్యం | 116 |
| 16. | ఈశావాస్యోపనిషత్ – సారాంశం | 125 |
| 17. | శిష్యుల సందేహాలు – స్వామీజీ సమాధానాలు | 139 |

# మున్నుడి

సంస్కారం అనేది ఒక వ్యక్తికి సంబంధించినది. సంస్కృతి అనేది ఒక సమాజానికి సంబంధించినది. మన భారతీయ సంస్కృతి ముక్తి సంస్కృతి. ఆ ముక్తినే మోక్షము, కైవల్యము, అపవర్గము అనియూ అంటారు. 'ముక్తి' అంటే విడుదల. దేన్నుంచి విడుదల?

దుఃఖాన్నుంచి, బంధాన్నుంచి, కర్తృత్వాన్నుంచి, హీన ఉచ్చభావాలనుంచి, పోల్చుకోవటంనుంచి, లేమినుంచి, కొరతనుంచి, అజ్ఞానంనుంచి, అహంకారంనుంచి.

మన భారతీయ వివాహవ్యవస్థలో 'కాశీయాత్ర' అనే ఒక ఆచారం ఉంది. అబ్బాయి చిన్నవయసులో గురుకులానికి వెళ్ళి 10, 12 ఏళ్ళు గురుకులంలో గురుసేవ చేస్తూ, విద్యనార్జిస్తూ ఏకాగ్రతతో జీవితాన్ని బ్రహ్మచారిగా గడిపి ఇంటికి తిరిగొస్తాడు. దాన్నే 'దీర్ఘసత్రం' అని అంటారు. ఇంతకాలం కేశసంస్కారం కూడా లేకుండా గురుసేవ, విద్యార్జన మరియు మంత్రానుష్ఠానము మొదలగు సాధనల్లో నిమగ్నమైయున్నాడు కనుక ఇంటికి వచ్చినప్పుడే ముండనం చేయించి పసుపునీళ్ళతో స్నానం చేయిస్తారు. అదే 'అవభృతస్నానం' అంటారు. ఇప్పుడతడు –

| | |
|---|---|
| "అహం కాశ్యాం గచ్ఛామి" అనంటాడు | నేను కాశీకి వెళ్తాను |
| కిమర్థం? అని తల్లిదండ్రుల ప్రశ్న | ఎందుకు? |
| తపస్యాయ! | తపస్సుకోసం |
| కిమర్థం తపః? | తపస్సెందుకు? |
| ముక్త్యాయ! అని చివరి సమాధానం | ముక్తికోసం! |

అప్పుడు అక్కడున్న ఒకాయన "బాబూ! నువ్వు కాశీకెళ్ళటం, తపస్సు చేయటం, ముక్తిని పొందటం మంచిదే. కానీ, మా అమ్మాయినిచ్చి నీకు పెళ్ళి చేస్తాము. పెళ్ళి చేసుకుని మీరిద్దరూ గృహస్థాశ్రమాన్ని ఆచరిస్తూ, కలసి తపస్సును చేయండి. మీ తపస్సుకు కావాల్సిన సౌకర్యాలను మేము మీకు కల్పిస్తాము" అని చెప్పగా 'ఆమ్' = 'అలాగే' అని సమాధానమిస్తాడు. ఇక అప్పుడు వివాహాచారాలను మొదలుపెడతారు. వటువు కాస్తా వరుడుగా మారతాడు.

వివాహారంభంలో ఉండే 'కాశీయాత్ర' అనే ఆచారం మనకు ఏమి తెలుపుతుందంటే అబ్బాయి–అమ్మాయి పెండ్లి ద్వారా ఒక్కటయ్యేది ఏదో వేడుకకు, వినోదానికి మాత్రమే కాదు. గృహస్థాశ్రమాన్ని బాధ్యతగా నడపటానికి. తద్వారా వాళ్ళకు బుద్ధి పరిపక్వత, మనోవికాసాలతో జీవన సాఫల్యమైన ముక్తిని పొందటానికి. కనుకనే దాన్ని 'గృహస్థ

ఆశ్రమం' అంటారు. కనుక మనది 'ముక్తి' సంస్కృతి. ప్రపంచంలో ఇంకే సంస్కృతీ ఇలాంటిది లేదు. ఇది ఋషులు మనకిచ్చిన గొప్ప, సుదీర్ఘవారసత్వం. ఈ జ్ఞానవారసత్వం మనకు వచ్చుటకు ఎందరో త్యాగధనుల, జ్ఞానుల, ఆచార్యుల, గురువుల అజ్ఞాత జీవితాలున్నాయి. ఈ వారసత్వం, ఈ గురు-శిష్య ఆధ్యాత్మిక పరంపర మనవరకు వచ్చిందంటే ఇప్పుడు దాన్ని మనం నిలబెట్టాలి.

భగవంతుడు మనకిచ్చిన గొప్పవరం మానవజన్మ.

మనకు మనమిచ్చుకొనే గొప్పవరం స్పష్టత=clarity. Work for clarity=స్పష్టత కోసం ప్రయత్నించండి. అందుకోసం మన ప్రాచీన జ్ఞానవారసత్వంలోకి చూడండి! ఇది ఆధ్యాత్మిక శాస్త్ర శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా కలుగుతుంది. ఇదే అధ్యాత్మ అధ్యయనం.

వేదాన్తోనామ ఉపనిషత్ ప్రమాణం = ఉపనిషత్ ఆధారంగా గల జ్ఞానవిచారణే వేదాన్తము.

మతంలో మన దృష్టి గుడిమీదో, గుడిలోని దేవుడిమీదో ఉంటుంది. ఆధ్యాత్మికంలో/వేదాన్తంలో మన దృష్టి మనమీదుంటుంది. మనమీద=ఆత్మదృష్టి. తనను తాను శోధించుకోవటం. శోధనే అన్వేషణ కనుక ఇదే సత్యాన్వేషణ! ఈ జీవితం ఎందుకు? అని ఆరంభించి శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి చిత్తాహంకారములను దాటి ఆత్మస్వరూపం వరకు చేరుకోవటానికే ఈ అన్వేషణ. శోధనే సాధన. సరిగ్గా ప్రాణాయామం చేస్తే దేహంలోని ప్రతి కణమూ శుభ్రమయినట్లుగా సరిగ్గా వేదాన్తశాస్త్ర శోధన చేస్తే జీవితపు ప్రతి అడుగూ, ప్రతి ఆలోచనా శుద్ధంగా, ఉన్నతంగా మారిపోతుంది.

గురు-శిష్య లేదా ఆచార్య-జిజ్ఞాసువుల మధ్య జ్ఞానాన్వేషణే ఉపనిషత్తులు. ఇవి వందల కొలదీ ఉన్నా ముఖ్యంగా పది మనకందాయి శ్రీ శంకరుల భాష్యాలవల్ల. వాటిలో మొదటిది శుక్లయజుర్వేదీయ ఈశావాస్యోపనిషత్. 18 మంత్రాలతో విరాజిల్లే ఈ చిన్న ఉపనిషత్ మొదటి మంత్రం -

**ఈశా వాస్యమిదం సర్వం యత్కిం చ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్య స్విద్ధనమ్ ॥**

భావార్థం: ఈ జగత్తంతయూ ఈశ్వరుడిచేత వ్యాపింపబడింది. మట్టే కుండయినట్లుగా పరమాత్మే జగత్తయ్యాడు = జగత ఈశధీ. ఈ జగత్తును త్యాగబుద్ధితో అనుభవించు. ఇదేదీ నీది కాదు నీ శరీరంతో సహా, కనుక ఎవరి సొత్తుకూ కొంచమూ ఆశపడవద్దు!

ఎన్నో ఏండ్ల క్రితం ఒకతను "మీ ఉపనిషత్తులూ మా కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్నే బోధిస్తున్నాయంటనే!" అని ప్రశ్నిస్తే అంతగా ఆనాడు అవగాహన లేక నేనేమీ చెప్పలేక పోయాను. కాని ఈ రోజు చెప్పగలిగేదేమంటే వందేళ్ళ కమ్యూనిస్ట్ భావాలను వేల ఏళ్ళ

క్రితమే ఈశావాస్యం మొదటిమంత్రం ప్రపంచానికి చాటింది అని. కమ్యూనిస్ట్ ఆలోచనను చెప్పి దాన్ని దాటి పొమ్మంది ఈశావాస్యం. ఈ మొదటి మంత్రం చాలా ప్రసిద్ధి చెందిన మంత్రం. ఇందులో జీవితకళంతా ఇమిడి ఉంది.

**వేదాంతార్థ విచారేణ జాయతే జ్ఞానముత్తమమ్ ।**
**తేనాత్యంతిక సంసార దుఃఖనాశో భవత్యను ॥** – వివేక చూడామణి

తా: ఉపనిషత్తుల అర్థాలను విచారిస్తే ఉత్తమజ్ఞానం కలుగుతుంది. అందువల్ల సంసార దుఃఖం పూర్తిగా నశిస్తుంది.

ఈ క్రింది విధంగా ఈశావాస్య మంత్రాలు వివరిస్తాయి:

బ్రహ్మమే సర్వమూ, లోభాన్ని దూరంగా పెట్టు, గృహస్థ విధులు, ఆత్మతత్వము, సర్వమానవ సోదరత్వం, కర్మోపాసనల సముచ్చయ సాధన, భక్తిజ్ఞానముల సముచ్చయము, సూర్యప్రార్థన, అగ్నిస్తుతి, మరణం, పునర్జన్మ, జన్మరాహిత్యం మొదలగు విషయములు ఇందులో ఉన్నవి.

* * *

బురదనుండి పుట్టిన తామరాకు నీటితో సంబంధం పెట్టుకొని అక్కడే అతుక్కుపోతుంది. ఆ బురద నుండే పుట్టిన తామరపూవు సూర్యుడితో సంబంధం పెట్టుకొని పైకి లేచి తెల్లగా అనేక దళపద్మముగా వికసిస్తుంది.

ఇది శ్రీయుతులు రాజ్యశ్రీ రాఘవరావు గార్లకు సరిపోతుంది. 'చెన్న'పట్నంలో వారిరువురు పలు సంవత్సరాలు శ్రవణ, మననాలు చేశారు. 'వృత్తి'కాలంలో మంచి 'ప్రవృత్తి'ని కనుగొని శేషజీవితాన్ని (Retd. life) విశేషంగా గడుపుతూ తమ మహద్భాగ్యంగా భాగ్యనగరాన్ని మారుస్తున్నారు. జీవితానికి పరమ అర్థాన్ని అందుకున్నారు పరమార్థానందులనుండి.

చెన్న=మంచి. ఎంత మంచి? జీవితాన్ని అందంగా, భాగ్యంగా సమూలంగా మార్చేంత మంచి. అదే శ్రేయస్సు. చెన్నపట్నంలో పొందిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఇప్పుడు తాముండే తావులో వెదజల్లుతూ నిజమైన భాగ్యనగరంగా కృషి చేస్తున్నారు. కృషి=వ్యవసాయం. కృషి చేసేవాడు ఋషి అవుతాడు. ఆధ్యాత్మిక బీజాలను వెదజల్లి మామూలు మానవులను జిజ్ఞాసువులుగా, ముముక్షువులుగా, సాధకులుగా చెక్కి, తీర్చిదిద్ది, 'ఆత్మజ్ఞానం' అనే శ్రేష్ఠ పంటను పండిస్తున్నారు. ఇది అరుదైన పంట. ఇది బయట కనపడదు. దుర్లభమైన పంట. సాధకుల మస్తిష్కాలలో, జీవితాల్లో కనబడే పంట.

మన ప్రాచీన ఋషులందరూ గృహస్థులే. వారి మార్గంలో ఈ దంపతులు నడుస్తూ తమ చుట్టూ ఉండేవారిని ఆ బాటలో నడిపించే స్ఫూర్తిని కలిగిస్తూ, అందరికీ 'శ్రేయస్సు'ను కలిగిస్తున్నారు. లోకంలోని మానవకోటి అంతా ప్రేయస్సు వైపు పరుగులు పెడ్తున్నారు.

దుఃఖంలో కూరుకుపోయేట్లు చేస్తుందది. శ్రేయస్సు దుఃఖాన్నుండి బైటపడేసి, తనలోనే ఆనందాన్ని కనుగొనేట్లు వెలుగునిస్తుంది.

శ్రీమతి రాజ్యశ్రీ రచించిన ఈశావాస్యోపనిషత్ మూలప్రతిని చదివాను. వారి అవగాహన, అర్థవివరణ, విషయకూర్పు చక్కగా ఉన్నాయి. వారికి ప్రశంసలు. దాదాపు 42 పేజీల ఉపోద్ఘాతం ఈ గ్రంథారంభంలో సాధకుడికి వేదాన్తశాస్త్ర క్లుప్తపరిచయం చేస్తుంది ఉపనిషత్‌లోకి దిగే ముందు పాఠకులు ఆ చక్కని ఉపోద్ఘాతాన్ని ఆకళింపు చేసుకోవాలని విజ్ఞప్తి. అలాగే అన్ని 18 మంత్రాలకు చక్కని వివరణ రాశారు.

రచయిత్రి యొక్క నిదిధ్యాసనే ఈ గ్రంథరూపంలో వెలువడింది. పాఠకులు దీన్ని చక్కగా ఉపయోగించుకొందురు గాక!

సర్వులకూ సద్భావ మంగళాశీస్సులు!!

లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు! ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

మీ అంతరాత్మ

**శుద్ధ చైతన్యానన్దస్వామి**

9 జనవరి 2023

శ్రీ సిద్ధేశ్వర స్వామి క్షేత్రము
సిద్ధేశ్వరం 523 254,
గార్లపేట పోస్టు, కనిగిరి మండలం
ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్

# పరమార్థానంద స్వామీజీ ఆశీస్సులు

Swami Paramarthananda

Sriram Apartments,
80, St. Mary's Road,
Chennai - 600 018.
Phone : 2499 7459

Date : 8-12-22

Dear Raghava Rao
& Rajya Sri

Received your letter along with the 2 copies of Taittiriya-upanishad. Congratulations.

Very happy to see that the publication of Telugu books on Prasthanatrayam is almost over. By the Grace of God and Guruparampara, the rest also will happen smoothly.

With Blessings
Paramarthananda

# కంచి కామాక్షీదేవి కురిపించిన ఆనందవర్షాలు



ఘల్లు ఘల్లున కాలి గజ్జెలందెలు మ్రోగ,
కలహంస నడకల కామాక్షీ ఎక్కడికే?
కలియుగ జన్మమున పరమశివుడైనట్టి,
ఆదిశంకరుల అద్వైతామృతవర్షిణి సన్నిధికే!

కంచి కామాక్షీ కృపతో, శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతిగారి అనుగ్రహంతో, పరమార్థానంద స్వామీజీ ఆశీస్సులతో, మా వేదాంత శిబిరం-4 విజయవంతంగా జరుపుకుని, కంచి కామాక్షీదేవీ కురిపించిన ఆనందవర్షాలను ఎన్నింటినో కొంగునిండా నింపుకుని వచ్చాము.

1. **విద్యానందం:** ఎ) **ఏకాదశ ఉపనిషత్తుల సారం** – అన్ని ఉపనిషత్తుల సారం ఒకటే! **బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః.** దీన్ని గతి సామాన్యదర్శనం అంటారు. అంటే భిన్నత్వంలో ఏకత్వం చూస్తాము. కాని గురువులు రాఘవరావుగారు ఏకాదశ ఉపనిషత్తుల సారం లోతులు కొలిచిన విశ్లేషణ తీరు చూస్తే, ఏకత్వంలో భిన్నత్వం కూడా తెలుస్తుంది. అన్ని ఉపనిషత్తులూ నేర్పించేది ఒకటే అయినా, దేని ప్రత్యేకత దానిదే!

| | | |
|---|---|---|
| ముండకోపనిషత్ | – | ఏకం, నిత్యం, సారం, సత్యం – కారణబ్రహ్మ<br>అనేకం, అనిత్యం, అసారం, అసత్యం – కార్యబ్రహ్మ |
| కఠోపనిషత్ | – | ఆత్మ నిర్వచనాలు ఎన్నో వస్తాయి – ఆత్మ నిత్యం, సత్యం, సర్వవ్యాపకం, అకర్తా, అభోక్తా, నిర్వికారం, అసంగం |
| కేనోపనిషత్ | – | పదాల గారడీలతో ఆత్మ అర్థం అయిందంటే అర్థం కాలేదని అర్థం, ఎందుకంటే ఆత్మ ఆబ్జెక్టు కాదు అని బోధిస్తుంది. |
| కైవల్యోపనిషత్ | – | ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి నేనే సృష్టి, స్థితి, లయ కారకుడనని చెప్పగలుగుతాడు. |
| ప్రశ్నోపనిషత్ | – | సూక్ష్మశరీరంలోని 19 అంగాల విశ్లేషణ, షోడశకలా పురుషుని వివరణ |
| మాండూక్యోపనిషత్ | – | అజాతి వాదన – నిజంగా సృష్టి జరగలేదు. అయమాత్మా బ్రహ్మ ద్వారా చతుష్పాద ఆత్మను చతుర్మాత్ర ఓంకారంతో పోల్చి చెబుతుంది. |
| ఐతరేయోపనిషత్ | – | ప్రజ్ఞానం బ్రహ్మ మహావాక్యం ద్వారా సర్వం బ్రహ్మమయం జగత్ అని నిరూపిస్తుంది. |
| తైత్తిరీయోపనిషత్ | – | సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – స్వరూపలక్షణం.<br>ఈ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం బ్రహ్మ – తటస్థలక్షణం. |
| ఛాందోగ్యోపనిషత్ | – | త్రీణిరూపాణిత్యేవ సత్యం ద్వారా కార్యంనుంచి కారణానికి ఎలా వెళ్ళాలో నేర్పిస్తుంది. తత్త్వమసిలో నిలబడటానికి అనేక దృష్టాంతాలను ఇస్తుంది. |
| బృహదారణ్యకోపనిషత్ | – | బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా ఎలాగో అనేక కోణాల్లో చూపించి, అహం బ్రహ్మ అస్మిలో నిలబెడుతుంది. |
| ఈశావాస్యోపనిషత్ | – | పరస్పర విరుద్ధపదాలతో సగుణబ్రహ్మ, నిర్గుణబ్రహ్మ వర్ణనలను చేస్తుంది. |

బి) **సర్వవేదాంత సిద్ధాంత సారసంగ్రహం** – శ్రీ శంకరాచార్యులవారు రచించిన ప్రకరణ గ్రంథంలోని 250 శ్లోకాలు, సాధన చతుష్టయ సంపత్తిని విస్తారంగా బోధిస్తాయి. మనం వేదాంతంలో మునిగి తేలుతున్నా, ఆత్మలో రమిస్తున్నా, మనలో ఈ సాధన చతుష్టయ సంపత్తి సంపూర్ణంగా ఉందో లేదో అడుగడుక్కీ సమీక్షించుకోవాలని బోధించారు.

ఈ గ్రంథం ప్రత్యేకతను మద్దూరి రాజ్యశ్రీ ఇలా వివరించారు – శమాదిషట్క సంపత్తిలో శమం గురించి వివరించేటప్పుడు, దానితోపాటు శంకరులవారు 18 విలువలను చొప్పించారు. అంతేకాదు, జ్ఞానకర్మ సముచ్చయ ఖండనను పరమార్థానంద స్వామీజీ అద్భుతంగా వివరించిన అంశాలు కూడా విపులంగా వస్తాయి.

సి) **గైడెడ్ మెడిటేషన్** – ఆత్మవిద్య నేర్చుకోవాలంటే శారీరక ఆరోగ్యం, చిత్తఏకాగ్రత చాలా అవసరం. ఈ వేదాంత శిబిరంలో శ్రీ రామమోహన్ గారు యోగాసనాల ద్వారా, గైడెడ్ మెడిటేషన్ ద్వారా ఈ రెండు అంశాలనూ పెంపొందించారు.

డి) **సత్సంగం** – ఏకాదశ ఉపనిషత్తుల సారంనుంచి ప్రశ్నలు వేసి రాజేశ్వరి గారు, సర్వవేదాంత సిద్ధాంతసార సంగ్రహంనుంచి ప్రశ్నలు వేసి జయలక్ష్మి గారు, భగవద్గీతనుంచి ప్రశ్నలు వేసి రమణమూర్తి గారు సభ్యులచేత మననం చేయించారు. నవరత్నాలు పేరిట ఆత్మవిద్యలో నేర్చుకున్న అనేక అంశాలను నిదిధ్యాసనం చేయించారు విష్ణుప్రసాద్‌గారు.

2. **తల్లి కృపానందం:** కంచి కామాక్షీదేవి ఆలయానికి అతి సమీపంగా చంద్రశేఖర్ గారి తోడ్పాటుతో యాత్రి నివాస్‌లో ఉన్నాము. అందువల్ల సభ్యులు ఒక అడుగు ఇక్కడా, ఇంకొక అడుగు ఆలయంలోనూ అన్నట్టు ఉండేవారు. మా శిబిరంలో రుద్రం, కామాక్షీ సహస్రనామం, వేంకటేశ్వర వ్రతం, సూక్తాలు పారాయణం చేస్తే; ఆలయంలో లలితా సహస్రనామం, ఖడ్గమాల పారాయణం చేసేవారు. అంతేకాక, నటరాజస్వామి వారి పుణ్యమా అని పల్లకీసేవలో, రథయాత్రలో ప్రత్యేక దర్శనాలు చేసుకునేవారు. అవికాక, అమ్మవారి అభిషేకం, కంచిలో ఉన్న మరెన్నో ప్రత్యేక ఆలయాల సందర్శనభాగ్యం కూడా శ్రీ పెంద్యాల రామచంద్ర రావు గారి చలువవల్ల కలిగింది. అంతేకాదు అమ్మవారి చేతిలో ఉండే చిలుకలను కూడా చూసి మురిసిపోయాము.

3. **రసానందం:** వెళ్ళింది వేదాంత శిబిరానికే అయినా, భోజనం విషయానికి వచ్చేసరికి పెళ్ళి భోజనాన్ని తలపించేది మనోహర్ బృందం చేసిన అతిథి మర్యాదలు. బఫే బ్రేక్‌ఫాస్ట్; నాలుగు కూరలు, స్వీట్, హాట్‌లతో మధ్యాహ్నభోజనం; రకరకాల టిఫిన్స్‌తో పాటు పెరుగన్నంతో రాత్రి భోజనం ఉండేది. అన్ని వంటకాలు ఆనందమైతే, అవన్నీ షోడశోపేత రుచులతో కూడి ఉండటం ఆనందకరమైతే, మనోహర్ బృందం కొసరి కొసరి వడ్డించి, ఎలా ఉందని ఆప్యాయంగా అడగటం ఆనందతమం.

4. **మోదానందం:** కంచి పేరు చెప్పగానే ఎవరికన్నా గుర్తుకొచ్చేది కంచి పట్టుచీరలు. చీరలు చూస్తే ప్రియం, వాటిని కొంటే మోదానందం, వాటిని కొని కట్టుకుంటే ప్రమోదానందం. కంచి పట్టుచీరలు కొన్న మోదానందం సభ్యులు పొందారని వేరే చెప్పాలా? కాని ఆశ్చర్యకరంగా వాటి ఆకర్షణలకు లోబడని సభ్యులు కూడా కొందరు ఉన్నారనీ చెప్పక తప్పదు.

5. **స్వామీజీ దర్శనానందం:** మేము పరమార్థానంద స్వామీజీ బోధను చిలకలా వల్లిస్తున్నామే గానీ, అసలు గురువులు స్వామీజీయే అని గురుపరంపరను గుర్తు చేస్తుంటాము. స్వామీజీని చూడాలని ఎంతో ఎదురుచూస్తుండేవారు మా సత్యంగ సభ్యులు. కంచినుంచి హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో స్వామీజీ భగవద్గీతమీద చేసిన బోధను విని, ఆయనకు పాదపూజ చేసి, ఆయన దీవెనలు పొంది, ఆయనకు భిక్ష సమర్పించుకోగలిగే భాగ్యం కలిగినందుకు మేమందరం పొందిన ఆనందం మాటలకందనిది.

**6. నడిచే దేవతా విభూతి ఆనందం–** ఈ ఆనందాలన్నీ ఒక ఎత్తైతే, నడిచే దేవత చూపించిన విభూతి మరోఎత్తు. ఇది కొస మెరుపు. అలనాడు, ఆదిశంకరుల వెంట అమ్మవారు నడిచి వెళ్ళిందట. శంకరులవారంటే గౌరవం, ప్రేమాభిమానాలున్న వారందరిమీద అమ్మ ఆప్యాయతానురాగాలు అపారంగా కురిపిస్తుంది. శంకరుల వారందించిన అద్వైతబోధను నలుగురికి అందాలని మేము చేసే ఈ చిరు ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తూ, అమ్మ కామాక్షి తన ప్రాంగణంలో మాకు చోటిచ్చి, ఉపనిషత్తుల సారాన్ని, సర్వవేదాంత సిద్ధాంత సారసంగ్రహాన్ని మా దంపతులచేత చెప్పించింది. పలికేది అమ్మే, పలికించేది అమ్మే! మా పని వడ్డించిన విస్తరైంది. అంతే కాదు మాచేత ఇంకా అద్వైతామృతాన్ని వర్షింప చేయాలని మా వెన్ను తట్టి, మా వెంటే తరలి వచ్చింది, కరుణాకటాక్షిణి మా అమ్మ కామాక్షి.

(మా సత్సంగ్ సభ్యులు మాకు ఎనలేని ప్రేమతో ఈ కామాక్షి అమ్మవారి విగ్రహాన్ని ప్రసాదించారు)

ఎక్కడ రామకీర్తన జరిగితే అక్కడ హనుమ ఉన్నట్టుగా, ఎక్కడ శంకరుల బోధ జరిగితే అక్కడ కరుణాల రాశి అమ్మ కామాక్షి ఉంటుందనటానికి, ఇంతకన్నా నిదర్శనం ఏముంది?

**మద్దూరి రాజ్యశ్రీ**

# దొరకునా ఇటువంటి సేవ!



**అనన్తసంసారసముద్రతార ।**
**నౌకాయితాభ్యాంగురుభక్తిదాభ్యామ్ ।**
**వైరాగ్యసామ్రాజ్యదపూజనాభ్యాం।**
**నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥**

వేదాంత శిబిరం ఈసారి కంచిలో పెడదామనగానే సత్సంగ్ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. కారణం? కంచికి వెళుతూనో, వస్తూనో చెన్నై వాస్తవ్యులైన మా గురువుగారు శ్రీ పరమార్థానంద స్వామీజీని కళ్ళారా చూడవచ్చు. వారాశించినట్టే స్వామీజీ దర్శనం చేయిస్తామని హామీ ఇచ్చామే కాని, అక్కడనుంచి అన్నీ చిక్కుముడులే! అన్నీ సందేహాలే!

కంచి వెళ్ళేముందే వెళితే స్వామీజీ ఆశీస్సులు పొందినట్టు ఉంటుందన్నారెవరో. ఆయన బోధ వినాలన్నారు మరెవరో. ఇవన్నీ సాధ్యమయ్యేవేనా? మేమేమో అరవయిమందిమి అయ్యాము. ట్రైను దిగగానే వెళ్ళాలంటే ఇంతమంది స్నానపానాదులు ఎలా? అందుకని అలా వద్దనుకున్నాము.

ఇంతమందిని ఇంటికి తీసుకువెళితే ఎలా? బస్సులోనే అందరినీ ఉంచి, పదిమంది చొప్పున దర్శనం ఇప్పించాలా? లేదా స్వామీజీ బోధ చేసే ఏ స్కూల్లోనైనా ఒకరోజు మాకోసం ఒక గంట వచ్చి అక్కడ దర్శనం ఇచ్చి, ఏదైనా బోధ చేయమని కోరదామా? ఎంతకీ అంతుపట్టటం లేదు.

కాని, నెమ్మదిగా ఒక్కొక్క చిక్కుముడీ విడుతూ వచ్చింది; గురుకృప తోడవటం అంటే అదే అనిపించింది. స్వామీజీ చెన్నైలో నాలుగైదుచోట్ల పొద్దున్నా, సాయంకాలం బోధ చేస్తూంటారు. అవి ఎక్కడో చూద్దామని నెట్‌లో చూశాము. ఆశ్చర్యం! స్వామీజీ చెట్‌పట్ శంకరాలయంలో 11–12 గంటలవరకు సోమ, మంగళవారాల్లో బోధ చేస్తారు. మంగళవారం భగవద్గీత మూలం చేస్తున్నారు. మేము తిరిగివచ్చేరోజు అదే. ఆ సమయం కూడా మాకు చాలా అనువైన సమయం.

అయినా ఇవన్నీ ఫోనులో మాట్లాడితే బాగుండదని, మేము స్వయంగా వెళ్ళి పరమార్థానంద స్వామీజీని కలిసి మా విన్నపం ఈ విధంగా విన్నవించుకున్నాము. 'స్వామీజీ, మాకు మూడు ఆలోచనలు తోచాయి. మీరు ఒకరోజు కంచికి వచ్చి అక్కడ మా అందరికి బోధ చేస్తే బాగుంటుంది. లేదా మధ్యలో ఒకరోజు మా వారందరినీ ఒకటో, రెండో బస్సుల్లో తీసుకువచ్చి మీరు బోధ చేసేచోట బోధ విని వెళ్ళిపోతాము. కాని అందరూ వయస్సు మీరినవారు. ఇలా ప్రయాణం కుదురుతుందో, లేదో తెలియదు. ఇంకొకటి మంగళవారం 11 గంటలకు మీ బోధ విని, మీ పాదదర్శనం చేసుకుని తరిస్తాము. మీకేది వీలు?' స్వామీజీ కాసేపు ఆలోచించి, 'మూడోది చేద్దాము. నేను భగవద్గీతమీద బోధ చేస్తాను కాబట్టి, మళ్ళీ ప్రత్యేకించి ఏమీ చేయనవసరం లేదు. మీరు 10.30 కల్లా వచ్చి కూర్చోండి. క్లాసు అయ్యాక ఒక్కొక్కరూ వచ్చి దర్శనం చేసుకుని వెళ్ళవచ్చు,' అన్నారు. 'మీకు భిక్ష ఆలశ్యమవుతుంది,' అంటే 'నా భిక్ష గురించి ఆలోచించకండి,' అన్నారు. మా ఆనందం చెప్పనలవి కాదు.

అంతేనా! సత్యవ్రతానంద స్వామినిజీ దగ్గరికి వెళితే, ఇంకా ఎన్నో మార్గాలు సుగమమయ్యాయి. స్వామీజీ బోధ చేసే ఆ శంకరాలయం కళ్యాణమండపం అనీ, వారే భోజన సదుపాయం చేస్తారనీ, వారిని అడగమనీ చెప్పారు. 'అయితే స్వామీజీని కూడా అక్కడే భిక్ష తీసుకోమంటాము, మీరు కూడా రండి,' అంటే 'ముందు స్వామీజీని అడగండి. ఆయన ఒప్పుకుంటే నేనే ఆయనకు భిక్ష తెస్తాను,' అన్నారు.

స్వామీజీ ఒప్పుకున్నారు. 'మీరేం పెడితే అది తింటాను,' అన్నారు. శంకరాలయం వారు మాకు భోజన ఏర్పాట్లు, రాత్రి ట్రైనులోకి అల్పాహారం ఇస్తామన్నారు. అది కూడా ఉచితంగా. ఇంక మా ఆనందం ఆకాశం అంచులు తాకింది.

సత్యవ్రతానంద స్వామినిజీ అడుగడుగునా మాకు మార్గనిర్దేశకం చేశారు. మా దంపతులం పరమార్థానంద స్వామీజీకి పాదపూజ చేసి, వస్త్రం సమర్పించేటట్టు, తక్కిన సభ్యులు వరుసగా వచ్చి పూలు ఆయన పాదాలచెంత వేసేటట్టూ, స్వామీజీ వారికి కిస్‌మిస్, పటికబెల్లం పాకెట్లు ఇచ్చేటట్టూ, మూడు గ్రూపులుగా స్వామీజీతో ఫోటో తీసుకునేటట్టు నిర్ణయాలు జరిగిపోయాయి.

అనుకున్నరోజు రానే వచ్చింది. సభ్యులందరికీ ఒకటికి రెండుసార్లు స్వామీజీని ప్రశ్నలతో విసిగించకూడదనీ, నిశ్శబ్దంగా ఉండాలని చెప్పటం జరిగింది. శ్రీ పెండ్యాల రామచంద్ర రావు గారు ఆరోజుకి కావాల్సిన పూలు, పండ్లు, దండలు, ఫోటోగ్రాఫర్ – అన్ని ఏర్పాట్లూ చాలా చాకచక్యంగా చేయించారు. శ్రీ పెండ్యాలవారు అక్కడే కాదు, కంచిలో కూడా అడుగడుగునా సహాయసహకారాలు అందిస్తూనే ఉన్నారు. అక్టోబర్ 18, 2022, మా అందరి జీవితాల్లో మరుపురాని రోజు. ఇంత పకడ్బందీగా ప్రణాళికలు వేసినా ఎక్కడో తెలియని భయం! కాని అనుకున్నదానికన్నా అన్నీ చాలా చాలా బాగా జరిగిపోయాయి.

ఉదయం 9.15కే శంకరాలయం చేరుకున్నాం. లలితా సహస్రనామం పారాయణం చేశాము. స్వామీజీ బోధ విన్నాం. స్వామీజీ, 'మీరందరూ సమయానికి రాగలిగారు,' అని సంతోషంగా అన్నారు. మేము పాదపూజ చేశాము. మా దంపతులం చెరోవైపు కూర్చుని, వరుసగా సత్సంగ్ సభ్యులను పరిచయం చేస్తూ వచ్చాము. వారిలో కొందరు వారి ఆనందాన్ని వెలిబుచ్చుకున్నారు. స్వామీజీ చిరునవ్వుతో, అభయహస్తంతో వారందరినీ దీవించారు. గ్రూప్ ఫోటోలు తీసుకున్నాము. స్వామీజీకి, సత్యవ్రతానంద స్వామినిజీ ప్రత్యేకించి భోజనం తెచ్చారు. మేము, స్వామినిజీ శిష్యులూ వడ్డించాము.

స్వామినిజీ కూడా మా సభ్యులకు వారు రచించిన విలువైన పుస్తకాలు, అరటిపండ్లు పేరుపేరునా ఇచ్చి, సత్సంగ్ సభ్యులందరితో గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. వారు వెళుతుంటే మా సభ్యులు రెండువైపులా బారులు తీర్చి నిలుచుని వీడ్కోలు పలికారు. తిరుగు ప్రయాణంలో, దోవ పొడుగూతా మా సభ్యులు స్వామీజీ బోధను, ఆయన ప్రసన్న వదనాన్ని, ఆయన పలకరింపులను తలుచుకుంటూ మైమరచిపోయారు. మీకు స్వామీజీమీద ఎందుకింత గౌరవాభిమానాలు ఉన్నాయో ఇప్పుడు అర్థమయింది అన్నారు.

తర్వాత ఫోనులో మాట్లాడినప్పుడు స్వామీజీ చాలా మెచ్చుకున్నారు. 'మీ సత్సంగ్ సభ్యులు చాలా క్రమశిక్షణతో, చాలా బాగా ప్రవర్తించారు. చాలా బాగున్నారు,' అన్నారు. మా జన్మ ధన్యమైపోయింది.

ఇప్పటికీ తలుచుకుంటే కలలా అనిపిస్తుంది. స్వామీజీకి పాదపూజ చేయటం, చెన్నైలో ఆయనకు భిక్ష పెట్టటం, ఇదంతా సాధ్యమయే పనేనా? స్వామిని సత్యవ్రతానందజీ అండదండలు లేకపోతేనూ, స్వామీజీ అపారమైన కృపాకటాక్షాలు లేకపోతేనూ,

**దొరుకునా ఇటువంటి సేవ!**

**మద్దూరి రాజ్యశ్రీ**

# పూర్వపీఠిక

గురుముఖతా వేదాంతజ్ఞానాన్ని గ్రహించి, అవగాహన, ఆకళింపు చేసుకోవటానికే జీవితకాలం సరిపోదు. అటువంటి క్లిష్టమైన వేదశాస్త్రవిషయాలను అభ్యసించి, సరళమైన రీతిలో తెనిగించి మానవాళికి అందించడంలో విశేషకృషి చేస్తున్న శ్రీ కస్తూరి రాఘవరావు, శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ దంపతులు సదా శ్లాఘనీయులు.

ఉపనిషత్తులలో శిఖరాగ్రమైన ఈశావాస్యోపనిషత్తును సులభశైలిలో తెనిగించడమంటే సాహసమే. ఈ ప్రక్రియను సునాయాసంగా నిర్వర్తించి, గ్రంథరూపమిచ్చిన వీరి కృషి అనన్యసామాన్యము.

చెన్నై వాస్తవ్యులు స్వామి పరమార్థానందజీ గత నాలుగు దశాబ్దముల పైబడి ఆంగ్లంలో అద్వైత వేదాంత విషయములను సామాన్యులకు సైతం అవగాహన, ఆచరణాసక్తిని కలిగించేలా బోధిస్తున్నారు. స్వామీజీని అనన్య గురువుగా ఆరాధిస్తూ, వారి లక్ష్యములను తమవంతు కృషిగా సమాజానికి అందించడానికి ఒక దృఢ సంకల్పంతో శ్రీ కస్తూరి రాఘవరావు, శ్రీమతి రాజ్యశ్రీ దంపతులు నిర్విఘ్నంగా ఈ బ్రహ్మయజ్ఞాన్ని కొనసాగిస్తున్నారు.

నాంది ప్రస్థావనగా రెండు మాటలు...

జ్ఞానికి, అజ్ఞానికి అంతరం అక్షరభేదమైతే కావచ్చు కాని, లక్ష్యం, గమనం, గమ్యం సోపానాలానుక్రమంలో అధిరోహించాలంటే సద్గురు దర్శనం, సామీప్యం, బోధ సద్గురు కటాక్షం లేనిదే అసాధ్యం. అజ్ఞాని జ్ఞానిగా మారటంలోనే ఉపాసనాది పర్యంతము ధర్మబద్ధత, ధర్మరక్షణ అంతర్వాహినిగా మమేకమైపోతుంది. జ్ఞానసముపార్జనవలన మోక్షాన్వేషికి మార్గం సుగమమవటమే కాక, సమాజ సంక్షేమానికి కలిగే విఘాతాలను సమర్థవంతంగా నిరోధిస్తుంది, ప్రతిఘటిస్తుంది. సంక్షేమసమజీవనానికి బాటలు వేస్తుంది. అటువంటి అజ్ఞానిని జ్ఞానతీరాలకు చేర్చేది గురువే.

ప్రస్తుతకాలంలో అన్యమతసాంప్రదాయ సుడివడిలో ధర్మగ్లాని నివారించడానికి సామాన్యుడు చేరలేని అనన్యగురుప్రసాదితమైన వేదవాఙ్మయాన్ని, ఆంగ్లబోధలనుండి తెలుగులోకి సరళమైన భాష, శైలితో అనువదించి అవగాహన, ఆచరణ మార్గాలను వేదప్రామాణికత, శాస్త్రపరిమితులు అతిక్రమించక జిజ్ఞాసువులకు, ముముక్షువులకు తమ ప్రవచనములు, సత్సంగములు, గ్రంథముద్రణల ద్వారా అందించడమే కాక, పుణ్యక్షేత్రములలో సదస్సులు నిర్వహించి, ఉభయతారకమైన పుణ్యక్షేత్రదర్శనం, వేదశాస్త్రములలోని వివిధ అంశములపై ప్రసంగముల జ్ఞానలబ్ధి కలుగజేస్తున్న – శ్రీ కస్తూరి రాఘవరావు, శ్రీమతి మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ దంపతులు ధన్యజీవులు.

సత్సంకల్పసిద్ధితో జన్మించి పూర్వజన్మ పుణ్యఫలం, నిజజన్మ సంస్కారం తోడై సమాజసేవకు అంకితమైన వీరిరువురు ప్రాతఃస్మరణీయులు. ఈ పుణ్యదంపతులు ఆర్ష విద్యాతరంగిణీ ట్రస్టును వేదాంత విషయ ప్రవచన, ప్రచారణ, ప్రచురణ మాధ్యమాల వేదికగా ఏర్పరచి సత్సంగీయులు, శ్రేయోభిలాషుల సహాయ సహకారాలతో నిర్విఘ్నంగా నిర్వహిస్తున్న ఈ బ్రహ్మయజ్ఞం ఇంతింతై వటుడింతై అన్న రీతిలో నిరంతర స్రవంతిగా పరిఢవిల్లాలని కోరుతున్నాను. ఆ పరమాత్మ ఈ పుణ్యదంపతుల లక్ష్యసాధనకు అనువైన దీక్షాదక్షతలు ప్రసాదించాలని ప్రణమిల్లి ప్రార్థిస్తున్నాను.

బుధజన విధేయుడు

**డా॥ రామానందశర్మ మంచిరాజు**

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శ్రుణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ।
ధీనామవిత్ర్యవతు। గణేశాయ నమః।
సరస్వత్యై నమః। శ్రీ గురుభ్యో నమః।
హరిః ఓమ్॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# ఈశావాస్యోపనిషత్ మంత్రాలు

మంత్రం–1

ఓమ్ ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కిం చ జగత్యాం జగత్ ।

తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనమ్ ॥

మంత్రం–2

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ।

ఏవం త్వయి నాన్యథేతో ఽస్తి న కర్మ లిప్యతే నరే ॥

మంత్రం 3

అసుర్యా నామ తే లోకా అంధేన తమసాఽఽవృతాః ।

తాగ్ంస్తే ప్రేత్యాభిగచ్ఛంతి యే కే చాత్మహనో జనాః ॥

మంత్రం 4

అనేజదేకం మనసో జవీయో నైనద్దేవా ఆప్నువన్పూర్వమర్షత్ ।

తద్ధావతో ఽన్యానత్యేతి తిష్ఠత్తస్మిన్నపో మాతరిశ్వా దధాతి ॥

మంత్రం 5

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే ।

తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః ॥

మంత్రం– 6

యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవానుపశ్యతి ।

సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే ॥

మంత్రం 7

యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః ।

తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః ॥

మంత్రం 8

స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరగ్ం శుద్ధమపాపవిద్ధమ్।

కవిర్మనీషీ పరిభూస్స్వయమ్భూర్యాథాతథ్యతో ఽర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యస్సమాభ్యః॥

మంత్రం 9

అంధం తమః ప్రవిశన్తి యేఽవిద్యాముపాసతే ।

తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః ॥

మంత్రం 10
అన్యదేవాహుర్విద్యయాఽన్యదాహురవిద్యయా।
ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే ॥
మంత్రం 11
విద్యాం చావిద్యాం చ యస్తద్వేదోభయగ్ం సహ ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే ॥
మంత్రం 12
అంధం తమః ప్రవిశన్తి యేఽసంభూతిముపాసతే ।
తతో భూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాగ్ం రతాః ॥
మంత్రం 13
అన్యదేవాహుస్సంభవాదన్యదాహురసంభవాత్ ।
ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే ॥
మంత్రం 14
సంభూతిం చ వినాశం చ యస్తద్వేదోభయగ్ం సహ ।
వినాశేన మృత్యుం తీర్త్వాఽసంభూత్యాఽమృతమశ్నుతే॥
మంత్రం 15
హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్ ।
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥
మంత్రం 16
పూషన్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య వ్యూహ రశ్మీన్
సమూహ తేజో యత్తే రూపం కల్యాణతమం తత్తే పశ్యామి
యోఽసావసౌ పురుషస్సోఽహమస్మి॥
మంత్రం 17
వాయురనిలమమృతమథేదం భస్మాంతగ్ం శరీరమ్।
ఓం క్రతో స్మర కృతగ్ం స్మర క్రతో స్మర కృతగ్ం స్మర ॥
మంత్రం 18
అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్।
యుయోధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాం తే నమఉక్తిం విధేమ ॥

# ఈశావాస్యోపనిషత్ – ఉపోద్ఘాతం

**యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।**
**తం హ దేవమ్ ఆత్మబుద్ధిప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥**

– శ్వేతాశ్వతర ఉపనిషత్ 6.18

పరమాత్మ అందరికన్నా ముందు బ్రహ్మను సృష్టించాడు. బ్రహ్మకు సృష్టికార్యం అప్పజెప్పి, వేదాలు కూడా ఇచ్చాడు. అంటే దీన్నిబట్టి వేదాలు సాక్షాత్తూ ఆ పరమాత్మ నుంచే వచ్చాయని తెలుస్తున్నది.

**తస్మాదృచః సామయజూంషి దీక్షా** – ముండకమ్ 2.1.6

ఆ పరమాత్మనుంచే ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, (అథర్వణ వేదం) వచ్చాయి కాబట్టి అవి అపౌరుషేయాలు. పరమాత్మ వేదాలను మానవాళికి ఒక మాన్యువల్‌గా వాడటానికి ఇచ్చాడు.

వేదాలను తన జీవితానికి మార్గదర్శిగా అంగీకరించిన వ్యక్తిని వైదికుడు అంటారు. ఈ వైదికుడినే ఆధునిక భాషలో చెప్పాలంటే హిందువు అంటారు. వేదాలను శాస్త్రం అంటారు. **శాసనాత్ త్రాయతే ఇతి శాస్త్రమ్**. శాస్+త్రమ్=శాస్త్రమ్. మనిషిని శాసించి, రక్షిస్తుంది శాస్త్రం.

**సత్యం సత్యం పునః సత్యమ్ ఉధృత్యభుజముచ్యతే**
**వేదాత్ శాస్త్రం పరం నాస్తి న దైవం కేశవాత్ పరమ్**

**ఉధృత్యభుజమ్** – చెయ్యెత్తి పెట్టి, గట్టిగా చెబుతున్నాయి. ఏమని?

**సత్యం సత్యం పునః సత్యమ్** – ఇదే సత్యం, పూర్తి సత్యం. సత్యం వినా మరొకటి లేదు. ఏమిటా సత్యం?

**వేదాత్ శాస్త్రం పరం నాస్తి** – వేదాలను మించిన గొప్ప మార్గదర్శి లేదు.

**న దైవం కేశవాత్ పరమ్** – కేశవుణ్ణి మించిన గొప్ప దైవం లేనట్టుగా.

ఈ వేదాలు నాలుగు. అవి – ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణవేదం. నాలుగు వేదాలూ కలిపి దాదాపు 20,000 మంత్రాలు ఉన్నాయి. ఋషులు వారికున్న అసాధారణ సాత్త్వ్విక మనస్సువల్ల వాటిని అందుకోగలిగారు.
మన ధ్యానశ్లోకం అర్థం ఇదే–

| | | |
|---|---|---|
| సదాశివ సమారంభామ్ | – | ఆది గురువయిన ఆ పరమశివునినుంచి |
| శంకరాచార్య మధ్యమామ్ | – | ఈ బ్రహ్మవిద్యను మధ్యలో అందుకున్న శంకర భగవత్పాదులు |
| అస్మదాచార్య పర్యంతామ్ | – | మనకు అందజేసిన మన గురువులు – శ్రీ దయానంద సరస్వతుల వారు, శ్రీ పరమార్థానందుల వారి వరకు |
| వందే గురుపరంపరామ్ | – | ఈ గురుపరంపరకు మా నమస్కారములు. |

వేదాలను రెండుగా విభజించవచ్చు. వేద పూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అని కూడా అంటారు. ఇందులో గృహస్థు చేయాల్సిన ఎన్నో యజ్ఞాలు, యాగాల వివరణ ఉంటుంది. ఉపాసన కూడా వేదపూర్వభాగంలోకే వస్తుంది. కర్మలు ఎలా చేయాలో చెబుతుంది కాబట్టి ఇది కర్మ ప్రధానంగా ఉంటుంది. వేద అంత భాగాన్ని జ్ఞానకాండ అని కూడా అంటారు. ఇందులో ఆత్మ బోధ వస్తుంది. ఆత్మ గురించిన బోధ ఉంటుంది కాబట్టి ఇది జ్ఞానప్రధానంగా ఉంటుంది. రెండూ ముఖ్యమైనవే.

వేద అంతభాగంలోకి వెళ్ళేముందు కర్మకాండ గురించి కొన్ని ముఖ్యమైన అంశాలు చూద్దాము. కర్మకాండలో కర్మత్రయం, ఫలత్రయం, దోషత్రయం ఉంటాయి.

1. **కర్మత్రయం** – మనం వాడే కరణాల దృష్ట్యా మనం చేసే కర్మలు మూడు రకాలుగా ఉంటాయి. వాటిని త్రివిధం కర్మ అంటారు.

| | | | |
|---|---|---|---|
| **ఎ) కాయిక కర్మ** | – శరీరంతో చేసేది | – | పూజ, ప్రదక్షిణం, నమస్కారం, తీర్థయాత్ర, యజ్ఞం |
| **బి) వాచిక కర్మ** | – వాక్కుతో చేసేది | – | పైకి చేసే జపం, పారాయణం |
| **సి) మానసిక కర్మ** | – మనసుతో చేసేది | – | ధ్యానం |

2. **ఫలత్రయం** – ఏ కర్మ చేసినా, దానికి ఫలం ఉంటుంది. అది దృష్టఫలం కావచ్చు. అదృష్ట ఫలం కావచ్చు. అంటే కనపడే ఫలం, కనపడని ఫలం. ఆ ఫలం పుణ్యం కావచ్చు. పాపం కావచ్చు. ఉదాహరణకు ఆకలితో ఉన్న పేదవానికి అన్నం దానం చేస్తే పుణ్యం వస్తుంది. అది దృష్టఫలంగానూ, అదృష్టఫలంగానూ కూడా వస్తుంది. ఆకలి తీరిన ఆ పేదవాని ముఖంలో కలిగిన ఆనందం, అతను నోరారా మనను దీవించటం – దృష్టఫలం. ఈ మంచి కార్యం చేసినందుకు మన ఖాతాలో

కొంత పుణ్యం వచ్చి చేరుతుంది. కాని అతను తినీ తినగానే, 'దుక్కలా ఉన్నావు, పనిచేసుకు బతకలేక, ఇలా ఊరిమీద పడి తింటావెందుకు?' వంటి దుర్భాషలాడామనుకోండి. అప్పుడు అదృష్టఫలంగా పాపం కొంత వచ్చి చేరుతుంది. అలా ప్రతి కర్మకూ పుణ్యమో, పాపమో ఏదో ఒక ఫలం తెలిసో, తెలియకో చేరుతూ ఉంటుంది. ఆ ఫలాన్ని ఫలత్రయం అన్నారు. మనకు అది అర్థ లేదా కామ లేదా ధర్మరూపంలో కలుగుతుంది. అంటే మనం చేసే కర్మలు ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలలో మొదటి మూడింటినీ చేకూరుస్తాయి.

ఎ) **అర్థం –** ముందు కలిగే ఫలం అర్థం. అది ప్రాథమిక ఫలం. అర్థం అంటే అసలు అర్థం డబ్బు. కాని ఇక్కడ డబ్బు ఒక్కటే కాదు. డబ్బు, పదవి, అంతస్తు ఏదైనా కావచ్చు. అంటే భద్రతని చేకూర్చేదేదైనా వస్తుంది దానికింద. ఆవుకూడా ఎండగా ఉంటే భద్రతకోసం నీడని వెతుక్కుంటుంది.

బి) **కామం –** కామం అంటే కోరిక. కోరిక భద్రతనివ్వదు. ఆనందాన్ని కలుగజేస్తుంది. ఉదాహరణకు టీవీ భద్రతనివ్వదు. ఆనందాన్నిస్తుంది. డబ్బు వచ్చాక హోమ్ థియేటర్ కావాలనో, ఏ స్విట్జర్లాండ్‌కో వెళ్ళాలనో కోరుకుంటాము.

సి) **ధర్మం –** దీన్ని పుణ్యం అని కూడా అంటారు. మనం చేసే కర్మలు మనకు పుణ్యాన్నో, పాపాన్నో జమ చేస్తాయని అనుకున్నాం కదా! ఒక వయసు వచ్చాక ధర్మచింతన మొదలవుతుంది. ముందు అర్థ, కామాల వెంటపరుగులు తీసినా, మొదట్లో ధర్మపరంగా చేయాలన్న చింత లేకపోయినా, అంతర్వాణి ఎప్పుడో నిలదీయటం మొదలుపెడుతుంది. ధర్మపరంగా అర్థ, కామాలను సాధించమంటుంది.

ఎప్పుడూ మంచిపనులు చేస్తూ, మంచికి మారుపేరులా ఉండి దైవ చింతనతో కాలం గడుపుతూ, చీమకి కూడా హాని తలపెట్టని వ్యక్తేమో కష్టాల కడలిలో కూరుకుపోయి, దారిద్ర్యం అట్టడుగున ఉంటాడు. మంచి అంటే ఏమిటో తెలియని, దుర్మార్గానికి దుస్తులు తొడిగితే ఇలా ఉంటుందా అనిపించే వ్యక్తి మిలమిల మెరిసే బెంజ్‌కారులో ఊరేగుతూ, అష్టైశ్వర్యాలతో తులతూగుతూ ఉంటాడు. అలా ఎందుకు జరుగుతుంది?

దీనికి జవాబు చెప్పాలంటే, కర్మసిద్ధాంతం అంతా విప్పాల్సి ఉంటుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అది వారి పూర్వజన్మ సుకృతం లేదా దుష్కృతం. వారి ఖాతాలో ఉన్న పుణ్యం లేదా పాపం వారికలాంటి జీవితం ఇస్తుంది. అంతేగాని భగవానుడు తనకు తోచినట్టుగా

మనకు పుణ్యమో, పాపమో హెలికాప్టర్‌లోంచి కొంత పడేయదు. ఇవాళ మనం హాయిగా ఉన్నామంటే, మనం పూర్వజన్మలో ఎంతో మంచి చేసుకున్నామన్నమాట.

అలా మనం చేసిన కర్మత్రయం మనకు ఫలత్రయం ఇస్తుంది. ఇది సానుకూలంగా చెప్పిన మాట. వ్యతిరేకంగా చూస్తే మన కర్మత్రయం మనకు ఇచ్చే ఫలత్రయంలో దోషత్రయం ఉంది.

3. **దోషత్రయమ్ –** మూడు రకాల కర్మలు చేస్తే, మూడు రకాల పురుషార్థాలను పొందవచ్చు. అంటే కాయిక, వాచిక, మానసిక కర్మల ద్వారా ధర్మార్థకామాలనే పురుషార్థాలను పొందవచ్చు. ఇవి మనకు శాంతిని, ఆనందాన్ని, భద్రతని, ఇచ్చినట్టు కనబడతాయి. పైకి గులాబీలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. కాని వాటి వెన్నంటే, గులాబీ ముళ్ళలాంటి దోషత్రయాన్ని వెన్నంటి తీసుకువస్తాయి. మూడు కర్మల ఫలాలు పొందినా వాటి వెనుక మూడు దోషాలు ఉన్నాయి.

ఎ) **దుఃఖమిశ్రితత్వమ్ –** ఏ లక్ష్యం సాధించాలన్నా అది ప్రశాంత గోదావరిమీద సాఫీగా సాగే పడవ ప్రయాణం లాంటిది కాదు. ఎంతో ప్రయాసతో కూడింది. ఒకటి సాధించాలంటే ఎన్నో వదులుకోవాలి. ఆఖరికి ఒక స్కూల్లో సీటు సంపాదించాలన్నా, ముందురోజు రాత్రి వెళ్ళి ఆ స్కూలు గేటు ముందు, రోడ్డుమీద తల్లిదండ్రులు పడుకున్న రోజులున్నాయి. ఇంతా కష్టపడి సీటు సంపాదించినా, ఆ అబ్బాయిగానీ, అమ్మాయిగానీ చక్కగా చదివి పైకొస్తారా? ఏమో! పెరుగుట తరుగుట కొరకే అనీ, ఓడలు బళ్ళు అవుతాయనీ మన పెద్దలు అన్నారు. మనం కడుపు కట్టుకొని, కూడబెట్టిన ఆస్తి పదికాలాలు నిలుస్తుందా? నిలవదు! అందుకని ఆనందాన్ని అంటిబెట్టుకుని ఉంటుంది దుఃఖం. ఏ వస్తువూ, ఏ వ్యక్తీ పూర్తిగా ఆనందాన్నివ్వలేవు.

బి) **అతృప్తికరత్వమ్ –** కోరికలు అనంతం అని ఆర్థికశాస్త్రంలో నేర్చుకుంటాము. మన పిల్లలు మనను పది కోరికలు కోరితే, మనం తొమ్మిది తీర్చామనుకోండి. వారు దానికి తృప్తిపడతారా? లేదే! తీర్చని పదో కోరికకోసం బాధపడతారు. పోనీ అని పదీ తీరిస్తే, ఇంకో కోరికతో సిద్ధంగా ఉంటారు.

సి) **బంధకత్వమ్ –** ఒక వ్యక్తిమీద గాని, ఒక వస్తువుమీద గాని ప్రేమ ఉండాలి. నిజమే గానీ, ఆ ప్రేమ మనను కట్టిపడేయకూడదు. సెల్‌ఫోన్ మనకు ఒక పరికరం అంతే. అది మనను 24 గంటలూ దానికే కట్టిపడేయకూడదు. పెళ్ళిపీటల మీదా, స్మశానంలోనూ సెల్‌ఫోన్ లేనిదే గడవదు. మనిషికి కావాలి, వద్దు అని

చెప్పే స్వేచ్ఛ ఉంది. అది మనిషికి మాత్రమే ఉంది. కాని పూజ్యస్వామీజీ అంటారు మనిషికి వద్దు అనగలిగే స్వేచ్ఛ మొదటిసారి మాత్రమే ఉంది – దేని విషయంలోనైనా సరే. ఉదాహరణకు సిగరెట్టే తీసుకోండి. మొదటి సిగరెట్టు కాల్చనంతవరకూ వద్దు అనగలడు. ఒకసారి అవునంటే ఏమవుతుందిలే అనుకున్నాడో, అయిపోయింది అతని పని. ఎన్నటికీ వద్దు అనలేడు. దానికి బానిస అయిపోతాడు.

ఇంతవరకూ మనం కర్మత్రయం, ఫలత్రయం, దోషత్రయం చూసాము. మనం ఇంకా కర్మకాండలోనే ఉన్నాము. ఈ మూడు దోషాలవల్ల మన పరిస్థితి ఏమిటి? నిరంతరం ఖంగారు, ఆందోళన, ఒత్తిడి, భయం. డబ్బు సంపాదించాలన్న తపన, సంపాదించాక పోతుందేమోనన్న భయం. భయం, భయం, బ్రతుకు భయం. కొంతమందికి ఏ బెంగా లేకపోయినా, నాకు ఏ బెంగా లేదే అని బెంగపడతారు. కొంతమందికి మనసారా నవ్వాలన్నా భయమే. 'బాబోయ్ ఇంతచేటు నవ్వేస్తున్నాను. తరువాత బాగా ఏడవాల్సి వస్తుందేమో,' అని భయపడతారు. అంతచేటు నవ్వాక, కాస్త ఏడిస్తే మాత్రం ఏం? అది వేరే విషయం.

ఇంతకీ జీవితం ఇలా బాధతో, భయంతో, ఆందోళనతో నిండి ఉంది కదా! ఈ బాధ ఎందుకు వచ్చింది? కర్మ చేయటంవల్ల, కర్మచేస్తే కలిగే ఫలంవల్ల, ఆ ఫలం దోషభూయిష్టమైనది కావటంవల్ల. అందుకని కర్మ చేయటం ఎందుకు? బాధపడటం ఎందుకు? కర్మ మానేస్తే పోలా అనుకోకూడదు. లాభం లేదు. అదీ ఆనందాన్నివ్వదు. కర్మ మానేసి సన్యాసం స్వీకరించి హిమాలయాలనే చూసీ చూసీ విసుగుపుడుతుంది కొందరికి. మనం మెరీనా బీచ్‌నుంచి హిమాలయాల దగ్గరకి వెళితే వారు హిమాలయాలనుంచి మెరీనా బీచ్‌కి రావాలని ఉందని అంటారు. జీవితం విసుగ్గా ఉందనీ, పొద్దున్న చపాతీ, పప్పు తింటే, రాత్రి పప్పు, చపాతీ తింటామని చెబుతారు. విసుగుపుడితే వారికి సన్యాసాశ్రమం నుంచి వెనక్కి తిరిగి రావటానికి లేదు.

ఇప్పుడు కర్తగా ఉంటే జీవితం భారంగా ఉంది, అకర్తగా ఉంటే శూన్యంగా అనిపిస్తోంది. మరి ఏం చేయాలి? దానికి వేదాంతం ఒక్కటే జవాబు. వేదాంతం కూడా దానికి ఒక్కటే పరిష్కారం ఉంది అంటుంది. నిన్ను నువ్వు తెలుసుకో. దీన్నే ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మవిద్య అంటుంది.

కర్మ చేస్తే భారంగా అనిపించటం, కర్మ చేయకపోతే శూన్యంగా అనిపించటం– ఈ రెండూ వెరసి సంసారం అంటారు. ఆత్మజ్ఞానం పొందితే అన్నది వృత్తి (ఆలోచన)లో మార్పు. ఆలోచన మార్పు ఇంతకు ముందు చూసిన ఫలదోషాలనుంచి విముక్తులను చేస్తుంది. దుఃఖం, బంధం, అశాశ్వతం అన్న దోషాలను పోగొడుతుంది. ఎప్పుడైతే నేను

బంధవిముక్తుడిని అన్న జ్ఞానం కలుగుతుందో అదే మోక్షం. కర్తగా ఉన్నా బాధవేయదు. అకర్తగా మారినా శూన్యభావన కలుగదు.

**నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః॥ గీత: 3 – 18**

అట్టి మహాత్మునికి కర్మ చేసినా, చేయకపోయినా ఎట్టి ప్రయోజనమూ ఉండదు.

నారదులవారికి తెలియని విషయం లేదు. ఎన్నో శాస్త్రాలు నేర్చుకున్నారు. సిద్ధులు ఉన్నాయి, త్రికాలజ్ఞాని–కాని సనత్కుమారుల దగ్గరికి వెళ్ళి –

**తరతి శోకమ్ ఆత్మవిత్ – ఛాందోగ్యమ్**

ఏ విద్య తెలుసుకుంటే శోకం పోతుందో ఆ విద్య నేర్పించు అని కోరారని ఛాందోగ్యోపనిషత్తులో వస్తుంది.

**జ్ఞానకాండ–** వేదంలో రెండవ భాగం లేదా వేద అంతభాగాన్ని వేదాంతం అనీ, జ్ఞానకాండ అనీ అంటారు. కర్మకాండవల్ల అనేక కర్మలు, యజ్ఞాలు ఎలా చేయాలో నేర్చుకుని, దాన్నించి సంసారమనే చక్రంలో ఇరుక్కోకుండా జ్ఞానకాండకి వచ్చి మోక్షం పొందాలని శాస్త్రం ఉద్దేశ్యం. కర్మలు చేయటంవల్ల చిత్తశుద్ధి, ఉపాసన చేయటంవల్ల చిత్త ఏకాగ్రత ఏర్పడుతాయి. దానివల్ల సాధన చతుష్టయ సంపన్నుడయి జ్ఞానకాండకు అధికారి అవుతారు. సాధన చతుష్టయం అంటే వివేకం, వైరాగ్యం, శమదమాది షట్క సంపత్తి, ముముక్షుత్వం.

వేదాలను ఇంకో కోణంలో నాలుగు భాగాల క్రింద విడదీయవచ్చు.

1. సంహిత – సూక్తాలు
2. బ్రాహ్మణమ్ – యజ్ఞాలు
3. ఆరణ్యకమ్ – ఉపాసన
4. ఉపనిషత్తు – జ్ఞానమ్

అంటే క్రమంగా మనం భక్తినుంచి, కర్మనుంచి ఉపాసనకు వచ్చి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పరచుకుని, జ్ఞానకాండకు రావాలని వేదం అంతరార్థం.

జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం.

ఉపనిషత్తుకు వేదాంతం అనీ, జ్ఞానకాండ అనీ, బ్రహ్మవిద్య అనీ, ఆత్మవిద్య అనీ కూడా పేర్లు ఉన్నాయి.

**విద విచారణే విద సత్తాయం విద జ్ఞానే విద లాభే! ఏతేషాం ధాతూనాం విషయే వర్తంతే యస్మాత్ తతో వేదాః ఇత్యుక్త॥**

ఇది వేదం నిర్వచనం. బ్రహ్మ గురించిన విచారణ చేసి, బ్రహ్మ ఉన్నాడని చెప్పి, బ్రహ్మజ్ఞానం బోధించి, బ్రహ్మజ్ఞానఫలం గురించి చెప్పేది వేదం.

వేదంకు ఇంకో నిర్వచనం కూడా ఉంది.

**ప్రత్యక్షేణానుమిత్యా వా**
**యస్తూపాయో న విద్యతే।**
**ఏనం విదంతి వేదేన**
**తస్మాత్ వేదస్య వేదతా॥**

ప్రత్యక్ష ప్రమాణంచేత, తర్కంచేత తెలియని విషయాన్ని చెబుతుంది కాబట్టి వేదం.

వేదానికి తొమ్మిది పేర్లు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. శ్రుతి | – | ఋషులు విన్నారు. |
| 2. అనుశ్రవము | – | శిష్యులు విని మళ్ళీ చెప్పారు. |
| 3. త్రయీ | – | మూడు వేదాలు (అథర్వణ వేదాన్ని ఎక్కువగా చెప్పరు) |
| 4. ఆమ్నాయము | – | పవిత్ర గ్రంథాలు, పదే పదే వల్లె వేసేవి. |
| 5. సమామ్నాయము | – | పవిత్ర గ్రంథాలు, పదే పదే వల్లె వేసేవి. |
| 6. ఛందస్సు | – | ఛందోబద్ధంగా ఉంటుంది. |
| 7. స్వాధ్యాయము | – | తనకు విధించిన శాఖను చదవటం |
| 8. ఆగమము | – | మిత్రనిలాగా వచ్చి చేరుతుంది. |
| 9. నిగమము | – | పదాల ధాతువు చెబుతుంది. |

వ్యాసమహర్షి అపౌరుషేయమైన వేదాలను నాలుగుగా విభజించి, తన శిష్యులు నలుగురికి ఒక్కొక్క వేదం బోధించి, వారి ద్వారా వ్యాప్తి చెందించాడు.

| | | |
|---|---|---|
| ఋగ్వేదమ్ | – | పైలుడు |
| యజుర్వేదమ్ | – | వైశంపాయనుడు |
| సామవేదమ్ | – | జైమిని |
| అథర్వణవేదమ్ | – | సుమంతుడు |

# ఉపనిషత్

వేదాలు అపౌరుషేయం.ఏ మనిషీ లిఖించినవి కావు. అవి సాక్షాత్తూ పరమాత్మ చేత ఇవ్వబడ్డాయి. ఆ మాటకొస్తే ప్రతీదీ భగవదనుగ్రహమే. ఈ శరీరం, మనసు, ఇంద్రియాలు, శక్తి, వనరులు, జ్ఞానం, జ్ఞానం పొందే అవకాశం, జ్ఞానం పొందే సామర్థ్యం అన్నీ భగవానుని కృపే. ఆమాటకొస్తే అజ్ఞానం కూడా ఇవ్వబడిందే. జ్ఞానం పొందే అవకాశం ఉన్నచోట అజ్ఞానం, అపోహలు కూడా చోటు చేసుకుంటాయి. అపోహలు ఉన్నచోట అనేక సిద్ధాంతాలు బయలుదేరతాయి. ఆ అపోహలు ఒకరినుంచి ఇంకొకరికి అందజేయబడుతాయి. దాన్ని అంధపరంపర అంటారు పూజ్య స్వామీజీ. అంటే ఒక గుడ్డివాడు ఇంకో గుడ్డివాడికి దారి చూపినట్టు ఉంటుంది.

ఈ జ్ఞానాన్ని ఋషులు వారి సత్త్వగుణంచేత పరమాత్మనుంచి అందుకుని పరంపరగా ముందుతరాల వారికి అందించారు. బ్రహ్మజ్ఞానానికి ప్రమాణం శ్రుతి. ఋషులు విని తెలుసుకున్నారు కాబట్టి వేదాన్ని శ్రుతి అని కూడా అంటారు.

ఉపనిషత్తుకు అనేక పేర్లు ఉన్నాయి అవి –

| | | |
|---|---|---|
| వేదాంతం | – | వేద అంతభాగంలో వస్తుంది. |
| జ్ఞానకాండ | – | జ్ఞానాన్ని బోధిస్తుంది. |
| ఆత్మవిద్య | – | ఆత్మ గురించి చెబుతుంది |
| బ్రహ్మవిద్య | – | బ్రహ్మ గురించి చెబుతుంది. |

వేద అంతభాగంలో ఉండి, జీవ(ఆత్మ), ఈశ్వర(బ్రహ్మ) ఐక్యం గురించిన జ్ఞానాన్ని బోధించేది ఉపనిషత్తు.

ఉపనిషత్తుకు ఆ పేరు ఎందుకు వచ్చింది?

ఉపనిషత్తు పదాన్ని పదవిచ్ఛేదం చేస్తే ఉప+ని+షద్ అవుతుంది.

**షద్** – షద్ అంటే నాశనం చేసేది. జ్ఞానాన్ని నాశనం చేసేది అనకూడదు. సంసారాన్ని నాశనం చేస్తుంది. అదికూడా దీనికి మూలకారణమైన అజ్ఞానాన్ని. మనం అజ్ఞానంవల్ల సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. అజ్ఞానంవల్ల అంతా నేనే చేస్తున్నానన్న 'అహం' పెరుగుతుంది. అహంవల్ల కోరిక పుడుతుంది. కోరికవల్ల కర్మలు చేస్తాము. వాటివల్ల సుఖదుఃఖాలు కలుగుతాయి. పుణ్యపాపాలను పెంచుకుంటాము. ఆ పుణ్యపాపాలను హరించుకోవటానికి పునరపి జననం, పునరపి మరణం అనే చక్రంలో పడిపోతుంటాము.

అజ్ఞానం–అహం–కోరిక–కర్మ–సుఖదుఃఖాలు–పుణ్యపాపాలు–పునర్జన్మ. ఈ ఏడు అడుగులు మనం అజ్ఞానంవల్ల వేస్తున్నాము.ఆ అజ్ఞానాన్ని పారద్రోలటంవల్ల మనకు దుఃఖనాశనం కలిగి మోక్షప్రాప్తి కలుగుతుంది. అంటే ఆత్మవిద్య పొందటంవల్ల ఈ సంసారబంధంనుంచి విముక్తి పొందుతాము.

**ఉప –** ఆత్మజ్ఞానంకోసం ఆచార్యుని దగ్గరికి వెళ్ళి ప్రశ్నలు అడిగి, జ్ఞానాన్ని పొందాలి. గురువుని అడగందే బోధ చేయరు. అర్జునుడు శరణువేడి, మార్గం చూపమంటేనే గీతాబోధ వచ్చింది. అది కూడా వినయంగా అడగాలి.

**ని –** నిశ్చయజ్ఞానం. ఆచార్యునినుంచి నిశ్చయజ్ఞానం పొందాలి. ఆచార్యుని దగ్గరకు వెళ్ళగానే ఎన్నాళ్ళు నేర్చుకోవాలి లేదా ఏదైనా క్రాష్‌కోర్సు ఉందా అనకూడదు. నిశ్చయ జ్ఞానం కలిగేదాకా వేదాంతం పదే పదే నేర్చుకోవాలి.

సంసారచక్రంనుంచి బయటపడి మన స్వభావం గురించి నిశ్చయజ్ఞానం కలగాలి. నేను శరీరాన్ని కాదు, మనసుకాదు, ఇంద్రియాలు కాదు, జీవాత్మ కాదు, పరమాత్మకి బానిసను కాదు. నేను ఏకాత్మను; నిత్య, ముక్త, శుద్ధ, పరిపూర్ణబ్రహ్మను అని అర్థం చేసుకోవాలి.

అందువల్ల ఉపనిషత్తు అంటే ఆచార్యుని దగ్గరికి వెళ్ళి ఆత్మజ్ఞానం పొందితే సంసారాన్ని నాశనం చేసే నిశ్చయ జ్ఞానం కలిగిస్తుంది అని అర్థం.

ఉపనిషత్తుకు ఇంకొక అర్థం కూడా వస్తుంది. ఉప అంటే అత్యంత సమీపం. ని అంటే నిశ్చయజ్ఞానం. ఉపనిషత్తు అంటే అత్యంత సమీప విషయమైన బ్రహ్మ గురించిన నిశ్చయ జ్ఞానం పొందటం.

ఇది ఉపనిషత్‌కు మరొక అర్థం. ఇంకొక అర్థం కూడా చెప్పవచ్చు. ఉపనిషత్తుయొక్క వాచ్యార్థం తీసుకుంటే దాని అర్థం బ్రహ్మవిద్య లేదా వృత్తిజ్ఞానం. ఈ బ్రహ్మవిద్య ఆలోచన రూపంలో మనస్సులో కలిగే జ్ఞానం. బ్రహ్మవిద్యను ఉపనిషత్ అని ఎందుకు అంటారంటే, ఆ పదంలోనే అది చేసే రెండు పనులను సూచిస్తున్నది. ఇక్కడ ఉపనిషత్‌ను రెండు పదాలుగా విడదీస్తాము. ఉపని+షద్.

**ఉపని –** ఉపనయతి ఇతి ఉపని. రెండింటిని కలుపుతుంది. ఏ రెండింటిని? జీవాత్మనూ, పరమాత్మనూ కలుపుతుంది. జ్ఞానంవల్లనే జీవాత్మ, పరమాత్మల ఐక్యం ఎలా కుదురుతుందని సందేహం రావచ్చు. ఎందుకంటే కాఫీ విషయమే తీసుకోండి. ఇన్ని పాలు పోసి, ఇంత డికాక్షన్ కలిపి, ఇంత పంచదార వేస్తే ఘుమఘుమలాడే చక్కటి ఫిల్టర్ కాఫీ తయారవుతుందని

నేర్చుకున్నామనుకోండి. అంతమాత్రాన కాఫీ తయారయిపోతుందా? అవదు! మీరు కాఫీ కలిపే కర్మ చేయాలి.

మరయితే జీవాత్మ, పరమాత్మ ఒకటే అనే ఐక్యజ్ఞానం పొందినంత మాత్రాన ఐక్యం అయిపోతాయా? అవుతాయి. ఎందుకు? ఇక్కడ అజ్ఞానంవల్ల జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనుకుంటున్నారు. అజ్ఞానాన్ని అవిద్య అని కూడా అంటారు. అవిద్యా నివృత్తి అయితే పొరపాటు తొలగుతుంది. పొరపాటు తొలిగితే భేదం ఉందనే అపోహ తొలుగుతుంది. అపోహ తొలగటమే ఐక్యం పొందటం.

ఈ దశలను మళ్ళీ ఒకసారి చూస్తే జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొందితే, అజ్ఞానం తొలగుతుంది. అజ్ఞానం తొలిగితే, అజ్ఞానజనిత పొరపాటు తొలగుతుంది. అజ్ఞానజనిత పొరపాటు తొలిగితే జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనే అపోహ తొలగుతుంది. అపోహ తొలగటమే ఐక్యజ్ఞానం పొందటం. అందువల్ల ఉపని అంటే జీవాత్మ, పరమాత్మల ఐక్యజ్ఞానం కలగజేయటం.

**షద్**– అవసాదయతి ఇతి షద్ – నాశనం చేసేది అని అర్థం. దేన్ని నాశనం చేస్తుంది? ఆత్మను, లేదా బ్రహ్మను అనకూడదు. సంసారాన్ని నాశనం చేస్తుంది. సంసారాన్ని అనేక విధాలుగా నిర్వచించవచ్చు. రాగద్వేషాలు సంసారం; కామక్రోధలోభమోహమదమాత్సర్యాలు సంసారం; అహంకార, మమకారాలు సంసారం; బాధపడటం, అపరాధభావన సంసారం. ఏ నిర్వచనం తీసుకున్నా వీటన్నిటికీ మూలకారణం అజ్ఞానం. అజ్ఞానం నాశనమయితే సంసారం నాశనం అవుతుంది.

బ్రహ్మవిద్యను ఉపనిషత్ అని అనటానికి కారణం టూకీగా –

ఉపని – జీవాత్మ, పరమాత్మలను ఐక్యం చేస్తుంది

షద్ – సంసారాన్ని నాశనం చేస్తుంది.

రెండూ కలిపితే అంతకుముందు చూసిన అర్థం సారాంశమే వస్తుంది. జీవాత్మ, పరమాత్మ ఐక్యజ్ఞానం ద్వారా సంసారాన్ని నాశనం చేసేది ఉపనిషత్. ఇది వాచ్యార్థం.

**లక్ష్యార్థం** – ఉపనిషత్ అంటే బ్రహ్మవిద్య అని చూశాము. ఏ విద్య అయినా సరే వృత్తిరూపంలో కలుగుతుంది. వృత్తి అంటే ఆలోచన. ఆలోచనలు మనస్సులో ఏర్పడతాయి. మనస్సు ఆంతరంగా ఉంది. అలాంటప్పుడు బ్రహ్మవిద్య ఆంతరంగా కలగాలి కదా, బాహ్యంగా ఉన్న ఉపనిషత్ గ్రంథాన్ని ఎలా బ్రహ్మవిద్య అంటారని సందేహం కలుగవచ్చు. దానికి జవాబు – ఇక్కడ లక్ష్యార్థాన్ని తీసుకోవాలి.

ఒక వస్తువు గురించి, ఒక పరికరం ఉపయోగించి, నేను నేర్చుకుని, దానికి సంబంధించిన జ్ఞానం పొందుతాను. వీటికి సంస్కృతపదాలను చూద్దాము. నేర్చుకునే నేను ప్రమాతను; వస్తువు ప్రమేయం; పరికరం ప్రమాణం, జ్ఞానం ప్రమా. వీటిని ఒక వాక్యంగా చూస్తే ప్రమాతనైన నేను ఒక ప్రమాణం ఉపయోగించి ప్రమేయం గురించిన ప్రమా పొందుతాను. అంటే ప్రమాతనైన నేను ఉపనిషత్ అనే ప్రమాణం ఉపయోగించి బ్రహ్మ అనే ప్రమేయం గురించిన (బ్రహ్మ ప్రమేయం కాదని తర్వాత నేర్చుకుంటాము, ఇప్పటికి అర్థం చేసుకోవటానికి అలా చెప్పవచ్చు) ప్రమా పొందుతాను. ఇక్కడ ఉపనిషత్ ప్రమాణం అయింది.

ఆ విధంగా ఉపనిషత్ పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు.

వాచ్యార్థం – ప్రమా – బ్రహ్మవిద్య జ్ఞానం కలిగిస్తుంది.

లక్ష్యార్థం – ప్రమాణం – బ్రహ్మవిద్య నేర్చుకోవటానికి తోడ్పడుతుంది.

ఇక్కడ కూడా ఒక సందేహం కలుగవచ్చు. ఉపనిషత్ గ్రంథమే ఎలా సంసారాన్ని నాశనం చేస్తుంది? అలా గ్రంథమే నాశనం చేసేటట్టయితే, ఉపనిషత్‌ను తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుంటే సరిపోతుంది కదా! అందువల్లనే లక్ష్యార్థాన్ని కూడా చూడాలి. అది చూసేముందు ఈ ఉదాహరణ చూద్దాము.

**ఎవరెస్ట్ శిఖరం ఎక్కితే ఆనందం కలుగుతుంది**

ఎవరెస్ట్ శిఖరం ఎక్కేది కాళ్ళతో; ఆనందం కలిగేది మనస్సుకు. అదెలా కుదురుతుంది అంటామా? కాళ్లతో ఎవరెస్ట్ శిఖరం ఎక్కితే, మనస్సుకు ఆనందం కలుగుతుంది అని అర్థం. అంటే కాళ్ళతో ఎక్కటం ఆనందం కలగటానికి కారణహేతువు అవుతుంది. అలాగే ఉపనిషత్ బ్రహ్మవిద్య అని అంటే, ఉపనిషత్‌లోని మంత్రాలు సంసారనాశన జ్ఞానం కలగటానికి కారణహేతువు అవుతాయి. కాబట్టి ఉపనిషత్ అంటే రెండు అర్థాలు చెప్పవచ్చు. జ్ఞానం, జ్ఞానాన్ని కలగజేసే ప్రమాణం.

**ఉపనిషణ్ణం వా అస్యాం పరం శ్రేయః ఇతి ।**
**తదర్థత్వాద్ గ్రంథః అపి ఉపనిషత్॥**

శంకరాచార్యులవారు తన భాష్యంలో ఉపనిషత్తును ఈ విధంగా నిర్వచించారు. ఈ జ్ఞానంలో సర్వోత్తమమైన మోక్షం ఆత్మరూపంగా కూర్చుని ఉంది అనే అర్థం వస్తుంది కాబట్టి ఇది ఉపనిషత్తు అయింది. ఆ జ్ఞానంకోసం ఉద్దేశింపబడిన గ్రంథాన్ని కూడా ఉపనిషత్తు అంటారు.

దీని అర్థం ఉపనిషత్తును అధ్యయనం చేస్తే, మీరే ముక్తపురుషులు అని నేర్చుకుంటారు. దీన్ని ఏదో లౌకికవిద్య నేర్చుకున్నట్టుగా నేర్చుకోకూడదు. లౌకికవిద్య మీ మేధస్సును

మెరుగుపరిస్తే, ఆత్మవిద్య మీ మనస్సును శుద్ధి చేస్తుంది. ఆత్మజ్ఞానం పొందితే ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతారు. మీరు వ్యక్తిగతంగా మార్పు పొందుతారు. మీరు బాహ్యంగా వెతికే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యంగా లేవు, మీలోనే ఉన్నాయని నేర్చుకుంటారు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – గీత 2.55

స్థితప్రజ్ఞుడు ఆత్మలోనే రమిస్తాడు. ఆ విధంగా మోక్షం గురించి ఈ బోధలో అంతర్లీనంగా ఉంది. ఈ ఉపనిషత్తు ఎప్పుడో మరణానంతరం వచ్చే ఫలం గురించి చెప్పదు. జీవన్ముక్తిని బోధిస్తుంది. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతారు.

ఇటువంటి ఉపనిషత్తులు 1180 ఉండేవి ఒకప్పుడు.

**శంకరభాష్యం–** వేదాలు ఉన్నవి నాలుగే అయినా ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయి, 108 మాత్రమే మిగిలాయి. వాటిల్లో కూడా దశ ఉపనిషత్తులని ప్రధాన ఉపనిషత్తులని అంటారు. ఎందుకంటే ఈ దశ ఉపనిషత్తులకీ శంకరాచార్యులవారు భాష్యం చెప్పారు. వీటికి రాయటానికి కారణాలు రెండు –

1, ఈ పదీ చదివితే నాలుగు వేదాల సారాంశం వస్తుంది.
2. బ్రహ్మసూత్రాల్లో ఉపనిషత్తు వాక్యాలను తీసుకుని లోతుగా పూర్వాపరాలని విశ్లేషించారు వ్యాసమహర్షి. ఆ వాక్యాలు ఈ 10 ఉపనిషత్తులనుంచీ అధికశాతం ఉన్నాయి. అందుకని వాటినే తీసుకున్నారు.

ఈ పది ఉపనిషత్తులను ప్రధాన ఉపనిషత్తులనటంలో అర్థం తక్కినవి చిన్న బ్రహ్మ గురించి చెప్తాయని కాదు. బ్రహ్మ ఒక్కటే. ఈశావాస్య ఉపనిషత్తులో 18 మంత్రాల్లో వర్ణించినా, బృహదారణ్యక ఉపనిషత్తులో అరణ్యం అంత పెద్దదిగా వర్ణించినా, రెండింటి సారాంశము ఒకటే. ఈ పదీ శంకరభాష్యంవల్ల ప్రాచుర్యం పొందాయి. వాటిని తేలికగా గుర్తుంచుకోవటానికి చిన్న పద్య రూపంలో చెబుతారు.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

ఈశావాస్య ఉపనిషత్తు పేరు ముందు వచ్చినా, దానితో ఉపనిషత్తు బోధ మొదలుపెడితే, అంతా అయోమయంగా తోస్తుంది. అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణంలోంచి పూర్ణం తీసేసినా పూర్ణమే మిగులుతుంది అని అంటే ఒక్క అక్షరం ముక్క కూడా అర్థంకాదు. అలాగే, బృహదారణ్యకం చాలా పెద్దది. దయానంద సరస్వతి స్వామి హాస్యంగా ఒక మాట చెప్తారు. ఏదైనా మంత్రం ఎవరైనా చెప్పి, ఇది ఎందులోంచి అంటే బృహదారణ్యకం లోది అనాలిట. అవునా, కాదా అని ఎదుటి వ్యక్తి తేల్చటానికి తాతలు దిగివస్తారట. అదీకాక, అది నిజంగానే అందులోనే ఉండే అవకాశమూ ఉంది.

అందుకని ఉపనిషత్తు బోధ ముండకోపనిషత్తుతో మొదలుపెడతారు. శంకరాచార్యుల వారు 10 ఉపనిషత్తులకు వ్యాఖ్యానం చేసినా కనీసం ఆరు ఉపనిషత్తులనన్నా అధ్యయనం చేయాలనీ, అవి కూడా ఈ వరుసక్రమంలో చేస్తే మంచిదనీ పరమార్థానంద స్వామి చెప్పి, ఆయన అదే వరుసక్రమంలో బోధించారు కూడా. అది – ముండక, కేన, కఠ, కైవల్య (కైవల్యం ఈ పదిలో లేకపోయినా ముఖ్యమైనది) తైత్తిరీయ, ఈశావాస్యమ్. అప్పుడు ఒక నిశ్చయ జ్ఞానం కలుగుతుందని చెబుతారు స్వామీజీ.

శంకరాచార్యులవారు ఈ పది ఉపనిషత్తులకే కాదు, మరొక రెండింటికి కూడా భాష్యం రాశారని అంటారు. అవి శ్వేతాశ్వతర ఉపనిషత్, నృసింహ ఉత్తర తాపనీయ ఉపనిషత్.

ఉపనిషత్తుల్లోని సారం ఒక్కటే. అది –

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

ఇదే విషయాన్ని ఒక్కొక్క ఉపనిషత్ ఒక్కొక్క పద్ధతిలో విశ్లేషిస్తుంది. పంచకోశవివేకం, అవస్థాత్రయ వివేకం, ఆత్మానాత్మ వివేకం, అధ్యారోప అపవాదం – ఇలా కొన్నింటిని వాడతాయి. పద్ధతి వేరైనా లక్ష్యం ఒకటే. జీవ ఈశ్వర ఐక్యాన్ని బోధిస్తాయి.

జీవ ఈశ్వర ఐక్య బోధక వేదవాక్యం

ఇలా ఐక్యాన్ని బోధించే ఏ వాక్యాన్నైనా మహావాక్యం అంటారు. అలాంటి మహావాక్యాలు ఉపనిషత్తుల్లో కోకొల్లలు. కాని బాగా ప్రాచుర్యం పొందిన మహావాక్యాలు నాలుగు ఉన్నాయి.

| **మహావాక్యం** | **ఉపనిషత్** |
|---|---|
| ప్రజ్ఞానం బ్రహ్మ | ఐతరేయోపనిషత్ |
| అహం బ్రహ్మాస్మి | బృహదారణ్యకోపనిషత్ |
| తత్త్వమసి | ఛాందోగ్యోపనిషత్ |
| అయమాత్మా బ్రహ్మ | మాండూక్యోపనిషత్ |

సాధారణంగా ఉపనిషత్తుల బోధ గురుశిష్యుల సంవాదరూపంలో సాగుతుంది. ఆ సంవాదం ఒక గురువుకు, ఒక శిష్యునికి మధ్య ఉండవచ్చు; ఒక గురువు అనేక శిష్యుల మధ్య ఉండవచ్చు; అనేక శిష్యులు, అనేక గురువుల మధ్య ఉండవచ్చు. ముండకోపనిషత్, కఠోపనిషత్ – ఒక గురువు, ఒక శిష్యుని మధ్య జరిగిన సంవాదం; ప్రశ్నోపనిషత్‌లో ఆరుగురు శిష్యులు ఒక గురువును ప్రశ్నలు అడుగుతారు; ఛాందోగ్యోపనిషత్, బృహదారణ్యకోపనిషత్‌లో అనేక శిష్యులను, అనేక గురువులను చూస్తాము.

ఇలా గురుశిష్యుల సంవాదరూపంలోనే ఎందుకు ఉంటుంది? దానికి అనేక కారణాలు చెప్పవచ్చు.

1. **సంప్రదాయ పద్ధతి** – బ్రహ్మవిద్యను గురువు ద్వారానే నేర్చుకోవాలి. స్వంతంగా నేర్చుకుంటే తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది.

2. **సుఖార్థ ప్రతిబోధనార్థమ్** – సంభాషణ రూపంలో ఉంటే విషయం తేలిగ్గా అర్థమవుతుంది. శాస్త్రమే అనేక ప్రశ్నలు వేసి, జవాబులు కూడా ఇస్తుంది.

3. **గురుశిష్య పరంపర** – వేదాన్ని శ్రుతి అంటారు. ఋషులు విని, తమ తర్వాత తరంలోని శిష్యులకు అందజేశారు. సాంప్రదాయ తాళంచెవితో తెరుస్తారు వేదాంతాన్ని.

**ఇతి శుశ్రుమ పూర్వేషాం యే నస్తద్వ్యాచచక్షిరే** – కేన 1.3

ఈ విద్య చెప్పటం చాలా కష్టం కాని, మా గురువులు మాకు చెప్పిన పద్ధతిలో చెబుతాను అంటాడు గురువు కేనోపనిషత్‌లో.

4. **లక్ష్యార్థం** – చాలా పదాలకు లక్ష్యార్థాలు ఉంటాయి. అవి సందర్భాన్నిబట్టి అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ఈశావాస్యోపనిషత్‌లో అనేక పదాలకు నిఘంటువు అర్థం సరిపోదు. కొన్నిచోట్ల పదాల గారడీ వస్తుంది.

**తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే** – ఈశావాస్యోపనిషత్ 5

అది కదులుతోంది, కదలటం లేదు; అది దూరంగా ఉంది, దగ్గరగా ఉంది.

**యస్యామతం తస్యమతం మతంయస్య న వేదసః** – కేన 2.3

నాకు బ్రహ్మ తెలుసు అంటే, వారికి బ్రహ్మ తెలియదు; బ్రహ్మ తెలియదు అనుకున్నవారికి బ్రహ్మ తెలుసు.

ఇటువంటి వాక్యాలను గురువు మాత్రమే విడమర్చి చెప్పగలడు. అంతేకాదు, ఒకే పదానికి సందర్భాన్నిబట్టి అర్థం మారుతుంది. ఆత్మ అంటే నేను, బ్రహ్మ, సచ్చిదానంద ఆత్మ– అలా ఏదైనా అర్థం రావచ్చు. దాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. అందువల్ల ఉపనిషత్తులను గురువు ద్వారానే నేర్చుకోవాలి. అది కూడా శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు ద్వారానే నేర్చుకోవాలి. అది కూడా గురువు దగ్గరకు తానే వెళ్ళాలి.

ఈశావాస్యోపనిషత్తుకు ఆ పేరెందుకు వచ్చింది?

ఒక్కొక్క ఉపనిషత్తుకు ఒక్కొక్క పద్ధతిలో పేరు పెట్టారు.

**కేన** – కేనేషితం పతతి ప్రేషితం మనః

**ఈశావాస్య** – ఈశా వాస్యమిదగ్ం సర్వమ్.

ఈ రెండు ఉపనిషత్తులు ఈ పదాలతో మొదలయ్యాయి కాబట్టి వాటికి ఆ పేరు వచ్చింది. కాని అన్ని ఉపనిషత్తులకూ ఈ సూత్రం వర్తించదు.

**ప్రశ్న** – ఆరుగురు శిష్యులు ఒక గురువును ప్రశ్నలు అడిగారు కాబట్టి ప్రశ్నోపనిషత్తు.

**ముండకమ్ –** ముండకం అనేది ఒక శిరోవ్రతం. అదికాక ముండకోపనిషత్తు తక్కిన ఉపనిషత్తులకు శిరస్సు లాంటిది. ఉపనిషత్తులను నేర్చుకునేవారు, ఓం ప్రథమంగా ముండకోపనిషత్తును నేర్చుకుంటారు.

**కఠ –** కాఠక ఋషి చెప్పారు కాబట్టి కఠోపనిషత్తు అయింది.

**ఐతరేయమ్ –** ఐతరేయ అనే ఋషినుంచి వచ్చింది కాబట్టి దీనికి ఐతరేయోపనిషత్తు అనే పేరు వచ్చింది.

అలా ఒక్కొక్క ఉపనిషత్తుకు ఒక్కొక్క కారణంవల్ల ఆ పేరు వచ్చింది.

ఈశావాస్యోపనిషత్‌ను మంత్రోపనిషత్ అనీ, బృహదారణ్యకోపనిషత్‌ను బ్రాహ్మణోపనిషత్ అనీ అంటారు. ఇటువంటి ఇంకొక జంట ముండకోపనిషత్, ప్రశ్నోపనిషత్. ముండకోపనిషత్ మంత్రోపనిషత్ అయితే, ప్రశ్నోపనిషత్ బ్రాహ్మణోపనిషత్. సాధారణంగా బ్రాహ్మణోపనిషత్‌ను, మంత్రోపనిషత్‌కు వ్యాఖ్యానం అంటారు. అంటే ఉపనిషత్తే వ్యాఖ్యానం చేస్తుందన్నమాట.

**ఈశావాస్యోపనిషత్ ప్రత్యేకత**

1. ఈశావాస్యోపనిషత్ మంత్రోపనిషత్

2. ఉపనిషత్తులకు స్వరాలు ఉండేవి మొదట్లో. కాని కొన్నింటికి కాలక్రమేణా ఆ స్వరాలు అంతరించి పోయాయి. కాని కొన్నింటికి మిగిలాయి. వాటిలో ఈశావాస్యోపనిషత్ ఒకటి. తక్కినవి తైత్తిరీయమ్, ఛాందోగ్యమ్, బృహదారణ్యకమ్. ఇలా స్వరాలు ఉన్నచోట వాటికి పద, క్రమ, ఘన, జట పాఠాలు ఉంటాయి.

3. ఈశావాస్యోపనిషత్ చిన్నదే అయినా నేర్చుకోవటం కష్టం. బోధ కష్టం కాదు, ఎందుకంటే అన్ని ఉపనిషత్తుల్లోనూ బోధ ఒకటే – జీవ, ఈశ్వర ఐక్యాన్ని బోధిస్తాయి అవి. కాకపోతే ఇక్కడ కష్టమైనది మంత్రాలను అర్థం చేసుకోవటం. ఆ మంత్రాలను రెండుమూడు రకాలుగా వ్యాఖ్యానించవచ్చు; అదికూడా అద్వైతపరంగానే. ఎవరిదాకానో ఎందుకు, శంకరాచార్యుల వారే భిన్న సందర్భాల్లో భిన్న రీతుల్లో భాష్యం రాశారు. ఈశావాస్యోపనిషత్‌కు భాష్యం రాసినప్పుడు ఒకలాగా, బృహదారణ్యకంలో ఉటంకించినప్పుడు మరొకలాగా, ఛాందోగ్యంలో ఉటంకించినప్పుడు ఇంకొకలాగా భాష్యం రాశారు. ఈ విషయాన్ని మీరు సానుకూలంగా తీసుకున్నా సరే, ప్రతికూలంగా తీసుకున్నాసరే, దీని ప్రత్యేకత ఇది.

4. ఈశావాస్యోపనిషత్ శాంతిపాఠంలోనే ప్రత్యేకత ఉంది. తక్కిన శాంతిపాఠాలు ఈశ్వరానుగ్రహంకోసం, ఆరోగ్యరక్షణకోసం ఉంటే, ఈ శాంతిపాఠంలోనే మొత్తం వేదాంత సారం వచ్చేస్తుంది.

# శాంతిపాఠం

ఒక్కొక్క వేదానికి ఒక్కొక్క శాంతిపాఠం ఉంటుంది. ఈ క్రింది పట్టికలో ఏ వేదానికి ఏ ఉపనిషత్తులు చెందుతాయో, వాటిల్లో వచ్చే నాలుగు ప్రసిద్ధమైన మహావాక్యాలు ఏమిటో, ఆయా వేదాలకు చెందిన శాంతిపాఠాలు ఏమిటో ఒక్కచోట చూడవచ్చు.

| క్రమసంఖ్య | వేదం | ఉపనిషత్ | మహావాక్యం | శాంతిపాఠం |
|---|---|---|---|---|
| 1. | ఋగ్వేదం | ఐతరేయమ్ | ప్రజ్ఞానం బ్రహ్మ | వాఙ్మేమనసి |
| 2. | కృష్ణయజుర్వేదం | కఠ, తైత్తిరీయమ్ | – | సహ నావవతు |
| 3. | శుక్లయజుర్వేదం | ఈశ, బృహదారణ్యకమ్ | అహం బ్రహ్మాస్మి | పూర్ణమదః |
| 4. | సామవేదం | కేన, ఛాందోగ్యమ్ | తత్త్వమసి | అప్యాయంతు |
| 5. | అథర్వణవేదం | ప్రశ్న, ముండకమ్, మాండూక్యమ్ | అయమాత్మా బ్రహ్మ | భద్రం కర్ణేభిః |

శాంతిపాఠం ఎందుకు పఠించాలి?

ఒక పని విజయవంతమవ్వాలంటే దానికి మూడు అంశాలు తోడ్పడాలి. ప్రయత్నం– కాలం– దైవం. ప్రయత్నం అంటే మనం అనుకున్నపనిని వీడకుండా అంకితభావంతో ప్రయత్నం చేయటం. కొంతమందికి ఆరంభశూరత్వం ఉంటుంది. వారు చాలా ఉత్సాహంతో మొదలు పెడతారు గాని, ఒక్క ఎదురుదెబ్బతగిలినా చతికిలపడిపోతారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకు దూసుకుపోయేలా ఉండాలి. కాలం అంటే సమయం. ఏ పని కూడా రాత్రికి రాత్రి అయిపోదు. దానికి కొంత సమయం వెచ్చించాలి. ఫలితానికి కొంతకాలం వేచి ఉండాలి. మూడోది దైవానుకూలం. మనకు ఎదురయ్యే ఆటంకాలను మనం ఊహించలేము. వాటిని అడ్డుకునే శక్తి లేదు. దీన్ని కర్మ అనీ, అదృష్టం అనీ, దైవానుగ్రహం అనీ అంటారు. ఈ దైవానుగ్రహంకోసం చేసే ప్రార్థన ఈ శాంతిపాఠం.

మానవ ప్రయత్నమూ, ఈశ్వరానుగ్రహమూ రెండూ ఉండాలి. ఈశ్వరానుగ్రహం లేకపోతే ఎంత ప్రయత్నం చేసినా విజయం పొందలేము. అలాగని ఈశ్వరానుగ్రహం చాలని వదిలేసినా చాలదు. ఈశ్వరానుగ్రహం సమృద్ధిగా ఉంది, సూర్యరశ్మి సమృద్ధిగా ఉన్నట్టుగా. అది కూడా మన చుట్టూ ఉంది. దాన్ని మనం తెలుసుకుని, వినియోగించుకోవాలి.

ఉపనిషత్తు నేర్చుకునే విద్యార్థులు శాంతిపాఠం రెండు కారణాలకోసం పఠిస్తారు. అవి– శారీరక ఆరోగ్యం పొందటానికి, ఆటంకాలు తొలగటానికి.

**1. శారీరక ఆరోగ్యం–** ఉపనిషత్తులు నేర్చుకోవటానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. అందుకని శారీరక ఆరోగ్యంకోసం ప్రార్థన చేస్తారు. ఎక్కడో జరిగే క్లాసుకు వెళ్ళాలి. గంట కూర్చోవాలి.

**మనసు–** మనసు బాగుండకపోతే శరీరం సహకరించినా గురువు బోధ ఎక్కదు.

**బుద్ధి –** ఉపనిషత్తు నేర్చుకోవటం అంటే మామూలు విషయం కాదు.దానికి సూక్ష్మబుద్ధి ఉండాలి. క్షురకుని కత్తి అంత పదునుగా ఉండాలని యమధర్మరాజే స్వయంగా చెబుతాడు. ఇందులో తర్కం చాలా ఉంటుంది. అది అర్థం కావాలి.

**ఇంద్రియాలు–** చెవులు బాగా పనిచేయాలి.గురువు చెప్పేది ఒకటి, మనం వినేది ఒకటి అయితే అర్థం మారిపోతుంది. గురువు నువ్వు ఇమ్మోర్టల్ (శాశ్వతం) అంటే నువ్వు ఇమ్మోరల్ (అనైతికం) అని వింటే ప్రమాదం.

అందుకని శరీరం,మనసు,బుద్ధి, ఇంద్రియాలు బాగుండాలని కోరుకుంటాము. మన ప్రారబ్ధకర్మని తొలగించమనటం లేదు.మనం ఉపనిషత్తు నేర్చుకునే ఆ గంటా మన బాధలను కొంచెం ఆపమని కోరుకుంటున్నాము.

**2.ఆటంకాలు –** మనకు కలిగే ఆటంకాలను త్రివిధ ప్రతిబంధకాలు అంటారు. వాటి నివృత్తికోసం ప్రార్థన చేస్తున్నాము. అవి –

**అధిదైవిక** – ప్రకృతి వైపరీత్యాలు – వానలు, వరదలులాంటివి. వాటిమీద మనకేమీ అధికారం లేదు.

**అధిభౌతిక** – మన తోటి మనుష్యులవల్ల కలిగే ఆటంకాలు. సరిగ్గా మనం ఉపనిషత్తు క్లాసుకి బయల్దేరేముందు ఏ చుట్టమో వస్తే వారిని కాదని వెళ్ళలేము కాని కొంతవరకూ మనం దీన్ని అదుపులో పెట్టగలము. మన ఇంటికి తరచుగా వచ్చే బంధువులకు నేను బుధ,గురువారాల్లో 10 నుంచి 12 వరకూ ఉండను, ఆధ్యాత్మిక ప్రసంగాలకు వెళతాను, దయచేసి ఆ సమయంలో తప్ప వేరే ఎప్పుడైనా రండి అని వారికి ముందే చెప్పుకోగలం.

**అధ్యాత్మిక** – మనకు మనమే పెద్ద ఆటంకం.మూడు అడుగులు ముందుకు వేద్దామనుకుంటే, ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది మనసు. అమ్మో, ఆత్మవిద్యా! నాకేం వస్తుంది అనుకుంటాం. దీన్ని చాలామటుకు అదుపులో పెట్టగలం. మన మనసును మనమే నియంత్రించుకోవాలి.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే।**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

**అదః పూర్ణమ్** – అది పూర్ణం. అది అంటే ఆ పరమాత్మ. అదః అక్షరాలా తీసుకుంటే 'ఆ' అని వస్తుంది. 'ఆ' ఎవరు? పరమాత్మ. ఆ పరమాత్మ పూర్ణం అంటే అనంతం.

**ఇదం పూర్ణమ్** – ఇది పూర్ణం. ఇదం అక్షరాలా తీసుకుంటే 'ఈ' అని వస్తుంది. ఈ ఎవరు? జీవాత్మ. అందువల్ల ఇదం పూర్ణం అంటే ఈ జీవాత్మ పూర్ణం. పూర్ణం అంటే అనంతం. ఈ రెండు వాక్యాలనూ కలిపితే కొన్ని ఉపసిద్ధాంతాలు వస్తాయి.

1. **జీవాత్మ, పరమాత్మల ఐక్యం** – పరమాత్మ అనంతం అంటే దేశపరంగా అనంతం, కాలపరంగా అనంతం, వస్తుపరంగా అనంతం అంటే అన్ని విధాలా సర్వవ్యాపకం. జీవాత్మ కూడా అనంతం అన్నాము. కాని నిజానికి అనంతంగా సర్వవ్యాపకంగా ఉన్నది ఒకటే ఉంటుంది. రెండు అనంతాలు అంటే రెండు భిన్నమైనవి సర్వవ్యాపకమైనవి లేవు. రెండు పూర్ణాలు ఉన్నాయి అని చెపితే, అది తర్కవిరుద్ధంగా ఉంటుంది.

దీనికి ఒకటే మార్గం ఉంది. ఏమిటది? ఒకటే అనంతంగా సర్వవ్యాపకంగా ఉంటుంది కాబట్టి; పరమాత్మ అనంతం, జీవాత్మ కూడా అనంతం అంటే, పరమాత్మ, జీవాత్మ ఒకటే అవాలి. పూర్ణమదః పూర్ణమిదం వాక్యం– మహావాక్యం. జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని సూచించే వాక్యం.

2. **లక్ష్యార్థదృష్ట్యా ఐక్యం** – పరమాత్మ అంటే సోపాధిక పరమాత్మ, నిరుపాధిక పరమాత్మ ఉన్నారు. అలాగే జీవాత్మ అంటే కూడా సోపాధిక జీవాత్మ, నిరుపాధిక జీవాత్మ ఉన్నారు. ఇప్పుడు ఐక్యం దేని పరంగా?

| సోపాధిక జీవాత్మ | సోపాధిక పరమాత్మ |
|---|---|
| స్థూలశరీరం | స్థూలప్రపంచం |
| సూక్ష్మశరీరం | సూక్ష్మప్రపంచం |
| కారణశరీరం | కారణప్రపంచం |
| చిదాభాస | చిదాభాస |
| చిత్ | చిత్ |

సోపాధికంగా చూస్తే జీవాత్మలోనూ, పరమాత్మలోనూ ఐదు అంశాలు ఉంటాయి. సోపాధిక జీవాత్మను వ్యష్టి ఉపాధి అనీ, సోపాధిక పరమాత్మను సమష్టి ఉపాధి అనీ అంటారు. ఉపాధుల పరంగా చూస్తే పరమాత్మకు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వశ్రేష్ఠుడు అనే గుణాలు ఉన్నాయి. జీవాత్మకు అల్పజ్ఞుడు, అల్పవ్యాపి అనే గుణాలు ఉన్నాయి. జీవాత్మ మూడు శరీరాలు, పరమాత్మ మూడు ప్రపంచాలు చాలా భిన్నంగా ఉన్నాయి. అవి ప్రతిబింబమాధ్యమాలు. ఆ ప్రతిబింబమాధ్యమాల్లో ప్రతిబింబించబడే చైతన్యంలో కూడా

వ్యత్యాసం ఉంటుంది. దాన్ని చిదాభాస అంటారు. రెండింటిలోనూ సమానంగా ఉన్నది చిత్ మాత్రమే. దాన్ని శుద్ధచిత్ అంటారు.

అందువల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి మాట్లాడితే అది ఉపాధి పరంగా కాదు, ఉపాధి లేకుండా శుద్ధచైతన్యపరంగా. అంటే నిరుపాధిక పరమాత్మ, నిరుపాధిక జీవాత్మలు ఒకటే. అంటే దీన్ని లక్ష్యార్థం అంటారు.

**లక్ష్యార్థదృష్ట్యా తత్త్వపదార్థయోః ఐక్యమ్**

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** – పూర్ణమైన పరమాత్మనుంచి పూర్ణమైన జీవాత్మ ఉద్భవించింది. అంటే ఏమిటి? పరమాత్మనుంచి జీవాత్మ పుట్టింది. ఇంతకు ముందేమో జీవాత్మ, పరమాత్మ ఐక్యం అన్నాము. ఇప్పుడేమో జీవాత్మ పరమాత్మనుంచి పుట్టింది అంటున్నాము. అదెలా సాధ్యం? దీన్నించి ఉపసిద్ధాంతాన్ని చూద్దాము.

**కార్యకారణ సంబంధం** – జీవాత్మ, పరమాత్మనుంచి పుట్టింది అంటే, జీవాత్మ కార్యం, పరమాత్మ కారణం. అందువల్ల ఇద్దరి మధ్యా కార్యకారణ సంబంధం ఉంటుంది. కార్యకారణాల మధ్య ఐక్యం ఎలా ఉంటుంది? అలా అయితే తండ్రీ, కొడుకులు ఒకటే అన్నట్టు ఉంటుంది. అక్కడ ఐక్యం నిరుపాధిక దృష్ట్యా అన్నాము.

అందువల్ల ఇక్కడ భేదం సోపాధికదృష్ట్యా వస్తుంది. కార్యకారణ సంబంధం సోపాధిక దృష్ట్యా వస్తుంది. అంటే సోపాధిక పరమాత్మనుంచి సోపాధిక జీవాత్మ పుట్టింది.

**వాచ్యార్థ దృష్ట్యా తత్త్వపదార్థయోః కార్యకారణసంబంధః**

ఎవరైనా జీవ–ఈశ్వరుల మధ్య ఉన్న సంబంధం ఏమిటని అడిగితే, దానికి వెంటనే జవాబు చెప్పకూడదు. ఎదురు ప్రశ్నించాలి. దేని దృష్ట్యా అని అడగాలి. అనాత్మ దృష్ట్యా కార్యకారణ సంబంధం; ఆత్మ దృష్ట్యా ఐక్య సంబంధం. జీవ–ఈశ్వరుల మధ్య సంబంధం ఈ రెండు దృష్టులనుబట్టి ఉంటుంది. ఇది అర్థం కాకపోతే, మనం అద్వైతాన్ని అర్థం చేసుకోలేము.

శంకరులవారు అద్వైతంమీద ఎన్నో రచనలు చేశారు. వాటిల్లో ధ్యానశ్లోకాల్లో భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. తర్వాతంతా జీవాత్మ –పరమాత్మల ఐక్యం గురించి చెబుతారు. ఉదాహరణకు భజగోవిందంలో ప్రార్థన శ్లోకంలో భేదం ఉంటుంది. తర్వాతంతా అభేదం చూపిస్తారు. అందువల్ల కొందరు శంకరులవారిని సరిగా అర్థంచేసుకోలేరు. శంకరులవారిని అర్థం చేసుకోవాలంటే, మనకు అద్వైతం సరిగా అర్థం అవాలి. పరమాత్మ, జీవాత్మలను రెండు రకాలుగా చూస్తామని; అవి సోపాధిక, నిరుపాధికంగా చూస్తామనీ తెలియాలి. అప్పుడే

శంకరులవారు అర్థమవుతారు. లేకపోతే అయోమయంలో పడ్డది ఆయన కాదు, మనం అవుతాము.

అందువల్ల ఇక్కడ సోపాధిక దృష్ట్యా జీవాత్మ–పరమాత్మల మధ్య కార్యకారణ సంబంధం ఉంది.

**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** – పూర్ణంలోంచి పూర్ణం తీస్తే పూర్ణమే మిగులుతుంది. పూర్ణస్య అంటే సోపాధిక ఆత్మ. పూర్ణం ఆదాయ అంటే పూర్ణ ఆత్మను తీస్తే, మిగిలేది ఏమిటి?

**పూర్ణమేవ అవశిష్యతే** – పూర్ణం మాత్రమే మిగులుతుంది. దీని ప్రత్యేకత ఏమిటో చూద్దాము. సోపాధిక ఆత్మ అంటే ఆత్మ+ఉపాధి. ఆత్మ+ఉపాధినుంచి ఆత్మను తీస్తే ఏం మిగలాలి? ఉపాధి మిగలాలి. కాని ఉపనిషత్తు ఏమంటోంది? ఆత్మ ఏవ అవశిష్యతి అంటున్నది. అంటే ఆత్మ మాత్రమే మిగులుతుంది అంటున్నది. అదెలా సాధ్యం? అదెలాగంటే, ఆత్మ లేకుండా ఉపాధికి విడిగా ఉనికి లేదు. ఉపాధి అంటే అనాత్మ. అనాత్మకు ఆత్మ లేకుండా ఉనికి లేదు. అనాత్మకు విడిగా ఉనికి లేదు కాబట్టి అనాత్మ మిథ్య.

రెండు ఉపాధులు ఉన్నాయని చూశాము. అవి – వ్యష్టి ఉపాధి, సమష్టి ఉపాధి. ప్రపంచం సమష్టి ఉపాధి, శరీరం వ్యష్టి ఉపాధి. ఈ రెండింటికీ అధిష్ఠానం ఆత్మ. వాటినుంచి వాటి అధిష్ఠానమైన ఆత్మను తీసేస్తే అవి ఉన్నా, లేనట్టే!

కుండ = మట్టి + నామరూపాలు
కుండ – మట్టి = నామరూపాలు అవాలి.

కాని ఉపనిషత్తు ఏమంటున్నది?

కుండ – మట్టి = మట్టి

అదెలా? నామరూపాలు ఎప్పుడు వస్తాయి? ఒక వస్తువు పుడితే. మట్టినుంచి ఒక వస్తువు పుడితే, దానికి కుండ నామరూపాలు వచ్చాయి. కాని కుండనుంచి మట్టిని తీసేస్తే, కుండ ఆకారం ఉండదు. కుండ ఆకారం లేకపోతే నామరూపాలు దేనికి? ఆ విధంగా నామరూపాలు మిథ్య అవుతాయి; మిథ్యకు విడిగా ఉనికి లేదు కాబట్టి, సత్య అధిష్ఠానం అయిన మట్టే మిగులుతుంది. ఇప్పుడు ఇదే సూత్రాన్ని ఆత్మకు ఉపయోగిస్తే

జగత్తు = ఆత్మ + అనాత్మ
జగత్తు – ఆత్మ = అనాత్మ అవాలి

కాని ఉపనిషత్తు ఏమంటున్నది?

జగత్తు – ఆత్మ = ఆత్మ

అదెలా? ఆత్మ లేకుండా అనాత్మ జగత్తుకు విడిగా ఉనికి లేదు; **జగత్తు మిథ్య,** ఆత్మ లేదా బ్రహ్మ సత్యం. ఇదీ ఈ వాక్యం అర్థం. ఇప్పుడు ఈ శాంతి మంత్రాన్ని మళ్ళీ టూకీగా చూస్తే –

| | |
|---|---|
| **పూర్ణమదః పూర్ణమిదమ్** | **– జీవాత్మ పరమాత్మల ఐక్యం** |
| **పూర్ణాత్ పూర్ణముదచ్యతే** | **– జీవాత్మ పరమాత్మల మధ్య కార్యకారణ సంబంధం** |
| **పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే** | **– బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా** |

దశ ఉపనిషత్తులలో ఈశావోస్యోపనిషత్తును మొదటి ఉపనిషత్తుగా పేర్కొంటారు.

**ఈశకేన కఠప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

అలాగని మొట్టమొదట ఈశావాస్యం నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే మెదడు వేడెక్కిపోతుంది. దానికి శాంతిపాఠం ఇదే. దీన్ని ఉన్నది ఉన్నట్టుగా చెపితే – అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణంనుంచి పూర్ణం వచ్చింది; పూర్ణంలోంచి పూర్ణం తీస్తే పూర్ణమే మిగులుతుంది. ఇన్ని పూర్ణాలేమిటో అర్థం కాక తల పూర్ణంగా తిరుగుతుంది. నిజానికి ఇది గొప్ప అద్వైత మంత్రం. పైన చూసినట్టుగా వేదాంతసారం అంతా మూడు వాక్యాల్లో వచ్చేసింది. ఇదొక్కటి అర్థం చేసుకుంటే చాలు, వేదాంతాన్నంతా అర్థం చేసుకున్నట్టే.

**ఓం శాంతిః శాంతిః శాంతిః –** త్రివిధ ప్రతిబంధాలనుంచి నన్ను నివృత్తుని చేయి. అధిదైవిక, అధిభౌతిక, అధ్యాత్మిక ఆటంకాలను తొలగించు.

శాంతికి ఇంకో అర్థం కూడా ఉంది. మనం ప్రారబ్ధకర్మతో అవస్థపడుతున్నప్పుడు ప్రాయశ్చిత్తకర్మల ద్వారా దాని చెడు ఫలితాలని తగ్గించుకోవటానికి ప్రయత్నిస్తాము. దీన్ని శాంతి కర్మ అంటారు. అది కర్మ అవచ్చు, ప్రార్థన అవచ్చు. ఇక్కడ శాంతి ప్రార్థన ఆటంకాలని తొలగించటానికి చేస్తాము. శాంతిపాఠం అంటే గట్టిగా చదవాల్సి ఉంటుంది.

చిన్మయానంద స్వామి చలోక్తిగా ఈ ఓం శాంతిః శాంతిః శాంతిః మూడు రకాలుగా పలకాలని చెబుతారు. మొదటి శాంతి ఆధిదైవిక ఆటంక నివృత్తికోసం కాబట్టి ఎక్కువ గట్టిగాను, రెండోది తోటిమానవులకు వర్తిస్తుంది కాబట్టి గట్టిగాను, మూడోది మన మనసుకు చెప్పేది కాబట్టి చాలా చిన్న గొంతుతోనూ చెప్పాలంటారు.

**ఉపసిద్ధాంతం** – ఈ సందర్భంలో మాయ గురించి ప్రత్యేకించి చెప్పకపోయినా, మనం తెలుసుకుంటే మంచిది. బ్రహ్మ, జగత్తుల మధ్య కార్యకారణ సంబంధం ఉంది అన్నప్పుడు బ్రహ్మ అంటే మాయాసహితబ్రహ్మ అని అర్థం చేసుకోవాలి.

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు; సగుణ ఈశ్వరుడు – సృష్టికర్త

బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అన్నప్పుడు మాయను జగత్తుతో కలుపుకోవాలి. నిర్గుణబ్రహ్మ సత్యం, మాయ+జగత్తు మిథ్య.

మనం శాంతిపాఠం పఠించి మన ప్రతిబంధకాలకు తాత్కాలికంగా స్టే ఆర్డర్ తెచ్చుకున్నాం. కాబట్టి ఇంక ఉపనిషత్తులోకి అడుగు పెడదాము.

# శ్రీ శంకర భగవత్పాదుల ఉపోద్ఘాతం

మామూలుగా ఉపనిషత్తులను బ్రాహ్మణోపనిషత్తులు అంటారు. అవి వేద అంతభాగంలో వస్తాయి. కాని ఈశావాస్యోపనిషత్‌ను మంత్రోపనిషత్ అంటారు. అది వేద మధ్యభాగంలో వస్తుంది. అందువల్ల వేద పూర్వభాగాన్ని ఆధారం చేసుకుని కర్మఠులు ఈశావాస్యోపనిషత్ కర్మకాండలోకి వస్తుందని వాదిస్తారు. వారు కర్మశేషత్వం ఉంది అంటారు. శేషత్వం అంటే ఇక్కడ సంబంధం. కర్మ సంబంధం ఉంది అంటారు.

శంకరాచార్యులవారు ఆ వాదనను తన ఉపోద్ఘాతంలో ఖండిస్తారు. ఆ వాదనయొక్క సారాంశాన్ని, స్వామీజీ చెప్పినదాంట్లోంచి టూకీగా చూద్దాము.

కర్మ కొంచెం కూడా లేదు; జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది అంటారు శంకరాచార్యుల వారు.

**కర్మశేషతా నాస్తి**

అంటారు శంకరాచార్యులవారు. ఇది నిరూపించటానికి పూర్వమీమాంసలోకే వెళతారు. కర్మకాండను నమ్మేవారిని పూర్వమీమాంసకులనీ, పూర్వపక్షులనీ అంటారు. పూర్వపక్షి అంటే పక్షి కాదు; వేదపూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని వాదన చేసేవారని అర్థం. వారు ఒక మంత్రాన్ని కర్మకాండకు చెందిందో లేదో చెప్పటానికి ఐదు అంశాలు తీసుకుంటారు. శంకరాచార్యుల వారు అందులో రెండు తీసుకున్నారు. అవి శ్రుతి ప్రమాణం, లింగ ప్రమాణం.

**శ్రుతి ప్రమాణం** – శ్రుతే ప్రత్యక్షంగా ఈ కర్మ చేయండని చెబుతుంది.

**ఇషేత్వా ఇతి ఛినత్తి**

కొమ్మను కోస్తున్నప్పుడు మంత్రం చదవండి అంటున్నది ఈ మంత్రం.

**లింగ ప్రమాణం** – శ్రుతి ఒక్కోసారి ప్రత్యక్షంగా చెప్పదు కాని, సందర్భాన్ని బట్టి అది కర్మకాండతో కలుపుకోవాలని అర్థం చేసుకోవచ్చు. లౌకిక ఉదాహరణ తీసుకుంటే 'నేను భిక్ష వేస్తున్నాను' అని ఎవరైనా అంటే అతను ఒక స్వామీజీని భోజనానికి పిలిచాడని అర్థం చేసుకోవచ్చు. శాస్త్రంనుంచి ఉదాహరణ చూస్తే,

**బర్హిః దేవసదనం దామి**

నేను హోమగుండం తయారుచేస్తున్నాను అని అంటే, యజ్ఞం చేయటంకోసం హోమగుండం తయారుచేస్తున్నాను అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది.

కాని ఈ రెండు ప్రమాణాలు కూడా ఈశావాస్యోపనిషత్తుకు చెందవు అంటున్నారు శంకరాచార్యులవారు. ఈశావాస్యం ఎక్కడా అందువల్ల కర్మ చేయండి అని చెప్పలేదు.

కాబట్టి వినియోజక శ్రుతిప్రమాణం నాస్తి అంటారు శంకరాచార్యులవారు. అంతేకాదు, కర్మాంగభూతజీవుడు లేడు. అందువల్ల లింగప్రమాణం కూడా లేదు అంటారు.

**పూర్వమీమాంసకుల వాదన** – పూర్వమీమాంసకులు శ్రుతిప్రమాణం లేదు నిజమే ఒప్పుకుంటాము కాని, లింగప్రమాణం ఉంది అంటారు. దానికి వారు చెప్పే కారణం ఇది. ఈశావాస్యోపనిషత్తు వివరిస్తున్నది జీవాత్మ గురించి. జీవాత్మ కర్తా, భోక్తా. జీవాత్మ అనేక కర్మలు చేస్తాడు కాబట్టి ఇది కర్తృప్రతిపాదక ఉపనిషత్ అంటారు వారు.

**శంకరుల వారి జవాబు** – శంకరులవారు, ఈ ఉపనిషత్ జీవాత్మ గురించి చెబుతున్నది నిజమే కాని, జీవాత్మ స్వరూపం ఏమిటో చూడండి అంటున్నారు. జీవాత్మను అకర్తా, అభోక్తా, నిత్యముక్త పురుషః అని వర్ణిస్తుంది ఉపనిషత్. అందువల్ల ఈ ఉపనిషత్ కర్మాంగం అవదు అంటారు. దానికి ఈ ఉపనిషత్‌లో రాబోయే మంత్రాన్ని ఉటంకిస్తున్నారు.

**స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరగ్ం శుద్ధమపాపవిద్ధమ్।**
**కవిర్మనీషీ పరిభూః స్వయమ్భూర్యాథాతథ్యతో ఽర్థాన్వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః॥ 8**

అంటే ఆత్మ సర్వవ్యాపకం, శుద్ధం, ఏకం, నిత్యం, శరీరరహితం, పాపరహితం వంటి గుణాలు వస్తాయి. అందువల్ల ఆత్మ కర్తా కాదు, భోక్తా కాదు; ఆత్మ కర్మఫలం కూడా కాదు.

కర్మఫలం నాలుగు విధాలుగా వస్తుంది.

| | | |
|---|---|---|
| ఉత్పత్తి | – కుండ పుట్టటం | – ఆత్మ నిత్యం |
| వికారం | – పాలు పెరుగుగా మారటం | – ఆత్మ శరీరరహితం |
| ఆప్తి | – స్వర్గానికి వెళ్ళటం | – ఆత్మ సర్వవ్యాపకం |
| సంస్కారం | – తడి వస్త్రంతో అద్దం తుడవటం | – ఆత్మ శుద్ధం |

నిజానికి ఈ సంస్కారాన్ని రెండు విధాలుగా చేస్తారు. మన లౌకికజీవనంలో శరీరం విషయమే తీసుకుంటే స్నానం చేస్తే శరీరానికున్న మలినం పోతుంది. దాన్ని దోష అపనయనం అంటారు. కాని ఆత్మ అపాపవిద్ధం. స్నానం చేశాక పౌడరు అద్దటం, సెంటు రాయటం గుణ ఆధానం అంటారు. కాని ఆత్మ శుద్ధం. ఈ కారణాల దృష్ట్యా ఆత్మ చతుర్విధఫల విలక్షణం అని చెప్పవచ్చు.

**పూర్వమీమాంసకుల వాదన** – పూర్వమీమాంసకులు ఉపనిషత్తులోని వాక్యాలను **అర్థవాద వాక్యాలు** అంటారు. అర్థవాద వాక్యాలు అంటే స్తుతి వాక్యాలు. ఆ విధంగా శ్రుతి నువ్వు అకర్తా, అభోక్తా, శుద్ధం, నిత్యం అంటూ స్తుతిస్తున్నది అంటారు వారు.

**శంకరుల వారి జవాబు** – మళ్ళీ పూర్వమీమాంసలోకే వెళితే అందులో అర్థవాద వాక్యాలు ఉన్నాయి. వాటికి విడిగా ఉనికి లేదు. వాటిని విధివాక్యాలతో కలుపుకోవాలి. ఉదాహరణకు

**వాయుర్వై క్షేపిష్ఠా దేవతా** అని కర్మకాండలో వస్తుంది. దాని అర్థం వాయుదేవత చాలా వేగంగా వెళ్ళే దేవత. దానివల్ల మనకేమిటి ప్రయోజనం? దీన్ని **వాయవ్యం శ్వేతమాలభేత**తో కలుపుకోవాలి. అందువల్ల వాయువుకు పూజ చేయాలి. వాయువుకు పూజ చేస్తే ఆయన ఫలాన్ని అంత వేగంగానూ ఇస్తాడని ఆ మొదటివాక్యం ఉద్దేశ్యం.

కాని ఈశావాస్యోపనిషత్‌లో అటువంటి విధివాక్యాలు లేవు. ఆత్మ నిత్యం, శుద్ధం పదాలు వాడాక, వాటి తర్వాత వేరే విధివాక్యాలు లేవు. ఉపనిషత్తు ఆత్మస్వరూపం చెప్పి ముగిస్తుంది. ఆ మాటకొస్తే ఒక్క ఈశావాస్యోపనిషత్తే కాదు, ఏ ఉపనిషత్తు కూడా విధి వాక్యాలను చెప్పదు. ప్రతి ఉపనిషత్తు కూడా ఆత్మస్వరూపం చెప్పి ముగిస్తుంది. అందువల్ల ఈ వాక్యాలు అర్థవాద వాక్యాలు కావు, సత్యవాక్యాలు.

ఇది కర్మకాండలో భాగం అని చెప్పటానికి శ్రుతిప్రమాణం లేదు, లింగప్రమాణం లేదు, అర్థవాదం కాదు. అందువల్ల జ్ఞానకాండ పృథక్ శాస్త్రం అని నిరూపిస్తారు శంకరాచార్యులవారు. ఉపనిషత్తుల్లోనే కాదు, గీతాశాస్త్రంలో కాని, మహాభారతంలోని మోక్షధర్మపర్వంలో కూడా కర్మసంబంధం లేదు. అవన్నీ **జ్ఞానాదేవ తు కైవల్యమ్** అని నిరూపిస్తాయి అంటారు శంకరాచార్యులవారు.

ఇక్కడ స్వామీజీ (పరమార్థానందజీ) మనకు రాగల సందేహాలను ఊహించుకుని వాటికి జవాబులను ఇస్తున్నారు.

**సందేహం** – జ్ఞానకాండ ఆత్మను అకర్తా, అభోక్తా అని నిరూపిస్తే, మరి కర్మకాండ ఆత్మను కర్తా, భోక్తా అంటుంది కదా! ఈ రెండింటిలో ఏది సత్యం? రెండూ సత్యమే అనలేము. ఎందుకంటే ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు. రెండూ వేదంలోని వాక్యాలే.

వేదపూర్వభాగం ఆత్మ కర్తా, భోక్తా అంటున్నది; వేదఅంతభాగం ఆత్మ అకర్తా, అభోక్తా అంటున్నది. వేదఅంతభాగాన్ని మాత్రం ప్రమాణంగా స్వీకరించి, వేదపూర్వభాగాన్ని అప్రమాణంగా కొట్టివేయమంటే అది అర్థజరతీయ న్యాయం అవుతుంది.

ఒక రోగి వైద్యుని దగ్గరకి వెళ్ళి, 'నా కుడి మోకాలు నొప్పిగా ఉంది,' అన్నాడు. అతనికి వయస్సు అరవై దాటిందని తెలిసిన వైద్యుడు, 'నీకు వయస్సు పైబడింది, అందువల్ల కాలునొప్పి వచ్చింది,' అంటే అతను వాదిస్తాడు. 'నా ఎడమకాలుకు కూడా అంతే వయస్సు ఉంది, దానికి ఎందుకు రాలేదు?' దీన్ని అర్థజరతీయ న్యాయం అంటారు.

**జవాబు** – కర్మకాండ కొత్తగా ఆత్మ కర్తా, భోక్తా అని చెప్పదు. వేదాన్ని ప్రమాణం అంటాము. ప్రమాణం నిర్వచనాల్లో ఒక నిర్వచనం అది మనకు ముందే తెలిసిన విషయాన్ని కొత్తగా చెప్పకూడదు. మనిషి కర్మలు చేయాలి, వాటికి తగ్గ ఫలాలు వస్తాయని అందరికీ తెలుసు.

వేదం ఆ విషయం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఒకవేళ అందరికీ తెలియకపోతే, వేదానికి రానివారికి కర్మలు చేయాలని తెలియకూడదు. కాని అందరూ చేస్తూనే ఉన్నారు.

అందువల్ల వేదం కొత్తగా ఆత్మ కర్తా, భోక్తా అని చెప్పటం లేదు. మనకు తెలిసిన విషయాలనే చెబుతున్నది. వాటిని అనువాద వాక్యాని అంటారు. అవి ప్రమాణవాక్యాలు కావు. వేదం గొప్పతనమే అది. మనం ఏ స్థాయిలో ఉంటే, అది మన స్థాయికి దిగివచ్చి అక్కడినుంచి మనను నెమ్మదిగా పైకి లేపుతుంది. మనం బురదలో ఉంటే, అది కూడా బురదలోకి వస్తుంది. మనం నేను కర్తా, భోక్తా, సంసారిని అనుకుంటున్నాము కాబట్టి వేదం, 'అవును నిజమే, నువ్వు కర్తా, భోక్తా, సంసారివి. ఈ సంసారంనుంచి బయటపడే మార్గమేమిటో నేను చెబుతాను రా,' అంటుంది. ఒకవేళ వేదం ముందే, 'నువ్వు కర్తవు కాదు, భోక్తవు కాదు, నీకు శరీరమే లేదు. నీకు సంసారమే లేదు, నువ్వు ముందే ముక్తపురుషుడివి,' అంటే ఎవరూ వేదానికి రారు.

అందువల్ల వేదం మన వాదనలను ఒప్పుకుంటున్నట్టు నటిస్తూనే వాటిలోని లోపాలను ఎత్తిచూపి, నెమ్మదిగా మనం చేసే కర్మను కర్మయోగంగా మలుస్తుంది. దాని తర్వాత జ్ఞానయోగం వైపుకు మళ్ళేలా చేస్తుంది.

అంతేకాదు కర్మ చేయటానికి అధికారిత్వం కూడా నిర్దేశిస్తుంది. అది కూడా మనిషికున్న అపోహలనుంచి ఏర్పరచినవే. మూడు అర్హతలు ఉండాలి అనుకుంటాడు మనిషి. అవును సుమా, అది నిజమే అంటుంది. ఆ మూడు అర్హతలు –

1. అర్థిత్వమ్ – ఫలంమీద కోరిక ఉండాలి – స్వర్గలోకానికి వెళ్ళాలనే కోరిక ఉండాలి
2. ద్విజత్వమ్ – ఉపనయనం జరిగివుండాలి. అది బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకే సాధ్యం
3. దక్షత్వమ్ – యోగ్యత ఉండాలి. ధనం, భార్య, ఆరోగ్యం ఉండాలి

వైదికకర్మలు చేయాలంటే వేదమంత్రాలు పఠించగలగాలి. వేదమంత్రాలు పఠించాలంటే ఉపనయనం జరిగివుండాలి. ఉపనయనం జరిగిన వ్యక్తిని ద్విజుడు అంటారు. ద్విజుడు అంటే రెండుసార్లు పుట్టినవాడు. శాస్త్రం అసలు నీకు చావు, పుట్టుకలే లేవు అంటే రెండోసారి పుట్టే ప్రసక్తి ఎక్కడ ఉంది? కాని మనిషి అలా అనుకుంటున్నాడు. అలాగే స్వర్గానికి వెళ్ళాలని, విజయాలు పొందాలని కోరికలు కోరుతున్నాడు. శాస్త్రం నువ్వు పూర్ణుడవు అంటుంది. కాని కర్మ చేస్తే కలిగే దృష్టఫలం బ్రహ్మవర్చస్సు ఏర్పడుతుంది. అదృష్టఫలం స్వర్గాదిలోకాలకు మరణానంతరం వెళతాడు.

అలాగే దక్షత్వం కూడా మనిషికున్న అపోహలనుంచి వచ్చినదే. అహం న కాణకుబ్జత్వాది అనుకుంటాడు సాధకుడు. అంటే తను ఒక కన్ను గ్రుడ్డి ఉన్నవాడు కాదు, గూని కాదు,

కుంటివాడు కాదు. అంటే కర్మలు చేయటానికి అధికారిత్వం ఉంది అనుకుంటున్నాడు కాబట్టి, అవును ఇటువంటి అర్హతలు ఉన్న సాధకులు యజ్ఞం చేసి ఫలం పొందవచ్చు అంటుంది. నిజానికి శాస్త్రం ప్రకారం ఆత్మ అకర్తా, అభోక్తా.

దీన్నిబట్టి కర్మకాండ వేరు, జ్ఞానకాండ వేరు అని అర్థమవుతున్నది. జ్ఞానకాండలో కర్మ అనుష్ఠానం అవసరం లేదు. జ్ఞానకాండలో ఆత్మజ్ఞానం పొందటం ద్వారా, అజ్ఞాన నివృత్తి జరిగి, అజ్ఞానజనిత సంసారం నాశనం అవుతుంది. ఉపనిషత్ అర్థం వచ్చేసింది.

కర్మకాండ వేరు, జ్ఞానకాండ వేరు అని నిరూపించటానికి ఈ రెండు శాస్త్రాల్లోనూ ఉన్న అనుబంధ చతుష్టయం వేరు అని చూస్తాము. అనుబంధ చతుష్టయం అంటే నాలుగు అంశాలను చూస్తాము అందులో. అవి అధికారి, విషయం, ప్రయోజనం, సంబంధం. ఆ బేధాన్ని ఒక పట్టికలో చూద్దాము.

**అనుబంధ చతుష్టయం**

| **అంశం** | **కర్మయోగం** | **జ్ఞానయోగం** |
|---|---|---|
| అధికారి | కోరిక ఉండటం | కోరిక లేకపోవటం |
| విషయం | అనిత్యవిషయం | నిత్యవిషయం |
| ప్రయోజనం | అనిత్యఫలం – ధర్మ అర్థ కామాలు | నిత్యఫలం – మోక్షం |
| సంబంధం | జ్ఞానం + కర్మ = ఫలం | జ్ఞానం = ఫలం |

అందువల్ల ఈ మంత్రాలు మూడు అంశాలను తేటపరుస్తున్నాయి అంటున్నారు శంకరాచార్యులవారు. అవి – ఆత్మస్వరూపాన్ని వెల్లడి చేస్తున్నాయి; ఆత్మ అజ్ఞానాన్ని తొలగిస్తున్నాయి, తద్వారా శోకమోహాదులతో కూడిన సంసారాన్ని నాశనం చేస్తున్నాయి. ఆ విధంగా ఉపనిషత్తు పేరు సరిపోతుంది కూడా. ఉపనిషత్తు అంటే ఆత్మజ్ఞానం కలిగించి, సంసారాన్ని నాశనం చేసేదని అర్థం.

**సంక్షేపతో వ్యాఖ్యాస్యామః** – ఈ మంత్రాలను మేము సంక్షిప్తంగా వివరించబోతున్నాము అంటున్నారు శంకరాచార్యులవారు.

ఇంతవరకూ అవతారిక భాష్యం చూశాము. దీని సారాంశం – ఉపనిషత్ ఒక పృథక్ శాస్త్రం. అంటే అది ఒక భిన్నశాస్త్రం. ఈ నేపథ్యంతో మంత్రాల్లోకి వెళదాము.

## ఈశావాస్యోపనిషత్ – విహంగవీక్షణం

ఈశావాస్యోపనిషత్ అవటానికి చాలా చిన్న ఉపనిషత్తే అయినా చాలా లోతైన, గంభీరమైన, క్లిష్టమైన ఉపనిషత్తు. ఇందులో కేవలం 18 మంత్రాలే ఉన్నాయి. ఇటువంటి ఉపనిషత్తే మాండూక్యోపనిషత్ కూడా. అది దీనికన్నా చిన్నది. అందులో 12 మంత్రాలే ఉన్నాయి. మాండూక్యోపనిషత్‌ను నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. ఓంకార నిర్వచనం – మంత్రం 1
2. చతుష్పాద ఆత్మనిర్వచనం – మంత్రం 2
3. ఆత్మ విచారణ – మంత్రాలు 3–7
4. ఓంకార విచారణ – మంత్రాలు 8–12

మాండూక్యోపనిషత్ చాలా చిన్నదైనా కూడా గౌడపాదాచార్యులవారు దానిమీద కారికలు రాయటంవల్ల అది చాలా పెద్దదైంది.

ఇప్పుడు ఈశావాస్యోపనిషత్‌ను కూడా అలాగే నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. జ్ఞానయోగం నిర్వచనం – మంత్రం 1
2. కర్మయోగం నిర్వచనం – మంత్రం 2
3. జ్ఞానయోగ విచారణ – మంత్రాలు 3–8
4. కర్మయోగ విచారణ – మంత్రాలు 9–18

మాండూక్యోపనిషత్‌లో ముందు చెప్పిన అంశాన్ని తర్వాత, తర్వాత చెప్పిన అంశాన్ని ముందూ విశ్లేషిస్తే, ఈశావాస్యోపనిషత్ ముందు చెప్పిన అంశాన్నే ముందు విశ్లేషిస్తుంది. అంటే ముందు జ్ఞానయోగాన్ని నిర్వచించి, దాని విచారణే ముందు చేస్తుంది; తర్వాత రెండవ అంశంగా పేర్కొన్న కర్మయోగంయొక్క విచారణ తర్వాత చేస్తుంది.

మొదటి రెండు మంత్రాలను సూత్రభూత మంత్రాలు అంటారు. అంటే ఉపనిషత్ చెప్పదలుచుకున్న అంశాన్ని ముందు చిన్న సూత్రంలా, చిన్న వాక్యంతో చెబుతుంది. తర్వాత ఆ వాక్యాన్ని ఉపనిషత్తే వివరిస్తుంది. ఈ పద్ధతిని తైత్తిరీయోపనిషత్‌లో కూడా చూస్తాము.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్**

అని ముందు సూత్రంలా చెప్పి, తర్వాత దానికి లఘువ్యాఖ్యానం చేస్తుంది. దాన్ని వృత్తి అని కూడా అంటారు. మళ్ళీ తర్వాత దాన్ని ఇంకా వివరంగా చెబుతుంది.

ఈశావాస్యోపనిషత్‌లోని మొదటి రెండు మంత్రాలు మూడు అంశాలను చర్చిస్తాయి. అవి –

1. సాధకుని లక్ష్యం – ఆత్మజ్ఞానం
2. సాధకుని మార్గం (ఎ) – సన్న్యాస మార్గం
3. సాధకుని మార్గం (బి) – గృహస్థమార్గం

ఏ సాధకునికైనా అంతిమ లక్ష్యం ఒకటే ఉండాలి. అది ఆత్మజ్ఞానం లేదా బ్రహ్మజ్ఞానం పొందటం. లక్ష్యం ఒకటే అయినా, దాన్ని రెండు మార్గాల్లో ఏదో ఒక మార్గం ద్వారా పొందవచ్చు. కుదిరితే సన్న్యాసం తీసుకోవచ్చు. దాన్ని నివృత్తి మార్గం అంటారు లేదా గృహస్థాశ్రమంలోనే ఉండి, జ్ఞానం పొందవచ్చు. దాన్ని ప్రవృత్తి మార్గం అంటారు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।**

**జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥** – గీత 3.3

కృష్ణపరమాత్మ కూడా అదే చెప్పాడు భగవద్గీతలో. సాంఖ్యానాం అంటే సన్న్యాసులు; యోగినామ్ అంటే గృహస్థులు. అలా రెండు నిష్ఠల్లో ఏది పాటించినా, జ్ఞానం పొందటానికి ఒకటే మార్గం. అది గురువువద్ద, శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి.

ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి? వేదాంతం ద్వైతదర్శనం చేస్తే సంసారం తప్పదు అంటుంది.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

ఇది అక్షరలక్షలు విలువచేసే వాక్యం. హిరణ్యగర్భ అందరికన్నా ముందు పుట్టాడు. తను పుట్టాక చుట్టూ చూస్తే ఎవ్వరూ లేరు, ఏమీ లేదు. వెంటనే భయం వేసిందిట. కాని తనకు తానే మళ్ళీ నచ్చచెప్పుకున్నాడు. దేన్ని చూసి భయపడుతున్నాను నేను? ఇంకొక వస్తువు కాని, మనిషి కాని ఉంటే భయపడాలి. ఏమీ లేకపోతే ఎందుకు భయపడాలి అనుకున్నాడు. ఉపనిషత్తులు చేసే బోధ ఇదే. ద్వైతం చూస్తే ప్రవృత్తిమార్గంలో వెళతాము. అప్పుడు కర్మలు చేస్తాము. వాటికి తగ్గ కర్మఫలాలు వస్తాయి. వాటిని అనుభవించటానికి పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి తిరగక తప్పదు. ద్వైతదర్శనం అధ్యాస వల్ల జరుగుతున్నది.

రజ్జుసర్పభ్రాంతి దృష్టాంతం తీసుకుంటే తాడును చూసి పాముగా పొరపాటు పడుతున్నాము. అంటే తాడుమీద పాముని ఆరోపిస్తున్నాము. తాడుని అధిష్ఠానం అనీ, ఆరోపించిన పాముని

అధ్యాస అనీ అంటారు. అలాగే ఇక్కడ అధిష్ఠానంగా ఉన్న అద్వైతం గురించి తెలియక ద్వైత అధ్యాస చేస్తున్నాము. అంటే ద్వైతదర్శనం అధిష్ఠాన అద్వైత అదర్శనంవల్ల జరుగుతున్నది.

సంసార పరిహారం జరగాలంటే ద్వైతనివృత్తి జరగాలి. ద్వైతనివృత్తి జరగాలంటే అధిష్ఠాన అజ్ఞాననివృత్తి జరగాలి. అధిష్ఠాన అజ్ఞాననివృత్తి జరగాలంటే, అధిష్ఠాన అద్వైత దర్శనం కలగాలి. అంటే జ్ఞానం పొందాలి. అంటే ఈశావాస్యోపనిషత్తు నేర్చుకోవాలి.

**అద్వైతదర్శనేన ద్వైతనివృత్తిః ఏవ జ్ఞానయోగః**

**అధిష్ఠాన అద్వైత దర్శనేన ద్వైతస్య ఆభాసీకరణమ్ ఏవ జ్ఞానయోగః**

ఇదీ మొదటిమంత్రం సారం. ఈశావాస్యోపనిషత్తు భాషే వేరు. ఏ పదానికీ నిఘంటువు అర్థం ఉండదు. ఏ వాక్యమూ సాదాసీదాగా, స్పష్టంగా ఉండదు. కాని శంకరాచార్యుల వారి అమోఘమైన భాష్యంవల్ల, పరమార్థానంద స్వామీజీ అద్భుతమైన బోధవల్ల మనం అంత కష్టమైనది కూడా చాలా తేలికగా అర్థం చేసుకోవచ్చు.

ఈ మొదటి మంత్రంలో ద్వైతనివృత్తికి ఆచ్ఛాదనం వాడుతున్నది. ద్వైతనివృత్తిని విద్వత్ సన్న్యాసంగా అర్థం చేసుకోవాలి. అంటే ద్వైతాన్ని జ్ఞానం ద్వారా పారద్రోలాలి. ఇది ఎలా చేయాలి? దశలవారీగా చూద్దాము.

1. సంసారం ఎలా పోతుంది? – జ్ఞానం పొందితే సంసారనివృత్తి కలుగుతుంది
2. ఏ జ్ఞానం పొందాలి? – బ్రహ్మజ్ఞానం పొందాలి
3. బ్రహ్మను ఎలా అర్థం చేసుకోవాలి? – జగత్తే కార్యమంతటా కారణంగా బ్రహ్మ ఉన్నాదు

కారణం అంటే ఇక్కడ ఉపాదాన కారణం. కుండ అంతటా మట్టి ఉపాదాన కారణంగా ఉంటుంది. మట్టి లేనిదే కుండకు విడిగా ఉనికి లేదు.

**వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్** – ఛాందోగ్యమ్

కుండ అనే పదార్థం విడిగా లేదు. ఉన్నది మట్టి మాత్రమే. నామ మాత్రమే అంటారు. పేరుకు మాత్రమే కుండ ఉంది. కుండని చేతితో పట్టుకున్నా, దాని వాసన చూసినా, దాని బరువును చూసినా, నిజానికి ఇవన్నీ మట్టికే చెందుతాయి.

**మరత్తై మఱైందది మామదయానై, మరత్తిల్ మఱైందది మామదయానై**

**చెక్కను మరిచాడు ఏనుగును చూసి, చెక్కను చూసి మరిచాడు ఏనుగును**

తమిళంలో వాక్యమిది. ఒక చిన్నపాప చెక్క ఏనుగును చూసి, అది చెక్క అని తెలియక ఏనుగనుకుని భయపడింది. తండ్రి ఆ పాపను దగ్గరికి తీసుకువెళ్ళి, దానిమీద చేయి వేయించి, అది చెక్క ఏనుగు అని విడమర్చి చెప్పాక, చెక్క దర్శనంలో పడి ఏనుగును మర్చిపోయింది. మనం చేసేదీ అదే.

జగత్తును చూసి బ్రహ్మను మర్చిపోతాము; అది నిజంగా జగత్తు కాదు, ఉన్నదంతా బ్రహ్మే అని తెలిస్తే జగత్తును మర్చిపోతాము. అంటే కారణదృష్టి, కార్యదృష్టిని పారద్రోలుతుంది.

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

ఉదాహరణకు ఒక సినిమాలో దయ్యాన్ని చూస్తే భయపడతాము. కాని అది తెరమీద ఆడే ఒక బొమ్మ మాత్రమే అని అర్థం చేసుకుంటే భయం మటుమాయమవుతుంది. అలాగే జగత్తు మిథ్య అని తెలిస్తే సంసారం భయపెట్టదు. ఇప్పుడు ఈ నేపథ్యంతో మొదటి మంత్రం చూద్దాము.

# ఈశావాస్యోపనిషత్ – వివరణ

## మంత్రం-1

**ఓమ్ ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనమ్ ॥**

### 1. సూత్రభూత మంత్రం – మంత్రం 1

**ఈశా ఇదగ్ం సర్వం వాస్యమ్** – ఈశా అంటే శుద్ధచైతన్యం; వాస్యం అంటే కప్పబడివుంది. ఏది కప్పబడివుంది? ఇదగ్ం సర్వం. ఇక్కడ ఉన్నదంతా ఈశ్వరునిచేత లేదా పరమాత్మచేత కప్పబడివుంది. ఇక్కడ ఉన్నదంతా ఈశ్వరునిచేత కప్పబడివుంది అంటే ఈశ్వరునికి భిన్నంగా వేరే ఏదీలేదు. అంటే ద్వైతం లేదని చెప్పటానికి ద్వైత ఆచ్ఛాదనం వాడింది. ఈశ్వరుడు తప్ప వేరే ఏదీ లేదంటే మిథ్యాత్వ నిశ్చయం చేస్తున్నది ఉపనిషత్తు.

మట్టి దృష్టి కలిగితే కుండ దృష్టి ఎలా పోతుందో అలా కారణదృష్టి కలిగితే కార్యదృష్టి పోతుంది.

ఇదగ్ం సర్వం – సున్నా తర్వాత శ, ష, స, హ, ర అక్షరాలు వస్తే దానిముందు 'గ్' అక్షరం వస్తుంది. మంత్రాన్ని చదివేటప్పుడు ఇదగ్ం సర్వం అని చదువుతాము. అర్థం చేసుకునేటప్పుడు ఇదం సర్వం అని అర్థం చేసుకుంటాం. ఈ సర్వంలో ఏం వస్తుంది?

**యత్కించ జగత్యాం జగత్** – జగత్ పదం రెండుసార్లు వచ్చింది. జగత్యాం అంటే పృథివ్యాం అని అర్థం. అంటే ఈ భూమ్మీద ఉన్న; జగత్ అంటే వస్తువులు, జీవులు అన్నీ; యత్కించ అంటే యత్ కించిత్ అంటే ఏ ఒక్కటీ కూడా వదలకుండా. పృథివి అంటే ఒక్క భూమ్మీదే అని కాదు. దాన్ని ఉపలక్షణంగా తీసుకోవాలి. పద్నాలుగు లోకాలూ వస్తాయి జగత్యాంలోకి.

ఉపలక్షణం అంటే ఒక అంశాన్ని చెప్పి తక్కినవాటిని చెప్పకపోయినా, వాటిని కూడా కలుపుకోవాలి. ఉదాహరణకు ఆత్మ అదృశ్యం అంటే దాని అసలు అర్థం ఆత్మ కంటికి కనపడదు. దీన్ని ఉపలక్షణంగా తీసుకోవాలి. ఆత్మ తక్కిన ఇంద్రియాలకు కూడా అందదు. ఆత్మ ఇంద్రియ అగోచరం.

**త్రయం వా ఇదం నామరూపకర్మ జగత్** – బృహదారణ్యకమ్

జగత్తును నామరూపకర్మగా బృహదారణ్యకం వర్ణిస్తుంది. ఒక కుండను తీసుకుంటే దానికి నామం కుండ; రూపం గుండ్రంగా ఉంటుంది; కర్మ నీరు నింపుకోవటానికి పనికి వస్తుంది. అందువల్ల జగత్ అంటే అన్ని లోకాలు వస్తాయి. జగత్యాం జగత్ అంటే చివరి అర్థం నామరూపాభ్యాం జగత్.

ఇప్పుడు ఈ రెండు వాక్యాల సామాన్య అర్థం చూస్తే, విశ్వంలో ఉన్న అన్ని వస్తువులు, జీవులు అన్నింటిలోనూ ఈశ్వరుడే ఉన్నాడు.

మొత్తం వేదాంతసారం దీనిలో వచ్చేసింది. అది –

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

ఆ విధంగా ఈ నామరూపాత్మక జగత్తు అంతా ఈశ్వరుని చేత కప్పబడివుంది అని జ్ఞాని అర్థం చేసుకుంటాడు.

చందనం నీటితో కలిస్తే అది తడిగా అవుతుంది. ఆ తడివలన దుర్వాసన వస్తుంది. ఆ దుర్వాసన నీటివల్ల వచ్చింది. చందనం స్వస్వరూపం సుగంధం. దాన్ని రాపిడి చేస్తే నీరు పోయి, తన స్వస్వరూపమైన సుగంధం మళ్ళీ వస్తుంది. అదే విధంగా ఆత్మ స్వస్వరూపం అకర్తా, అభోక్తా. కాని అది తెలియక కర్తృత్వం, భోక్తృత్వమ్ మొదలైన ద్వైతరూపమైన ప్రపంచం (సంసారం) ఆరోపించబడి ఉంది. చందనంనుంచి నీరుని తీసినట్టుగా, ఈ ద్వైతాన్ని జ్ఞానం ద్వారా తీయాలి.

**తేన త్యక్తేన భుంజీథాః** – ఇటువంటి ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలాన్ని కూడా వివరిస్తున్నది ఉపనిషత్. జ్ఞానం పొందితే దాన్ని విద్వత్ సన్న్యాసం అంటారని చూశాము. అటువంటి విద్వత్ సన్న్యాసాన్ని పొందిన వ్యక్తి ఇంక వైదికకర్మలు చేయడు. ఎందుకు? వైదికకర్మలు చేయాలంటే ద్వైతదృష్టి ఉండాలి, కర్తృత్వబుద్ధి ఉండాలి; వర్ణాశ్రమ ధర్మాలమీద అభిమానం ఉండాలి. కాని జ్ఞానికి ద్వైతబుద్ధి ఉండదు; ఉన్నదంతా అద్వైత ఆత్మ మాత్రమే అంటాడు; తను అకర్తా, అభోక్తా అంటాడు; తనకు వర్ణాశ్రమ ధర్మాలు అంటవు అంటాడు. అందువల్ల అతను కర్మలను త్యజిస్తాడు.

ఈ విద్వత్ సన్న్యాసికి గృహస్థుకు ఉండే మూడు కోరికలు ఉండవు. అవి పుత్రైషణ, లోకైషణ, విత్తైషణ. ఏషణ అంటే కోరిక. అతనికి పుత్రులు కావాలని కాని, స్వర్గలోకానికి వెళ్ళాలని కాని, ధనం సంపాదించాలని కాని కోరిక ఉండదు. ఏషణాత్రయ సన్న్యాసం చేస్తాడు జ్ఞాని అని బృహదారణ్యకంలో వస్తుంది.

తేన త్యక్తేన అంటే మామూలు అర్థం త్యజించటంవల్ల అని అర్థం. తర్వాత పదం భుంజీథాః. భుంజీథా అంటే నిన్ను నువ్వు రక్షించుకో అని వస్తుంది. త్యజించబడిన లేదా మరణించిన పుత్రుడు కాని, సేవకుడు కాని తనకు చెందదు కాబట్టి తనను కాపాడదు. కాని అటువంటి వ్యక్తితో కాపాడుకో అంటున్నది ఉపనిషత్తు. అందువల్ల త్యక్తేన అంటే త్యాగేన అని అర్థం చేసుకోవాలి అంటున్నారు శంకరాచార్యులవారు. అంటే ఈ మూడు కోరికలను త్యాగం చేయటం ద్వారా సంసారబంధంనుంచి నిన్ను నువ్వు కాపాడుకో అని అర్థం తీసుకోవాలి

అంటున్నారు శంకరాచార్యులవారు. ఎందుకంటే ఉదాహరణకు మీరు ఇచ్చేసిన షాల్‌తో మిమ్మల్ని చలినుంచి కాపాడుకోండి అని చెప్పలేము కదా!

ఎందుకు మనని మనం సంసారంనుంచి కాపాడుకోవాలి? ఎందుకు జగత్ మిథ్య అని తెలుసుకోవాలి? ఎందుకంటే జగత్ మిథ్యాత్వం తెలియకపోతే ద్వైతం మనను భయపెడుతుంది, సంసారచక్రంలో పడవేస్తుంది.

**మృత్యోస్స మృత్యుమాప్నోతి యః ఇహ నానేవ పశ్యతి** – కఠ

**ఉదరమంతరం కురుతే అథ తస్య భయం భవతి** – తైత్తిరీయమ్

మిమ్మల్ని ఒక పీడకల భయపెడుతున్నదనుకోండి. దాన్నించి తప్పించుకునే మార్గమేమిటి? దానికి ఒకటే మార్గం ఉంది. ఆ నిద్రనుంచి లేవటమే. అలాగే మీరు తాడును చూసి పాము అనుకుని భయపడ్డారు. దాన్నించి తప్పించుకునే మార్గమేమిటి? గరుడమంత్రం చదివితే పోతుందా? పాములు పట్టేవాడిని పిలిస్తే పోతుందా? దానికి కూడా ఒకటే మార్గం ఉంది. పాము అజ్ఞానాన్ని తాడు జ్ఞానం పొందటంవల్ల పోగొట్టటమే. అలాగే ఆత్మ అజ్ఞానం పోవాలంటే జ్ఞానజనిత సన్న్యాసం లేదా విద్వత్ సన్న్యాసం ఒక్కటే మార్గం.

అందువల్ల తేన త్యక్తేన అంటే తేన ద్వైతప్రపంచ మిథ్యాత్వ నిశ్చయేన. అంటే ద్వైతప్రపంచం మిథ్య అనే జ్ఞానం పొందటంవల్ల భుంజీథాః – మోక్షం పొందు అంటున్నది ఉపనిషత్తు.

మొదటి మంత్రంయొక్క ఒకటిన్నర పాదాలలో వేదాంతబోధ అయిపోయింది. మొదటి రెండు మంత్రాలు మూడు అంశాలను చెప్పబోతున్నాయని చూశాము. మొదటి అంశం లక్ష్యం. అది ఆత్మజ్ఞానం పొందటం. జగత్తు నామరూపకర్మ మాత్రమే, జగత్తంతా ఈశ్వరుడే నిండివున్నాడు. ఈ జ్ఞానం పొంది నిన్ను నువ్వు రక్షించుకో. ఇదీ జ్ఞానం.

ఇప్పుడు మార్గం చూడాలి. ఈ మంత్రంలోని మిగిలిన భాగంలో మొదటి మార్గం వస్తున్నది. ఈ జ్ఞానమనే లక్ష్యాన్ని రెండు సాధనల ద్వారా పొందాలి. మొదటి సాధన వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు ఒక ఆచార్యుని ద్వారా చేయాలి. అది వినా ఇంకొక మార్గం లేదు. దాన్ని సాక్షాత్ సాధన అంటారు. ఈ సాక్షాత్ సాధనను రెండు ఆశ్రమ జీవన విధానాలలో దేనివల్లనైనా పొందవచ్చు. అది సన్న్యాసాశ్రమం ద్వారా పొందవచ్చు లేదా గృహస్థాశ్రమం ద్వారా పొందవచ్చు. ఈ మంత్రంలో సన్న్యాసాశ్రమం ద్వారా పొందవచ్చని చూస్తాము.

ఈ రెండింటిలో సన్న్యాసాశ్రమం ద్వారా జ్ఞానాన్ని పొందటం తేలిక. ఎందుకు? సన్న్యాసికి బంధాలు ఉండవు, బాధ్యతలు ఉండవు, కర్మలు ఉండవు. అతనికి కుటుంబం ఉండదు, ఆస్తిపాస్తులు ఉండవు. పూజలు, యజ్ఞాలు చేయనవసరం లేదు. ఆకలి వేస్తే

భిక్షాటనం చేసి తనకు వచ్చిన ఆహారాన్ని సంతోషంగా స్వీకరించాలి. అతని జపం ఓంకార జపం, మహావాక్య జపం; అతని పారాయణం గీతా పారాయణం, ఉపనిషత్ పారాయణం. ఆ విధంగా సన్న్యాసమార్గాన్ని చూడబోతున్నాము.

**మా గృధః కస్యస్విద్ధనమ్** – దీన్ని కస్యస్విద్ ధనం మా గృధః గా మార్చుకోవాలి. దీనికి రెండు అర్థాలు చెప్పవచ్చు. ఒక అర్థం ఇంకొకరి సొమ్ము ఆశించకు. అంటే పరాయిసొమ్ముకోసం అర్రులు చాచకు. రెండవ అర్థం నీ సొమ్ము కూడా నువ్వు పెంచుకోకు. ధనం అంటే ఒక డబ్బు మాత్రమే కాదు ఆస్తి, భద్రత, హోదా అన్నీ వస్తాయి.

స్విద్ పదానికి ప్రత్యేకించి అర్థం లేదు. ధనాన్ని స్వీకరించు అంటే పరిగ్రహః అని అర్థం. స్వీకరించకు అంటే అపరిగ్రహః. దాన్నే ఇక్కడ మా గృధః అని అంటున్నది ఉపనిషత్తు. ఈ వాక్యం మొత్తం అర్థం ఎవరి సొమ్మునూ ఆశించకు అని వస్తుంది. ఈ వాక్యం సన్న్యాసాన్ని సూచిస్తుంది. దీన్ని వివిధిషా సన్న్యాసం అంటారు. ఆ పదం ఇక్కడ ప్రత్యక్షంగా రాకపోయినా మనం అర్థం చేసుకోవచ్చు.

సన్న్యాసం స్వీకరించినంత మాత్రాన అందరూ అన్నీ త్యజిస్తారని చెప్పలేము. ఒక సన్న్యాసి తన కౌపీనాన్ని ఎలుకలు కొట్టేస్తుంటే, వాటి బారినుంచి తన కౌపీనాన్ని రక్షించు కోవటంకోసం ఒక పిల్లిని పెంచసాగాడు. దానికి పాలకోసం ఆవును కొన్నాడు. ఆవు సంరక్షణార్థం ఒక అమ్మాయిని పెట్టాడు. చివరికి ఆ అమ్మాయిని పెళ్ళి కూడా చేసుకున్నాడు. ఫలితంగా పిల్లలు పుట్టుకొచ్చారు. కొన్నాళ్ళ తర్వాత తిరిగివచ్చిన అతని తోటి సన్న్యాసి చూసి ఆశ్చర్యంగా ఇదేమిటని అడిగితే, 'కౌపీన సంరక్షణార్థమ్ అయం పటాటోపః' అన్నాడు. అందువల్ల ఇక్కడ ఉపనిషత్తు పరాయిసొమ్మునీ ఆశించకు, నీ సొమ్మునీ పెంచుకోకు అంటున్నది.

మా గృధః కస్యస్విద్ధనమ్ వాక్యాన్ని ఇంకొకలాగా విడదీస్తే ఇంకొక అర్థం కూడా వస్తుంది. మా గృధః – దీనికి కూడా మా గృధఃనే. కాకపోతే ఇక్కడ ఫుల్‌స్టాప్ పెట్టాలి. దేన్నీ ఆశించకు. ఎందుకు? కస్యస్విద్ ధనమ్? దీని అర్థం ఎవరిదీ ధనం? ఈ ధనం ఆత్మదా? ఆత్మ వస్తువును కోరలేదు. ఎందుకంటే ఆ ఆత్మ నువ్వే కాబట్టి. పోనీ ఈ ధనం ఆత్మ వ్యతిరిక్తమా? ఆత్మకు వ్యతిరిక్తంగా ఏదీ లేదు. ఆత్మకు వ్యతిరిక్తంగా ఉంటే అది మిథ్య. అటువంటి మిథ్యావస్తువును కోరకు. అందువల్ల ఏ విధంగానూ ధనాన్ని కోరలేవు అని అర్థం. ఎవరిదీ ధనం ప్రశ్నను ఇంగ్లీషులో రిటారికల్ క్వశ్చన్ అంటారు. సంస్కృతంలో ఆక్షేపార్థే అంటారు. ఆక్షేపార్థే అంటే కాదు అని అర్థాన్నిచ్చే ప్రశ్న కాని ప్రశ్న. ఎవరిదీ ధనం? అంటే ఎవరిదీ కాదు అని అర్థం. సర్వం ఆత్మమయం జగత్.

ఇక్కడితో మొదటి మంత్రం ముగిసింది. ఇందులో రెండు అంశాలు వచ్చాయి. లక్ష్యం, ఒక మార్గం. ఆ మార్గం నివృత్తి మార్గం. అందరూ ఈ నివృత్తిమార్గాన్ని పాటించగలరా?

శాస్త్రం, ఇది చూడటానికి చాలా తేలికగా అనిపించినా, పాటించటం చాలా కష్టం అంటుంది. మనస్సు పరిపక్వత చెందకపోతే చాలా కష్టపడతారు.

**సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః** – గీత 5.6

అటువంటి సన్న్యాసిని మిధ్యాచారుడు అంటారు. మిథ్యాచార స్స ఉచ్యతే. ఎవరైనా సన్న్యాసం స్వీకరిస్తామంటే, తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సన్న్యాసులే సలహా ఇస్తారు. ఎందుకంటే సన్న్యాసం వన్‌వే ట్రాఫిక్ వంటిది. అందులోకి వెళ్ళటమే కాని, దాన్నించి బయటపడే మార్గం ఉండదు. ఒక సన్న్యాసిని, 'నీ జీవితం ఎలా ఉంది?' అని ఎవరో అడిగితే, 'పొద్దున్న దాల్ రోటీ, రాత్రి రోటీ దాల్ తింటాము,' అన్నాడుట.

**మంత్రం–2**

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ।**
**ఏవం త్వయి నాన్యథేతో ఽ స్తి న కర్మ లిప్యతే నరే ॥**

2. **సూత్రభూత మంత్రం – మంత్రం 2**

మొదటి మంత్రంలో లక్ష్యం అయిన విద్వత్ సన్న్యాసాన్ని, ఒక మార్గం అయిన వివిధిషా సన్న్యాసాన్ని చూశాము. విద్వత్ సన్న్యాసం అంటే జ్ఞానం పొందాక సన్న్యాసం స్వీకరించి నిదిధ్యాసనం చేయటం. వివిధిషా సన్న్యాసం అంటే అజ్ఞాని జ్ఞానం పొందటం కోసం సన్న్యాసం స్వీకరించి, అప్పుడు శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటం. అతను అజ్ఞాని అయినా సాధన చతుష్టయ సంపత్తి పొందితే జ్ఞానయోగ్యత ఏర్పడి, శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా జ్ఞానం పొందగలడు.

జ్ఞానం పొందని, సాధన చతుష్టయ సంపత్తి లేని, సన్న్యాసం స్వీకరించని అజ్ఞానికి కర్మయోగాన్ని నిర్దేశిస్తున్నది ఉపనిషత్తు. దీన్ని ప్రవృత్తిమార్గం అంటారు. బృహదారణ్యకోపనిషత్, ఈశావాస్యోపనిషత్‌కు వ్యాఖ్యానం అని చూశాము. అందువల్ల అందులో జ్ఞానయోగ సూత్రాన్ని విద్యాసూత్రంగానూ, కర్మయోగసూత్రాన్ని అవిద్యా సూత్రంగానూ చూస్తాము.

కర్మయోగానికీ, జ్ఞానయోగానికీ మధ్య ఉన్న సంబంధాన్ని సాధన–సాధ్య సంబంధం అంటారు. కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొంది, జ్ఞానమార్గానికి వచ్చి ఆత్మజ్ఞానం పొందాలి. దీన్ని వైదిక పంథా అంటారు. ఇప్పుడు మంత్రం చూద్దాము.

**జిజీవిషేత్** – జీవితుం ఇచ్ఛేత్, జీవించాలని కోరుకో అంటున్నది ఉపనిషత్తు. ఎన్నాళ్ళు?

**శతగ్ం సమాః** – వంద సంవత్సరాలు జీవించాలని కోరుకోవాలి. సమా అంటే సంవత్సరాలు; శతగ్ం అంటే వంద. వంద సంవత్సరాలు జీవించాలనే కోరిక ఎవరికైనా ఉంటుంది. మృత్యుదేవత ఒడిలో ఉన్న వ్యక్తికి కూడా తన జీవితాన్ని ఇంకొంచెం పొడిగిస్తే బాగుంటుందని

ఉంటుంది. అటువంటప్పుడు వంద సంవత్సరాలు జీవించాలని కోరుకోమని ఉపనిషత్ పనిగట్టుకుని చెప్పటం ఎందుకు? ఆకలేస్తే అన్నం తినమని ఎవరూ చెప్పనవసరం లేదు.

**ప్రాప్త విషయే విధిః న అపేక్షితః**

అంటే తెలిసిన విషయాన్ని విధివాక్యంగా చెప్పనవసరం లేదు శాస్త్రం. అయితే ఎందుకు చెప్పింది అంటే ఈ జిజీవిషేత్‌ను తీసుకువెళ్ళి కుర్వన్నేవేహ కర్మాణికి కలుపుకోవాలి అంటున్నారు శంకరాచార్యుల వారు. అప్పుడు కర్మాణి కుర్వన్ జిజీవిషేత్ అవుతుంది.

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేత్** – కుర్వన్ ఏవ ఇహ కర్మాణి జిజీవిషేత్. ఇహ – ఈ లోకంలో; కర్మాణి – కర్మలను; కుర్వన్ ఏవ – చేస్తూనే; జిజీవిషేత్ – జీవించాలని కోరుకోవాలి. రెండు వాక్యాలూ కలిపితే ఈ లోకంలో కర్మలను చేస్తూనే వంద సంవత్సరాలు జీవించాలని కోరుకోవాలి.

కర్మలు చేయాలి అంటే ఎటువంటి కర్మలు? ముందు కర్మల్లో రకాలను చూద్దాము. నిత్యనైమిత్తిక కర్మలు, నిషిద్ధకర్మలు, ప్రాయశ్చిత్త కర్మలు. నిషిద్ధకర్మలను అసలు చేయకూడదు. ప్రాయశ్చిత్త కర్మలను తగ్గించుకోవాలి. నిత్యనైమిత్తిక కర్మలను విహితకర్మలు అనికూడా అంటారు. అంటే అవి శాస్త్రం విధించిన కర్మలు. వాటిని ముందు సకామకర్మలుగా మొదలు పెట్టినా, నెమ్మదిగా వాటిని నిష్కామకర్మలుగా మలచుకోవాలి అంటుంది. భగవద్గీతలోని మూడవ అధ్యాయం ఈ రెండవ మంత్రాన్ని ఆధారంగా చేసుకుని వచ్చింది.

**నియతం కురు కర్మ** – గీత 3.8

సకామకర్మలు చేస్తే అర్థకామాలు తీరుతాయి, లౌకిక విజయాలు కలుగుతాయి కాని ఆధ్యాత్మిక ఎదుగుదల ఎక్కువగా ఉండదు. లౌకిక విజయాలు కూడా ఖచ్చితంగా వస్తాయని చెప్పలేము. షరతులు వర్తిస్తాయి అంటారు. కర్మఫలాన్ని ఆశించి చేసే కర్మను ఏ దేవునికి, ఎలా, ఎప్పుడు చేయాలో అలా, ఆ దేవునికి, అప్పుడు చేయాలి. ఏ ప్రసాదం పెట్టాలంటే అది పెట్టాలి. ఎన్నిసార్లు పారాయణం చేయాలంటే అన్నిసార్లు చేయాలి. సగం చేసి మానేస్తే ఫలం దక్కదు.

నిష్కామకర్మలో అలాకాదు. ఆధ్యాత్మిక ఎదుగుదల ఎక్కువగా వస్తుంది. అది కాక, అవాంతర ఫలంగా లౌకికవిజయాలు కూడా వస్తాయి. ఎందుకంటే నిష్కామకర్మలో ఎంత మేరకు చేస్తే అంతవరకూ పుణ్యం వస్తుంది. నిష్కామకర్మలో తీసుకునేది తక్కువా, ఇచ్చేది ఎక్కువా ఉంటుంది. నిష్కామకర్మగా పంచమహాయజ్ఞాలు చేయాలి. అవి సాత్త్వికకర్మలు అవుతాయి.

ఎందుకు శాస్త్రం విధించిన కర్మలు చేయాలి? ఆ కర్మలు రాగద్వేషాలను అరికట్టటానికి తోడ్పడే గొప్ప సాధనలు. ఉదాహరణకు కార్తీకమాసంలో పొద్దున్నే లేచి, తలారా స్నానం

చేసి, అంత పొద్దున్నే ఆలయానికి వెళ్ళి దీపం వెలిగించాలి అంటుంది. చలికాలంలో పొద్దున్నే లేవటమే బ్రహ్మప్రళయం. అయినా లేచి, తలస్నానం చేయాలంటే, మామూలుగా అయితే మనస్సు లొంగదు కాని భక్తిలో ఇవేవీ శ్రమ అనిపించవు. అలా ఇష్టం లేనివి చేయిస్తుంది.

అంతేకాదు, ఇష్టమున్నది త్యజించేలా చేస్తుంది. ఆ నెలరోజులూ ఉల్లిపాయ తినరు; మసాలాలు తినరు కొందరు. ధనుర్మాసంలో స్త్రీలు తలలో పూలు ముడవకూడదు, కంటికి కాటుక పెట్టకూడదు అంటారు. అది కూడా శ్రద్ధగా పాటిస్తారు చాలామంది. ఆ విధంగా భక్తిపరంగా చేసే నిష్కామకర్మలు రాగద్వేషాలను పారద్రోలుతాయి.

**భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః।**

**స్థిరైరంగైః తుష్టువాగ్ంసస్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః॥**

ఈ శాంతిపాఠం సారం కూడా ఇదే. నాకు ఆయుష్షు ఉన్నంతవరకూ ఆరోగ్యకరమైన అంగాలతో దైవపూజ చేస్తూనే జీవించాలి గాక.

ఈశావాస్యోపనిషత్‌లోని ఈ రెండవ మంత్రంలోని మొదటిపాదం కర్మయోగాన్ని నిర్దేశిస్తుంది. నిష్కామకర్మ చేయాలి అంటే ఈశ్వరార్పణబుద్ధితో కర్మ చేయాలి. దీనికి కర్మయోగంలోని రెండవ అంశాన్ని కూడా కలుపుకోవాలి. ఈశ్వరప్రసాదబుద్ధితో కర్మఫలాన్ని స్వీకరించాలి.

### కర్మయోగం = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వరప్రసాద బుద్ధి

అసలు ఉండితీరాల్సిన అంతిమలక్ష్యం ఆత్మజ్ఞానం పొందాలనుకోవటం. అది పొందలేని, సాధన చతుష్టయ సంపత్తి లేని వ్యక్తికి కర్మయోగం ఒక్కటే మార్గం. దీన్ని డబుల్ నెగెటివ్‌లో చెబుతున్నది శాస్త్రం. కర్మయోగం తప్ప వేరే మార్గం లేదు.

**నాన్యథేతోఽస్తి** – న+అన్యథా+ఇతః+అస్తి. ఇతః అంటే దీనికన్నా. దేనికన్నా? కర్మయోగం కన్నా; అన్యథా – మరియొక మార్గం; న అస్తి – లేదు. అంటే కర్మయోగాన్ని పాటించటం తప్ప, వేరే మార్గం లేదు.

ఇంతవరకూ మంత్రం అర్థం చూస్తే ఈ సాధకులు నిత్యనైమిత్తిక కర్మలు చేస్తూ వంద సంవత్సరాలు జీవించాలని కోరుకోవాలి. మొదటి మార్గం వివిదిషా సన్న్యాసం ద్వారా మోక్షం పొందటం. అది చేయలేనివారికి రెండవ మార్గం కర్మయోగం చేసి జ్ఞానయోగ్యత పొందటం. ఈ కర్మయోగం తప్ప వేరొక మార్గం లేదు.

**ఏవం త్వయి న కర్మ లిప్యతే నరే** – ఈ విధంగా కర్మయోగం పాటించిన వ్యక్తిని కర్మఫలం బాధించదు.

ఏవం – ఈ ప్రకారంగా; త్వయి నరే – జీవించగోరే వివేకిని; కర్మ న లిప్యతే – కర్మఫలం బాధించదు. అంటే ప్రారబ్ధకర్మవల్ల జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకుని నిలబడగలిగే ఆత్మస్థైర్యం కలుగుతుంది. రాహుదశ, కేతుదశ, శనిదశ అంటూ బాధపడుతూ కూర్చోడు. అతను షాక్ అబ్సార్బర్స్‌ను పెంపొందించుకుంటాడు.

**యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥** – గీత 2.48

అంటే కర్మయోగి అసలు చలించడా అంటే, చలిస్తాడు కాని దానివల్ల నిద్రలేని రాత్రులు గడపడు. ఎందువల్ల? ఈశ్వరుణ్ణి నమ్ముతాడు కాబట్టి. కర్మయోగికి భక్తిభావన మెండుగా ఉంటుంది.

**తక్కువేమి మనకూ రాముండొక్కడుండు వరకూ**

అంటాడు. కాని ఇంకొక శ్లోకంలో రాముడొక్కడే కాదు, రామలక్ష్మణులు ఇద్దరు మనకు అండగా ఉంటారని వస్తుంది. దానిసారం – మనకు అండగా రాముడు మన ముందూ, లక్ష్మణుడు మన వెనకా నడుస్తారుట. అది కూడా ఎక్కుపెట్టిన బాణంతో నడుస్తారుట. అంటే క్షణమాత్రం ఆలశ్యం కూడా లేకుండా రక్షిస్తారు. అంత భద్రత సాక్షాత్తూ భగవంతుడే ఇస్తుంటే ఇంక లౌకిక భద్రత ఏపాటిది? అందువల్ల కర్మయోగికి నిత్యభద్రత ఉంటుంది భగవంతునివల్ల.

ఇక్కడితో రెండవ రకం ఆశ్రమజీవన విధానం కూడా అయిపోయింది. దీనితో సూత్రభూత మంత్రాలు అయిపోయాయి. ఈశావాస్యోపనిషత్ కూడా అయిపోయింది అని చెప్పవచ్చు. తక్కిన మంత్రాలు ఈ సూత్రభూత మంత్రాల వ్యాఖ్యానం మాత్రమే.

కాని మూడవ మంత్రంలోకి అడుగుపెట్టే ముందు, శంకరాచార్యులవారు జ్ఞానకర్మ సముచ్చయంమీద చేసిన చిన్న చర్చను కూడా చూద్దాము.

# జ్ఞానకర్మ సముచ్చయ భాష్యం

శంకరాచార్యులవారి కాలంలో జ్ఞానకర్మ సముచ్చయ పదం మెండుగా ఉండేది. సముచ్చయం అంటే కలపటం. కర్మ, జ్ఞానం కలిపి చేయాలని వారు అంటారు. అవసరం లేదు, జ్ఞానం పృథక్ శాస్త్రం అని శంకరులవారు నిరూపించుకు వస్తారు. అదేమిటో చూద్దాము.

**పూర్వపక్షి ప్రశ్న** – మొదటి మంత్రం సన్న్యాసికి జ్ఞాననిష్ఠను బోధిస్తున్నదని, రెండవ మంత్రం ఆ జ్ఞాననిష్ఠలో సామర్థ్యం లేని వ్యక్తికి కర్మనిష్ఠను చెబుతున్నదని చూశాము. అలా ఎలా చెప్పగలరు అని వాదిస్తున్నాడు పూర్వపక్షి. పూర్వపక్షి అంటే పూర్వమీమాంసను ఆధారంగా చేసుకుని వాదన చేసే వ్యక్తి అని చూశాము. ఉపనిషత్తు ప్రత్యక్షంగా ఈ రెండూ భిన్నవ్యక్తులకో, ఒకరికో చెప్పలేదు. అందువల్ల ఇవి జ్ఞానకర్మ సముచ్చయాన్ని సూచిస్తున్నాయా, భిన్న అధికారులను సూచిస్తున్నాయా?

**జవాబు** – నిజానికి శంకరాచార్యులవారు రెండవ మంత్రంయొక్క ఉపోద్ఘాతంలోనే జ్ఞానం పొందగలిగినవారికి జ్ఞానమార్గం; అది పొందలేనివారికి కర్మమార్గం అని పేర్కొన్నారు. దాన్ని అథ ఇతరస్య అనే పదాలతో సూచించారు. దాన్నిబట్టే జ్ఞానకర్మలకు విరోధం పర్వతంలాగా చలింపశక్యం కానిది అనే విషయం చెప్పబడింది. మళ్ళీ ఎందుకు అడుగుతున్నారు అంటున్నారు శంకరులవారు.

ఇలాంటి వాదనలు వచ్చినప్పుడు శంకరులవారు శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ద్వారా ఖండిస్తారు. ఎక్కువగా యుక్తి ప్రమాణాన్ని వాడతారు కాని ఇక్కడ శ్రుతి ప్రమాణాన్ని వాడుతున్నారు. ఈశావాస్యోపనిషత్తులోని మంత్రాలనే కాక, తక్కిన ఉపనిషత్ వాక్యాలను కూడా ఉటంకిస్తూ వారి వాదనను ఖండిస్తున్నారు. ఈ వాదనను మళ్ళీ తొమ్మిదవ మంత్రం ముందూ, మళ్ళీ చివర్లోనూ చూస్తాము.

ఇక్కడ జ్ఞానానికీ, కర్మకూ మధ్య ఐదు భేదాలను చూపిస్తున్నారు. అవేమిటో చూద్దాము.

1. **క్రియాకారక ఫలభేద త్యాగః – స్వీకారః**

తేన త్యక్తేన భుంజీథా – కోరికలను వదిలివేయటం ద్వారా నిన్ను నువ్వు రక్షించుకో అంటున్నది జ్ఞానమార్గానికి.

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేత్ – కర్మలు చేస్తూనే జీవించాలని కోరుకో అంటున్నది కర్మమార్గానికి. కర్మ చేస్తే చేసే వ్యక్తి, చేసే కర్మ, వాడే పరికరం – ఇటువంటి భేదాలు ఉంటాయి, కాని జ్ఞానకాండలో ఉండవు.

2. **ధనత్యాగః – స్వీకారః**

మా గృధః కస్యస్విద్ధనమ్ – ఎవరి ధనాన్నీ ఆశించకు, నీ ధనాన్ని కూడా దాచుకోవాలని చూడకు అంటున్నది ఉపనిషత్.

కుర్వన్నేవేహ కర్మాణి – కర్మలు చేస్తూనే ఉండు అంటే, ఆ కర్మలు చేయటానికి ధనం కావాలి. యజ్ఞయాగాదులు చేయాలి, అన్నదానం చేయాలి. వీటన్నింటికీ చాలా ధనం కావాలి. జ్ఞానమార్గంలో ధనాన్ని కోరకు అంటున్నది.

3. **జిజీవిషేత్ అభావః – భావః**

శతగ్ం సమా జిజీవిషేత్ – వంద సంవత్సరాలు జీవించాలని, అన్ని సంవత్సరాలూ కర్మ చేస్తూ జీవించాలని కోరుకొమ్మని అంటున్నది ఉపనిషత్.

న జీవితే మరణే వా గృధిం కుర్వీత – కాని సన్న్యాసి జీవించాలనీ కోరుకోకూడదు, మరణించాలనీ కోరుకోకూడదు. పైగా సన్న్యాసి ఒకసారి సన్న్యాసం స్వీకరించాక, దాన్నించి వెనక్కి రాలేడు కూడా.

4. **గతి అభావః – భావః**

అంతేకాదు ఈశావాస్యోపనిషత్‌లోనే ఫలభేదాన్ని కూడా చూడబోతాము. జ్ఞానికి జీవన్ముక్తి కలుగుతుంది. అతను ఇక్కడే, ఇప్పుడే మోక్షాన్ని పొందుతాడు కాబట్టి అతనికి ప్రయాణం లేదు. కర్మయోగికి ప్రయాణం ఉంది. గతి అంటే ప్రయాణం. అతను బ్రహ్మలోకానికి వెళతాడు.

5. **నివృత్తిమార్గః – ప్రవృత్తిమార్గః**

శాస్త్రమే రెండు భిన్నమార్గాలు ఉన్నాయని చెబుతున్నది. సన్న్యాసమార్గాన్ని నివృత్తి మార్గమనీ, కర్మమార్గాన్ని ప్రవృత్తిమార్గమనీ అంటుంది. నివృత్తిమార్గంలో మూడు రకాల ఏషణలు (కోరికలు) విడిచిపెట్టబడతాయి.

శంకరాచార్యులవారు సందర్భం వచ్చినప్పుడల్లా సన్న్యాసమార్గమే గొప్పదని చెబుతూ వస్తారు. ఇక్కడ దానికి శ్రుతి ప్రమాణాన్ని కూడా చూపిస్తున్నారు.

**న్యాస ఏవాత్యరేచయత్** – మహానారాయణోపనిషత్

న్యాస అంటే సన్న్యాసం. ఏవ అత్యరే చయత్ అంటే సన్న్యాసం మాత్రమే గొప్పది.

**ప్రవృత్తిలక్షణో ధర్మో నివృత్తశ్చ సుభాషితః** – మహాభారతమ్

ప్రవృత్తిరూపమైన ధర్మం, నివృత్తిరూపమైన ధర్మం అంటూ వేదాచార్యులైన వేదవ్యాసులు విచారణ చేసి, ఈ సత్యాన్ని తన పుత్రుడైన శుకమహర్షికి బోధించారు. ఇందులో ప్రతిపదం కూడా ముఖ్యమే. సాక్షాత్తూ వేదవ్యాసులవారు చెప్పారు, మహాభారతంలో చెప్పారు, విచారణ చేసి చెప్పారు. తన పుత్రునికి చెప్పారు.

**క్రియాపథః చ ఏవ పురస్తాత్ సన్న్యాసః చ ఉత్తరేణ**

ముందు కర్మయోగం పాటించి, తర్వాత సన్న్యాసమార్గానికి రావాలి.

ఈ కారణాల దృష్ట్యా, జ్ఞానకర్మ సముచ్చయం కుదరదని నిరూపించారు శంకరాచార్యులవారు. ఒకవేళ సముచ్చయం ఉండి తీరాలంటే క్రమ సముచ్చయం చేయాలి కాని సమ సముచ్చయం కాదు. సమ సముచ్చయం అంటే రెండూ ఒకసారి కలిపి చేయటం, క్రమ సమచ్చయం అంటే ఒకదాని తర్వాత ఇంకొొకటి చేయటం. అది కూడా కర్మయోగం తర్వాత, జ్ఞానయోగం పాటించటం. ఇక్కడితో జ్ఞానకర్మ సముచ్చయ వాదఖండన అయిపోయింది. ఇప్పుడు మూడవ మంత్రంలోకి, మూడవ అంశంలోకి అడుగుపెడదాము.

## మంత్రం 3

**అసుర్యా నామ తే లోకా అంధేన తమసాఽఽవృతాః।**
**తాగ్ంస్తే ప్రేత్యాభిగచ్ఛంతి యే కే చాత్మహనో జనాః ॥**

### 3. జ్ఞానయోగ వివరణ – శ్లోకాలు 3–8

జ్ఞానయోగ వివరణకు వెళ్ళేముందు ఉపనిషత్తు జ్ఞానయోగాన్ని స్తుతించదలుచుకుంది, అది కూడా పరోక్షంగా.

**అజ్ఞాన నిందయా జ్ఞానస్తుతిః**

అజ్ఞానిని నిందించటం ద్వారా ఆత్మజ్ఞానాన్ని స్తుతిస్తున్నది. అజ్ఞానిని మహాసంసారి అంటున్నది. అజ్ఞాని పునరపి జననం, పునరపి మరణం వృత్తంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడు. మనుష్యజన్మలో అజ్ఞానంతో మరణిస్తే దేవజన్మలో కూడా అజ్ఞానం పోదు. అందువల్ల దేవలోకాలు కూడా అజ్ఞానంతో కూడుకుని ఉంటాయి కాబట్టి వాటిని చీకటి లోకాలు అంటున్నది ఉపనిషత్తు. అజ్ఞానినింద చేస్తున్నది కాని, అజ్ఞాని పదం కూడా ప్రత్యక్షంగా రాలేదు. ఇందులో ఏ పదానికీ కూడా నిఘంటువు అర్థం రాలేదు.

**ఆత్మహనో జనాః** – అజ్ఞానులు ఆత్మను హత్య చేస్తున్నారు అంటున్నది ఉపనిషత్తు. ఆత్మను ఎలా హత్య చేయగలరు? ఆత్మ గురించి నేర్చుకునే మొట్టమొదటి లక్షణమే ఆత్మకు చావు పుట్టుకలు లేవు. శరీరం మరణించినా ఆత్మకు మరణం లేదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే ॥** – గీత 2.20

శంకరాచార్యులవారి పేరు చెప్పగానే, ఆయన చూపిన సిద్ధులను గుర్తుకు తెచ్చుకుంటారు చాలామంది. ఆయన కనకధారాస్తోత్రం చదివితే ఎలా కనకవర్షం కురిసిందో చెబుతారు కాని, శంకరాచార్యులవారు ప్రస్థానత్రయంమీద రాసిన భాష్యం చదివితే ఆయనమీద గౌరవం ఆకాశమంత ఎత్తుకు పెరుగుతుంది. ఈశావాస్యోపనిషత్తులో ఆయన ప్రతిభ అడుగడుగునా కనిపిస్తుంది.

ఆత్మ అజ్ఞానం ఉంటే అది ఆత్మను హత్య చేసినట్టుగానే భావించవచ్చు. ఎందుకంటే నాశనమయిన వస్తువు ఏ ప్రయోజనాన్నీ ఇవ్వలేదు. నాశనమయిన వస్తువునే కాదు, దాని గురించి తెలియకపోయినా కూడా దాన్ని అనుభవించలేము. ఒక పండు ఉందని తెలిస్తేనే కదా, దాన్ని తినేది? ఆత్మజ్ఞానం పొందితేనే కదా **అహం పూర్ణః అస్మి** అని చెప్పగలిగేది?

అజ్ఞాని ఎంతసేపూ తను శరీరాన్ని అనుకుంటాడు. తను కర్తా, భోక్తా అనుకుంటాడు. దానివల్ల కర్మలు చేస్తూనే ఉంటాడు. వాటికి తగ్గ ఫలాలను అనుభవిస్తూనే ఉంటాడు. అంటే పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటాడు.

**ప్రేత్య** – వారి మరణానంతరం,

**తాగ్ంస్తే లోకాన్ అభిగచ్ఛంతి** – లోకాలకు వెళతారు. ఇక్కడ కూడా లోకాలు అంటే నిజంగా లోకాలు కాదు. ఇక్కడ అర్థం శరీరం.

లోక్యతే అనుభూయతే ఇతి లోకః

అనుభవించబడేది ఏదైనా లోకం. శరీరానికి కలిగే షడ్వికారాలు అనుభవంలోకి వస్తాయి. మరణించాక దేవశరీరాన్ని పొందుతాడు. లోకః అంటే దేవలోకంలో జన్మ పొందుతాడు అంటే దేవశరీరాన్ని పొందుతాడు. ఆ విధంగా లోకః = శరీరం.

**అసుర్యా నామ** – నామ పదానికి ప్రత్యేకించి అర్థం లేదు. అసుర్యా పదం లోకాః పదానికి విశేషణం. అసురులు అంటే మామూలుగా రాక్షసులు. కాని ఇక్కడ దేవతలను కూడా అసురులు అంటున్నది ఉపనిషత్తు. **అసుషు రమంతే ఇతి అసురః**.

దేహాభిమానం ఉన్న అజ్ఞానులు. స్వర్గలోకంలో కూడా దేహాభిమానం కనిపిస్తుంది. వారు ఎప్పుడూ ఆనందంలో మునిగి తేలుతుంటారు. దేవతలు కూడా ఆత్మజ్ఞానం పొందితేనే జ్ఞానులు అవుతారు. కేనోపనిషత్‌లో ఇంద్రుడు, అగ్ని, వాయువు ఆత్మజ్ఞానం పొందినట్టు చూస్తాము. ఆత్మజ్ఞానం పొందకపోతే వారు కూడా వారి పుణ్యం అయిపోయాక భూలోకానికో, ఇంకా హీనలోకానికో రాక తప్పదు. అందువల్ల అసుర్యాః అంటే అజ్ఞానుల శరీరం.

**అంధేన తమసా౨ ౨ వృతాః** – ఈ పదం లోకాఃకు రెండవ విశేషణం. ఈ అజ్ఞానులు చిమ్మచీకటి లోకాలకు వెళతారు. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటిలోకాలకు వెళతారు. నిజానికి స్వర్గలోకాలు ఎంతో ప్రకాశవంతంగా ఉంటాయి కాని, అటువంటి లోకాలను చిమ్మచీకటి లోకాలు అని ఎందుకంటున్నది ఉపనిషత్తు? అవి అజ్ఞానంతో నిండివుంటాయి కాబట్టి అక్కడున్నవారు అజ్ఞానంలో ఉంటారు కాబట్టి, వారు ఆత్మజ్ఞాన ఫలాన్ని అనుభవించలేరు.

దీన్ని నహినిందా న్యాయం అంటారు వేదాంతంలో. వేదాంతం దేన్నైనా నిందిస్తే, ఇంకొకదాన్ని స్తుతించటంకోసం నిందిస్తున్నదని అర్థం. అద్వైతస్తుతి కోసం అజ్ఞాన నింద చేస్తున్నది.

**నహి నిందా నిందార్థా పరంతు అన్యత్ స్తుత్యర్థా**

ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం మోక్షం. అది అత్యుత్తమ పురుషార్థం. దానితో చూస్తే ఉన్నతలోకాలకు వెళ్ళటమనే ఉత్తమఫలం కూడా తక్కువే. అందువల్ల ముందు ఆత్మజ్ఞానాన్ని స్తుతించి, తర్వాత అటువంటి ఆత్మ లక్షణాలేమిటో చెప్పబోతున్నది ఉపనిషత్తు, రాబోయే మంత్రాల్లో.

## మంత్రం 4

**అనేజదేకం మనసో జవీయో నైనద్దేవా ఆప్నువన్పూర్వమర్షత్ ।**

**తద్ధావతోఽన్యానత్యేతి తిష్ఠత్తస్మిన్నపో మాతరిశ్వా దధాతి ॥**

ఆత్మ అజ్ఞాని సంసారంనుంచి సంసారానికి తిరుగుతాడు. అటువంటి అజ్ఞానిని **ఆత్మ హనః** అన్నది ఉపనిషత్తు. ఎటువంటి ఆత్మ? 4-8 మంత్రాలను ఆత్మస్వరూప ప్రతిపాదక మంత్రాలు అంటారు. ఈ మంత్రాలు ఈ ఉపనిషత్తులోనే కాదు, మొత్తం వేదాంతంలోనే చాలా ముఖ్యమైన మంత్రాలు. భిన్నపదాలతో, విరుద్ధస్వభావాలతో ఆత్మ లక్షణాలను చెప్పుకువస్తుంది ఉపనిషత్తు.

**ఏకమ్** – ఆత్మ ఒక్కటే ఉంది. ఈ పదం ఆత్మ బహుత్వ వాదనను ఖండిస్తుంది. తక్కిన దార్శనికులు ఆత్మలు అనేకం అంటారు. వారిని ఖండించటానికి శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాలు వాడాలి భాష్యకారులు. ఇక్కడ **ఏకమ్** పదం శ్రుతి ప్రమాణం.

**ఏకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్

ఉన్నదొకటే ఆత్మ అని ఛాందోగ్యోపనిషత్‌లో కూడా వస్తుంది. ఒకటే అంటే సజాతీయ, విజాతీయ, స్వగతభేద రహితమ్ ఆత్మ.

**విజాతీయమ్** – ముందు విజాతీయ పదాన్ని చూద్దాము. ఉదాహరణకు మనిషి, వృక్షం. మనుష్యజాతి వేరు, వృక్షజాతి వేరు.

**సజాతీయమ్** – ఇప్పుడు వృక్షం తీసుకుంటే వృక్షజాతిలోనే అనేక రకాల చెట్లు ఉన్నాయి. మామిడిచెట్టు, కొబ్బరిచెట్టు, పనసచెట్టు.

**స్వగతమ్** – మళ్ళీ వృక్షం ఉదాహరణకే వస్తే ఒక చెట్టులోనే అనేక భాగాలు ఉన్నాయి. బోదె, కొమ్మలు, ఆకులు, పువ్వులు, పండ్లు.

ఇప్పుడు ఆత్మపరంగా చూద్దాము.

**విజాతీయమ్** – ఆత్మను అద్వైత ఆత్మ అంటాము. ఆత్మకు భిన్నంగా ఇంకొక వస్తువు లేదు. అందువల్ల వేరే జాతి లేదు.

**సజాతీయమ్** – ఉన్నదొకటే ఆత్మ, అనేక ఆత్మలు లేవు. అందువల్ల ఆత్మలో రకాలు లేవు.

**స్వగతమ్** – ఆత్మ నిరవయవం. అందువల్ల ఆత్మకు భాగాలు లేవు.

సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమ్ ఆత్మ

**అనేజత్** – ఆత్మ ఎక్కడికీ కదలదు. దీని అర్థం ఆత్మ సర్వవ్యాపకం. అంతటా ఉన్న ఆత్మ ఎక్కడ్నుంచి ఎక్కడికి కదులుతుంది? ఆకాశంలాగా ఆత్మ సర్వవ్యాపకం.

ఏకమ్, అనేజత్ పదాలనుంచి ఆత్మయొక్క మూడు లక్షణాలను చూస్తాము. అవి ఏకం, సర్వగతం, అచలం.

**నిత్యస్సర్వగతః స్థాణుః అచలోఽ యం సనాతనః** – గీత 2.24

**మనసః జవీయః** – ముందు వాచ్యార్థం చూద్దాము. మనస్సుకన్నా వేగంగా ఆత్మ వెళుతుంది. దీన్నించి రెండు అంశాలను చెప్పవచ్చు.

1. మనస్సుకన్నా వేగంగా ఆత్మ వెళుతుంది అంటే, మనస్సు వేగంగా వెళుతుంది అనే విషయం ముందు గ్రహించాలి. ఉన్నచోటనే ఉండి, మనస్సు అవసరమైతే సంకల్ప మాత్రం చేతనే బ్రహ్మలోకానికి కూడా వెళ్ళివస్తుంది. అందువల్ల మనస్సు అతిశయించిన వేగం కలది అని అంటారు. మనస్సు అంటే సంకల్పాత్మక, వికల్పాత్మక మనస్సు.

2. ఆత్మ మనస్సు కంటే వేగంగా వెళుతుంది అంటే అక్కడ 'ఇవ' శబ్దాన్ని కలుపుకోవాలి. ఇవ అంటే వెళుతున్నట్టుగా అని అర్థం. నువ్వు అందంగా ఉన్నట్టుగా ఉన్నావు అంటే నిజంగా అందంగా ఉన్నట్టు కాదు అర్థం. అలాగే ఆత్మ మనస్సుకన్నా వేగంగా వెళుతున్నట్టుగా ఉందంటే నిజంగా వెళుతున్నట్టు కాదు.

ఉదాహరణకు మీరు ఇక్కడ ఉండి సూర్యుణ్ణి చూస్తున్నారు. ఒకరోజు విమానంలో ముంబై వెళ్ళి, అక్కడ విమానం దిగి పైకి చూస్తే సూర్యుడు ఆకాశంలో కనిపిస్తాడు. 'చూశావా, నీకన్నా ముందు వచ్చాను, నీకు స్వాగతం పలకటానికి,' అని చిరునవ్వులు చిందిస్తున్నట్టుగా అనిపిస్తుంది. అదే విధంగా మరణించాక మనస్సు ఏ లోకానికి వెళ్ళినా కూడా, ఆ లోకం చైతన్యవంతంగా అందుబాటులో ఉంటుంది. సర్వవ్యాపకమైన ఆత్మ అక్కడికి ముందే వెళ్ళి చిదాభాస ద్వారా దీపిస్తున్నట్టుగా ఉంటుంది.

లోకానికి వెళ్ళటం దాకా ఎందుకు? మనస్సు పని చేసే తీరు తీసుకుంటే మనస్సు ఏ వస్తువును చూస్తే, దానిమీదకు వృత్తి (ఆలోచన) వెళ్ళి, దానిమీద పడుతుంది. కాని మనస్సు ఆ వస్తువుమీద పడేలోపే సర్వవ్యాపకమైన ఆత్మ ఆ వస్తువులో కూడా ఉంటుంది కాబట్టి ఆత్మ మనస్సుకన్నా వేగంగా **వెళ్ళినట్టుగా** అనిపిస్తుంది.

**న ఏనద్ దేవాః** – ఇంద్రియాలు కూడా ఆత్మను అందుకోలేవు. దేవాః అంటే ఇంద్రియాలు. ఎందుకు?

**పూర్వమర్షత్** – ఆత్మ వాటికన్నా ముందే చేరిపోయింది కాబట్టి. ఇది వాచ్యార్థం.

ఉపనిషత్ ఒక ఊహాజనిత పరుగు పందెమును వివరిస్తున్నది. ఇంద్రియాలు, మనస్సు, ఆత్మ – ఈ మూడూ పందెములో పాల్గొంటున్నాయి. ఆత్మ మనస్సుకన్నా వేగంగా వెళుతుంది అంటే వేగంగా వెళ్ళే మనసే ఆత్మను అందుకోలేకపోతే, ఇంక ఇంద్రియాల గురించి వేరే

చెప్పాలా? దీన్ని కౌముతిక న్యాయం అంటారు. మనస్సు, ఇంద్రియాల పనితీరు చూస్తే ఇంద్రియాలు, మనస్సుమీద ఆధారపడి ఉంటాయి.

మీ కన్ను వెనక మీ మనస్సు లేకపోతే, మీ కళ్ళు ఈ అక్షరాల వెంట వెళుతున్నా, వాటిలోని భావం అర్థం కాదు.

**రూపం దృశ్యం లోచనం దృక్ తద్దృశ్యం దృక్తు మానసమ్**
**దృశ్యా ధీవృత్తయః సాక్షీ దృగేవ న తు దృశ్యతే** – దృగ్దృశ్య వివేకమ్ 1

ఒక జీవిలో మూడు దృక్కులు ఉంటాయి. కంటితో ఆ జీవి బాహ్యప్రపంచాన్ని చూస్తాడు.

కన్ను – దృక్ 1 జగత్తు – దృశ్యం 1

కాని ఆ కన్ను వెనక మనస్సు లేకపోతే కన్ను చూడలేదు.

మనస్సు – దృక్ 2 కన్ను – దృశ్యం 2

మనస్సుకు సాక్షిచైతన్యం చైత్యన్నాన్ని అరువు ఇవ్వకపోతే, మనస్సు చూడలేదు.

సాక్షి – దృక్ 3 మనస్సు – దృశ్యం 3

సాక్షిని చూసేది ఎవరు? దృగేవ న తు దృశ్యతే – అది చూసేదే కాని చూడబడేది కాదు. అంటే కన్ను ప్రత్యక్షంగా సాక్షినుంచి అరువు తెచ్చుకోలేదు, మనస్సు ద్వారానే పనిచేస్తుంది. అటువంటి మనస్సే సాక్షిని (ఆత్మను) అందుకోలేకపోతే ఇంక ఇంద్రియాలు ఎక్కడ అందుకుంటాయి?

ఈ ఊహాజనిత పరుగుపందెంనుంచి మనం గ్రహించాల్సిన ఉపసిద్ధాంతం – ఆత్మ ఇంద్రియ అగోచరం, మనో అగోచరం. అంతేకాదు, ఆత్మ రూపద్వయం.

ఇప్పుడు మళ్ళీ మూడు లక్షణాలు చూశాము. ఆత్మ ఇంద్రియ అగోచరం, మనో అగోచరం, రూపద్వయం. రూపద్వయం అంటే –

నిరుపాధిక ఆత్మ దృష్ట్యా ఆత్మ అచలం, ఏకం, సర్వవ్యాపకం.
సోపాధిక ఆత్మ దృష్ట్యా ఆత్మ చలం.

ఉపాధి అంటే తన ధర్మాన్ని తన దగ్గరగా ఉన్నదానికి ఇచ్చేది. ఉదాహరణకు ఒక తెల్లటి స్ఫటికం పక్కన ఒక ఎర్ర మందారపువ్వును పెడితే, తెల్ల స్ఫటికం ఎర్రగా కనిపిస్తుంది. స్ఫటికాన్ని ఎంత తోమినా ఎరుపురంగు పోదు. అది పువ్వునుంచి వచ్చిన రంగని అర్థం చేసుకుంటే, అంటే బుద్ధిలో మార్పు వస్తే పోతుంది. అలా మనస్సుకు దగ్గరగా ఉన్న ఆత్మకు మనస్సు లక్షణాలను ఆపాదిస్తాము. మనస్సును ఉపాధి అనీ, ఆత్మను ఉపహితం అనీ అంటారు.

**తత్ అన్యాన్ అత్యేతి ధావత్** – ఇంకా పరుగుపందెము కొనసాగుతున్నది. తత్ అంటే ఆత్మ; ధావత్ అంటే వేగంగా వెళుతున్నది. దేనికన్నా వేగంగా? అన్యాన్ అత్యేతి – తక్కినవాటి కన్నా వేగంగా వెళుతున్నది. ఆ తక్కినవి ఏమిటో ఇంతకుముందే చూశాము. అవి మనస్సు, ఇంద్రియాలు. ఆత్మ మనస్సు, ఇంద్రియాలకన్నా అత్యంత వేగంగా **వెళుతున్నట్లుగా** ఉంది. ఇవ శబ్దం కలుపుకోవాలని చూశాము. ఇక్కడ కూడా తక్కినవాటికన్నా అంటే మళ్ళీ ఆత్మకు భిన్నంగా వేరే ఉన్నట్లు వస్తుంది. అందువల్ల అన్యాన్ అంటే ఆత్మ వ్యతిరిక్తం కాదు, ఆత్మ విలక్షణం అని తీసుకోవాలి. ఆత్మ లక్షణానికి భిన్నంగా ఉన్నవన్నీ మిథ్యే.

**తిష్ఠత్** – ఇప్పుడే తక్కినవాటికన్నా వేగంగా వెళుతుంది అంటూ ఆత్మ ఎక్కడికీ వెళ్ళదు, స్థిరంగా ఉంటుంది అంటున్నది ఉపనిషత్. అంటే రూపద్వయాన్ని చూడాలి ఇక్కడ కూడా. సోపాధిక దృష్ట్యా వేగంగా వెళ్ళినట్టుగా ఉంటే, నిరుపాధిక దృష్ట్యా స్థిరంగా ఉంటుంది.

**తస్మిన్ అపో మాతరిశ్వా దధాతి** – ఆత్మ సమక్షంలోనే హిరణ్యగర్భ అన్నింటికీ అధిష్ఠాన దేవతగా పనులను విభజిస్తున్నాడు.

తస్మిన్ అంటే ఆత్మ సమక్షంలో; అపః అంటే అసలు అర్థం నీరు, కాని ఈశావాస్యోపనిషత్‌లో చాలా పదాలకు నిఘంటువులో ఉన్న అర్థం కుదరదని చూశాము. ఇక్కడ అపః అంటే కర్మలు. బ్రహ్మసూత్రాల్లో తదంతర ప్రతిపత్తి అధికరణమ్‌లో అపః అంటే కర్మలు అని వివరంగా, సహేతుకంగా వస్తుంది.

దీనికి ఒక కారణం వైదిక కర్మలు ఎక్కువగా నీటి ప్రధానంగా ఉంటాయి. నీరు మాత్రమే కాదు, ద్రవపదార్థాలైన పెరుగు, పాలు, నెయ్యి కూడా వాడతారు. ఇంకొక కారణం ఛాందోగ్యోపనిషత్‌లో చూస్తాము.

**అన్నమయగ్ం హి సోమ్య మనః ఆపోమయః ప్రాణః తేజోమయీ వాక్** – ఛాందోగ్యమ్

మనస్సు పృథివీతత్త్వంనుంచి, ప్రాణం జలతత్త్వంనుంచి, వాక్కు అగ్నితత్త్వంనుంచి పుట్టాయి. అందువల్ల మనస్సుకు శక్తిని అన్నం, ప్రాణానికి శక్తిని నీరు, వాక్కుకి శక్తిని అగ్ని ఇస్తాయి. నీరు ప్రాణానికి శక్తినిస్తే, ప్రాణం కర్మేంద్రియాలకు శక్తినిస్తే, కర్మేంద్రియాలు కర్మలు చేస్తాయి. ఇప్పుడు మొదటి పదం, ఆఖరి పదం చూస్తే నీరు=కర్మలు అవుతుంది.

మాతరిశ్వా అంటే అసలు అర్థం వాయువు. మాత అంటే అంతరిక్షం. అంతరిక్షంలో సంచరించేది కాబట్టి వాయువును మాతరిశ్వా అంటారు. అన్ని జీవులకు ప్రాణశక్తినిచ్చేది ఈ వాయువే

**నమో బ్రహ్మణే నమస్తే వాయో**

వ్యష్టి శరీరంలో అన్ని అంగాలకు అధిష్ఠానదేవతలు ఉంటారు. వారందరికీ అధిష్ఠాన దేవత హిరణ్యగర్భ.

అధిష్ఠాన దేవతలు వారివారి పనులను సక్రమంగా చేస్తున్నారు.

**భయాత్ అస్య అగ్నిః తపతి భయాత్ తపతి సూర్యః**
**భయాత్ ఇంద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః** – కఠ 2.3.3

ఆయన భయంచేతనే అగ్ని మండుతున్నది; సూర్యుడు ప్రకాశిస్తున్నాడు; ఇంద్రుడు, వాయువు వారి పనులు సక్రమంగా చేస్తున్నారు. పంచమదేవత అయిన యమధర్మరాజు కూడా తన పనిని తాను సక్రమంగా చేస్తున్నాడని స్వయంగా యమధర్మరాజే చెప్పుకుంటున్నాడు. ఇదే భావాన్ని కొద్ది పదాల వ్యత్యాసంతో తైత్తిరీయంలో కూడా చూస్తాము.

**భీషాస్మాత్ వాతః పవతే । భీషోదేతి సూర్యః**
**; ó Iఽ స్మాదగ్నిశ్చేన్ద్రశ్చ మృత్యుర్ధావతి పంచమ ఇతి**

**దధాతి** – దధాతికి రెండు అర్థాలు చెప్పవచ్చు. **విభజతి** – హిరణ్యగర్భ ఈ అధిష్ఠాన దేవతలకు వారివారి పనులను విభజిస్తున్నాడు. అగ్నికి మండేశక్తిని, సూర్యునికి ప్రకాశించే శక్తిని ఇస్తున్నాడు. **ధారయతి** – వారి పనులను సక్రమంగా చేసేలాగా వారిని నిలబెడుతున్నాడు.

**మహద్భయం వజ్రముద్యతమ్** – కఠ

ఆయన ఎత్తిపట్టిన వజ్రాయుధంతో తిరుగుతున్నాడనే భయంతో ఈ ఐదుగురు దేవతలూ వారివారి పనులను సక్రమంగా చేస్తున్నారు. కాని అలా వ్యష్టిపరంగా, సమష్టిపరంగా దేవతల ద్వారా కర్మలు చేయించే హిరణ్యగర్భకు ఆ శక్తిని ఇచ్చేది ఆత్మే. ఆత్మ సమక్షంలోనే హిరణ్యగర్భ ఆ పనులను చేయించగలుగుతున్నాడు. ఈ పాదం అర్థం ఆత్మ సర్వ అధిష్ఠానం. దీన్నిబట్టి చైతన్యం పదార్థానికి శక్తిని ఇస్తుంది కాని పదార్థం చైతన్యానికి కాదు అని అర్థమవుతుంది.

ఆత్మ హిరణ్యగర్భకు చైతన్యాన్ని ఇస్తుంది అంటే ఆత్మ నిజంగా ఇవ్వదు. ఆత్మకు క్రియాపదాన్ని వాడలేము. దాన్ని నామవాచకంగా తీసుకోవాలి. సన్నిధి మాత్రేన అని కలుపుకోవాలి. అయస్కాంతం మైపు ఇనుపముక్కలు ఆకర్షించబడినట్టుగా, ఆత్మ సమక్షంలో పనులు అవుతాయి.

ఈ మంత్రంలో చూసిన ఆత్మ లక్షణాలు – ఏకత్వం, సర్వవ్యాపకత్వం, ఇంద్రియ అగోచరత్వం, మనో అగోచరత్వం (అప్రమేయత్వం), సర్వ అధిష్ఠానత్వం, రూపద్వయత్వం.

## మంత్రం 5

**తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే ।**
**తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః ॥**

ఈ మంత్రంలో ఇంచుమించుగా ముందు మంత్రంలో వచ్చిన అంశాలే మళ్ళీ వస్తాయి. అలా చెప్పినదే మళ్ళీ చెపితే దాన్ని మామూలుగా పునరుక్తిదోషం అంటారు. ఇక్కడ పునరుక్తి దోషం రాదా అంటే రాదంటున్నారు శంకరాచార్యులవారు. ఆత్మనః దుర్విఘ్నేయత్వాత్. ఆత్మను అర్థం చేసుకోవటం కష్టం కాబట్టి అనేక కోణాల్లో ఆత్మ గురించి చెబుతుంది శాస్త్రం.

**తత్త్వమసి శ్వేతకేతో** – ఛాందోగ్యమ్

ఈ మహావాక్యాన్ని తొమ్మిదిసార్లు చెబుతుంది ఛాందోగ్యోపనిషత్.

**శాస్త్రజ్ఞోపి స్వాతంత్ర్యేన బ్రహ్మజ్ఞానాన్వేషణం న కుర్యాత్**

ఎంత పండితుడైనా కూడా స్వంతంగా ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నించకూడదు. ముఖ్యంగా ఈశావాస్యోపనిషత్. నారదులవారికి తెలియని విద్య అంటూ లేదు, అయినా ఆయన ఆత్మజ్ఞానం పొందటానికి సనత్కుమారుల దగ్గరకు వెళ్ళారు. అలా కాకుండా స్వంతంగా నేర్చుకుని, లేనిపోని అపోహలు పెంచుకున్నాక, అప్పుడు గురువు దగ్గరకు వెళితే, ఆ గురువుకు రెండు బాధ్యతలు ఉంటాయి. ముందుగా అతనిలో పేరుకున్న అపోహలను తొలగించాలి; తర్వాత అతనిలో ఆత్మజ్ఞానం నెలకొనేలా చేయాలి. అసలు నేర్చుకోకపోయినా ఫర్వాలేదు; స్వంతంగా నేర్చుకుని ఇలా అపోహలు పెంచుకుంటేనే కష్టం. ఇంకా భిన్నపదాలతో వివరించుకొస్తున్నది ఉపనిషత్తు. దానికి రూపద్వయం లక్షణం తీసుకోవాలి.

**తత్ ఏజతి** – చలతి. ఆత్మ కదులుతుంది. ముందు మంత్రంలో మనసో జవీయః అని చూశాము. ఆత్మ కదలటమే కాదు, మనస్సుకన్నా వేగంగా పరుగులు తీస్తుంది అన్నది.

**తత్ న ఏజతి** – ఆత్మ కదలదు. ముందు మంత్రంలో తిష్ఠత్ అని చూశాము. ఆత్మ ఎక్కడికీ కదలదు, స్థిరంగా ఉంటుంది. ఈ భిన్నపదాలను భిన్న ఉపాధుల దృష్ట్యా అర్థం చేసుకోవాలి. సోపాధిక దృష్ట్యా తన్నేజతి; నిరుపాధిక దృష్ట్యా తన్నైజతి.

దీనికి ఉదాహరణగా లైట్‌హౌస్ లైట్‌ను తీసుకోవచ్చు. లైట్‌హౌస్ బయటనుంచి చూస్తే మూడు రంగులు కనిపిస్తాయి, అవి తిరుగుతూ ఉంటాయి కాని లైట్‌హౌస్ లోపలికి వెళ్ళి చూస్తే, అక్కడ ఉన్నది ఒకటే తెల్లని లైట్; అది కూడా కదలదు. ఇంకొక ఉదాహరణగా అద్దంలో సూర్యుని ప్రతిబింబం తీసుకోవచ్చు.

పైన ఆకాశంలో ఉన్న సూర్యుణ్ణి మీరు కింద అద్దంలో కనబడేలా చేశాక, ఆ అద్దాన్ని తిప్పారనుకోండి. మీరు అద్దాన్ని ఎటు తిప్పితే అటు సూర్యుడు తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. కాని నిజంగా చూస్తే అసలు సూర్యుడు కదలటం లేదు.

**తద్దూరే తద్వంతికే** – ముందు విభిన్న పదాలను ఉపాధి భేదం ద్వారా వివరిస్తే, ఈ విభిన్న పదాలను అధికారి భేదం ద్వారా చూస్తాము. చాలా దూరంగా ఉందిట ఆత్మ, చాలా దగ్గరగా ఉందిట.

తద్దూరే – తత్ దూరే – అజ్ఞానికి చాలా దూరంగా ఉందిట. అతను ఆత్మను బాహ్య వస్తువుగా పొరపాటుపడి బాహ్యంగా వెతుకుతాడు కాబట్టి అది అతనికి దూరంగా ఉంది.

దూరాత్ సుదూరే

దూరమైన వాటికన్నా దూరంగా ఉంటుందిట. అతను వందల కోట్ల సంవత్సరాలు వెతికినా ఆత్మ దొరకదు. అతను ముందు బాహ్యంగా వెతుకుతాడు, తర్వాత లోపల వెతుకుతాడు. గురువు ఆ ఆత్మవు నువ్వే అని చెప్పాలి.

తద్వంతికే – తద్ + ఉ + అంతికే – ఉ అంటే ఏవ. తద్ అంటే ఇక్కడ జ్ఞానికి. జ్ఞానికి మాత్రమే అత్యంత దగ్గరగా ఉంటుంది. అతను ఆత్మ ఎక్కడో బాహ్యవస్తువు కాదు, వెతుకుతున్న తనే ఆత్మ అని అర్థం చేసుకుంటాడు. వారి జ్ఞానాన్నిబట్టి వారు అర్థం చేసుకుంటారు కాబట్టి, దాన్ని అధికారి భేదం అంటున్నాము. ఉదాహరణకు ఒక గోడ దగ్గరగా ఉందా, దూరంగా ఉందా అంటే ఆ గోడకు దూరంగా కూర్చున్న వ్యక్తికి అది దూరంగానే ఉంది; కాని ఆ గోడకు ఆనుకుని కూర్చున్న వ్యక్తికి చాలా దగ్గరగా ఉంది.

**తదంతరస్య సర్వస్య** – తద్ + అంతః + అస్య + సర్వస్య – తద్ అంటే ఆత్మతత్త్వం. సర్వస్య జగతః అంతః వర్తతే జగత్తులోని అన్నింటిలోనూ ఆత్మ ఆంతరంగా ఉంది.

**యత్ సాక్షాత్ అపరోక్షాత్ బ్రహ్మ య ఆత్మా సర్వాంతరః** – బృహదారణ్యకమ్

సర్వాంతరః అంటే ఇక్కడ చూసిన సర్వస్య అంతరః అనే అర్థం. అంటే ఆత్మ **అంతర్యామి.**

**తదు సర్వస్యాస్య బాహ్యతః** – ఆత్మ బాహ్య జగత్తు అంతటా ఉంది.

**త్రయం వా ఇదం నామరూపం కర్మ** – బృహదారణ్యకమ్

ఈ జగత్తును నామరూపకర్మగా విభజిస్తుంది బృహదారణ్యకోపనిషత్. తద్+ఉ – తద్ అంటే ఈ ఆత్మతత్త్వం; ఉ అంటే అపి. బాహ్యతః అంటే బాహ్యంగా; ఈ ఆత్మ అన్నింటికీ బాహ్యంగా కూడా ఉంది. అంటే ఆత్మ **అతీతం**. ఆత్మ దేశకాలవస్తు అతీతం.

**చిత్ రూపేణ అంతః సత్ రూపేణ బహిః చ**

అంటే ఆత్మ చైతన్యం రూపంలో లోపల ఉంటే, ఉనికి రూపంలో బాహ్యంగా ఉంది. జ్ఞాని బాహ్యంగా చూస్తే సత్‌గా తెలుసుకుంటాడు, కళ్ళు మూసుకుంటే చిత్‌గా తెలుసుకుంటాడు. జ్ఞానికి ఆత్మ అలా ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది.

**ప్రతిబోధ విదితం మతమ్** – కేన

ఈ మంత్రంలో చూసిన ఆత్మ లక్షణాలు – రూపద్వయం, స్వస్వరూపం, సర్వ అంతర్యామి, సర్వ అతీతం.

## మంత్రం 6

**యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవానుపశ్యతి ।**
**సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే ॥**

మంత్రాలు 4, 5లలో ఆత్మస్వరూపం చూస్తే, మంత్రాలు 6, 7లలో ఆత్మస్వరూపంతో పాటు, ఫలం కూడా చూస్తాము. అంటే ఈ మంత్రాల్లో ఆత్మజ్ఞానం, ఆత్మజ్ఞానఫలం కూడా చూస్తాము. ఈ మంత్రంలోకి వెళ్ళేముందు, ఆత్మజ్ఞానం పొందే విధానాన్ని చూద్దాము.

వేదాంతానికి నేను శరీరాన్ని అనే పెట్టుబడితో వెళతాము. అక్కడ మూడు దశల్లో ఆత్మ జ్ఞానాన్ని పొందుతాము.

**దశ 1** – నేను శరీరం కాదు, నేను శరీరం**లో** ఉన్నాను.

**లో** అనే విభక్తిని అరువు తెచ్చుకున్నాము. నేను గదిలో ఉన్నాను అంటే నేను వేరు, గది వేరు అని అర్థం. అలాగే నేను శరీరంలో ఉన్నాను అంటే శరీరం వేరు, నేను వేరు అని అర్థం. నేను శరీరంలో ఉన్న శరీరిని.

**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్ ॥ – 5.13**

**దశ 2** – నేను ఈ శరీరం**లోనే** కాదు అన్ని శరీరా**ల్లో** ఉన్నాను.

నేను ఈ శరీరంలో ఉన్నాను అంటే ఈ శరీరానికే పరిమితి చెందినట్టు అవుతుంది. నేను అన్ని శరీరాల్లో ఉన్నాను.

**దశ 3** – నేనే **అన్ని శరీరాలూ**. నేను అంతటా ఉన్న ఆత్మను.

ఇప్పుడు అప్పు తెచ్చుకున్న **లో** తిరిగి ఇచ్చేశాము. ఎలా మన జ్ఞానం మారిందో చూశారా? నేను శరీరాన్ని అనుకుని వస్తే నేను శరీరంలో ఉన్నానునుంచి అన్ని శరీరాల్లో ఉన్నానుకి వచ్చి, నేనే అన్ని శరీరాలూ అంటే నేనే సర్వవ్యాపకమైన ఆత్మను అనే దశకు చేరుకుంటాము. ఈ మంత్రంలో రెండు, మూడు దశలను చూస్తాము. మొదటిది మనకు తెలుసని భావిస్తున్నది ఉపనిషత్తు. అది కూడా రెండవదశను రెండవ పాదంలోనూ,

మూడవదశను మొదటి పాదంలోనూ చూస్తాము. ఇదే అర్థంలో కృష్ణపరమాత్మ ఆరవ అధ్యాయంలో చెప్పాడు.

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః॥** – గీత 6.29

ఈ ఉపనిషత్‌లోని ఆరవ మంత్రంలో రెండవపాదం ముందు చూద్దాము.

**సర్వభూతేషు చాత్మానమ్** – దీని అర్థం ఆత్మనైన నేను అన్ని శరీరాల్లో ఉన్నాను. దీనికి గీతావాక్యం – సర్వభూతస్థమాత్మానం. ఈ రెండు వాక్యాలు మన దశ 2ను సూచిస్తాయి.

నేను ఈ శరీరం**లోనే** కాదు, **అన్ని** శరీరా**ల్లో** ఉన్నాను.

**సర్వాణి భూతాని ఆత్మని ఏవ** – దీని అర్థం ఆత్మే అన్నీ. దానికి గీతావాక్యం – సర్వభూతాని చాత్మని. ఈ రెండు పదాలు మన దశ 3ను సూచిస్తాయి.

నేనే **అన్ని శరీరాలూ**. నేను అంతటా ఉన్న ఆత్మను.

కాని ఈ మూడవదశకు అంత తేలికగా రాలేదు ఒక సాధకుడు. ఎందుకంటే వేదాంతానికి రాకముందు నేను శరీరాన్ని అనుకుంటాడు అని చూశాము. అటువంటి వ్యక్తికి అసలు ఆత్మ అనేది ఒకటి ఉందనే తెలియదు. అందువల్ల మొదటిదశకు వస్తేనే గొప్ప. అంటే ఈ శరీరంలో నేను ఉన్నాను అనేది అర్థం చేసుకోవాలి. తర్వాత తక్కిన రెండు దశలకు రావటానికి వేదాంతంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. అందులో ఆత్మ నిర్వచనం వస్తుంది.

**ఆత్మా కః? స్థూల సూక్ష్మకారణశరీరాత్ వ్యతిరిక్తః । పంచకోశాతీతః సన్,**
**అవస్థాత్రయ సాక్షీ సచ్చిదానంద స్వరూపః సన్ యస్తిష్ఠతి స ఆత్మా ।**– తత్త్వబోధ

ఆత్మ అంటే ఏమిటి? స్థూల సూక్ష్మకారణ శరీరాలకు భిన్నమైనది; పంచకోశాలకు అతీతమైనది; అవస్థాత్రయానికి సాక్షి అయినది; సచ్చిదానంద స్వరూపమైనది ఏదో అది ఆత్మ.

**యస్తు** – యః అంటే ముముక్షువు.

**అనుపశ్యతి** – పశ్యతి అంటే మామూలుగా చూడటం. కాని ఇక్కడ అర్థం చేసుకోవటం. ఇంగ్లీషులో కూడా ఎవరైనా ఏదైనా చెబితే ఐ అండర్‌స్టాండ్ అనకుండా ఐసీ అంటాము. అలాగే ఇక్కడ కూడా ఆత్మ గురించి అర్థం చేసుకుంటాడు జ్ఞాని. అను అంటే దేన్నో అనుసరించి; ఇక్కడ శాస్త్ర ఆచార్య ఉపదేశాన్ని అనుసరించి. అంటే ఆత్మ గురించిన జ్ఞానం శాస్త్రంనుంచి ఆచార్యుడు చేసిన బోధ ద్వారా అర్థం చేసుకుంటాడు. ఆత్మజ్ఞానం ఇన్‌ట్యూషన్‌వల్ల

పొందేది కాదు, ఇన్ ట్యూషన్ పొందాలి. అంటే స్వంతంగా పొందేది కాదు గురుబోధ ద్వారా పొందాలి.

ఇటువంటి ఆత్మజ్ఞానం పొందితే జ్ఞానికి కలిగే ఫలం ఏమిటి?

**తతో న విజుగుప్సతే** – తతః పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు. అవి తర్వాత, అందువల్ల. ఆత్మజ్ఞానం పొందిన తర్వాత ఫలాన్ని అనుభవిస్తాడు; ఆత్మజ్ఞానం పొందినందువల్ల ఫలాన్ని అనుభవిస్తాడు. ఏమిటా ఫలం?

**న విజుగుప్సతే** – విజుగుప్స పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. అవి దయ, నింద, ద్వేషం, అభద్రతాభావన. ఇక్కడ దయ కుదరదు. ఆత్మజ్ఞానం పొందినందువల్ల ఎవరి మీదా దయ చూపడు అనలేము. అందువల్ల నింద లేదా ద్వేషం అర్థం తీసుకోవాలి. న విజుగుప్సతే అంటే ఎవరినీ నిందించడు లేదా ఎవరినీ ద్వేషించడు.

పూజ్యస్వామీజీ అందరితో చాలా ఆప్యాయంగా మాట్లాడతారు. ఎవరిమీద కూడా ఇసుమంతైనా ద్వేషం చూపించరు. ద్వేషం ఎందుకు కలుగుతుంది? ఎవరైనా నాకు భిన్నంగా ఉన్నారు లేదా చెడ్డగా ఉన్నారు అనుకుంటే కలుగుతుంది. పూజ్యస్వామీజీ అలా మీరు ఎవరినైనా భావిస్తే దానికి మీ అజ్ఞానమో లేదా మీ అపరిపక్వతో కారణమవుతుంది అంటారు. ఎందుకంటే జ్ఞాని సర్వత్ర ఆత్మదర్శనం చేస్తాడు. ఇందాక చూసిన గీతాశ్లోకంలో ఫలంగా సర్వత్ర సమదర్శనః చూశాము. అందరిలోనూ ఆత్మను చూస్తాడు కాబట్టి అందరినీ సమానంగా చూస్తాడు. దీన్ని స్థితప్రజ్ఞత అంటారు. జ్ఞానికి రాగద్వేషాలు ఉండవు.

**ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే ఏతద్వై తత్** – కఠ 2.1.12

ఇదే పదం కఠోపనిషత్‌లో కూడా వస్తుంది. విజుగుప్సతేకి అనేక అర్థాలు ఉన్నాయని చూశాము. అందువల్ల అక్కడి సందర్భాన్నిబట్టి వేరే అర్థం చెప్పారు శంకరాచార్యులవారు. అక్కడ పరమాత్మే అన్ని కాలాల్లోనూ ఉన్నాడని అర్థం చేసుకున్న జ్ఞాని దేన్నించీ భద్రతను కోరడని అర్థం వస్తుంది.

## మంత్రం 7

**యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః ।**
**తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః ॥**

ఇంచుమించుగా మంత్రం 6లో వచ్చిన భావనే ఇక్కడ కూడా. అంటే –
ఆత్మజ్ఞానం + ఫలం చూస్తాము. ఆత్మజ్ఞానాన్ని మూడు దశల్లో పొందుతాడు ఒక సాధకుడు అని చూశాము. ఆ దశలు మళ్ళీ ఒకసారి చూస్తే –

1. నేను శరీరం**లో** ఉన్నాను
2. నేను ఈ శరీరం**లోనే** కాదు అన్ని శరీరా**ల్లో**నూ ఉన్నాను
3. నేనే అన్ని **శరీరాలూ**. నేను అంతటా ఉన్న ఆత్మను.

ఈ మంత్రంలో మూడవదశను మళ్ళీ నొక్కి వక్కాణిస్తోంది ఉపనిషత్తు. ఈ మూడు దశలనూ ఇంకో విధంగా చూద్దాము.

1. ఆత్మ శరీరంలో ఉంది
2. ఆత్మ శరీరంలోనే కాదు, బయట కూడా ఉంది
3. నిజానికి ఆత్మలోనే శరీరాలన్నీ ఉన్నాయి.

ఈ వాక్యాల్లో ఆత్మ గురించి జ్ఞానపరంగా ఎదుగుతాడు కాని, ఇంకా ద్వైతం మిగిలే ఉంది. ఆత్మ శరీరంలో ఉంది అన్నా, ఆత్మలోనే శరీరాలు ఉన్నాయి అన్నా, రెండు వస్తువులు కనబడుతున్నాయి అక్కడ. అవి ఆత్మ, శరీరం (అనాత్మ).

పురాణగాథ పరంగా చూస్తే చిన్న కృష్ణుడు మన్ను తిన్నాడనే ఫిర్యాదు విన్నప్పుడు యశోదాదేవి, 'ఏదీ నోరు తెరువు,' అంది. కృష్ణుడు నోరు తెరిస్తే, యశోదాదేవి ఆ చిన్ని నోట్లో అండపిండ బ్రహ్మాండాలనే చూసింది.

కలయో వైష్ణవ మాయయో యశోదాదేవిని కానో అని ఆశ్చర్యపోయింది. మనం నేర్చుకున్న ఆత్మజ్ఞానమే అది! ముందు కృష్ణుడు జగత్తులో బాహ్యంగా ఉన్నాడు. తర్వాత కృష్ణునిలోనే జగత్తంతా ఉంది.

అలా అనాత్మలో ఆత్మ ఉందన్నా, ఆత్మలోనే అనాత్మ ఉందన్నా ద్వైతం ఉంటుంది. ఈ రెండింటిలో ఒకదాన్ని నిషేధించాలి. దేన్ని నిషేధిస్తాము? అనాత్మనే! నిజానికి అద్వైత ఆత్మను అర్థం చేసుకుంటే, అంటే పారమార్థిక స్థాయికి ఎదిగితే, ఏ పదమూ వాడలేము, మిగిలింది మౌనవ్యాఖ్యానమే అంటారు గౌడపాదాచార్యులవారు. అద్వైతం వాడాలంటే ద్వైతం ఉండాలి; బ్రహ్మ సత్యం అనాలంటే మిథ్యా జగత్తు ఉండాలి. అనాత్మకు విడిగా ఉనికి లేదు, అది నామరూపాత్మ కర్మ మాత్రమే అని చూశాము.

**బ్రహ్మైవేదమమృతం పురస్తాద్బ్రహ్మ పశ్చాద్బ్రహ్మ దక్షిణతశ్చోత్తరేణ**
**అధశ్చోర్ధ్వం చ ప్రసృతం బ్రహ్మైవేదం విశ్వమిదం వరిష్ఠమ్** – ముండకమ్ 2.2.11

ఉన్నదంతా బ్రహ్మే! తూర్పున, పశ్చిమాన, ఉత్తరాన, దక్షిణాన, పైన, కింద అంతటా ఉన్నది బ్రహ్మే! బ్రహ్మ వినా మరొకటి లేదు. భక్తుడు ఉన్నదంతా భగవంతుని మహిమ అంటాడు. జ్ఞాని జీవాత్మ, పరమాత్మ ఐక్యం అర్థం చేసుకుంటాడు కాబట్టి ఉన్నదంతా నా మహిమే అంటాడు. ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**యస్మిన్** – ఈ పదానికి రెండు అర్థాలు చెప్పవచ్చు. ఒకటి యస్మిన్ కాలే అంటే విద్యా అవస్థాయాం అంటే జ్ఞానం పొందే సమయంలో. ఇంకొకటి, యథోక్తాత్మని అంటే పైన చెప్పబడిన ఏ ఆత్మ గురించి అయితే నేర్చుకుంటాడో, అతను,

**విజానతః** – విజ్ఞాని అవుతాడు. జ్ఞాననిష్ఠలో ఉంటాడు. నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించు కుంటాడు. ఎలా నేర్చుకుంటాడు?

**అనుపశ్యతః** – శాస్త్ర, గురు ఉపదేశం ద్వారా.

**ఏకత్వమ్** – ఉన్నదొకటే ఆత్మ అని నేర్చుకుంటాడు. ఏమిటా అద్వైతజ్ఞానం? ఆ బ్రహ్మ అంటే బ్రహ్మ వేరు, నేను వేరు అని అర్థం వస్తుంది. నేను సత్యం, తక్కినదంతా నామరూప అధ్యాస అని అర్థం చేసుకుంటాడు.

**సర్వాణి భూతాని ఆత్మైవ అభూద్** – అతని దృష్టిలో అనాత్మ ప్రపంచం అంతా ఆత్మే అయింది. మాండూక్యోపనిషత్‌లో చతుష్పాద ఆత్మను చూస్తాము. అందులో మొదటి మూడు పాదాలుగా విశ్వ–విరాట్, తైజస–హిరణ్యగర్భ, ప్రాజ్ఞ–ఈశ్వరుల జంటలను చూస్తాము. అవన్నీ నాలుగవ పాదం అయిన తురీయం వేసుకున్న వేషాలుగా చూస్తాము. అంటే తురీయం మూడు పాదాల్లోనూ అధిష్ఠానంగా ఉంటుంది, వాటికి అతీతంగా ఉంటుంది. ఇంకో విధంగా చెప్పాలంటే తురీయం లేకుండా వాటికి విడిగా ఉనికి లేదు.

**ఈశా వాస్యమిదగ్ం సర్వం** – ఈశావాస్యమ్ 1

ఈ జగత్తు అంతా ఈశ్వరునితో కప్పబడివుంది,

**మరత్తై మర్రైందది మామదయానై, మరత్తిల్ మర్రైందది మామదయానై**
**చెక్కను మరిచాడు ఏనుగును చూసి, చెక్కను చూసి మరిచాడు ఏనుగును**

తమిళంలో వాక్యమిది. ఒక చిన్నపాప చెక్క ఏనుగును చూసి, అది చెక్క అని తెలియక ఏనుగనుకుని భయపడింది. తండ్రి ఆ పాపను దగ్గరికి తీసుకువెళ్ళి, దానిమీద చేయి వేయించి, అది చెక్క ఏనుగు అని విడమర్చి చెప్పాక, చెక్క దర్శనంలో పడి ఏనుగును మర్చిపోయింది. మనం చేసేదీ అదే. ఏదో ఒకటే చూస్తాము. అజ్ఞాని అనాత్మను మాత్రమే చూస్తాడు. జగత్తును మాత్రమే చూస్తాడు, బ్రహ్మ ఉందని తెలియదు. జ్ఞాని బ్రహ్మను మాత్రమే చూస్తాడు, జగత్తును పట్టించుకోడు.

**బ్రహ్మను అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

రజ్జుసర్పభ్రాంతిని తీసుకుంటే తాడుని చూసి పాము అనుకుంటున్న వ్యక్తికి అక్కడ తాడు ఉందనే తెలియదు. అతని దృష్టిలో ఉన్నది పాము ఒక్కటే. తర్వాత, అజ్ఞానం తొలిగాక,

తాడుని చూస్తే పాము లేదు. రెండు సందర్భాలలోనూ ఉన్నదొకటే వస్తువు. అది అజ్ఞానికి పాముగా కనిపిస్తే, జ్ఞానికి తాడుగా అర్థమవుతుంది.

సర్వం ఆత్మమయం జగత్ అని అర్థం చేసుకున్న జ్ఞానికి కలిగే ఫలమేమిటి?

**తత్ర కః మోహః కః శోకః** – జ్ఞానికి శోకమోహాలు ఉండవు.

తత్ర – తత్రకు రెండు అర్థాలు చెప్పవచ్చు. ఆ కాలంలో అంటే జ్ఞానం పొందినప్పుడు లేదా ఆ ఆత్మలో.

కః మోహః – మోహం ఎక్కడిది? మోహం పదాన్ని ఏకవచనంగా వాడింది ఉపనిషత్తు కాని దాన్ని బహువచనంగా తీసుకోవాలి. ఎవరైతే రేపు నేను ఆనందంగా ఉంటాను అనుకుంటాడో, అతను ఎన్నటికీ ఆనందంగా ఉండలేడు. అలా అనుకున్నాడు అంటే అతను ఇప్పుడు ఆనందంగా లేడని అర్థం. అంతేకాదు, ఆ రేపు అనేది ఎన్నటికీ రానే రాదు.

వేదాంతం అయితే నువ్వు ఎప్పటికీ ఆనంద స్వరూపుడవు లేదా ఎన్నటికీ ఆనంద స్వరూపుడవు కాలేవు అంటుంది. ఎందుకంటే నువ్వు వెతికే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో దొరకవు. అవి నువ్వే అంటుంది. నువ్వు ఆనందస్వరూపుడవు, నువ్వు పూర్ణపురుషుడవు అంటుంది. పరిస్థితులవల్ల ఆనందం పొందవు, ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఆనందంగా ఉంటావు అంటుంది. కొంతమంది వేదాంతానికి వచ్చి కూడా ఇది సరిగ్గా అర్థం చేసుకోక, వచ్చే జన్మలోనైనా నేను వేదాంతానికి త్వరగా వస్తానా? వచ్చే జన్మలో కూడా మీరే గురువుగా వస్తారా అని స్వామీజీని అడుగుతుంటారు. వేదాంతం అర్థమయితే, తను ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందుతాడని, ఇంక పునర్జన్మ లేదనీ జీర్ణించుకోవాలి.

అందువల్ల కః మోహః అంటే మోహం ఎక్కడుంది అని ప్రశ్న కాదు. మోహం ఉండదని చెబుతున్నది ఉపనిషత్తు.

కః శోకః – ఏదో తక్కువైందనే భావనవల్ల శోకం ఉంటుంది. ఎన్ని ఉన్నా, ఇంకా ఇంకా కావాలనుకుంటాడు మనిషి. కాని జ్ఞానం పొందితే ఈ శోకమోహాలు ఉండవు అంటున్నది శాస్త్రం. శోకం అంటే దుఃఖం, మోహం అంటే ఘర్షణ. ఈ రెండూ అజ్ఞానంవల్ల పుట్టినవి. అజ్ఞానం కామకర్మబీజం. అజ్ఞానంవల్ల కోరికలు పుడతాయి, కోరికలు తీర్చుకోవటానికి కర్మలు చేస్తాడు.

పూజ్యస్వామీజీ ముముక్షుత్వాన్ని జిజ్ఞాసుత్వంగా మార్చుకోవాలి అంటారు. వేదాంతాన్ని కనీసం మూడు సంవత్సరాల కోర్సుగా నేర్చుకోవాలి. అప్పుడే జ్ఞానమూ, జ్ఞానఫలమూ కలుగుతాయి.

కః మోహః కః శోకః – శ్రుతి శోక, మోహాలు ఉండవు అంటున్నది కాని కః అనటం వల్ల వాటి కారణాన్ని కూడా త్రోసిపుచ్చుతున్నది.

**కారణ అభావే కార్య అభావః**

అజ్ఞానంనుంచి పుట్టే శోకమోహాలను నిషేధిస్తూ చెప్పటం ద్వారా, అజ్ఞానమనే కారణంతో సహా సంసారాన్ని కూకటివేళ్ళతో పెకళించి వేస్తున్నది. ఇంక సంసారం అసంభవం. నిద్రలో, ఆనందంలో, విషయ అనుభవంలో, మరణంలో, ప్రళయంలో, కోమాలో కూడా శోకమోహాలు ఉండవు కాని వాటిలో అవి తాత్కాలికంగా ఉండవు. ఆ ఫలం ఆపేక్షిక ఫలం మాత్రమే. జ్ఞానం పొందితేనే సంసారం ఉండదు. అప్పుడే ఆత్యంతిక ఫలం కలుగుతుంది.

ఈ మంత్రం సారం – సర్వత్ర ఆత్మదర్శనం, తద్వారా శోకమోహనివృత్తి.

**మంత్రం 8**

**స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరగ్ం**
**శుద్ధమపాపవిద్ధమ్। కవిర్మనీషీ**
**పరిభూః స్వయమ్భూర్యాథాతథ్యతో ఽ ర్థాన్**
**వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః॥**

ఇది జ్ఞానయోగంలో చెప్పబడిన ఆఖరి మంత్రం. దీన్ని ఉపసంహార మంత్రం అంటారు. ఇంతవరకూ వచ్చిన ఆత్మస్వరూప లక్షణాలు కొన్ని మళ్ళీ వస్తాయి. ముఖ్యంగా ఇక్కడ రూపద్వయంగా చూస్తాము. అంటే కొన్ని సోపాధిక లక్షణాలు, కొన్ని నిరుపాధిక లక్షణాలు చూస్తాము. ముందుగా నిరుపాధిక లక్షణాలు చూస్తాము.

**సః** – పైన చెప్పబడిన ఆత్మ,

**పర్యగాత్** – సర్వవ్యాపకం. అంటే ఆత్మ నెమ్మదిగా అంతటా వ్యాపించుకుంటూ వస్తుందని కాదు దాని అర్థం. ఆకాశంలాగా ఆత్మ సర్వవ్యాపకం. కర్మకాండలో నామవాచకం వాడినా దాన్ని క్రియాపదంగా తీసుకోవాలి; జ్ఞానకాండలో క్రియాపదం వాడినా దాన్ని నామవాచకంగా తీసుకోవాలి. పర్యగాత్ క్రియాపదం కాని దాన్ని నామవాచకంగా తీసుకోవాలి.

**శుక్రమ్** – శుక్రమ్ అంటే శుద్ధం. కాని ఈ మంత్రంలోనే శుద్ధం పదం తర్వాత వస్తుంది. అందువల్ల దానికి అర్థం ఇక్కడ స్వయంజ్యోతి ప్రకాశకంగా తీసుకోవాలి.

అలా రెండు పదాలు ఇంచుమించు ఒకటే అర్థంతో ఉన్నప్పుడు వాటి మధ్య సూక్ష్మభేదాన్ని చూపిస్తారు శంకరాచార్యులవారు తన భాష్యంలో. ఉదాహరణకు ముండకోపనిషత్‌లో సర్వజ్ఞః సర్వవిద్ పదాలు పక్కపక్కనే వస్తాయి. రెండింటి అర్థం ఇంచుమించుగా ఒకటే. కాని శంకరాచార్యులవారు సర్వజ్ఞుడు అంటే పరావిద్య తెలిసినవాడు అనీ, సర్వవిద్ అంటే అపరావిద్య తెలిసినవాడు అనీ వివరించారు అక్కడ.

**అకాయమ్** – కాయమ్ అంటే శరీరం. అది మామూలుగా స్థూలశరీరానికి వాడతారు కాని ఇక్కడ స్థూలశరీరానికి వేరే పదాలు రావటంవల్ల లింగశరీర రహితమ్ అని తీసుకోవాలి. సూక్ష్మశరీరాన్ని లింగశరీరం అంటారు. అకాయమ్ అంటే సూక్ష్మశరీరం లేనిది.

**అవ్రణమ్** – వ్రణమ్ అంటే గాయం. అవ్రణమ్ అంటే గాయాలు లేనిది.

**అస్నావిరగ్మ్** – స్నావలు అంటే శిరలు (బ్లడ్ వెసల్స్). అస్నావిరగ్మ్ అంటే శిరలు లేనిది.

ఈ రెండు పదాలూ – అవ్రణమ్, అస్నావిరగ్మ్ – కలిపి స్థూలశరీరం లేనిది అని అర్థం.

**శుద్ధమ్** – శుద్ధం అంటే నిర్మలం, అవిద్యామలరహితం. అవిద్యామలం కారణ శరీరానికి చెందుతుంది.

**అనిర్వాచ్య అనాది అవిద్యారూపం శరీరద్వయస్య కారణమాత్రం**
**సత్ స్వరూప అజ్ఞానం, నిర్వికల్పకరూపం యదస్తి తత్ కారణశరీరమ్** – తత్త్వబోధ

అనిర్వచనీయం, అనాది, అజ్ఞానం, స్థూల సూక్ష్మ శరీరాల కారణం, స్వరూప జ్ఞానం లేనిది, నిర్వికల్పరూపం ఉన్నది ఏదో అది కారణశరీరం. ఇందులో మనకు కావాల్సిన పదం,

**అవిద్యారూపమ్** – అవిద్యారూపం అంటే అజ్ఞానం. అజ్ఞానంవల్ల కారణశరీరం అశుద్ధం. కాని ఆత్మ అవిద్యామలరహితం; కారణశరీరం లేనిది.

అకాయమ్, అవ్రణమ్, అస్నావిరగ్మ్, శుద్ధమ్ పదాలు కలిసి ఆత్మ **శరీరత్రయరహితమ్**.

**అపాపవిద్ధమ్** – దీన్ని పాపేన అవిద్ధమ్‌గా విడదీసుకోవాలి. విద్ధం అంటే అశుద్ధం. పాపంవల్ల అశుద్ధం అయ్యేది శరీరం. పాపంతో పాటు పుణ్యం కూడా కలుపుకోవాలి. పాపం ఇనుపసంకెళ్ళు అయితే, పుణ్యం బంగారుసంకెళ్ళు. పుణ్యంలో దుఃఖం దాగి ఉంటుంది. ఆత్మ పుణ్యపాప అతీతం.

**స విద్వాన్ పుణ్యపాపే విధూయ** –

జ్ఞాని పుణ్యపాపాలు రెండింటినీ విదుల్చుకుంటాడు. జ్ఞానికి శరీరం పాపవిద్ధం అనీ, ఆత్మ అపాపవిద్ధం అనీ తెలుసు. అతను కూడా ప్రారబ్ధకర్మను తప్పించుకోలేడు, కాకపోతే నాకే ఎందుకు వచ్చిందని వాపోడు. దానికి చలించకుండా ఉండటం నేర్చుకుంటాడు.

ఇక్కడ ఒక చిన్న వ్యాకరణ సూత్రాన్ని కూడా చూద్దాము. సః పర్యగాత్ పదాలు పుంలింగ పదాలు, తర్వాత వచ్చే పదాలు కవిః మనీషీ కూడా పుంలింగ పదాలు. అలా పుంలింగ పదాలతో మొదలుపెట్టి, వాటితోనే ముగిస్తున్నది కాబట్టి ఈ మధ్యలో వచ్చే పదాలను

కూడా మనం పుంలింగ పదాలుగా మార్చుకుంటాము. నిజానికి అవి నపుంసకలింగ పదాలు. ఉపనిషత్తును తప్పు పట్టకూడదు. వాటిని ఛాందస ప్రయోగంగా తీసుకోవాలి. శుక్రమ్–శుక్రః; అకాయమ్–అకాయః; అవ్రణమ్–అవ్రణః; అస్నావిరగమ్–అస్నావిరః; శుద్ధమ్–శుద్ధః; అపాపవిద్ధమ్–పాపవిద్ధఃగా మార్చుకుంటాము.

**కవిః** – కవి అంటే కవితలు రాసేవాడు కాదు. సర్వబుద్ధి ప్రకాశకత్వాత్ సర్వజ్ఞః. అన్నీ తెలిసినవాడు.

**నాన్యోఽతోఽస్తి ద్రష్టా** – బృహదారణ్యకమ్ 3.7.23

ఈ ఆత్మ చైతన్యం కంటే అదనంగా ఇంకా చూసేవాడు లేడని అర్థం.

**మనీషీ** – మనసః ఈశితా – మనస్సును నియంత్రించే సాక్షిచైతన్యం. మనసు అంటే అన్ని అంగాలను తీసుకోవాలి. అన్ని అంగాలకూ అధిపతి సర్వేశ్వరుడు.

**పరిభూః** – పరి అంటే ఉపరి అంటే అన్నింటికీ పైన; భూః అంటే ఉండేది. సర్వాతీతం. అధిష్ఠాన దేవతలకు అధిష్ఠాన దేవత హిరణ్యగర్భ; హిరణ్యగర్భకు కూడా అధిష్ఠాన దేవత ఆత్మ. పరిభూ అంటే భిన్నాలకు అతీతం, దేశ కాలాలకు అతీతం. ధర్మాధర్మాలకు అతీతం. అంటే ఆకాశంలాగా అసంగం అని చెప్పవచ్చు. అందువల్ల సర్వ అధిష్ఠానం లేదా సర్వాతీతం.

**స్వయంభూః** – అన్నీ తానే అయి ఉన్నది. సర్వాత్మకం. స్వయం ఏవభవతి ఇతి స్వయంభూః– అంటే పుట్టుక లేనిది. **నిత్యం**, అకార్యం. అన్నింటికి ఆత్మ కారణం కాని, ఆత్మ కార్యం కాదు. సర్వకారణ అకార్యం. ఇంకో విధంగా చెప్పాలంటే కార్యకారణ సంఘాత రహితం. కాని ఆత్మను కారణంగా వర్ణించేటప్పుడు మాయాసహిత ఆత్మ అనాలి; అంటే సగుణ ఈశ్వరుడు. సగుణ ఈశ్వరుడు సృష్టి చేశాడు. ఎవరిని? ప్రజాపతులను.

**సమాభ్యః** – సమా అంటే సంవత్సరాలు.

**జిజీవిషేచ్ఛతగ్ం సమాః** – ఈశావాస్యమ్ 2

వంద సంవత్సరాలు జీవించాలని కోరుకో అంటున్నది. కాని ఇక్కడ సమా అంటే ప్రజాపతులని అర్థం.

**సంవత్సరో వై ప్రజాపతిః** – ప్రశ్న

ప్రజాపతులంటే అందరు దేవతలకు దాన్ని ఉపలక్షణంగా తీసుకోవాలి.

**శాశ్వతీభ్యః** – శాశ్వతీభ్య అంటే కాలాతీతం అని కాదు, కల్పాంతం వరకూ ఉంటారని అర్థం. అంటే ఆపేక్షిక శాశ్వతత్వంగా తీసుకోవాలి.

**అర్థాన్** – అర్థం పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. అర్థం ఒక అర్థం. ఇక్కడ కర్తవ్యాని అని అర్థం. అంటే ఈ ప్రజాపతులకు ఆత్మ కర్తవ్యాలను విధిస్తున్నది. దేన్ని ఆధారంగా తీసుకుని?

**యథాతథ్యత్** – వారు చేసుకున్న పుణ్యాలను ఆధారంగా చేసుకుని ఇస్తుంది. దేవతలలో కూడా తారతమ్యాలు ఉంటాయి. ఇంద్రుడొక్కడే ఐరావతాన్ని వాడగలడు. ఇవన్నీ పదవులు. ఆయా పదవులను వారి పుణ్యాన్నిబట్టి ఇవ్వటం జరుగుతుంది. ఆత్మ ఇస్తుంది అంటే మాయాసహిత ఈశ్వరుడు అని అర్థం చేసుకోవాలి.

**వ్యదధాత్** – విధించాడు. ఈ మొత్తం వాక్యం కలిపితే ఈశ్వరుడు ఈ దేవతలకు వారివారి పుణ్యాలను బట్టి, వారికి కర్తవ్యాలను విధించాడు. ఆత్మ సర్వవిధాత.

ఈ విధంగా ఈ మంత్రంలో సోపాధిక, నిరుపాధిక లక్షణాలు చూశాము.

**నిరుపాధిక లక్షణాలు**

| | |
|---|---|
| పర్యగాత్ | – సర్వవ్యాపకం |
| శుక్రమ్ | – స్వయంజ్యోతి ప్రకాశం |
| అకాయమ్, అవ్రణమ్, అస్నావిరగమ్, శుద్ధమ్ | – శరీరత్రయ రహితం |
| అపాపవిద్ధమ్ | – పుణ్యపాప అతీతం |
| పరిభూ | – సర్వ అతీతం |
| స్వయంభూ | – నిత్యం |

**సోపాధిక లక్షణాలు**

| | |
|---|---|
| కవిః | – సర్వజ్ఞుడు |
| మనీషీ | – సర్వేశ్వరుడు |
| అర్థాన్ వ్యదధాత్ | – సర్వవిధాత |

ఇక్కడితో జ్ఞానయోగం అయిపోయింది. ఫలం అంతకుముందు శ్లోకాల్లో చూశాము.

| | |
|---|---|
| తతో న విజుగుప్సతే | – దేన్నీ ద్వేషించడు |
| తత్ర కో మోహః కశ్శోకః | – శోక, మోహాలు ఉండవు. అజ్ఞానజనిత సంసారం ఉండదు. |

# శంకరాచార్యులవారి అవతారిక

ఇక్కడనుంచి ఉపనిషత్తు కర్మయోగం గురించి చెప్పబోతున్నది. కాని ఆ మంత్రాలలోకి వెళ్ళబోయే ముందు శంకరాచార్యులవారు వివరంగా ఉపోద్ఘాతం రాశారు. అవతారిక అంటే ఉపోద్ఘాతం. శంకరాచార్యులవారి అవతారిక భాష్యంయొక్క సారం చూద్దాము.

ఉపనిషత్తును ప్రధానంగా నాలుగు అంశాలుగా విభజించవచ్చు. అవి –

1. జ్ఞానయోగం నిర్వచనం – మంత్రం 1
2. కర్మయోగం నిర్వచనం – మంత్రం 2
3. జ్ఞానయోగ విచారణ – మంత్రాలు 3–8
4. కర్మయోగ విచారణ – మంత్రాలు 9–18

(ఈ విభజనను మనం ముందే చూశాము. దానికి ఆధారం ఇక్కడ వచ్చిన వివరణ.)

1. **జ్ఞానయోగం నిర్వచనం – మంత్రం 1**

ఈ జగత్తు అంతా ఈశ్వరునిచేత కప్పివేయబడింది, ఎవరి సొమ్మును ఆశించకు; కోరికలను త్యజించు అనే వివరణ ద్వారా జ్ఞాననిష్ఠ చెప్పబడింది.

2. **కర్మయోగం నిర్వచనం – మంత్రం 2**

ఆత్మజ్ఞానం పొందలేని, జీవించాలని కోరుకునే వారికి కర్మ చేస్తూనే వంద ఏళ్ళు జీవించాలి, కర్మయోగం తప్ప వేరే మార్గం లేదనే వివరణ ద్వారా కర్మనిష్ఠ చెప్పబడింది.

ఈశావాస్యోపనిషత్ మంత్రోపనిషత్ అనీ, బృహదారణ్యకోపనిషత్ బ్రాహ్మణోపనిషత్ అనీ, అందువల్ల బృహదారణ్యకం ఈశావాస్యానికి భాష్యం అనీ చాలాసార్లు చూశాము. ఇక్కడ శంకరాచార్యులవారు బృహదారణ్యకోపనిషత్‌నుంచి కర్మనిష్ఠను, జ్ఞాననిష్ఠను సూచించే భాగాలను వివరిస్తున్నారు. ఈ రెండు అంశాలు కలుపుకుంటే ఈ అవతారికలో శంకరాచార్యులవారు ఆరు అంశాలను చర్చిస్తున్నారు.

**కర్మనిష్ఠ – బృహదారణ్యకంనుంచి** – అజ్ఞానికి రెండు రకాల అజ్ఞానం ఉంటుంది. ఒక అజ్ఞానం – ఆత్మ అజ్ఞానం అంటే స్వస్వరూపజ్ఞానం ఉండదు. రెండవ అజ్ఞానం – ఆత్మ అజ్ఞానం సంసారానికి కారణం అని తెలియని అజ్ఞానం.

ఆత్మజ్ఞానం మోక్షాన్ని ఇస్తే అందరూ ఎందుకు ఆత్మజ్ఞానం పొందటానికి రారు? దానికి కారణం, మనుష్యులకు ఉండే అంతులేని కోరికలు. ఆత్మజ్ఞానం సాధ్యం అవాలి, దానికి కావాల్సిన సాధన చేయాలి కాని మనుష్యులు కోరేవి వేరే ఉంటాయి.

**ఆత్మైవేదమగ్ర ఆసీత్** – బృహదారణ్యకమ్ 1.4.17

బృహదారణ్యకంలో ఒక కథలాగా వస్తుంది. ముందు ఆత్మ ఒక్కటే ఉందిట. ఇక్కడ ఆత్మ అంటే అజ్ఞాని బ్రహ్మచారి. అలా ఎలా చెప్పగలరు? ఆ ఆత్మ నాకు భార్య కావాలి, ధనం కావాలి, నేను కర్మలు చేయాలి అనుకుందిట. భార్య కావాలి అంది కాబట్టి బ్రహ్మచారి, కర్మలు చేయాలి అంది కాబట్టి అజ్ఞాని బ్రహ్మచారి కోరిక ఇది. ఇవన్నీ కలిపి సాధన ఇచ్ఛ కిందికి వస్తుంది. దీనివల్ల కలిగే సాధ్యం లోకం. అలా అజ్ఞాని కోరికలు సాధన, సాధ్యాల చుట్టూ తిరుగుతూ ఉంటాయి.

అందువల్లనే బ్రహ్మచారులు భార్య కావాలని కోరుకుంటారు. అజ్ఞాని బ్రహ్మచారి నాకు భార్య ఉంటే, పుత్రులు ఉంటే నేను పరిపూర్ణుడను అవుతాను అనుకుంటాడు అంటున్నది ఉపనిషత్తు. జాగ్రత్తగా గమనించండి, అతను భార్య, పుత్రులు ఉంటే పరిపూర్ణుడు అవుతాడు అనటం లేదు ఉపనిషత్తు; అవుతాను అనుకుంటాడు అంటున్నది. అతనికా ఒంటరితనం పరిచ్ఛేద భావనవల్ల కలుగుతున్నది.

ఈ బ్రహ్మచారికి పాంక్తబ్రహ్మ ఉపాసనను నిర్దేశించింది ఉపనిషత్తు. ఒక యజ్ఞం చేయాలంటే ఐదు అంశాలు కావాలి. అవి యజమాని, పత్ని, పుత్రుడు, మానుషవిత్తం, దైవవిత్తం. మానుషవిత్తం అంటే శరీర ఆరోగ్యం, ధనం. దైవవిత్తం అంటే ఆధ్యాత్మిక జ్ఞానం. ఈ ఐదు అంశాలను ఐదు అంగాలమీద ఉపాసన చేయాలి. పాంక్తం అంటే ఐదు.

మనస్సు–యజమాని, వాక్కు–భార్య, ప్రాణం–పుత్రుడు, కన్ను–మానుషవిత్తం, చెవి–దైవవిత్తం. మనస్సు మన జీవితాన్ని నిర్దేశిస్తుంది; వాక్కు మనస్సు చెప్పినదాన్ని చెబుతుంది, భార్య భర్త అడుగుజాడల్లో నడుచుకుంటుంది; ప్రాణం మనస్సు, వాక్కులకు ప్రాణశక్తిని ఇస్తుంది, పుత్రుడు భార్యాభర్తలకు ప్రాణం; కన్ను ద్వారా చాలా వ్యవహారాలు నడుపుతాము, అందువల్ల అది మానుషవిత్తం; చెవి ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందుతాము, అందువల్ల అది దైవవిత్తం. వీటి మీద ఉపాసన చేయాలి. ఈ ఉపాసనను ఆత్మజ్ఞానం లేనివాడై, కోరికలు కలవానికి నిర్దేశించింది ఉపనిషత్తు.

దానికి తగ్గట్టుగా, ఆ కర్మల ఫలం ఏడు అన్నాల సృష్టి. దాన్ని బృహదారణ్యకంలో సప్తాన్న బ్రాహ్మణమ్‌లో చూస్తాము (1.5.2). తీరికూర్చుని ఈశ్వరుడు ఈ జగత్తును ఎందుకు సృష్టించాడు? ఈ ప్రశ్న చాలామంది వేస్తుంటారు. ఈ సప్తాన్న బ్రాహ్మణమ్‌లో దానికి కారణం వస్తుంది. జీవుడే తను చేసే కర్మ ద్వారా, ఉపాసన ద్వారా భోగ్యప్రపంచాన్ని సృష్టించాడు. జీవుడు కర్తగా కొన్ని కర్మలు చేస్తాడు; భోక్తగా వాటి ఫలాలను అనుభవిస్తాడు. ఆ ఫలాలను జగత్తు ద్వారా అనుభవిస్తాడు.

ఈ జగత్తును ఏడు అన్నాలుగా సృష్టిస్తాడు జీవుడు. భోగ్యవిషయాన్ని అన్నం అంటారు.

ఆ ఏడు అన్నాలు –

1. మర్త్యాన్నం – మనిషి, జీవరాశులు తినే సాధారణ అన్నం
2, 3. దేవ అన్నం – దర్శపూర్ణ మాసాల్లో దేవతలకు యజ్ఞాల్లో వేసే ఆహుతులు
4. పశు అన్నం – లేగదూడలు తాగే క్షీరం

ఈ నాలుగు అన్నాలనూ కలిపి సాధన అన్నం అంటారు.

5. మనస్సు
6. వాక్కు
7. ప్రాణం

ఈ మూడు అన్నాలను కలిపి సాధ్య అన్నం అంటారు.

జీవుడు ఈ జన్మలో ఈ నాలుగు సాధన అన్నాలు ఇవ్వటమనే పుణ్యకర్మలు చేస్తే, దానివల్ల కలిగే ఫలం– వచ్చే జన్మలో మూడు సాధ్య అన్నాలు బాగుంటాయి. ఈ జన్మలో ఒకవేళ మనస్సు, వాక్కు, ప్రాణం బాగుండకపోతే, మనం ముందు జన్మలో సాధన అన్నాలు దానం చేయలేదని అర్థం. అందువల్ల ఈ జన్మలో మన రాత బాగుండకపోతే దానికి మనం ఎవరినీ నిందించనవసరం లేదు, మనని మనమే నిందించుకోవాలి.

సాధన అన్న అభావాత్ సాధ్య అన్న అభావః

ఈ ఏడు అన్నాలు (భోగ్యములు) జీవసృష్టి. కర్తగా తను చేసిన పనులకు భోక్తగా అనుభవిస్తాడు. ఈ కర్తృత్వ, భోక్తృత్వాలే తన స్వరూపమనే భావనతో ఉంటాడు. ఇదే సంసారం.

**జ్ఞాననిష్ఠ – బృహదారణ్యకంనుంచి**

కర్మ గురించి బృహదారణ్యకంలో చెప్పినదానిని వివరించినట్టుగానే, ఇప్పుడు దానికి భిన్నంగా జ్ఞానం గురించి బృహదారణ్యకం ఏం చెబుతున్నదో వివరిస్తున్నారు శంకరాచార్యుల వారు. అక్కడ అజ్ఞానీ బ్రహ్మచారి భార్య కావాలి, పుత్రులు కావాలని కోరుకుంటే ఇక్కడ జ్ఞానీ సన్న్యాసి పుత్రులు ఎందుకని ఎదురు ప్రశ్నిస్తాడు శారీరక బ్రాహ్మణమ్‌లో.

**కిం ప్రజయా కరిష్యామః** – బృహదారణ్యకమ్ 4.4.22

పిల్లలవల్ల ఏం చేస్తాము అని అర్థం. అంటే ఇక్కడ పిల్లలు సరిగ్గా చూడటం లేదని తిట్టటం కాదు.దీన్ని ఆక్షేపార్థే (రిటారికల్ క్వశ్చన్) అంటారు. పిల్లలు వద్దు అంటున్నాడు. ఇది అర్థం చేసుకోవటానికి, మళ్ళీ కర్మకాండలోకి వెళదాము.

**పుత్రేణ అయంలోకః జయ్య కర్మణా పితృలోకః విద్యయా దేవలోకః** – బృహదార్యణకమ్

పుత్రులు ఉన్నవారు మనుష్యలోకంలో పుడతారు, యజ్ఞకర్మలు చేసినవారు స్వర్గలోకానికి వెళతారు, ఉపాసనలు చేసినవారు బ్రహ్మలోకానికి వెళతారు. ఈ సూత్రం కర్మకాండలో చూస్తాము. కాకపోతే వీటికి కూడా షరతులు వర్తిస్తాయి. ఆ విషయం పక్కన పెడితే, అజ్ఞాని ఈ సాధనల ద్వారా ఈ లోకాలనే సాధ్యాలను పొందుతాడు. కాని జ్ఞాని ఈ మూడు కోరికలూ వదులుకుని, పైకి ఎదుగుతాడు.

**తే హ స్మ పుత్రైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయ**

ఏషణ అంటే కోరిక. అతను పుత్రులు కావాలనే కోరికను, విత్తం కావాలనే కోరికను, లోకానికి వెళ్ళాలనే కోరికను వదులుకుంటాడు. ఈ సాధనలు వదులుకుంటాడు అంటే సాధ్యాలమీద కోరిక లేదు. పుత్రుల ద్వారా మనుష్యలోకంలో పుట్టాలని లేదు; ధనం సంపాదించి, తద్వారా కర్మలు చేసి స్వర్గలోకానికి వెళ్ళాలని లేదు, ఉపాసన చేసి బ్రహ్మలోకానికి వెళ్ళాలనీ లేదు. అందువల్లనే కిం ప్రజయా కరిష్యామిః అంటాడు. అక్కడ తక్కిన రెండూ కూడా కలుపుకోవాలి. పుత్రులు ఎందుకు, ధనం ఎందుకు, లోకం ఎందుకు? ఈ లోకాలకు వెళ్ళాలని లేకపోతే మరి ఏ లోకానికి వెళతావు అని జ్ఞానిని అడిగితే, అతని జవాబు –

**యేషాం నోఽ యమాత్మాఽ యం లోక ఇతి**

ఆత్మలోకానికి వెళతాను అంటాడు. ఆత్మలోకం అంటూ విడిగా లోకం లేదు. ఇంతవరకూ లోకాల గురించి వచ్చింది కాబట్టి ఇక్కడ కూడా లోకం మాట వచ్చింది అంతే. స్వయం ప్రకాశక ఆత్మజ్ఞానం పొంది, ఆ ఆత్మను నేనే అని అర్థం చేసుకుంటాను అంటాడు. అతను ఆశ్రమజీవనంలో మూడు దశలు దాటి, ఈ దశకు వస్తాడు.

తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి – వేదాధ్యయనం చేస్తాడు – బ్రహ్మచర్య ఆశ్రమంలో

యజ్ఞేన దానేన – యజ్ఞాలు, దానాలు చేస్తాడు – గృహస్థాశ్రమంలో

తపసా అనాశకేన – తపస్సు, భిక్షాటనం చేస్తాడు – వానప్రస్థాశ్రమంలో

ఏతమేవ విదిత్వా మునిర్భవతి – ఆత్మజ్ఞానం కోరి సన్న్యసిస్తాడు – సన్న్యాసాశ్రమంలో

3. **జ్ఞానయోగ వివరణ – మంత్రాలు 3–8**

ఈశావాస్యోపనిషత్‌లో అజ్ఞానుల నింద ద్వారా జ్ఞానయోగం చెప్పబడింది. వారిని **ఆత్మహనోజనాః** అంది. దాని తర్వాత ఆత్మ నిర్వచనాలు వస్తాయి. అందులో కొన్ని ఆత్మ ఏకం, సర్వగతం, రూపద్వయం, సర్వఅధిష్ఠానం, సర్వాతీతం, శరీరత్రయ విలక్షణం. ఈ ఆత్మ స్వరూపాన్ని జిజ్ఞాసువులు మాత్రమే తెలుసుకోగలరు. కోరికలు ఉన్నవారు కాదు.

**తే హి అత్ర అధికృతాః న కామినః ఇతి** – శ్వేతాశ్వతరోపనిషత్

వారు కర్మయోగమార్గాన్ని పాటించాలి. ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం– శోక, మోహాలు ఉండవు; అభద్రతా భావన ఉండదు. ఈ పరమ పవిత్రమైన జ్ఞానాన్ని సన్న్యాసాశ్రమంలో ఉన్నవారికి మహర్షులు బోధించారు అని చెప్పటం ద్వారా కర్మఠులనుంచి విడదీసి, జ్ఞాననిష్ఠ చెప్పబడింది.

4. **కర్మయోగ వివరణ – మంత్రాలు 9–18**

దీనికి భిన్నంగా ఎవరైతే కర్మయందు నిష్ఠగల కర్మఠులై ఉంటారో, కర్మను చేస్తూనే జీవించాలని కోరుకుంటారో, వారికి కర్మయోగం చెప్పబడింది.

**సముచ్చయ ఖండన** – ఇది కర్మనిష్ఠులకే కాని జ్ఞాననిష్ఠులకు కూడా కాదని ఎలా చెప్పగలరు అని పూర్వపక్షులు ప్రశ్నిస్తున్నారు.

**జవాబు 1 – క్రియాకారక ఫలరూప ద్వైత త్యాగః** – వైరాగికి ఆత్మ ఏకత్వ విజ్ఞానం చెప్పబడింది. సాధ్యసాధన భేదాన్ని నిషేధించటం ద్వారా ద్వైతనిషేధం బోధించబడింది. ద్వైతనిషేధం చేస్తే సముచ్చయం కుదరదు.

బ్రహ్మసూత్రాల్లో జ్ఞానకర్మ సముచ్చయం చేయలేమని అనేక వాదనలు వస్తాయి. అందులో ఒక వాదన సముచ్చయం అవసరం లేదు, కుదరదు. అసాధ్యం అని వస్తుంది.

అవసరం లేదు – జ్ఞానాదేవ తు కైవల్యమ్ – జ్ఞానంవల్లనే మోక్షం

కుదరదు – న కర్మణా న ప్రజయా ధనేన – కర్మవల్ల, పుత్రులవల్ల, ధనంవల్ల మోక్షం రాదు

అసాధ్యం – నేహ నానాస్తి కించన – ద్వైతభావన, కర్తృత్వభావన ఉండదు.

2. **ఉపాసన, జ్ఞానసముచ్చయం కుదరదు** – ఉపాసన కర్మజాతికే చెందుతుంది. కాయిక, వాచిక కర్మలు కర్మయోగంలోకి వస్తే, మానసిక కర్మలు ఉపాసనయోగంలోకి వస్తాయి. ఉపాసన కూడా కర్మకాండలోనే చెప్పబడుతుంది. కర్మకు కర్త–కారణం–కర్మ ఉన్నట్లే ఉపాసనకు ఉపాసకుడు–ఉపాస్యదేవత–కారణం ఉంటాయి. నిజానికి వేదాంతం ప్రకారం కర్మ, ఉపాసన ఒకటే. అందువల్ల జ్ఞానాన్ని ఈ రెండింటితోనూ సముచ్చయం చేయలేము. సముచ్చయం చేసి తీరాలంటే సమ సముచ్చయం కుదరదు, క్రమ సముచ్చయం చేయాలి. క్రమ సముచ్చయం అంటే ఒకదాని తర్వాత ఇంకొకటి చేయాలి. అది కూడా కర్మ తర్వాత ఉపాసన, తర్వాత జ్ఞానం – ఇదీ క్రమపద్ధతి.

3. **విద్య అంటే జ్ఞానం కాదు** – ఇప్పుడు రాబోయే కర్మయోగ వివరణ మంత్రాల్లో విద్య అనే పదం వాడింది ఉపనిషత్తు. పైగా విద్య, అవిద్యల సముచ్చయం చేయాలని చెప్పింది. అంటే జ్ఞానకర్మల సముచ్చయం చేయమని చెప్పినట్లేగా అంటారు పూర్వపక్షులు.

విద్యకు రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి ఆత్మజ్ఞానం, రెండు ఉపాసన. ఉపాసన కర్మజాతికి చెందింది కాబట్టి ఇక్కడ ఉపనిషత్తు కర్మ, ఉపాసనల సముచ్చయం బోధిస్తున్నది కాని కర్మ, జ్ఞానాల సముచ్చయం కాదు.

విద్యకు రెండు అర్థాలు ఉంటే, మీరు ఉపాసన అర్థం తీసుకుంటే, మేము జ్ఞానం అర్థం తీసుకుంటాము, తప్పేముంది అంటారు పూర్వపక్షులు. దానికి జవాబు – శ్రుతి విద్య అనే పదం వేసి వదిలివేస్తుంది. దాని అర్థమేమిటో భాష్యకారులే చెప్పాలి. సందర్భాన్నిబట్టి అర్థం మారుతుంది.

ఇక్కడ సందర్భం కేవల కర్మ, కేవల ఉపాసనల నింద జరుగుతున్నది. ఎందుకు? సముచ్చయ స్తుతికోసం. సముచ్చయానికి ఇక్కడ ప్రాధాన్యత ఉన్నప్పుడు దేన్ని దేనితో కలపాలో అదే తీసుకోవాలి. దానికి శ్రుతి, యుక్తి ప్రమాణాలు తీసుకోవాలి. కర్మ, ఉపాసనలు రెండూ కర్మలోకే వస్తాయి. బ్రహ్మవిద్య కర్మ విరోధి. ఉపాసనను దైవవిత్తం అంటారు. దైవవిత్తం కర్మతో కలుస్తుంది కాని జ్ఞానంతో కాదు. కర్మతో సముచ్చయాన్ని స్వీకరిస్తే సన్న్యాసాశ్రమానికి చోటులేదు. ఎందుకంటే కర్మ చేయటానికి భార్య ఉండాలి.

**ఉపాసనవల్ల ఆత్మజ్ఞానం కలగదు** – ఉపాసన అంటే ఆత్మజ్ఞానం అనవచ్చు కదా అంటారు పూర్వపక్షులు.

**బ్రహ్మవిదాప్నోతి పరమ్ –** తైత్తిరీయమ్

అక్కడ బ్రహ్మ ఉపాసన అప్నోతి పరమ్‌గా మార్చుకోవాలి అంటారు వారు.

కాని ఉపాసన ఫలం పరిచ్ఛిన్నఫలం. ఉపాసన చేస్తే బ్రహ్మలోకానికి వెళితే, జ్ఞానం పొందితే మోక్షం పొందుతారు.

**విద్యయా దేవలోకః** – బృహదారణ్యకమ్

**బ్రహ్మవిదాప్నోతి పరమ్** – తైత్తిరీయమ్

దీనితో జ్ఞానకర్మ సముచ్చయ ఖండన అయిపోయింది. శంకరులవారి అవతారిక అయిపోయింది.

## 4. కర్మయోగం వివరణ మంత్రాలు 9-18: ఉపోద్ఘాతం

కర్మయోగం వివరణను మళ్ళీ మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి -

ఎ) కర్మ ఉపాసన సముచ్చయం - మంత్రాలు 9-11
బి) ఉపాసనాద్వయ సముచ్చయం - మంత్రాలు 12-14
సి) గతిప్రార్థన - మంత్రాలు 15-18

ముందు మంత్రంలో జ్ఞానయోగం వివరణ అయిపోయింది. ఇప్పుడు రెండవ మార్గం అయిన ప్రవృత్తిమార్గం వివరణ వస్తున్నది. ఈ కర్మయోగాన్ని వేదపూర్వభాగంలో చూస్తాము. దాన్ని పూర్వమీమాంస అనీ, కర్మకాండ అనీ అంటారు.

కర్మకాండలో అనేక కర్మలు వస్తాయి. అవి సకామంగా చేస్తే లౌకిక విజయాలు పొందుతారు. ధనం, ధాన్యం, బహు పుత్రలాభం అంటూ ఫలంలో వస్తాయి. అవే కర్మలను నిష్కామంగా చేస్తే ఆధ్యాత్మిక ఎదుగుదల ఉంటుంది. జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది.

మనం చేసే కర్మలను మూడు రకాలుగా విభజించవచ్చు. వాటిని కాయిక, వాచిక, మానసిక కర్మలు అంటారు. కాయిక, వాచిక కర్మలను కర్మయోగంగానూ, మానసిక కర్మలను ఉపాసనయోగంగానూ విభజించవచ్చు. రెండూ కలిపి కర్మకాండలోకి వస్తాయని చూశాము. నిజానికి కేవలకర్మకు వేరే ఫలాలు ఉంటాయి, కేవల ఉపాసనకు వేరే ఫలాలు ఉంటాయి. కేవల కర్మ అంటే ఉపాసనా రహితకర్మ, కేవల ఉపాసన అంటే కర్మరహిత ఉపాసన. ఈ ఉపనిషత్తు ఈ రెండూ కలిపి చేయమని బోధిస్తున్నది.

నిజానికి మన సాంప్రదాయంలో మనం చేసే ప్రతి కర్మ అనుష్ఠానంలోనూ ఉపాసన సముచ్చయం ఉంటూనే ఉంటుంది. బ్రహ్మచారి ప్రతిరోజూ చేసే సంధ్యావందనంలో కాయిక కర్మ ఉంటుంది, మానసికంగా గాయత్రీ ఉపాసన ఉంటుంది.

అలాగే విష్ణుసహస్రనామ పారాయణం చేసేటప్పుడు, ముందు ధ్యానశ్లోకాలు ఉంటాయి. క్షీరోదన్వత్ప్రదేశే అని మొదలవుతుంది. దాన్ని కూడా మనం గడగడా చదివేస్తాము కాని, ఆ ధ్యానశ్లోకాలను మనస్సులో చదువుకుని, అందులో వర్ణించిన విష్ణుమూర్తి రూపాన్ని మనస్సులో ఊహించుకుని, అప్పుడు ఆయన సహస్రనామాలు చదవాలి. ఇదే సూత్రం లలితాసహస్రనామ పారాయణానికి కూడా వర్తిస్తుంది. అలా మనకు మన నిత్యపూజల్లోనే కర్మ, ఉపాసనల సముచ్చయాన్ని కలబోసింది మన శాస్త్రం.

**యదేవ విద్యయా కరోతి శ్రద్ధయా ఉపనిషదా**
**తదేవ వీర్యవత్తరం భవతి** - ఛాందోగ్యమ్

ఎవరైతే కర్మ, ఉపాసనల సముచ్చయం చేస్తారో వారు ఇంకా అధికఫలం పొందుతారని ఛాందోగ్యంలో వస్తుంది. సముచ్చయం అంటే కలిపి చేయటం. ఆ కలపటం మన ఇష్టానుసారం కాదు, శాస్త్రం విధించినట్టుగా చేయాలి.

కర్మ అంటే శాస్త్రవిహితకర్మలు చేయాలి, మన రాగద్వేషాలతో కూడిన కర్మలు కాదు. రాగద్వేషాలతో కూడిన కర్మలను ప్రాకృతం కర్మలు అనీ, అలాంటి కర్మలు చేసే వ్యక్తిని ప్రాకృత పురుషుడనీ అంటారు. ఉపాసన అంటే సగుణ ఈశ్వరధ్యానం. అది ఇష్టదేవతమీద చేసే ధ్యానం. రాముడు, కృష్ణుడు, దేవీ, హనుమంతుడు ఎవరైనా కావచ్చు. నిర్గుణ బ్రహ్మమీద ధ్యానం చేస్తే దాన్ని ఉపాసన అనరు, దాన్ని నిదిధ్యాసనం అంటారు. శ్రవణ, మననాల ద్వారా, ఆచార్యబోధ ద్వారా శాస్త్రఅధ్యయనం చేసి, ఆత్మజ్ఞానం పొందాక, జ్ఞాననిష్ఠలో నిలబడటానికి చేస్తారు నిదిధ్యాసనాన్ని. అందువల్ల ఇక్కడ ఉపాసన అంటే సగుణ ఉపాసన. ఉపాసన కేవలం మానసపూజ. ఇందులో శరీరం, వాక్కు పనిచేయవు. కర్మ శారీరక తమోగుణాన్ని నాశనం చేస్తే, ఉపాసన మానసిక తమోగుణాన్ని నాశనం చేస్తుంది.

కర్మ, ఉపాసన సముచ్చయం చేయించటంకోసం ఉపనిషత్తు నహినిందా న్యాయాన్ని ఎన్నుకుంది. ఈ నహినిందా న్యాయాన్ని ఈ ఉపనిషత్తులోనే మూడవమంత్రంలో చూశాము.

**అసుర్యా నామ తే లోకాః అంధేన తమసాఽ ఽ వృతాః**

అజ్ఞానులు చీకటి లోకాలకు వెళతారని, వారిని అసురులనీ అన్నది అక్కడ. అక్కడ అజ్ఞాన నింద ద్వారా జ్ఞానాన్ని స్తుతించింది.

**నిందా నిందార్థం న ప్రవృత్తా పరంతు అన్యస్తుత్యర్థం ప్రవృత్తా**

ఇది సూత్రం. ఒకదాన్ని నిందించటం దాని తాత్పర్యం కాదు, ఇంకొకదాన్ని స్తుతించటం కోసం అలా చేస్తుంది. ఈ నహినిందా న్యాయాన్ని భగవద్గీతలో, తక్కిన ఉపనిషత్తుల్లో కూడా చూస్తాము.

**న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః న, చ క్రియాభిర్న తపోభిరుగ్రైః ।** – గీత 11.48

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥** – గీత 18.5

యజ్ఞదాన తపస్సులను, భక్తికోసం ముందు నిందించింది గీత; తర్వాత యజ్ఞదాన తపస్సులు శ్రేష్ఠమైనవి అన్నది.

ఇక్కడ కూడా కేవలకర్మ చేసినవారు చీకటిలోకాలకు వెళతారని, కేవల ఉపాసన చేసినవారు ఇంకా చీకటి లోకాలకు వెళతారనీ మంత్రం 9లో చెప్పాక, వాటికి వాటి ఫలాలు భిన్నంగా

ఉన్నాయని మంత్రం 10లో చెప్పాక, తర్వాత కర్మ ఉపాసన సముచ్చయం, దాని ఫలం మంత్రం 11లో చెబుతుంది. ఈ నేపథ్యంతో మంత్రాలు చూద్దాము.

**మంత్రం 9**

**అంధం తమః ప్రవిశన్తి యేఽవిద్యాముపాసతే ।**

**తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః ॥**

ఎ) **కర్మ, ఉపాసన సముచ్చయం – మంత్రాలు 9–11**

**అంధం తమః** – తమః అంటే చీకటి, అంధం అంటే కళ్ళు పొడుచుకున్నా కానరాని చీకటి.

**ప్రవిశంతి** – ప్రవేశిస్తారు. కారుచీకటి లోకాలలో ప్రవేశిస్తారు. ఎవరు?

**యేఽవిద్యామ్ ఉపాసతే** – ఎవరైతే కేవలకర్మలు చేస్తారో వారు కారుచీకటి లోకాలలో ప్రవేశిస్తారు. అవిద్య అంటే కర్మ అని ఏ నిఘంటువులోనూ ఉండదు. ఈశావాస్యం ప్రత్యేకతే అది. అవిద్య అంటే న విద్య అని తీసుకోవాలి. దాన్ని విరోధి అర్థం అంటారు.

**విద్యాయాః అన్యా అవిద్యా**

అవిద్య అంటే అజ్ఞానం, కర్మ అని రెండు అర్థాలు వస్తాయి. ఇక్కడ సందర్భాన్ని బట్టి కర్మ అని తీసుకోవాలి. అది కూడా కేవలకర్మగా తీసుకోవాలి. అంటే ఉపాసనరహిత కర్మ.

ఉపాసతే అంటే ఉపాసన అని కాదు అర్థం. ఉపాసనలో మనస్సు ఏకాగ్రత చూపుతుంది. అలా ఏకాగ్రచిత్తంతో కర్మ ఎవరైతే చేస్తారో.

అంతా కలిపితే అర్థం, ఎవరైతే ఏకాగ్రచిత్తంతో కేవలకర్మను చేస్తారో, వారు కారుచీకటి లోకాలకు వెళతారు.

**తతో భూయ ఇవ తే తమః (ప్రవిశంతి)** – అంతకంటే ఇంకా ఎక్కువ చీకటి లోకాలలో ప్రవేశిస్తారు. తతః అంటే దానికంటే. దేనికంటే? ఆ చీకటిలోకం కంటే; భూయః ఇంకా ఎక్కువ, చిమ్మచీకటి లోకానికి; ఇవ అంటే ఏవగా తీసుకోవాలి. ఎవరు వెళతారు?

**య ఉ విద్యాయాగ్ం రతాః** – యః అంటే ఎవరైతే; ఉ అంటే కర్మను విడిచిపెట్టి; విద్యాయాం అంటే దేవతయొక్క ఉపాసనను; రతాః – అందులో లీనమై శ్రద్ధగా చేస్తారో.

అంతా కలిపితే అర్థం, ఎవరైతే అందులో లీనమై కేవల ఉపాసనను చేస్తారో, వారు ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతారు.

ఈ మంత్రంలో విద్యా పదం ముఖ్యమైన పదం. విద్యా అంటే జ్ఞానం కాదు. ఉపాసన చేయటం. ఏవ ఇక్కడ కలుపుకోవాలి. ఉపాసనాయాం ఏవ – ఉపాసన మాత్రమే చేస్తారో.

ఈ మంత్రం సారం – **ఏకైక అనుష్ఠాన నిందా సముచ్చయ స్తుత్యర్థ్యమ్**

## మంత్రం 10

**అన్యదేవాహుర్విద్యయాఽన్యదాహురవిద్యయా।**
**ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే ॥**

ముందు మంత్రంలో కేవలకర్మను, కేవల ఉపాసనను నిందించింది ఉపనిషత్తు. ఇక్కడ కేవలకర్మఫలం, కేవల ఉపాసన ఫలం ఉన్నాయని చెబుతున్నది. ఎందుకలా చెబుతున్నది? కర్మ, ఉపాసనలను సముచ్చయం చేయాలంటే వాటికి విడిగా ఫలం ఉండాలి. విడిగా అనుష్ఠానం చేయగలిగినదాన్ని అంగీ అనీ, అలా విడిగా చేయలేని దానిని అంగం అనీ అంటారు.

ఉదాహరణకు కేవలకర్మకు ఫలం లేదు అనుకోండి, అది స్వతంత్రం అవలేదు. కేవల ఉపాసనకు ఫలం ఉంటే, కేవలకర్మ, కేవల ఉపాసనకు అంగం అవుతుంది. దానికి న్యాయం ఇది –

**ఫలవతే సన్నిధే అఫలం తదంగం**

ఫలం లేనిది ఫలం ఉన్నదానితో కలిస్తే దాన్ని సముచ్చయం అనరు.

**అంగ అంగినోః సముచ్చయః న భవతి**
**అంగి ద్వయయోః సముచ్చయః భవతి**

తైత్తిరీయంలోని శీక్షావల్లిలో వ్యాహృతి ఉపాసన అనువాకం 5లో వస్తుంది. దానికి ఫలం చెప్పలేదు. దాని తర్వాత వచ్చిన హిరణ్యగర్భ ఉపాసనతో కలిపి దాన్ని చేయాలి. అలా ఒక నిష్ఫలకర్మ + ఫలకర్మ చేయాలంటే అవి రెండూ పక్కపక్కనే సన్నిహితంగా ఉండాలి. దాన్ని అంగ అంగీ ఉపాసన అంటారు.

కాని ఇప్పుడు మనం చూడబోయేది కర్మ, ఉపాసనల సముచ్చయం. అందువల్ల వాటికి వేరేవేరే ఫలాలు ఉన్నాయి అంటున్నది ఉపనిషత్తు.

**అన్యత్** – పృథగ్ అంటే భిన్నఫలం లేదా స్వతంత్రఫలం.

**ఏవ విద్యయా** – ఉపాసనవల్ల ఫలం వేరే వస్తుంది.

**ఇతి ఆహుః** – అని చెబుతున్నాయి.

ఆ ఫలమేమిటో ఇక్కడ చెప్పలేదు. మనం వేరే చోటినుంచి తెచ్చుకుంటాము.

**విద్యయా దేవలోకః** – బృహదారణ్యకమ్
**విద్యయా తదారోహంతి** – శతపథ బ్రాహ్మణమ్

ఉపాసన చేసినవారు బ్రహ్మలోకానికి వెళతారు.

**అన్యత్ ఆహుః అవిద్యయా** – కర్మవల్ల ఫలం వస్తుంది అని అంటున్నారు. దానికి కూడా ఫలం మనం కలుపుకుంటాము.

**కర్మణా పితృలోకః** – బృహదారణ్యకమ్
**న తత్ర దక్షిణాయంతి** – శతపథ బ్రాహ్మణమ్

కర్మ చేసినవారు స్వర్గలోకానికి వెళతారు. దక్షిణాయన మార్గంలో వెళ్ళేవారు ఆ లోకానికి వెళ్ళరు అంటే బ్రహ్మలోకానికి వెళ్ళరు.

కర్మ, ఉపాసనల ఫలం సానుకూలంగా చూస్తే కర్మ చేసినవారు స్వర్గలోకానికి వెళితే, ఉపాసన చేసినవారు అన్నిటికన్నా ఎక్కువ లోకమైన బ్రహ్మలోకానికి వెళతారు. అంటే ఉపాసన ఫలం ఇంకా ఎక్కువ. అలా వాటి ఫలం వాటికి ఉంది. వాటికి నిజంగా ఫలం లేకపోతే కర్మకాండ భాగం అప్రమాణం అయిపోతుంది. అందువల్ల వాటి ఫలాలను ఉపనిషత్తే స్తుతిస్తుంది కాని అక్కడే ఆగిపోవద్దు, జ్ఞానమార్గానికి రండి అంటున్నది. రానివారిని ఇక్కడ నిందిస్తున్నది.

కర్మ, ఉపాసనల ఫలాలను ప్రతికూలంగా చూస్తే కర్మఫలంకన్నా, ఉపాసనఫలం ఇంకా ఎక్కువ చీకటిలోకాలు అంటున్నది. ఎందుకు? ఈ లోకాలలో ఆటపాటలు, ఆనందమే ఉంటాయి. సుఖాలలో తేలిపోతుంటారు. ఆత్మజ్ఞానానికి ఆస్కారమే ఉండదు.

**పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః**
**తస్మాత్ పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్** – కఠ

ఇంద్రియాలు బాహ్యాముఖంగా ఉన్నాయి కాబట్టి అవి అంతర్ముఖం అవవు అని వస్తుంది అందులో. భూలోకంలో అన్ని కష్టాల మధ్య ఉంటేనే అంతర్ముఖం అవకపోతే, బ్రహ్మలోకంలో సుఖాల్లో తేలియాడుతుంటే, ఇంక ఆత్మజ్ఞానం కోరేదెక్కడ? అందువల్ల ఆ లోకాలను చిమ్మచీకటి లోకాలనీ, ఇంకా ఎక్కువ చీకటిలోకాలనీ అంటున్నది ఉపనిషత్తు. పైగా ఇది మేము చెప్పలేదు, మాకు మా గురువులు చెప్పారు అంటున్నది.

**ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే** – ఇది మాకు మా గురువులు ఇంతకుముందు చెప్పారు. ఇతి అంటే ఈ విధంగా అంటే కర్మకు వేరే ఫలం ఉంది, ఉపాసనకు వేరే ఫలం ఉంది అని,

(వయం) శుశ్రుమ – మేము విన్నాము. ధీరాణాం – ఋషులనుంచి విన్నాము. వారు ఆత్మజ్ఞానులు కానవసరం లేదు. కర్మ, ఉపాసనల గురించి తెలిస్తే చాలు.

యే అంటే ఆచార్యులు; నః అంటే మాకు, తత్ విచచక్షిరే – వాటి గురించి వివరించి చెప్పారు. ఇలా చెప్పటంలోని ఉద్దేశ్యం ఈ సముచ్చయ అనుష్ఠానం కాని, దాని ఫలం కాని

మా స్వంతం కాదు, ఏదో మాకు తోచింది చెప్పటమూ లేదు. ఇది గురుపరంపరగా వస్తున్నది. ఉపనిషత్‌లోని గురువులు, మా గురువులు మాకు చెప్పారు అంటే మన అద్వైత వేదాంతం ఎంత పురాతనమైనదో ఆలోచించండి. వేదాలు (ఉపనిషత్తులు) ఎప్పుడు వచ్చాయో తెలియదు. అందులోని బోధను అంతకుముందు గురువులు చెప్పారు అంటేనే ఇది ఎంతో సనాతనమైన సంప్రదాయం అని తెలుస్తున్నది.

ఈ మంత్రం సారం – **సముచ్చయార్థం అవతారిక**

## మంత్రం 11

**విద్యాం చావిద్యాం చ యస్తద్వేదోభయగ్ం సహ ।**
**అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే ॥**

మంత్రం తొమ్మిది ఏక అనుష్ఠాన నింద చేస్తే, మంత్రం పది ఏ అనుష్ఠానానికి ఆ ఫలం ఉందని నిరూపించింది. అంటే సముచ్చయం చేయటానికి మార్గాన్ని సుగమం చేసింది. నహినిందా న్యాయం వాడింది. కర్మ, ఉపాసనలు రెండూ రెండు అంగీలు అని నిరూపించింది, వాటికి భిన్నఫలాలను చెప్పటం ద్వారా. కాని ఈ మూడు మంత్రాల్లో ఏ మంత్రంలోనూ ఉపనిషత్తు కర్మ, ఉపాసన పదాలు వాడలేదు. కర్మకు అవిద్య పదం వేసింది; ఉపాసనకు విద్య పదం వేసింది. ఇప్పుడు సముచ్చయం గురించి చెప్పబోతున్నది.

**యస్తద్వేదోభయగ్ం సహ** – దానికి అన్వయం యః తత్ వేద ఉభయగ్ం సహ.

తత్ వేద అంటే దాన్ని తెలుసుకుని, ఆచరిస్తారో. ఎవరైతే ఈ రెండింటి గురించి తెలుసుకుని ఆచరిస్తారో. ఏ రెండూ?

**విద్యాం చ అవిద్యాం చ** – శాస్త్రీయ ఉపాసన, శాస్త్రీయ కర్మ గురించి తెలుసుకుని ఆచరిస్తారో; ఎలా?

**సహ** – రెండింటినీ సముచ్చయం చేసి అనుష్ఠిస్తారో. సహ పదం చాలా ముఖ్యమైన పదం. అది సముచ్చయాన్ని సూచిస్తుంది.

మనం ముందే చూశాము, మన శాస్త్రం ఎక్కడికక్కడ మనకు కర్మ, ఉపాసనల సముచ్చయం నేర్పిస్తూనే ఉంది. ఏ పూజ చేయాలన్నా,

**శుక్లాంభరదరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్**

ప్రార్థనతో మొదలవుతుంది. అది నరాలను శక్తివంతం చేస్తుంది. తర్వాత,

**ఓం భూః ఓం భువః ఓం సువః**

అంటూ ప్రాణాయామం చేయాలి. అది మనస్సును సిద్ధం చేస్తుంది. ఏ కర్మ చేయాలన్నా కూడా శరీరం, మనస్సు సంసిద్ధంగా ఉండాలి. వాటికి పైన చెప్పిన అంశాలు తోడ్పడతాయి.

సముచ్చయం చేస్తే కలిగే ఫలమేమిటి?

**అవిద్యయా మృత్యుం తీర్త్వా** – అక్షరాలా చూస్తే కర్మ చేస్తే మృత్యువును జయిస్తారు. కర్మ అంటే అగ్నిహోత్రాది కర్మ. నిజంగా కర్మతోనే మృత్యువును జయించగలిగితే, ఎవరూ ఉపాసనకూ, ఆ తర్వాత వచ్చే జ్ఞానానికీ రారు. అయితే దీని అర్థం ఏమిటి? ప్రాకృత పురుషుడు కాస్తా సంస్కృత పురుషుడు అవుతాడు.

ప్రాకృత పురుషుడు చేసే కర్మలను ప్రాకృతకర్మ అనీ, స్వాభావికకర్మ అనీ అంటారు. అతని కర్మలు అతని రాగద్వేషాలకు తగ్గట్టుగా ఉంటాయి. అటువంటి వ్యక్తిని కామవాదః కామచారః కామభక్షః అంటారు.

**కామవాదః** – నోటికి ఏది వస్తే అది మాట్లాడతాడు, ముందు వెనకలు ఆలోచించడు.

**కామచారః** – మనస్సుకు ఏది తోస్తే అది చేస్తాడు. ధర్మాధర్మాలు ఆలోచించడు.

**కామభక్షః** – కడుపుకు ఏది తినాలనిపిస్తే అది తింటాడు. ఆహార నియమాలు ఆలోచించడు.

ఇటువంటి వ్యక్తి సంసారంనుంచి సంసారంలో పడి తిరుగుతుంటాడు. దీన్ని పశుప్రవృత్తి అంటారు. పశువులు అలా ప్రవర్తిస్తే తప్పులేదు కాని మనిషి బుద్ధిజీవి. అతను ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకోవాలి. పశుప్రవృత్తినుంచి మనుష్యప్రవృత్తికి ఎదగాలి. ఉపనయనం అయి, విద్యాభ్యాసం చేసే వ్యక్తిని ద్విజుడు అంటారు. అతను రెండోసారి పుట్టినవాడు అవుతాడు. ఎందుకంటే వైదిక సాంప్రదాయం తెలుసుకుని, సంస్కృత పురుషుడు అవుతాడు.

మన సాంప్రదాయం మన జీవితంలో అడుగడుగునా భక్తిని నూరిపోసింది. పొద్దున్న లేస్తూనే భూదేవిమీద కాలు మోపే ముందు, క్షమాపణ కోరాలి. పందుం పుల్లతో దంత ధావనం చేసేటప్పుడు మనస్సును కూడా శుద్ధి చేయమని కోరాలి. స్నానం చేసేటప్పుడు రుద్రాభిషేకంగా భావించాలి. ఇది స్వాభావిక కర్మను పోగొడుతుంది.

ఇది కాక, మనిషికి స్వాభావిక జ్ఞానం ఉంటుంది. అంటే అతని ఆలోచనా ప్రవాహాన్ని అరికట్టడు. బాహ్యంగా మంచివాడుగా చలామణీ అయ్యే వ్యక్తి కూడా, అతని మనస్సులోకి తొంగిచూడగలిగితే, ఎన్నో చెడు ఆలోచనలు అతనిలో రాజ్యమేలుతాయి. శాస్త్రం అలా మనస్సులో కూడా చెడు తలంపు ఉండకూడదు అంటుంది. శాస్త్రీయ వృత్తిప్రవాహం మాత్రమే ఉండాలి. మనసా, వాచా, కర్మణా ఒక్కత్రాటిమీద నడవాలి అంటుంది శాస్త్రం.

**తీర్త్వా** – అతిక్రమించి. కర్మ, ఉపాసనల సముచ్చయం చేసిన వ్యక్తికి కర్మవల్ల రెండు ఫలాలు కలుగుతాయి. స్వాభావిక కర్మనాశనం అవుతుంది, స్వాభావిక జ్ఞానం కూడా నాశనం అవుతుంది.

**విద్యయా అమృతమశ్నుతే** – అసలయితే ఉపాసనవల్ల శాశ్వతత్త్వాన్ని పొందుతాడు అని అర్థం. ఉపాసన అంటే సగుణ ఉపాసన కాని, శాశ్వతమైన ఫలం మోక్షం ఒక్కటే, అది జ్ఞానంవల్లనే వస్తుంది. దీన్ని ఆపేక్షిక అమృతత్వం అంటారు. బ్రహ్మలోకంలో ఎన్నో వందల సంవత్సరాలు ఉంటాడు. అంతేకాదు అక్కడ క్రమముక్తి పొందే అవకాశం ఉంది. క్రమముక్తి పొందితే అది అమృతత్త్వఫలమే.

ఈ సందర్భంలో ముక్తి గురించిన మూడు పదాలను చూద్దాము. అవి – జీవన్ముక్తి, విదేహముక్తి, క్రమముక్తి.

**జీవన్ముక్తి** – ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి శాశ్వతమైన మోక్షఫలాన్ని పొంది; ఇక్కడే, ఇప్పుడే సంసారంనుంచి విడివడతాడు. అంటే జీవించి ఉండగానే మోక్షం పొందుతాడు.

**విదేహముక్తి** – జ్ఞాని మరణించాక, అతనికింక పునర్జన్మ ఉండదు. అతనికి ప్రయాణమూ ఉండదు. అతని సూక్ష్మ, కారణ శరీరాలు, సూక్ష్మ, కారణ ప్రపంచాలతో శాశ్వతంగా లయమయిపోతాయి.

**క్రమముక్తి** – జ్ఞానమార్గానికి రాకుండా, జీవించి ఉన్నంతకాలం ఉపాసనను శ్రద్ధగా చేసి, బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొందితేనే అతనికి ముక్తి కలుగుతుంది. దాన్ని క్రమముక్తి అంటారు. అక్కడ జ్ఞానం పొందాక, అక్కడ ఉన్నన్నాళ్ళూ జీవన్ముక్తిని అనుభవించి, అక్కడి కాలం చెల్లిపోయాక విదేహముక్తి పొందుతాడు. ఇంక పునర్జన్మ ఉండదు. కొందరు క్రమముక్తి అంటే క్రమంగా పైలోకాల్లో ఒక్కొక్క లోకానికీ వెళ్ళి, బ్రహ్మలోకానికి వెళితే మోక్షం పొందుతారు అనుకుంటారు. అది పొరపాటు.

క్రమముక్తి పొందటం అంత తేలికైన విషయం కాదు. అందువల్ల పూజ్య స్వామీజీ హాస్యంగా చెబుతారు, బ్రహ్మలోకంలో బ్రహ్మ బోధ చేస్తాను రమ్మని ఉపనిషత్తుల బోధ మొదలుపెడితే, ' అయ్యో, అక్కడ దయానంద సరస్వతి స్వామీజీ ఇవే బోధిస్తుంటే, నేను వెళ్ళలేదు. ఇక్కడ కూడా తప్పలేదా?' అంటారుట.

ఈ రెండూ ఒకదాని తర్వాత వస్తాయి. త్వా ప్రత్యయం ఆ విషయాన్ని సూచిస్తుంది. మృత్యుం తీర్త్వా అమృతమశ్నుతే – ప్రాకృత స్వభావాన్ని అధిగమించి, అమృతత్త్వాన్ని పొందుతాడు. ఇది ఏకఫలం. ఈ ఏకఫలం కూడా సముచ్చయాన్ని సూచిస్తుంది.

ఇక్కడితో కర్మయోగంలోని మొదటి అంశం అయిపోయింది.

**బి) ఉపాసనాద్వయ సముచ్చయం – మంత్రాలు 12–14**

ఈ సముచ్చయ వివరణ కూడా ముందు సముచ్చయ పద్ధతిలోనే కొనసాగుతుంది. కేవల ప్రకృతి ఉపాసన చేసినవారు చీకటిలోకాలకు వెళతారనీ, కేవల హిరణ్యగర్భ ఉపాసన చేసినవారు ఇంకా చీకటిలోకాలకు వెళతారనీ మంత్రం 12లో చెప్పాక, వాటికి వాటి ఫలాలు భిన్నంగా ఉన్నాయని మంత్రం 13లో చెప్పాక, ఉపాసనాద్వయ సముచ్చయం, దాని ఫలం మంత్రం 14లో చెబుతుంది.

ఉపాసనాద్వయ సముచ్చయం అంటే ఏవో రెండు ఉపాసనలు కలిపి చేయకూడదు. ప్రకృతి ఉపాసన, హిరణ్యగర్భ ఉపాసన కలిపి చేయాలి. కాకపోతే ఇక్కడ ఉపనిషత్తు ఈ రెండు పేర్లను ప్రత్యక్షంగా ఇవ్వదు. అంతకుముందు కూడా కర్మను అవిద్య అనీ, ఉపాసనను విద్య అనీ అన్నట్టే, ఇక్కడ హిరణ్యగర్భకు మూడు పేర్లు, ప్రకృతికి రెండు పేర్లు వాడింది.

హిరణ్యగర్భ – సంభూతి, సంభవం, వినాశం

ప్రకృతి – అసంభూతి, అసంభవం

సంభూతి అంటే హిరణ్యగర్భ అని ఎలా చెప్పగలరు? సంభూతి అన్నా, సంభవం అన్నా పుట్టుక. మొట్టమొదట పుట్టింది ఎవరు? హిరణ్యగర్భ. హిరణ్యగర్భ అన్నా బ్రహ్మ అన్నా ఒకటే.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ** – ముండకమ్ 1.1.1

అందరిలోకి ముందు పుట్టాడు బ్రహ్మ. ప్రకృతి అంటే కారణశరీరం. తత్త్వబోధలో కారణశరీరం నిర్వచనం వస్తుంది. అందులో అనాది అవిద్య పదం ప్రకృతికి పుట్టుక లేదు అని సూచిస్తుంది. ఇవి కాక, హిరణ్యగర్భను కార్యబ్రహ్మ అనీ, వ్యాకృతబ్రహ్మ అనీ అంటే, ప్రకృతిని కారణబ్రహ్మ అనీ, అవ్యాకృత బ్రహ్మ అనీ అంటారు.

ఈ మంత్రంలో కూడా నహినిందా న్యాయాన్ని వాడుతున్నది ఉపనిషత్తు. నహినిందా న్యాయం అంటే ఒకదాన్ని మెచ్చుకోవటంకోసం ఇంకొకదానిని నిందించటం అని చూశాము. ఈ నేపథ్యంతో ఈ మంత్రాలు చూద్దాము.

**మంత్రం 12**

**అంధం తమః ప్రవిశన్తి యేఽసంభూతిముపాసతే।**

**తతో భూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాగ్ం రతాః ॥**

**అంధం తమః ప్రవిశంతి** – ఇది ఇంచుమించు మంత్రం 9లాగే ఉంటుంది. తమః అంటే చీకటిలోకాలు. అంధం తమః అంటే చిమ్మచీకటి లోకాలకు అంటే కళ్ళు పొడుచుకున్నా కానరాని చీకటిలోకాలకు వెళతారు.

**యే అసంభూతిమ్ ఉపాసతే** – ఎవరైతే కేవలప్రకృతి ఉపాసన చేస్తారో, వారు కారుచీకటి లోకాలలో ప్రవేశిస్తారు.

**తతో భూయ ఇవ తే తమః (ప్రవిశంతి)** – అంతకంటే ఇంకా ఎక్కువ చీకటిలోకాలలో ప్రవేశిస్తారు. ఎవరు వెళతారు?

**య ఉ సంభూత్యాగ్ం రతాః** – ఎవరైతే ప్రకృతిని విడిచిపెట్టి, హిరణ్యగర్భ ఉపాసనను అందులో లీనమై శ్రద్ధగా చేస్తారో, వారు ఇంకా ఎక్కువ చీకటిలోకాలలో ప్రవేశిస్తారు.

ఉపాసనా సూత్రం – **యథా యథా ఉపాస్తే తథైవ ఫలం భవతి**

ఏ గుణంమీద ఉపాసన చేస్తే, ఆ ఫలం పొందుతాడు ఉపాసకుడు. ఉదాహరణకు, ఉపాసకుడు సర్వజ్ఞ ఈశ్వరునిమీద ఉపాసన చేస్తే అతను సర్వజ్ఞుడు అవుతాడు; సర్వశక్తిమాన్ ఈశ్వరునిమీద ఉపాసన చేస్తే అతను సర్వశక్తిమాన్ అవుతాడు.

ప్రకృతి అంటే జగత్తుకు ఉపాదానకారణమైన మాయాశక్తి. అదే అవిద్య. అవిద్య అంటే స్వరూపజ్ఞానం లేకపోవటం. మాయాశక్తిని కామకర్మబీజభూతామ్ అంటారు. అంటే కోరికలకు కర్మలకు ఉద్భవస్థానమైన అవిద్య. ఎవరైతే అటువంటి ప్రకృతిని ఉపాసిస్తారో వారు దానికి తగ్గట్టుగానే కన్నులు పొడుచుకున్నా కానరాని, అంటే వివేకజ్ఞానం లేని, చీకటిని ప్రవేశిస్తారు.

ఈ మంత్రం సారం – **ఏకైక అనుష్ఠాన నిందా సముచ్చయ స్తుత్యర్థమ్**

## మంత్రం 13

**అన్యదేవాహుస్సంభవాదన్యదాహురసంభవాత్ ।**
**ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్తద్విచచక్షిరే ॥**

ఇది ఇంచుమించు మంత్రం 10లాగే ఉంటుంది. ముందు మంత్రంలో కేవల ప్రకృతి ఉపాసనను, కేవల హిరణ్యగర్భ ఉపాసనను నిందించింది ఉపనిషత్తు. ఇక్కడ వాటికి ఫలాలు ఉన్నాయి అని చెబుతున్నది. ఎందుకలా చెబుతున్నది? ఈ రెండు ఉపాసనల సముచ్చయం చేయాలంటే వాటికి విడిగా ఫలం ఉండాలి. రెండు అంగీలను మాత్రమే సముచ్చయం చేయగలము. భిన్నఫలాలు ఉన్నాయని సూచించటం ద్వారా సముచ్చయం చేయగలము అని చెబుతున్నది.

**అన్యదేవాహుస్సంభవాత్** – దీన్ని ఇలా అన్వయం చేసుకోవాలి.

సంభవాత్ అన్యత్ (ఫలం) ఆహుః (ఋషయః)

ఆహుః – చెబుతున్నారు. ఏమని?

సంభవాత్ – సంభవాత్ అన్నా ముందు మంత్రంలో చూసిన సంభూతిమ్ అన్నా ఒకటే.

సంభూతి అంటే కార్యబ్రహ్మ ఉపాసన చేస్తే. ఇక్కడ ఉపాసన పదాన్ని వాడలేదు ఉపనిషత్తు. దాన్ని మనం కలుపుకోవాలి. దాన్ని అజహల్లక్షణమ్ అంటారు.

ఉదాహరణకు ఒక కారురేసు జరుగుతున్నదనుకోండి. ఎవరో వచ్చి, 'ఏది నెగ్గుతోంది,' అని అడిగితే మీరు, 'నీలం నెగ్గుతోంది,' అంటారు. నీలం రంగు నెగ్గలేదు. ఆ జవాబు విన్న వ్యక్తి నీలంరంగు కారు నెగ్గుతోంది అని అర్థం చేసుకుంటాడు. అంటే వాక్యంలో ఉన్న ఒక పదానికి ఇంకొక పదం అదనంగా కలుపుకుని అర్థం చేసుకోవాలి.

అన్యత్ (ఫలం) – హిరణ్యగర్భ ఉపాసన చేస్తే దానికి భిన్న ఫలం ఉంది. అన్యత్ అంటే పృథక్ అంటే భిన్నఫలం ఉంది. ఏమిటది? అణిమాది ఐశ్వర్యలక్షణాలు పొందుతారు.

అణిమాది సిద్ధులను అష్టసిద్ధులు అంటారు. మాయకు అష్టగుణాలు, పరమాత్మకు తొమ్మిది గుణాలు వర్ణిస్తారు. పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారాలను కలిపితే ఎనిమిది అవుతాయి. పంచభూతాల స్థానంలో పంచేంద్రియాలు తీసుకోవాలి. పంచేంద్రియాలను, మనస్సును, బుద్ధిని, అహంకారాన్ని జయించిన వ్యక్తికి ఈ అష్టసిద్ధులు కలుగుతాయి. అష్టసిద్ధి నవనిధికే దాతా అని హనుమంతుణ్ణి కీర్తిస్తారు. ఆ సిద్ధులేమిటో చూద్దాము.

1. అణిమ – అత్యంత సూక్ష్మంగా మారతాడు
2. మహిమ – అత్యంత స్థూలంగా మారతాడు
3. గరిమ – భూభారమంత బరువును పెంచుకోగలడు
4. లఘిమ – దూదికంటె తేలికగా అవగలడు
5. ప్రాప్తి – శూన్యంనుంచి కూడా కావాల్సింది పొందగలడు
6. ప్రాకామ్యం – దూరదర్శనం, దూరశ్రవణం, ఆకాశగమనంవంటి దివ్యశక్తులు కలుగుతాయి
7. ఈశత్వం – ఇంద్రాది దిక్పాలకులను కూడా నియంత్రించగలడు
8. వశిత్వం – సకల జీవరాశులను వశీకరణం చేయగలడు.

**అన్యదాహురసంభవాత్** – అసంభవాత్ అంటే ప్రకృతి. ప్రకృతి ఉపాసన చేస్తే దానికి విడిగా ఫలం ఉంది అంటున్నది ఇప్పుడు. ఇక్కడ కూడా ఉపాసన పదాన్ని మనం కలుపుకోవాలి. ప్రకృతి ఉపాసన చేస్తే కలిగే ఫలం ఏమిటి? ప్రకృతిలో లయమవుతారు. విష్ణుపురాణంలో కూడా జీవులు ప్రకృతిలో విలీనమవుతారని వస్తుంది. సుషుప్తిలో ఎలా అయితే సంసారదుఃఖం అనుభవానికి రాదో, అలాగే ప్రకృతి లయలో కూడా దుఃఖం ఉండదు. ప్రకృతి లయరూప పురుషార్థం పొందుతాడు. కాని ఇది మోక్షం కాదు. ఎందుకంటే మళ్ళీ సృష్టి జరిగినప్పుడు మళ్ళీ పుడతాడు.

**ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్తద్విచచక్షిరే** – ఇది మాకు మా గురువులు ఇంతకుముందు చెప్పారు. ఇతి అంటే ఈ విధంగా అంటే హిరణ్యగర్భ ఉపాసనకు వేరే ఫలం ఉంది, ప్రకృతి ఉపాసనకు వేరే ఫలం ఉందని చెప్పారు.

ధీరాణాం అంటే వారు ఆత్మజ్ఞానులు కానవసరం లేదని చూశాము. వారికి ఈ రెండు ఉపాసనల ఫలాల గురించి మంచి జ్ఞానం ఉంటే చాలు. దీనివల్ల ఈ ఫలాలు మేము స్వంతంగా చెప్పటం లేదు. మా గురువులు మాకు చెప్పారు అని వారు చెప్పినట్టు అర్థమవుతుంది. ఈ మంత్రం సారం – **సముచ్చయార్థం అవతారిక**

### మంత్రం 14

**సంభూతిం చ వినాశం చ యస్తద్వేదోభయగ్ం సహ ।**
**వినాశేన మృత్యుం తీర్త్వా౽ సంభూత్యా౽ మృతమశ్నుతే॥**

మంత్రం 12 ఏక అనుష్ఠాన నింద చేస్తే, మంత్రం 13 ఏ అనుష్ఠానానికి ఆ ఫలం ఉంది అని నిరూపించింది. అంటే సముచ్చయం చేయటానికి మార్గాన్ని సుగమం చేసింది. నహినిందా న్యాయం వాడింది. ప్రకృతి ఉపాసన, హిరణ్యగర్భ ఉపాసన రెండూ రెండు అంగీలు అని నిరూపించింది, వాటికి భిన్నఫలాలను చెప్పటం ద్వారా. కాని ఈ మూడు మంత్రాల్లో, ఏ మంత్రంలోనూ ఉపనిషత్తు ప్రకృతి, హిరణ్యగర్భ పదాలు వాడలేదు. ఇప్పుడు సముచ్చయం గురించి చెప్పబోతున్నది.

**యస్తద్వేదోభయగ్ం సహ** – దానికి అన్వయం యః తత్ వేద ఉభయగ్ం సహ. తత్ వేద అంటే దాన్ని గురించి తెలుసుకుని, ఆచరిస్తారో. ఎవరైతే ఈ రెండింటి గురించి తెలుసుకుని ఆచరిస్తారో. ఏ రెండూ?

**సంభూతిం చ వినాశం చ** – ప్రకృతి, హిరణ్యగర్భ సముచ్చయం ఉపాసన.

ఇంతకుముందు మంత్రాల్లో సంభూతి అంటే హిరణ్యగర్భ అని చూశాము. వినాశం పదం కూడా హిరణ్యగర్భకే సరిపోవాలి. ఎందుకంటే సూత్రం ఏమిటి?

**జాతస్య హి ధ్రువో మృత్యుః** – గీత 2.27

పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు. హిరణ్యగర్భ మొదట పుట్టాడు కాబట్టి సంభూతి అని చూశాము. ఆ సూత్రం ప్రకారం వినాశం అంటే హిరణ్యగర్భే అవాలి. కాని హిరణ్యగర్భ ఉపాసనను, హిరణ్యగర్భ ఉపాసనతో కలిపి చేయమని చెప్పలేదు ఉపనిషత్తు. అవి రెండు భిన్న ఉపాసనలు అయివుండాలి. అంతేకాదు, ఇంతకుముందు రెండు మంత్రాల్లో ఇంకొక ఉపాసన, ప్రకృతి ఉపాసన వచ్చింది. అందువల్ల ఇక్కడ సంభూతిం అంటే ప్రకృతి ఉపాసన అని అర్థం చేసుకోవాలి.

అలా ఎలా చెప్పగలరు అంటే దానికి కావాల్సిన వివరణ శంకరాచార్యులవారు ఇచ్చారు. వ్యాకరణసూత్రం ప్రకారం ఏ + అ = అవర్ణలోపం.

ఉదా. స్థాపయమేఽచ్యుత = స్థాపయమే (ఏ) + అచ్యుత
నిరీక్షేఽహమ్ = నిరీక్షే (ఏ) + అహమ్

ఈ ఉదాహరణలు భగవద్గీతలోవి. యే లో ఏ శబ్దం ఉంది. పలికేటప్పుడు 'అ' అక్షరాన్ని పలకము. అవర్ణలోపం జరుగుతుంది. అక్కడ అవర్ణం ఉందని ఽ (అవగ్రహం) ద్వారా చూపిస్తారు.

**తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యేఽలక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే** – శ్రీసూక్తమ్

ఇందులో కూడా అలక్ష్మీర్మే అని పలకం. లక్ష్మీర్మే అని పలకాలి. కాని సంధి విడదీసేటప్పుడు ప్రపద్యే (ఏ) + అలక్ష్మీ అని వస్తుంది.

ఇదే సూత్రం ప్రకారం మంత్రం 14ను మంత్రం 13తో కలిపి పలికితే సంభూతిం – అసంభూతిం అవుతుంది. విచచక్షిరేఽసంభూతిమ్ = విచచక్షిరే + అసంభూతిమ్

ఆ విధంగా ఇక్కడ సంభూతి అంటే ప్రకృతి; వినాశం అంటే హిరణ్యగర్భ. ఈ పదాలకు ఉపాసన పదం కూడా కలుపుకోవాలి. ఈ ఉపాసనలను ఎలా చేయాలి?

**సహ** – రెండింటినీ సముచ్చయం చేసి అనుష్ఠిస్తారో. సహ పదం చాలా ముఖ్యమైన పదం. అది సముచ్చయాన్ని సూచిస్తుంది.

**వేద** – సముచ్చయ ఉపాసన చేస్తారో. సముచ్చయం చేస్తే కలిగే ఫలమేమిటి?

**వినాశేన మృత్యుం తీర్త్వా** – అక్కడ అవిద్యయా మృత్యుం తీర్త్వా అంటే ఇక్కడ వినాశేన మృత్యుం తీర్త్వా అంటున్నది. కాకపోతే ఈ మృత్యుం తీర్త్వాకి ఇక్కడ ఫలం వేరే ఉంది. మృత్యుతరణం పొందుతారు అంటే అనైశ్వర్యం పోతుంది. హిరణ్యగర్భ ఉపాసన చేసిన వ్యక్తి అణిమాది సిద్ధులు అనే ఐశ్వర్యం పొందుతాడు కాబట్టి అనైశ్వర్యం పోతుంది. అందువల్ల అతను ఎవరిమీదా, దేనికీ ఆధారపడడు. దాసత్వం, సేవకత్వం దుఃఖాన్ని కలుగజేస్తాయి. ఈ ఉపాసకుడు ఎవరికీ దాసోహం అననవసరం లేదు. అతనే అంతటికీ అధిపతి అవుతాడు.

**ఆప్నోతి స్వారాజ్యమ్ । ఆప్నోతి మనసస్పతిమ్ । వాక్పతిశ్చక్షుష్పతిః । శ్రోత్ర పతిర్విజ్ఞానపతిః ఏతత్తతో భవతి ।** – తైత్తిరీయమ్

హిరణ్యగర్భ ఉపాసన చేసిన ఉపాసకుడు అన్నిటికీ అధిపతి అవుతాడు.

**ఐశ్వర్యప్రాప్త్యా అనైశ్వర్య నివృత్తిః మృత్యుతరణమ్**

అంతేకాదు అతనికి అధర్మకామాది దోషజాతం పోతుంది అంటున్నారు

శంకరాచార్యులవారు. అంటే అధర్మం, కోరికలు మొదలైన దోషాల సమూహం అనే మృత్యువును దాటుతాడు.

**అసంభూత్వా అమృతమశ్నుతే** – అక్కడ విద్యయా అమృతమశ్నుతే అంటే ఇక్కడ అసంభూత్వా అమృతమశ్నుతే అంటున్నది ఉపనిషత్తు. కాకపోతే ఇక్కడ అమృతం అంటే అర్థం వేరు. ఇక్కడ ఫలం ప్రకృతిలయ. అంటే ఈ ఉపాసకుడు మరణించాక ప్రకృతిలో లయమవుతాడు. అతనికి వెంటనే మళ్ళీ పునర్జన్మ ఉండదు. ఈ సృష్టి ఉన్నంతవరకూ అతను ప్రకృతిలో లయమయి ఉంటాడు. ప్రళయంలో అన్నీ అవ్యక్తంలోనే ఉంటాయని చూశాము. అంటే ఈ సృష్టి ముగిసి, ప్రళయం ముగిసి, మళ్ళీ సృష్టి వచ్చినప్పుడు అతను మళ్ళీ పుడతాడు. అంతవరకూ అతనికి జన్మ ఉండదు. అతనికి దుఃఖం కూడా ఉండదు.

ఈ విధంగా హిరణ్యగర్భ + ప్రకృతి ఉపాసన చేసిన వ్యక్తికి కలిగే ఫలం ఏకఫలం. ఇది సముచ్చయ ఉపాసన అని చూపటానికి ఒక కారణం అవి రెండు అంగీలు అని చూపించటం, ఇంకొక కారణం వాటికి ఏకఫలం కలుగుతుందని చూపించటం. ఆ ఏకఫలం ఇది –

**మృత్యుతరణ పూర్వక ప్రకృతిలయః**

ఎక్కువగా మన ఉపనిషత్తుల్లో అన్నింటిలోకీ శ్రేష్ఠమైన ఉపాసన – హిరణ్యగర్భ ఉపాసన అని వస్తుంది. దాని ఫలం బ్రహ్మలోకప్రాప్తి అని చూశాము. ఇక్కడ దానికన్నా ఎక్కువ ఉపాసన ప్రకృతి ఉపాసన. దాని ఫలం మళ్ళీ ఇంకో సృష్టి వచ్చేదాకా ప్రకృతిలో లయమవటం. కాని ఇది కూడా అంతిమఫలం కాదు, ఎందుకంటే ప్రకృతిలో ఉన్నంతవరకే దుఃఖ అభావం ఉంటుంది కాని, మళ్ళీ పుడితే మళ్ళీ సంసారం తప్పదు. సంసారచక్రం తప్పించుకోవాలంటే జ్ఞానమొక్కటే మార్గం.

ఇక్కడితో కర్మయోగంలోని రెండవ అంశం ముగిసింది. అది మొదటి అంశంతో సమాంతరరేఖగా సాగింది కాబట్టి, ఆ రెండింటినీ టూకీగా పోల్చి చూద్దాము.

**కర్మ ఉపాసనల సముచ్చయం**

మంత్రం 9 — కర్మచేసిన వ్యక్తి చీకటిలోకాలకు వెళతాడు

ఉపాసన చేసిన వ్యక్తి ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతాడు

మంత్రం 10 — కర్మ చేసిన వ్యక్తి పితృలోకానికి వెళతాడు

ఉపాసన చేసిన వ్యక్తి బ్రహ్మలోకానికి వెళతాడు

మంత్రం 11 — కర్మ, ఉపాసనల సముచ్చయం చేసిన వ్యక్తి ప్రాకృత స్వభావాన్ని అధిగమించి, అమృతత్వాన్ని పొందుతాడు

**ఉపాసనాద్వయ సముచ్చయం**

మంత్రం 12 — ప్రకృతి ఉపాసన చేసిన వ్యక్తి చీకటిలోకాలకు వెళతాడు

హిరణ్యగర్భ ఉపాసన చేసిన వ్యక్తి ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతాడు

మంత్రం 13 — ప్రకృతి ఉపాసన చేసిన వ్యక్తి ప్రకృతిలో లయమవుతాడు

హిరణ్యగర్భ ఉపాసన చేసిన వ్యక్తి అణిమాది ఐశ్వర్య సిద్ధులు పొందుతాడు

మంత్రం 14 — ప్రకృతి, హిరణ్యగర్భ ఉపాసనాద్వయ సముచ్చయం చేసిన వ్యక్తి మృత్యుతరణ పూర్వక ప్రకృతిలయ పొందుతాడు

# సంబంధ భాష్యం

శంకరాచార్యులవారు మళ్ళీ మంత్రం 15కి వెళ్ళేముందు కొంత ఉపోద్ఘాతం చెప్పారు. దాన్ని సంబంధ భాష్యం అంటారు. అందులోని అంశాల సారం చూద్దాము.

1. **ఫలం** – ఈ ఉపనిషత్తు కర్మ, ఉపాసన ఫలాలను ఇంతవరకూ చెప్పింది. వాటిలో అత్యుత్తమ ఫలం ప్రకృతిలో విలీనమవటం. కాని అది సంసారఫలంలోకే వస్తుంది కాని మోక్షఫలం కాదు.

2. **మోక్షం** – మోక్షఫలం జ్ఞానమార్గంవల్లనే సాధ్యం. సర్వాత్మభావన కలిగిన జ్ఞాని అన్ని కోరికలను త్యజించి జ్ఞాననిష్ఠలో నిలబడితే, అతనికి కలిగే ఫలం మోక్షం.

ఈ విధంగా ఈ ఉపనిషత్తులో ప్రవృత్తి, నివృత్తి రూపంలో ఉండే రెండు రకాల మార్గాలు చక్కగా వర్ణించబడ్డాయి.

3. **బృహదారణ్యకం** – బృహదారణ్యకోపనిషత్‌లో అంతకుముందు ఎనిమిది అధ్యాయాలు ఉండేవి. అందులో మొదటి రెండు అధ్యాయాలూ ప్రవృత్తిమార్గాన్ని వివరిస్తాయి కాని అవి కాలగర్భంలో కలిసిపోయి, ఇప్పుడు ఆరు అధ్యాయాలే మిగిలాయి. ఈ ఆరు అధ్యాయాలు నివృత్తిమార్గాన్ని వివరిస్తాయి.

4. **ఉపాసన** –ఎవరైతే ప్రవృత్తి మార్గంలో ఉండి, గర్భాధానంతో మొదలుపెట్టి, అంత్యేష్టి వరకు కర్మను చేస్తూనే జీవించాలని కోరుకుంటాడో అతను తన కర్మలతో పాటు సగుణబ్రహ్మ ఉపాసన చేయాలని చెప్పబడింది. అలా కర్మ, ఉపాసనలు సముచ్చయం చేసిన వ్యక్తి పొందే ఫలం ప్రాకృతపురుషుడు సంస్కృతపురుషునిగా మారి, బ్రహ్మలోకప్రాప్తిని పొందుతాడు అని ఈ ఉపనిషత్తు చెప్పింది. ఈ సముచ్చయకర్త శుక్లగతి ద్వారా సూర్యమండలంలో ఉన్న హిరణ్యగర్భలోకానికి వెళతాడు.

## సి.గతి ప్రార్థన - శ్లోకాలు 15-18: ఉపోద్ఘాతం

శ్లోకాలు 15-18 శుక్లగతి ద్వారా తీసుకువెళ్ళమని ఒక ఉపాసకుడు చేసే గతిప్రార్థన. ఈ ఉపాసకుడు జ్ఞానా, అజ్ఞానా? ఇతను అజ్ఞానే. జ్ఞానికి ప్రయాణమే లేదు. అతను జీవించి ఉండగా జీవన్ముక్తి పొంది, మరణించాక విదేహముక్తి పొందుతాడు.

**తనుం త్యజతు వా కాశ్యాం శ్వపచస్య గృహేఽథవా**

**జ్ఞానసంప్రాప్తిసమయే ముక్తోఽసౌ విగతాశయః** – తత్త్వబోధ

ఆత్మజ్ఞానం పొందినప్పుడే జీవన్ముక్తుడయిన వ్యక్తి, తన దేహాన్ని కాశీలో విడిచినా, చండాలుని ఇంటిలో విడిచినా, ఆశలు లేని విగతాశయుడు కాబట్టి నిత్యముక్తుడు అవుతున్నాడని వస్తుంది తత్త్వబోధలో.

అందువల్ల ఈ ప్రార్థన చేసేది కర్మ, ఉపాసనల సముచ్చయం చేసిన వ్యక్తి. అతను మరణించినప్పుడు చేసే కర్మను అంత్యేష్టి (అంత్య + ఇష్టి) అంటారు. అంటే అతని శరీరాన్ని అగ్నికి ఆహుతి చేస్తే ఆ అగ్ని ఆ జీవికి ఇంకో స్థూలశరీరాన్ని ఇస్తుంది. ఆ స్థూలశరీరం పేరుకే స్థూలశరీరం కాని, చాలా సూక్ష్మంగా ఉంటుంది. ఆ శరీరంతో అతను ప్రయాణిస్తాడు.

ఈ ఉపాసకుడు అహంగ్రహ ఉపాసన చేశాడు. ఉపాసనలో కూడా వివిధ రకాలున్నాయి. అవి ప్రతీక ఉపాసన, ప్రతిమా ఉపాసన, అహంగ్రహ ఉపాసన.

**ప్రతీక ఉపాసన** – సాలగ్రామంమీద విష్ణుమూర్తిని, శివలింగంమీద పరమశివుణ్ణి ఆవాహన చేసి, ఉపాసన చేయటాన్ని ప్రతీక ఉపాసన అంటారు.

**ప్రతిమా ఉపాసన** – ఒక మనుష్య ఆకారంమీద ఉపాసన చేయటం. రాముడు, కృష్ణుడు, దేవి – ఇలా ఏదో ఒక ఆకారంమీద ఉపాసన చేయటాన్ని ప్రతిమా ఉపాసన అంటారు.

**అహంగ్రహ ఉపాసన** – పరమాత్మను తనలోనే ఆవాహన చేస్తే, దాన్ని అహంగ్రహ ఉపాసన అంటారు. అహంగ్రహ ఉపాసనలో అభేదబుద్ధి ఉంటుంది. ఇందులో ఆత్మజ్ఞానం ఉండదు. ఆత్మ విచారణ లేదు. అభేదదృష్టి కేవలం ఊహ మాత్రమే. నేనే ఆ భగవంతుడు అని ఊహించుకుంటాడు. అభేద ఉపాసన అంటే జీవ-ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకోవటం, అభేదజ్ఞానం అంటే జీవ-ఈశ్వర ఐక్యాన్ని అర్థం చేసుకోవటం.

బృహదారణ్యకోపనిషత్తులోనూ, ఛాందోగ్యోపనిషత్తులోనూ హిరణ్యగర్భ ఉపాసనలు అనేకం వస్తాయి. ఒక ఉపాసనలో సమష్టిరూపంలో హిరణ్యగర్భను సూర్యదేవతగా కొలుస్తారు. అది అధిదైవ ఉపాసన; వ్యష్టిరూపంలో కుడికన్నుమీద కొలుస్తారు. అది అధ్యాత్మ ఉపాసన.

ఈశావాస్యోపనిషత్తులో వచ్చిన ఈ నాలుగు మంత్రాలూ ఒకటే మంత్రంగా బృహదారణ్యకోపనిషత్తులో కూడా వస్తాయి. బృహదారణ్యకం ఈశావాస్యానికి వ్యాఖ్యానం కాబట్టి అందులో కూడా ఉండటంలో ఆశ్చర్యం లేదు. బృహదారణ్యకంలో సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణమ్ (5.15) అంటారు దానిని. ఈ మంత్రాలు అగ్నిదేవతకు, సూర్యదేవతకు చేసే ప్రార్థనలు కాబట్టి ఆ బ్రాహ్మణానికి సూర్యాగ్ని ప్రార్థనా బ్రాహ్మణమ్ అని పేరు వచ్చింది. ఈ ప్రార్థన ఎప్పుడైనా చేయవచ్చు కాని, ఈ ఉపాసకుడు మరణం సమీపించినప్పుడు చేస్తున్న ప్రార్థన ఇది. అతను హిరణ్యగర్భ ఉపాసనలన్నీ చేసివుండి ఉండాలి. అతను జీవితాంతం ఉపాసననే చేస్తున్నాడు, ఆత్మజ్ఞానానికి రాలేదు. అటువంటి ఉపాసకుడు సరిగ్గా మరణించబోయే ముందు ఈ ప్రార్థన చేస్తున్నాడు. ఉపాసకుడు నిరంతరం దైవోపాసన చేస్తూ ఉంటాడు కాబట్టి అతనికి మరణకాలం గురించి తెలిసే అవకాశం ఉంటుంది.

జ్ఞానం పొందనిదే మోక్షం రాదు. ఈ సత్యం మారదు. అందువల్ల ఈ ఉపాసకుడు జీవన్ముక్తి, తర్వాత విదేహముక్తి పొందడు కాని క్రమముక్తి పొందుతాడు. ఈ ఉపాసకుడు శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి అక్కడ బ్రహ్మ ద్వారా బ్రహ్మజ్ఞానం పొందితే కలిగే ముక్తిని క్రమముక్తి అంటారు. బ్రహ్మలోకం అంటే హిరణ్యగర్భలోకం. సూర్యమండలం ద్వారా ఆ సాధకుడు హిరణ్యగర్భ లోకానికి వెళతాడు. అక్కడ బోధ చేసేది సాక్షాత్తూ బ్రహ్మదేవుడు కాబట్టి, ఆ బోధ తక్షణం అర్థం అవుతుంది. అప్పుడు బ్రహ్మలోకంలో జీవన్ముక్తి పొంది, ప్రళయంలో విదేహముక్తి పొందుతాడు. ఇది శాస్త్రం చెబుతుంది.

**శుద్ధః పూతోఽ జరోఽ మృతస్సంభవతి** – బృహదారణ్యకమ్ 5.14.8

అతను శుద్ధం అవుతాడు. అంటే పాపాలన్నీ తొలగిపోతాయి; శుద్ధః అంటే కర్మరహితుడు; పూతః అంతే కర్మఫల రహితుడు అవుతాడు. అమృతస్సంభవతి అంటే క్రమముక్తి పొందుతాడని అర్థం. ఈ ప్రార్థనలు బ్రహ్మలోకానికి వెళ్ళే ముందు చేసే ప్రార్థనలు. నన్ను శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి తీసుకువెళ్ళు అంటున్నాడు. ఎందుకంటే ఉపాసకునికి కృష్ణగతి కూడా సుపథం కాదు. కృష్ణగతిలో వెళ్ళిన వ్యక్తి మళ్ళీ వెనక్కి తిరిగివస్తాడు.

**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – గీత

వెళ్ళేది పుణ్యలోకానికి అయినా తిరిగివస్తాడు కాబట్టి కృష్ణగతి శోభనమార్గం కాదు. ఈ నేపథ్యంతో ఈ మంత్రాలను చూద్దాము.

## మంత్రం 15

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్ ।**

**తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥**

**పూషన్** – ఓ సూర్యదేవతా. పుష్ణాతి సర్వాణి ఇతి పూషా. పూషన్ అంటే అందరినీ పోషించేవాడు.

**సత్యస్యముఖమ్** – సత్యం అంటే హిరణ్యగర్భ. దానికి లోతైన అర్థం చూస్తే నిర్గుణబ్రహ్మ కూడా వస్తుంది. ముఖం అంటే ముఖద్వారం. హిరణ్యగర్భలోకానికి తీసుకువెళ్ళే ముఖద్వారం. అది ఆదిత్యమండలం.

**అపిహితమ్** – కప్పబడివుంది. దేనితో?

**హిరణ్మయేన పాత్రేణ** – బంగారంలా మెరిసిపోతున్న మూతతో కప్పబడివుంది. ఇక్కడ పాత్ర అంటే మూత.

**తత్ త్వమ్ అపావృణు** – తత్ అంటే ఆ బంగారు పాత్రను; త్వం అంటే నువ్వు; అపావృణు అంటే తొలగించు. సూర్యమండలం ద్వారా హిరణ్యగర్భ లోకానికి వెళ్ళే ద్వారం బంగారంతో మెరిసిపోతున్న మూతతో కప్పబడివుంది కాబట్టి, ఓ సూర్యదేవతా నువ్వు దాన్ని తొలగించు. ఎవరికి?

**సత్యధర్మాయ** – శాస్త్రంలో నిర్దేశించిన ధర్మాలన్నీ పాటించిన నాకోసం తెరువు. దీనికి మూడు అర్థాలు చెప్పవచ్చు. సత్యహిరణ్యగర్భ ఉపాసన చేయటమే నా ధర్మంగా భావించాను; సత్య వేదోక్త కర్మ అనుష్ఠానం చేశాను; సత్యమే ధర్మంగా అనుష్ఠానం చేశాను.

**దృష్టయే** – హిరణ్యగర్భ దర్శనంకోసం తీయమంటున్నాడు. ఈ మంత్రం క్రమముక్తిని సూచించే గొప్ప మంత్రం. నేను నిర్గుణబ్రహ్మజ్ఞానం పొంది, క్రమముక్తి పొందటానికి తెరువు అని కూడా చెప్పవచ్చు. అంటే జ్ఞానప్రాప్తయే అపావృణు అంటున్నాడు.

నిజానికి ఈ ప్రార్థనని అంటే ఈ మంత్రం 15ను ఈ సందర్భంనుంచి విడదీసి, జ్ఞానం పొందటానికి చేసే ప్రార్థనగా కూడా అన్వయించుకోవచ్చు. అప్పుడు ఈ పదాల అర్థాలు కొంచెం మారతాయి. మళ్ళీ ఈ మంత్రాన్ని చూస్తే ఇలా వస్తుంది.

**సత్యమ్** – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ.

**ముఖమ్** – ఇక్కడ ముఖద్వారం అంటే జ్ఞానమార్గంలోకి వెళ్ళే ద్వారం. అది కప్పబడివుంది. దేనితో?

**హిరణ్మయేన పాత్రేణ** – నేను వెళ్ళాల్సిన శ్రేయోమార్గాన్ని బంగారపు వన్నెగల పాత్ర మూసేసింది. బంగారం ఇక్కడ అర్థ, కామాలకు సంకేతం. ఈ అర్థకామాలు జ్ఞానమార్గంలోకి వెళ్ళకుండా అడ్డుపడుతున్నాయి.

రామాయణంలో సీత, రామునితో అడవిలో ఉండగా బంగారులేడిని చూసి ఆకర్షింపబడింది. దాని తర్వాత రామునినుంచి దూరమయింది. దీని అంతరార్థం చూస్తే జీవాత్మ అయిన సీత, పరమాత్మ అయిన రామునితో కలిసివుంది. కాని ఆ ఐక్యం గురించి తెలియక బంగారంలా ఆకర్షించే అర్థకామాల వైపు ఆకర్షితురాలైంది. అందువల్ల పరమాత్మకు దూరమయింది. ఇక్కడ సాధకుడు నేను అలా ఆకర్షణలకు లోనుకాకుండా, నాకు వైరాగ్యం కలిగించు అంటున్నాడు. అసలే ఆత్మజ్ఞానానికి రావటం కష్టం, వస్తే ఆకర్షణలకు లోను కాకుండా ఉండటం ఇంకా కష్టం.

**సత్యధర్మాయ** – నేను ఆత్మజ్ఞానం పొందాలనే ఇచ్ఛతో ఉన్నాను.

**దృష్టయే** – నేను ఆ ఆత్మజ్ఞానం పొందేలాగా చేయి.

## మంత్రం 16

**పూషన్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య వ్యూహ రశ్మీన్**
**సమూహ తేజో యత్తే రూపం కల్యాణతమం తత్తే పశ్యామి**
**యోఽసావసౌ పురుషస్సోఽహమస్మి॥**

ఉపాసకుడు చేసే ప్రార్థన ఇంకా కొనసాగుతున్నది. ఈ మంత్రం సారం – ఓ సూర్యదేవతా, నీ కిరణాల వేడినీ, వాడినీ కూడా తగ్గించు; నేను అహంగ్రహ ఉపాసన చేశాను. ఇక్కడ ఈ ఉపాసకుడు బ్రతిమాలటం లేదు, తను ఈ ఉపాసనలు చేశాడు కాబట్టి తనకా హక్కు ఉందనుకుంటున్నాడు. ముందుగా సూర్యదేవతను అనేక పేర్లతో సంబోధిస్తున్నాడు.

**పూషన్** – జగతః పోషణాత్ పూషా – జగత్తును పోషించుటవల్ల పూషన్.

**ఏకర్షే** – ఏక+ఋషి. ఋషి అంటే ఋషతి గచ్ఛతి; ఏకర్షే అంటే తథా ఏకః ఏవ ఋషతి గచ్ఛతి ఇతి ఏకర్షః. ఒంటరిగా పయనిస్తున్నాడు కాబట్టి ఏకర్షి.

**యమ** – తథా సర్వస్య సంయమనాద్ యమః – సర్వాన్నీ చక్కగా నియంత్రిస్తాడు కాబట్టి యముడు.

**సూర్యః** – సర్వస్య స్వీకరణాత్ సూర్యః. అన్నింటినీ వెనక్కి తీసుకుంటాడు. ఏమిటవి?

రశ్మీనాం స్వీకరణాత్ సూర్యః – తన సూర్యకిరణాలను తను ఉదయించినప్పుడు వెదజల్లి, మళ్ళీ తను అస్తమిస్తున్నప్పుడు వెనక్కి తీసుకుంటాడు.

జలస్య స్వీకరణాత్ సూర్యః – సముద్రంనుంచి నీటిని మేఘాలలోకి స్వీకరిస్తాడు.

ప్రాణానాం స్వీకరణాత్ సూర్యః – ప్రాణులకు తను ఉదయిస్తూ శక్తినిచ్చి, అస్తమిస్తూ ఆ శక్తిని స్వీకరిస్తాడు.

ఇప్పుడు ఈ మూడు లక్షణాలనూ కలిపి ఒక వాక్యంలో చెబితే,

తథా రశ్మీనాం ప్రాణానాం రసానాం చ స్వీకరణాత్ సూర్యః. రసానాం అంటే జలాన్ని స్వీకరించటం.

**ప్రాజాపత్యః** – ప్రజాపతేః అపత్యం ప్రాజాపత్యః – ప్రజాపతియొక్క పుత్రుడు ప్రాజాపతి.

ఇంతవరకూ సూర్యదేవతకు సంబోధన. ఇప్పుడు సూర్యదేవునికి చేసే ప్రార్థన.

**వ్యూహ రశ్మీన్** – రశ్మీన్ అంటే నీ కిరణాలను; వ్యూహ అంటే తొలగించు. అంటే నీ కిరణాల ప్రకాశాన్ని తొలగించు.

**సమూహ తేజః** – నీ తేజస్సు ఉపసంహరించు.

**యత్ తే కళ్యాణతమమ్** – నీ రూపం అతిశయించిన శోభ గలది. కాని నీ మిరిమిట్లు గొలిపే కాంతివల్ల నేను చూడలేకపోతున్నాను.

**తత్తే పశ్యామి** – తత్ అంటే ఆ కళ్యాణతమ రూపాన్ని నేను చూడగలిగేలా చేయి. ఈ ఉపాసకుడు అహంగ్రహ ఉపాసన చేశాడని చూశాము. అందువల్ల నేను నిన్ను సేవకునిలాగా యాచించటం లేదు అంటున్నాడు. నేను దాసోహం అనటం లేదు, సోహం అంటున్నాడు.

**యోऽసావసౌ పురుషస్సోऽహమస్మి** – ఆదిత్యమండలంలో ఏ పురుషుడైతే ఉన్నాడో, ఆ పురుషుణ్ణి నేనే అవుతున్నాను. యః అసౌపురుష అంటే సూర్యమండలంలో ఉన్న ఆ హిరణ్యగర్భ; సః అహమస్మి – నేనే. ఈ హిరణ్యగర్భ హృదయంలో ఉన్న మనస్సులో ఉన్నాడు.

బృహదారణ్యకోపనిషత్‌లోనే హిరణ్యగర్భ ఉపాసనల్లో ఒకటి వ్యాహృతి అవయవకరూప ఉపాసన వస్తుంది. ఆ బ్రాహ్మణం పేరు సత్యబ్రహ్మ సంస్థాన బ్రాహ్మణము (5.5).

**య ఏష ఏతస్మిన్మణ్డలే పురుషస్తస్య భూరితి శిరః ॥ ఏకగ్ం శిర ఏకమేతదక్షరం భువ ఇతి బాహూ ద్వౌ బాహూ ద్వే ఏతే అక్షరే స్వరితి ప్రతిష్ఠా ద్వే ప్రతిష్ఠే ద్వే ఏతే అక్షరే తస్యోపనిషదహరితి హన్తి పాప్మానం జహాతి చ య ఏవం వేద॥**(5.5.3)

ఈ మంత్రం సారం చూద్దాము. ఇక్కడ హిరణ్యగర్భ ఉపాసనను ఆయన అవయవాలతో పాటు చేస్తాము. ఈ అవయవాలను వ్యాహృతి మంత్రాలతో పోలుస్తాము. ఈ మండలంలో ఏ పురుషుడైతే ఉన్నాడో ఆ పురుషునికి –

'భూః' అనేది తల. తల ఒకటి, భూః అక్షరం కూడా ఒకటే

భువః అనేది రెండు బాహువులు; బాహువులు రెండు, అక్షరాలు కూడా రెండు

సువః అనేది రెండు కాళ్ళు; కాళ్ళు రెండు, అక్షరాలు కూడా రెండు.

ఈ విధంగా ఉపాసన చేయాలి. ఇది –

**ఆదిత్యమండలే వ్యాహృతి అవయవక హిరణ్యగర్భ ఉపాసన**

పురుషః అంటే పురుషాకారత్వాత్ పురుషః; పూరణాత్ ఇతి పురుష అంటే జగత్తంతా వ్యాపించి ఉండటంవల్ల పురుషుడు; పురిశయనాద్ వా పురుషః అంటే దేహంలో ఉండటంవల్ల పురుషుడు. ఆ విధంగా సమష్టిలో హిరణ్యగర్భ, వ్యష్టిలో తైజస ఒకటే.

ఇంతవరకూ సూర్యభగవానునికి చేసిన ప్రార్థన. హిరణ్యగర్భ ఉపాసన, సూర్యదేవతను ప్రతీకగా తీసుకుని చేశాడు. అందువల్ల అతను ఉపాసనలు చేశాడని చెప్పటానికి ప్రత్యక్ష సాక్షి సూర్యదేవత. అలాగే అతను నిత్యనైమిత్తిక కర్మలు కూడా చేశాడని చెప్పటానికి ప్రత్యక్షసాక్షి అగ్నిదేవత. ఎందుకంటే ఆ కర్మలన్నీ అగ్ని ద్వారానే చేస్తారు. అందువల్ల రాబోయే మంత్రాల్లో అగ్నిదేవతకు ప్రార్థన చేస్తున్నాడు.

**మంత్రం 17**

**వాయురనిలమమృతమథేదం భస్మాంతగ్ం శరీరమ్।**

**ఓం క్రతో స్మర కృతగ్ం స్మర క్రతో స్మర కృతగ్ం స్మర ॥**

ఒక గృహస్థు జీవించి ఉన్నంతకాలం అగ్నిదేవతకు ఎన్నో క్రతువులు చేస్తాడు. అతను మరణించినప్పుడు, అతని శరీరాన్ని అగ్నిదేవతకే ఆహుతి చేస్తారు. అందువల్ల అంత్యక్రియలను అంత్యేష్టి సంస్కారం అంటారు. అలా యజ్ఞాలు చేసిన గృహస్థు మరణం అంటే భయపడడు. దానిని కూడా ఒక యజ్ఞంలా తీసుకుంటాడు.

మనం మరణం అంటే అమంగళం అనుకుంటాము. కొంతమంది ఈ మంత్రాలను వినటానికి కూడా భయపడతారు. కాని మరణం కూడా ఒక యజ్ఞం కిందికి వస్తుంది. అందువల్ల సంధ్యావందనంలో యమాయ ధర్మరాజః అని వస్తుంది. యముడు తన ధర్మాన్ని నిర్వహిస్తున్నాడు.

**అథ** – ఇప్పుడు, నేను మరణించబోతున్నప్పుడు

**ఇదం శరీరం భస్మాంతగ్ం** – ఈ శరీరం అగ్నికి ఆహుతి చేయబడినదై, భస్మమే అంతంగా గలది అగుగాక! అంటే నా మరణం తర్వాత ఈ స్థూలశరీరం కాలి బూడిద అయి, పృథివీ దేవతతో కలవాలి అంటున్నాడు ఉపాసకుడు.

**వాయురనిలమ్** – నేను మరణించాక నా శరీరంలో ఉన్న ప్రాణం, అనంతంగా ఉన్న హిరణ్యగర్భలో కలిసిపోవాలి. వాయుః అంటే ప్రాణం; అనిలమ్ అంటే హిరణ్యగర్భ. ఎటువంటి హిరణ్యగర్భ?

**అమృతమ్** – అమృతమైన హిరణ్యగర్భ. కాకపోతే ఇక్కడ అమృతం అంటే శాశ్వతం కాదు, ఆపేక్షిక అమృతత్వాన్ని తీసుకోవాలి.

ఈ ఉపనిషత్తులోనే హిరణ్యగర్భ ఉపాసన గురించి చూసినప్పుడు వినాశం అనే పదాన్ని చూశాము. పుట్టుక ఉన్న ప్రతిదానికీ వినాశం తప్పదు. కాని అది చాలా ఎక్కువకాలం ఉంటుంది కాబట్టి అమృతమ్ అంటారు.

ఈ ఉపాసకుడు తన ప్రాణాలు హిరణ్యగర్భలో కలవాలి అని చేసిన ప్రార్థనను ఉపలక్షణంగా తీసుకోవాలి. మన శరీరంలో ప్రతి అంగానికి ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. ఉదాహరణకు కన్నుకు సూర్యుడు, మనస్సుకు చంద్రుడు, చేతులకు ఇంద్రుడు అధిష్ఠానదేవతలు. అతని మరణానంతరం ఈ అధిష్ఠానదేవతల అంశాలు ఆయా అధిష్ఠానదేవతలలో కలవాలని ప్రార్థిస్తున్నాడు.

తక్కిన జీవాత్మలకు (కేవల కర్మఠులకు) మళ్ళీమళ్ళీ ప్రయాణం ఉంటుంది. ఐస్‌బర్గ్ నీళ్ళలో వెళుతున్నట్టుగా, అహంకారం అనే ఐస్‌బర్గ్ అంత తేలికగా కరగదు. కాని ఈ ఉపాసకునికి అహంకారం లేదు, శరీర అభిమానమూ లేదు. తన శరీరం ఎప్పటికైనా కాలి బూడిద కావాల్సిందే అని తెలుసు అతనికి. అతని అంత్యక్రియలను అంత్యేష్టి సంస్కారం అంటారు. అలా యజ్ఞాలు చేసిన గృహస్థు మరణం అంటే భయపడడు. దానిని కూడా ఒక యజ్ఞంలా తీసుకుంటాడు. తన శరీరాన్ని అగ్నికి ఆహుతి చేశాక, తన సూక్ష్మశరీరం ఆయా అధిష్ఠాన దేవతలతో కలవాలని, దానికి తను శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళాలనీ ప్రార్థిస్తున్నాడు. అంటే తను బ్రహ్మలోకంలో జ్ఞానం పొంది అక్కడ క్రమముక్తి పొందుతాడు.

**ఓం** – ఓంకారం ఒక ఆలంబన. ఇక్కడ ఓంకారం హిరణ్యగర్భకు ఆలంబన. అంతకు ముందు సూర్యభగవానునికి ప్రార్థన చేస్తే ఇక్కడ అగ్నికి ప్రార్థన చేస్తున్నాడు.

**క్రతో స్మర** – ఇక్కడ క్రతో అని రెండుసార్లు వచ్చింది. అందువల్ల శంకరాచార్యుల వారు రెండింటికీ రెండు అర్థాలు చెబుతున్నారు. మొదటి క్రతో అర్థం మనస్సు. ఓ మనసా, నువ్వు గుర్తుపెట్టుకో అంటున్నాడు. ఏం గుర్తుపెట్టుకోవాలి?

**కృతగ్ం స్మర** – నేను ఇంతవరకూ చేసిన క్రతువులు అన్నీ గుర్తుపెట్టుకో అంటున్నాడు. క్రతువులు అంటే ఇక్కడ ఉపాసనలు. ఓ మనసా, తక్కినవన్నీ మర్చిపో, నేను చేసిన ఉపాసనలు మాత్రమే గుర్తుపెట్టుకో. అంటే అహంగ్రహ ఉపాసన గుర్తుపెట్టుకో. చివరి నిముషంలో భగవన్నామ స్మరణ చేయాలి. నీ చరణ కమలాల నేనున్న చాలు అనగలగాలి. భీష్మాచార్యులు చివరి నిముషంలో అందరినీ పంపివేసి, కృష్ణపరమాత్మ మాత్రమే పక్కనుండాలని కోరుకున్నాడు.

భగవద్గీతలోని ఎనిమిదవ అధ్యాయం ఈ నాలుగు మంత్రాలను ఆధారం చేసుకుని వచ్చినదే.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥** – గీత 8.6
**తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ** – గీత 8.7

మరణకాలంలో దేని గురించైతే తలుచుకుంటారో, దాన్నే పొందుతారు. అందువల్ల ఎప్పుడూ, ఎల్లవేళలా నన్నే (పరమాత్మనే) స్మరించు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కాని మనస్సు మాట వినదు. ఎటెటో వెళ్ళిపోతుంది. అలా వెళ్ళకుండా ఉండటానికి జ్ఞాని అయిన సదాశివ బ్రహ్మేంద్ర మనస్సుమీద అద్భుతంగా రాశారు.

**మానస సంచరరే బ్రహ్మణి మానస సంచరరే**
**మదశిఖి పింఛాలంకృత చికురే మహనీయ కపోల విజితముకురే**

ఓ మనసా ఎప్పుడూ పరమాత్మ ధ్యానంలోనే ఉండు. నెమలిపింఛం ధరించి, అద్దంలా మెరిసిపోయే ముఖబింబం ఉన్న భగవంతుణ్ణి ధ్యానం చేయి.

**క్రతో స్మర** – మనస్సుకు చేసినట్టే ఇప్పుడు అగ్నిదేవతకు ప్రార్థన చేస్తున్నాడు ఈ ఉపాసకుడు. అందువల్ల ఇక్కడ క్రతో అంటే ఓ అగ్నీ, నువ్వు గుర్తు పెట్టుకో అంటున్నాడు. ఏం గుర్తు పెట్టుకోవాలి?

**కృతగ్ం స్మర** – నేను ఇంతవరకూ చేసిన క్రతువులు అన్నీ గుర్తు పెట్టుకో అంటున్నాడు. క్రతువులు అంటే ఇక్కడ కర్మలు. చాలా కర్మలు యజ్ఞయాగాదుల రూపంలో ఉంటాయి. యజ్ఞయాగాదుల్లో ఎక్కువగా అగ్నికి ఆహుతి వేయటం ఉంటుంది. అలా యజ్ఞాలు కాకుండా,

మామూలు పూజ అయినా కూడా దీపం వెలిగించి పూజ చేస్తారు. అలా అగ్నిసాక్షిగా కర్మలు చేయటం అవుతుంది. అందువల్ల ఓ అగ్నిదేవతా! నువ్వు నేను చేసిన కర్మలన్నీ గుర్తుపెట్టుకో.

ఇక్కడ ఆ ఉపాసకుడు తను కర్మలు, ఉపాసనలు చేయకుండా, ఫలాన్ని ఆశించటం లేదనీ, చేసిన కర్మలు, ఉపాసనలకు రావాల్సిందేదో పొందే హక్కు ఉందనీ చెప్పకనే చెబుతున్నాడు. అందువల్ల ఇక్కడ బ్రతిమాలటం లేదు, అధికార పూర్వకంగా చెబుతున్నాడు. నువ్వు నేను చేసిన కర్మలన్నిటికీ సాక్షివి. అవి ఒకసారి గుర్తు తెచ్చుకో అంటున్నాడు. అగ్ని ఎలా సాక్షో ఇంకా వివరంగా వచ్చే మంత్రంలో చెబుతున్నాడు.

### మంత్రం 18

**అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్।**

**యుయోధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ ॥**

ఇంతవరకూ నాకు అధికారం ఉందని అంత గట్టిగా చెప్పినా, ఎక్కడో, ఏమూలో శంక ఉంది. ఏవైనా పాపాలు మిగిలిపోయాయేమో అనే శంక ఉంది. అందువల్ల ఓ అగ్నీ, ఆ పాపాలు తొలగించు, దానికోసం నీకు శతకోటి నమస్కారాలు అంటున్నాడు.

**అగ్నే** – ఓ అగ్నిదేవతా,

**సుపథా నయ** – నువ్వు నన్ను శోభనమార్గం ద్వారా తీసుకువెళ్ళు గాక! శోభనమార్గం అంటే శుక్లమార్గం. ఉపాసకునికి కృష్ణగతి కూడా సుపథం కాదు. ఎందుకంటే కృష్ణగతిలో వెళ్ళిన వ్యక్తి మళ్ళీ వెనక్కి తిరిగివస్తాడు. వెళ్ళేది పుణ్యలోకానికి అయినా తిరిగివస్తాడు కాబట్టి కృష్ణగతి శోభనమార్గం కాదు.

నయ – తీసుకువెళ్ళు.

**రాయే** – పుణ్యఫల ప్రాప్తయే – నేను చేసిన కర్మ, ఉపాసనల సముచ్చయ ఫలం ఏదైతే ఉందో, అది నాకు రావాలి. నేను ఇవి చేశాను కాబట్టే అడుగుతున్నాను.

**అస్మాన్** – అస్మాన్ అంటే కర్మజ్ఞాన సముచ్చయాన్ని అనుష్ఠించి ఉన్న నువ్వు ఎరుగుదువు.

**వయునాని** – కర్మలు;

**విశ్వాని** – చేసిన కర్మలన్నింటినీ;

**విద్వాన్** – నువ్వు ఎరుగుదువు;

**దేవ** – ఓ అగ్నిదేవా. ఇవన్నీ కలిపితే ఓ అగ్నిదేవా, నీకు నేను చేసిన అన్ని కర్మలూ తెలుసు. ఆ కర్మలకు వచ్చే ఫలం ఏదుందో అది నాకు అందజేయి.

ఈ ఉపాసకుడు చేసిన కర్మ, ఉపాసనలకు ఏ ఫలం రావాలో అది వచ్చి తీరుతుంది కదా, మళ్ళీ ప్రత్యేకించి అడగటం ఎందుకు? అతను చేసిన కర్మలో ఏవైనా దోషాలుండవచ్చు. అంటే మంత్రాలు పలకటంలో తప్పు పలకవచ్చు. అందువల్ల అంతా అయ్యాక ఓం తత్సత్ చెబితే కర్మలో దోషాలు తొలగుతాయి. అంతేకాదు, అతను తెలిసో, తెలియకో ఏవైనా పాపాలు చేసి ఉండవచ్చు కూడా. అవి ఉంటే బ్రహ్మలోకానికి వెళ్ళలేడు. అందువల్ల ఇప్పుడు చేసే ప్రార్థన సద్గుణ్య సంపాదనార్థం చేసే ప్రార్థన.

**యేనః** – పాపం, ఎటువంటి పాపం?

**జుహురాణమ్** – కుటిలమైన పాపం, వంచనాత్మకమైన పాపం.

**యుయోధి** – నాశనం చేయి. ఎవరినుంచి?

**అస్మద్** – మానుంచి. ఈ సాధకుడు తన ఒక్కడి గురించే అడగటం లేదు. అందరి గురించీ అడుగుతున్నాడు. అంటే తమ పుణ్యాన్ని పాపప్రతిబంధకం లేని పుణ్యంగా చేయమని ప్రార్థిస్తున్నాడు.

ఏదైనా పూజ చేసేటప్పుడు సంకల్పంలో సమస్త దురితక్షయ ద్వారా అని చెబుతాము. దాని అర్థం జుహురాణం యేనః యుయోధ్యః.

పాపం ఉంటే పుణ్యలోకాలకు వెళ్ళలేరు. అందువల్ల ఆ పాపాన్ని, తన పుణ్యకర్మలతో నాశనం చేయమని కోరుతున్నాడు సాధకుడు. అలా పాపనాశనం అయితే అతను కోరిన బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది. ఇదే ఆఖరు అవకాశం అతను క్రమముక్తి పొందటానికి. దానికి బదులుగా అతను ప్రాయశ్చిత్త కర్మలు చేసే పరిస్థితిలో లేడు, ఆఖరికి సాష్టాంగ నమస్కారం కూడా చేసే పరిస్థితిలో లేడు. అదే చెబుతున్నాడు.

**తే** – నీకు,

**నమఉక్తిం విధేమ** – నమస్కార వచనం చేస్తున్నాను. పరిచర్యలు చేసే పరిస్థితిలో లేను. మాటలతో నేను నమస్కారం చేస్తున్నాను.

**భూయిష్ఠామ్** – పదే పదే. అంటే మాటలతోనే నీకు శతకోటి నమస్కారాలు చేస్తున్నాను.

ఇక్కడితో అజ్ఞానీ ఉపాసకుడు చేసే గతి ప్రార్థన అయిపోయింది. ఇది ఆఖరి నిముషంలో చేసిన ప్రార్థనే అయినా కూడా ఎప్పుడైనా చేయవచ్చు.

మరి జ్ఞాని పరిస్థితి ఏమిటి? అతనికి ప్రయాణం లేదు. ఎందుకంటే అతను ఎప్పుడూ పరమాత్మ ఒడిలోనే ఉంటాడు. శివానందలహరిలో యోగికి ప్రయాణం లేదని వస్తుంది. ప్రయాణం లేకపోయినా, జ్ఞాని చేసే ప్రార్థన చూడాలంటే భర్తృహరి వైరాగ్యశతకంలోకి వెళ్ళాలి.

**మాతర్మేదిని తాత మారుత సఖే తేజః సుబంధో జల।**

**భ్రాతర్వ్యోమ నిబద్ధ ఏష భవతామ్ అంత్యః ప్రణమాంజలిః॥**

జ్ఞాని నా కుటుంబం అంతా గుర్తుకు వస్తోంది అంటున్నాడు. జ్ఞానికి కుటుంబం ఏమిటి? పంచభూతాలే అతని కుటుంబం. తల్లి పృథివీ, భూమి అన్నింటి భారం మోసినట్టుగా తల్లి అందరి భారం మోస్తుంది; తండ్రి వాయువు, వాయువు సేదదీర్చినట్టుగా తండ్రి సేద తీరుస్తాడు; సఖుడు అగ్ని, అగ్ని శరీరాన్ని వెచ్చగా ఉంచినట్టు సఖుడు వెచ్చటి స్నేహాన్ని పంచుతాడు; బంధువులు నీరు, నీరు చల్లదనాన్ని పంచినట్లు బంధువులు ఆప్యాయతను చూపుతారు; సోదరుడు ఆకాశం, ఆకాశం అన్నింటికీ ఆధారం అయినట్టుగా సోదరుడు ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటాడు. ఇదే నా చివరి ప్రార్థన అంటున్నాడు జ్ఞాని. తర్వాత వచ్చే పద్యంలో మీవల్ల పుట్టాను, మీ సంగత్వంవల్లనే ఆత్మజ్ఞానం పొందాను, నా భ్రమలు పోయాయి అని పంచభూతాలకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాడు. ఇదీ జ్ఞాని ప్రార్థన.

ఈశావాస్యోపనిషత్‌లో చివరి నాలుగు మంత్రాలలో అజ్ఞాని ప్రార్థనతో ఈ ఉపనిషత్తు అయిపోయింది.

# ఉపనిషత్ తాత్పర్యనిర్ణయ భాష్యం

శంకరాచార్యులవారి కాలంలో జ్ఞానకర్మ సముచ్చయ వాదన బలంగా ఉండేది. అందువల్ల శంకరాచార్యుల సందర్భం వచ్చినప్పుడల్లా జ్ఞానకర్మ సముచ్చయ ఖండన చేస్తూనే వస్తారు. ఇంత చిన్నదైన ఈశావాస్యోపనిషత్‌లోనే నాలుగుసార్లు ఆ అంశాన్ని చర్చిస్తూ వస్తున్నారు. ఉపోద్ఘాతంలో ఒకసారి, మూడవ మంత్రం ముందు ఒకసారి, తొమ్మిదవ మంత్రం ముందు ఒకసారి చేసి, ఇప్పుడు మళ్ళీ పద్దెనిమిదవ మంత్రం తర్వాత కూడా జ్ఞానకర్మ సముచ్చయ ఖండన చేస్తున్నారు. ఇప్పటి వాదన చూసేమందు ఒకసారి ఇంతకుముందు చేసిన వాదనలను పునరావృత్తం చేసుకుందాము.

## ఉపోద్ఘాతంలో చర్చ

**పూర్వపక్షి –** ఈశావాస్యోపనిషత్ మంత్రభాగంలో వస్తుంది కాబట్టి దానికి కర్మశేషిత్వం ఉంది అంటాడు పూర్వపక్షి. కర్మశేషిత్వం అంటే కర్మ సంబంధం.

**శంకరాచార్యులవారి జవాబు –** దీనికి కర్మశేషత్వం ఉందని నిరూపించటానికి శ్రుతి ప్రమాణం లేదు, లింగప్రమాణం లేదు.

**పూర్వపక్షి –** ఆత్మ లక్షణాలు అర్థవాద వాక్యాలు.

**జవాబు –** అర్థవాద వాక్యాలను విధివాక్యాలతో కలపాలి. ఈశావాస్యోపనిషత్‌లోనే కాదు, ఏ ఉపనిషత్‌లో కూడా ఆత్మలక్షణాలు చెప్పాక, అందువల్ల ఈ కర్మ చేయి అని రాదు. కాబట్టి జ్ఞానకాండ పృథక్ శాస్త్రం. అంటే దీనికి స్వతంత్రంగా ఉనికి ఉంది, కర్మతో కలపనవసరం లేదు.

## మంత్రం 3 ముందు వాదన

**పూర్వపక్షి –** జ్ఞానమార్గం ఒకరికి, కర్మమార్గం వేరొకరికి అని ఉపనిషత్ ప్రత్యేకించి చెప్పనప్పుడు మీరెలా చెప్పగలరు?

**జవాబు –** రెండవ మంత్రం ముందే అథ ఇతరస్య అని మేము చెప్పాము. అంటే ఆత్మజ్ఞానం నేర్చుకునే శక్తి లేనివారికి ఈ కర్మమార్గము అని చెప్పాము. జ్ఞానకర్మలకు విరోధం పర్వతమంత ఎక్కువగా ఉంది; దాన్ని కదపలేము అని ముందే చెప్పాము కదా అంటున్నారు శంకరాచార్యుల వారు.

అయినా ఇక్కడ కర్మకు, జ్ఞానానికి మధ్య ఐదుభేదాలను చూపించారు. అన్నీ శ్రుతి ప్రమాణాలే. ఎక్కువగా ఈశావాస్యంలోంచి చెబితే, కొన్ని మహాభారతంనుంచి చెప్పారు.

1. క్రియాకారక ఫల భేద త్యాగః – స్వీకారః
   తేన త్యక్తేన భుంజీథాః – కోరికలను వదులుకో – ఇది జ్ఞానికి.
2. ధనత్యాగః – స్వీకారః
   మా గృధః కస్యస్విద్ధనమ్ – ఎవరి సొమ్మును ఆశించకు. ఇది జ్ఞానికి.
3. జిజీవిషేత్ అభావః – భావః
   శతగ్ం సమా జిజీవిషేత్ – వంద సంవత్సరాలు జీవించాలని కోరుకో – ఇది కర్మఠునికి.
4. గతి అభావః – భావః (ఫలభేదం)
   తత్ర కో మోహః కశ్శోకః – అతనికి శోకమోహాలు లేవు – ఇది జ్ఞానికి.
5. నివృత్తి మార్గః – ప్రవృత్తి మార్గః
   ద్వావిమావథ పంథానే – రెండు మార్గాలు ఉన్నాయి.

## మంత్రం 9 ముందు వాదన

**పూర్వపక్షి** – రాబోయే మంత్రాలు కర్మనిష్ఠులకే కాని, జ్ఞాననిష్ఠులకు కాదని ఎలా చెప్పగలరు?

అక్కడ యుక్తి ద్వారా జవాబు చెప్పారు శంకరాచార్యుల వారు.

**జవాబు** – ద్వైత త్యాగః – స్వీకారః – కర్మ చేయటానికి ద్వైతస్వీకారం చేస్తే, అద్వైతం నేర్చుకోవటానికి ద్వైతనిషేధం చేయాలి.

**పూర్వపక్షి** – ఉపాసన, జ్ఞాన సముచ్చయం చేయవచ్చు.

**జవాబు** – ఉపాసన కూడా కర్మ జాతికి చెందింది కాబట్టి కుదరదు.

**పూర్వపక్షి** – విద్య అంటే జ్ఞానం. దాన్ని ఉపాసనగా ఎలా తీసుకుంటారు?

**జవాబు** – ఇక్కడ సందర్భం ఉపాసన. ఉపనిషత్తు కేవలకర్మను, కేవల ఉపాసనను ముందు మంత్రంలో నిందించింది, తరువాత వాటి సముచ్చయం చేయమని చెప్పటంకోసం. ఉపాసన కర్మతోనే కలుస్తుంది, జ్ఞానంతో కాదు.

**పూర్వపక్షి** – ఉపాసనవల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది.

**జవాబు** – వాటి ఫలాలు వేరే. ఉపాసకుడు బ్రహ్మలోకానికి వెళితే, జ్ఞాని మోక్షం పొందుతాడు.

ఇక్కడితో ముందు వాదనలు అయిపోయాయి. ఇప్పుడు మంత్రం 18 తర్వాత వచ్చే వాదోపవాదాలు చూడాలి. ఇన్నిసార్లు జ్ఞానకర్మ సముచ్చయ ఖండన అవసరమా అంటే అవసరమే అంటున్నారు స్వామీజీ.

స్వామీజీ ఒక పుస్తకం చదివారుట. ఆ పుస్తకంలో శంకరభాష్యం వివరించి, శంకరాచార్యుల వారు చేసిన జ్ఞానకర్మ సముచ్చయాన్ని ఆ రచయిత వివరించి, చివరగా తన మాట ఒకటి వేశారుట. ఏమిటది? శంకరాచార్యులవారు జ్ఞానకర్మ సముచ్చయం కుదరదంటున్నారు కాని అది సాధ్యమే అంటారు. శంకరులవారి భాష్యం చదివి, దాన్ని వివరించి కూడా ఆ రచయిత అలా అంటే, ఇంక మిగతావారి సంగతి ఏమని చెప్పాలి? అంత తేలికగా ఈ విషయంమీద ఉన్న అయోమయం పోదు. అందువల్ల ఇప్పుడు మంత్రం 18 తర్వాత శంకరాచార్యులవారు ఏం చెప్పారో చూద్దాము.

## మంత్రం 18 తర్వాత వాదోపవాదాలు

అసలీ వాదోపవాదాలు మళ్ళీ ఎందుకు వచ్చాయి? దానికి ఆధారం 11, 14 మంత్రాలు. ఆయా మంత్రాలలో వాదనలకు ఆస్కారమైన పదాలను చూద్దాము.

**అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే** – 11

**వినాశేన మృత్యుం తీర్త్వాఽసంభూత్యాఽమృతమశ్నుతే** – 14

మంత్రం 11లో అవిద్య, విద్య పదాలు వచ్చాయి. రెండు మంత్రాల్లోనూ అమృతం పదం వచ్చింది. అవిద్య పదంతో ఏ సమస్యా లేదు. అవిద్యా అంటే కర్మ అని అటు పూర్వపక్షీ, ఇటు శంకరాచార్యులవారూ ఇద్దరూ ఒప్పుకొంటారు. వచ్చిన సమస్యల్లా విద్య పదంతోనే!

**పూర్వపక్షి – విద్య** – విద్య పదంయొక్క ముఖ్యార్థం జ్ఞానం, లక్ష్యార్థం ఉపాసన. ముఖ్యార్థమైన జ్ఞానం వదిలేసి, ఉపాసనగా ఎందుకు తీసుకుంటారు మీరు? అలాగే అమృతంయొక్క ముఖ్యార్థం మోక్షం. అటువంటి ముఖ్యార్థమైన మోక్షాన్ని వదిలేసి బ్రహ్మలోకప్రాప్తి అని ఎలా చెబుతారు అంటున్నాడు పూర్వపక్షి.

**జవాబు** – నిజానికి ఈ ప్రశ్నకు జవాబు ముందే చెప్పటమైనది కదా అంటున్నారు శంకరాచార్యులవారు. కర్మకు, జ్ఞానానికి విరోధం ఉందని ముందే చూశాము. జ్ఞానానికి ద్వైతనిషేధం చేస్తే, కర్మకు ద్వైతస్వీకారం చేయాలని చూశాము.

**తమః ప్రకాశవత్ విరుద్ధ స్వభావః**

**పూర్వపక్షి** – కర్మకు, జ్ఞానానికి విరోధం ఉందని మీరు చెప్పారు కాని నాకేమీ కనబడటం లేదు. మనం చర్చిస్తున్న అంశాలు శాస్త్రంలో చెప్పబడ్డ అంశాలు. అవి వైదికకర్మ, వైదిక ఉపాసన, వైదికజ్ఞానం; వీటన్నిటికీ శాస్త్రమే ప్రమాణం. కాబట్టి శాస్త్రం నిర్ణయించనీ, జ్ఞానకర్మ సముచ్చయం చేయాలో వద్దో. శాస్త్రం చేయమనే చెప్పింది కాబట్టి శాస్త్రం విధించినది

అంతిమతీర్పు. దానికింక తిరుగులేదు. ఒకవేళ విరోధం ఉంటే, శాస్త్రమే చెబుతుంది, ఈ రెండింటినీ కలపకండి అని చెప్పి. ఆ విషయం నిరూపించటానికి పూర్వపక్షి ఒక ఉదాహరణ కూడా ఇస్తాడు.

శాస్త్రం హింస చేస్తే పాపం వస్తుందని బోధిస్తుంది. శాస్త్రం హింస చేస్తే బాధ వేస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఎందుకంటే అది మనకు అనుభవంలోకి వచ్చే విషయమే. పాపం మన కంటికి కనపడే విషయం కాదు. పాపం అపౌరుషేయ విషయం కాబట్టి చెబుతుంది. అదే శాస్త్రం యాగంలో పశుహింస చేయవచ్చు అంటుంది. యాగంలో పశు హింస పాపం కిందకు రాదు అంటుంది. అందువల్ల హింస చేయాలా, వద్దా అనేది శాస్త్రమే నిర్ణయిస్తుంది. తర్కం జోలికి పోకూడదు అంటాడు పూర్వపక్షి.

పాప సత్వే శాస్త్రం ప్రమాణమ్। పాప అసత్వే అపి శాస్త్రం ప్రమాణమ్।

అందువల్ల శాస్త్రం చెప్పింది కాబట్టి ఆత్మవిద్య, కర్మలను సముచ్చయం చేయాలి. అవి అవిరోధం అంటున్నాడు పూర్వపక్షి.

శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకోవాలని అద్వైత వేదాంతం కూడా నమ్ముతుంది. అందులో ఏమాత్రం సందేహం లేదు. వేరే సందర్భంలో కొందరు సంచితకర్మలు జ్ఞానం పొందితే నాశనమవుతాయని ఎలా చెప్పగలరు అని ప్రశ్నిస్తారు. వారికి జవాబు చెప్పేముందు, వారిని ఎదురు ప్రశ్నించాలి. అసలు సంచితకర్మలు ఉన్నాయని మీకెలా తెలుసు?

ప్రారబ్ధకర్మ ఉందని చెప్పగలము కాని సంచితకర్మలు మనకు ప్రత్యక్షంగా తెలియదు. దానికి వారి జవాబు – సంచితకర్మలు ఉన్నాయని నిరూపించటానికి శాస్త్రమే ప్రమాణం అంటారు.

అప్పుడు మనం తిరిగి ప్రశ్నిస్తాము. శాస్త్రం సంచితకర్మలు ఉన్నాయని చెబితే నమ్ముతారు కాని, అదే శాస్త్రం ఆ సంచితకర్మలే జ్ఞానం పొందితే జ్ఞానాగ్నిలో దగ్ధమవుతాయని చెపితే నమ్మరా? శాస్త్రాన్ని అలా కొంత నమ్మి, కొంత నమ్మకపోతే దాన్ని అర్ధజరతీయ న్యాయం అంటారు. అంటే ఒక మనిషి సగం వృద్ధుడు, సగం యువకుడు అని ఎలా అనలేమో, అలా శాస్త్రంలో కర్మకాండ ప్రమాణం, జ్ఞానకాండ అప్రమాణం అని కూడా అనలేము.

**జవాబు** – అలా మనం కూడా శాస్త్రప్రమాణాన్ని నమ్ముతాము కాబట్టి శంకరాచార్యులవారు ఈ సవాలుకు నేను కూడా సిద్ధమే అంటున్నారు. మామూలుగా ఇలా ఏ విషయంలోనైనా వాదోపవాదాలు వచ్చినప్పుడు వాటిని శంకరులవారు శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాల ద్వారా ఖండిస్తారు. ఇందులో కూడా తొమ్మిదవ మంత్రం ముందు తర్కం ద్వారా ఖండించారు. కాని ఇప్పుడు శ్రుతి ప్రమాణంతో ఖండించటానికి సిద్ధమే అంటున్నారు.

మీరు ఈశావాస్యోపనిషత్‌నుంచి ఉటంకిస్తే, నేను కఠోపనిషత్‌నుంచి చెబుతానని అంటున్నారు శంకరాచార్యులవారు.

**దూరమేతే విపరీతే విషూచీ అవిద్యాయా చ విద్యేతి జ్ఞాతా**
**విద్యాభీప్సినం నచికేతసం మన్యే న త్వా కామా బహవోఽ లోలుపన్త** – కఠ 1.2.4

విషూచీ – విభిన్న మార్గాలు; రెండూ పరస్పర విరుద్ధమైనవి. ఏ రెండూ? అవిద్యా, విద్యా. అక్కడ కూడా అవిద్య అంటే కర్మేగాని, విద్య అంటే ఆత్మజ్ఞానం. ఈ రెండూ విభిన్నం. ఇది శ్రుతిప్రమాణమే.

**పూర్వపక్షి** – సరే, మీకూ శ్రుతిప్రమాణం ఉంది, మాకూ శ్రుతిప్రమాణం ఉంది కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో ఎవరికి కావాల్సింది వారు ఎన్నుకోవచ్చు. దాన్ని వికల్పః అంటారు.

ఈ సందర్భం పూర్వమీమాంసలో వస్తూ ఉంటుంది. బ్రహ్మసూత్రాల్లో రెండు ప్రసిద్ధి చెందిన వాక్యాలను చర్చించారు శంకరాచార్యులవారు. ముందు అవేమిటో చూద్దాము.

**అతిరాత్రే షోడశినం గృహ్ణాతి**

**అతిరాత్రే షోడశినం న గృహ్ణాతి**

యజ్ఞంలో పదహారవ పాత్రను వాడాలని ఒక శాఖలో వస్తే, యజ్ఞంలో పదహారవ పాత్రను వాడకూడదని ఇంకొక శాఖలో వస్తుంది. అప్పుడేం చేయాలి? అది ఆ యజ్ఞం చేసే కర్మఠుని ఇష్టం. అతను ఏది కావాలనుకుంటే అది చేస్తాడు. దాన్ని వికల్పః అంటారు.

**ఉదితే జుహోతి – సూర్యుడు ఉదయించాక చేయాలి**
**అనుదితే జుహోతి – సూర్యుడు ఉదయించక ముందు చేయాలి.**

ఇది ఇంకొక ఉదాహరణ. ఇక్కడ కూడా కర్మచేసే వ్యక్తి ఇష్టప్రకారం జరుగుతుంది.

ఈ వికల్పవాదాన్ని అనుసరించి వాదిస్తున్నాడు పూర్వపక్షి. నేను శుక్లయజుర్వేదానికి చెందిన ఈశావాస్యోపనిషత్‌ను పాటించి సముచ్చయం చేస్తాను; మీరు కృష్ణయజుర్వేదానికి చెందిన కఠోపనిషత్‌ను పాటించి సముచ్చయం చేయకండి. సమస్య తీరింది కదా అంటాడు.

**జవాబు** – ఈ వికల్పవాదన కర్మకు మాత్రమే పరిమితం; జ్ఞానానికి వర్తించదు. కార్య విషయంలోనూ, సాధ్యవిషయంలోనూ వికల్పం చెల్లుతుంది కాని జ్ఞానవిషయంలోనూ, సిద్ధవిషయంలోనూ చెల్లదు. జ్ఞానం అనేది సత్యం. సత్యం ఒకటే ఉంటుంది.

పూజ్య స్వామీజీ ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. ఆయన చేతిలో గులాబీపువ్వును పట్టుకొని ఇది గుమ్మడికాయ అని చెప్పినా ఎవరూ నమ్మరని, ఆయనమీద గౌరవం ఎంతున్నా, వారి కన్ను చూపించిన దాన్నే నమ్ముతారనీ అనేవారు. అలాగే జ్ఞానవిషయంలో ఒక శ్రుతి

వాక్యాన్ని ప్రమాణంగా తీసుకోవాలి; రెండవ శ్రుతి వాక్యాన్ని తదనుగుణంగా వ్యాఖ్యానించాలి అంటారు శంకరాచార్యులవారు.

**పూర్వపక్షి** – సరే అయితే, ఒకటే శ్రుతివాక్యాన్ని తీసుకోవాలంటే మీ వాక్యాన్నే ఎందుకు తీసుకోవాలి, మేము చెప్పిన శ్రుతివాక్యాన్ని తీసుకోండి అంటాడు పూర్వపక్షి.

**జవాబు** – అలా ఏదో ఒకటి తీసుకోవటం కుదరదు. దానికి కూడా ఒక సూత్రం ఉంది.

**శ్రుతి స్మృత్యోః పరం బాధే శ్రుతిరేవ గరీయసీ**

శ్రుతివాక్యానికీ, స్మృతివాక్యానికీ మధ్య వివాదం వస్తే, శ్రుతివాక్యానికే విలువనివ్వాలి. ఎందుకంటే స్మృతి శ్రుతినుంచి వచ్చింది.

**శ్రుత్యోః పరస్పరం బాధే న్యాయోపేతా గరీయసీ**

అలాగే రెండు శ్రుతివాక్యాల మధ్య భేదం వస్తే తర్కాన్ని ఉపయోగించి ఏది సరియైనదో తేల్చుకోవాలి.

పూర్వపక్షి తర్కం వద్దు, శ్రుతినుంచి చూడాలి అన్నాకూడా తర్కానికి రాకతప్పలేదు. కాకపోతే ఇది శ్రుతి సమ్మత తర్కం. అందువల్ల శంకరాచార్యుల వారు తర్కపరంగా, నేను చెప్పిన శ్రుతిప్రమాణమే సరియైనది అంటున్నారు. దానికి ఆయన ఇచ్చిన జవాబు – **హేతు స్వరూప ఫల విరోధాత్**.

కర్మ, జ్ఞానాల మధ్య విరోధం ఉంది అన్నదే గెలుస్తుందని హేతువు, స్వరూపం, ఫలం నిరూపిస్తున్నాయి.

**హేతువు** – సాధ్యం పొందటానికి చేసే సాధనలు భిన్నం. కర్మ చేయాలంటే ద్వైతాన్ని స్వీకరించాలి; జ్ఞానం పొందాలంటే ద్వైతాన్ని నిషేధించాలి.

**స్వరూపం** – కర్మ చేయాలంటే అహం కర్తా అస్మి, అహం పరిచ్ఛిన్నః అస్మి అనుకోవాలి. జ్ఞాని, ఆత్మజ్ఞానం పొందాక అహం అకర్తా అస్మి, అహం అపరిచ్ఛిన్నః అస్మి అని అర్థం చేసుకుంటాడు.

**ఫలం** – కర్మ చేస్తే వచ్చే ఫలం అనిత్యఫలం, బంధఫలం; జ్ఞానం పొందితే వచ్చే ఫలం నిత్యఫలం, మోక్షఫలం.

అందువల్ల జ్ఞానమార్గంలో వికల్పం కుదరదు. కాబట్టి నేను చెప్పిన శ్రుతివాక్యమే బలమైనది అంటున్నారు శంకరాచార్యుల వారు.

**పూర్వపక్షి** – కఠలో వచ్చిన శ్రుతివాక్యంలో బలం లేదు; ఈశావాస్యోపనిషత్ వాక్యంలోనే బలం ఉంది. ఎందుకంటే కఠోపనిషత్‌లోని వాక్యం అర్థవాద వాక్యంలోకి వస్తుంది. అర్థవాద వాక్యాన్ని విధివాక్యంతో కలుపుకోవాలి. ఈ వాక్యం వచ్చిన సందర్భం చూద్దాము.

మొదటి అధ్యాయంలో మొదటి వల్లీలో నచికేతుడు యమధర్మరాజును ఆత్మజ్ఞానం బోధించమని అడిగాడు. నచికేతునికి యమధర్మరాజు ఆ విషయం చెప్పకుండా తప్పించుకోవటానికి అనేక ప్రలోభాలు పెడతాడు.

**ఇమా రామాః సరథాః సతూర్యా**
**న హీదృశా లంభనీయా మనుష్యైః** – కఠ 1.1.25

మానవలోకంలో తీర్చుకోవటానికి దుర్లభమైన కోరికలన్నీ మొహమాటపడకుండా తీర్చుకో. సారధులతో కూడిన రథాలను, సంగీత విద్వాంసులను, అప్సరసలను ఇస్తానని అనేక విధాలుగా ఆశలు చూపించాడు యమధర్మరాజు.

**అపి సర్వం జీవితమల్పమేవ**
**తవైవ వాహాస్తవ నృత్యగీతే** – కఠ 1.1.26

జీవితమే చాలా చిన్నది. కాబట్టి నువ్వు చెప్పిన గుర్రాలు, ఆటపాటలూ నీ దగ్గరే ఉంచుకో అని చెప్పాడు నచికేతుడు.

అతనిలో ఉన్న సాధన చతుష్టయ సంపత్తికి మురిసిపోయి, అతన్ని మెచ్చుకుంటూ చెప్పాడు ఈ మాటలు యమధర్మరాజు. ఏ కోరికా నిన్ను ప్రలోభపెట్టలేదు అన్నాడు. అందువల్ల ఇది అర్థవాద వాక్యాల కిందికి వస్తుంది. అర్థవాదం అంటే స్తుతివాక్యాలు. వీటిని తీసుకుని మీరింత గొప్పగా చెబుతున్నారు అంటాడు పూర్వపక్షి. ఈశావాస్యోపనిషత్ లోని వాక్యం విధివాక్యం. అందువల్ల దాన్నే తీసుకోవాలని పూర్వపక్షి తేలుస్తాడు.

**జవాబు** – సహ సంభవానుపపత్తేః అంటారు శంకరాచార్యులవారు. అంటే ఒకేవ్యక్తి యందు ఆ రెండూ ఏకకాలంలో కలిసి ఉండటం సంభవం కాదు. కర్మ చేయాలంటే అతను కర్త అవాలి, చేయాలనే కోరిక ఉండాలి. కాని జ్ఞానికి తను అకర్త అని తెలుసు. అతనికి వైరాగ్యం ఉంటుంది. అలా రెండు భిన్నలక్షణాలు ఒకేసారి ఉండవు. వేదం కూడా సంభవమయ్యేదానినే బోధిస్తుంది కాని సంభవం కానిదాన్ని చెప్పదు.

**శ్రోత్రేణ సూర్యం పశ్యేత్**

చెవితో సూర్యుణ్ణి చూడండని చెప్పదు. ఒకవేళ అలా చెప్పినా అది అసాధ్యం. వంద శ్రుతులు చెప్పినా చెవితో సూర్యుణ్ణి ఎలా చూడలేమో అలాగే కర్మను, జ్ఞానాన్ని సముచ్చయం చేయలేము.

**పూర్వపక్షి** – ఒక మెట్టు దిగివస్తాడు పూర్వపక్షి. సరే ఒకే వ్యక్తిలో ఈ రెండూ ఏకకాలంలో కలిసివుండకపోతే అవి ఒకదాని తర్వాత ఇంకొకటి ఉండవచ్చు అంటాడు.

**జవాబు** – అది కూడా సాధ్యం కాదు. ఎందుకంటే జ్ఞానం పుడుతూనే అవిద్య అస్తమిస్తుంది. జ్ఞానానికి ఆశ్రయమైన వ్యక్తిలో అవిద్య (అజ్ఞానం) సంభవం కాదు. అవిద్య లేకపోతే కర్తృత్వం ఉండదు; కర్తృత్వం ఉండకపోతే కర్మ చేయడు. ఉదాహరణకు అగ్ని లక్షణాలు వేడి, వెలుగు అని జ్ఞానం కలిగాక అదే వ్యక్తికి మళ్ళీ అగ్ని చల్లగా ఉంటుంది, ప్రకాశించదు అనే భ్రమ కానీ, అజ్ఞానం కానీ ఉండదు. జ్ఞానం ఉన్నచోట అజ్ఞానానికి చోటులేదు. ఒకవేళ ఇంకా అజ్ఞానం ఉంటే, జ్ఞానం పూర్తిగా పొందనట్టు అర్థం.

'అహం బ్రహ్మ అస్మి అని నాకు తెలుసు, కాని నా భార్యతోనే నాకు గొడవ,' అని ఎవరైనా అంటే అతనికి పూర్తిగా జ్ఞానం కలగనట్టు అర్థం. అహం బ్రహ్మ అస్మి అని చెప్పేది చైతన్యపరంగా. ఆ విషయం చెప్పిన వెంటనే భార్య గురించి చెప్పాడు అంటేనే చైతన్యం స్థాయినుంచి శరీరం స్థాయికి పడిపోయాడని అర్థం. కాని నిజానికి సరిగ్గా జ్ఞానం పొందితే, అలాంటి పొరపాటు ఉండదు. ఈ విషయం ఈశావాస్యోపనిషత్తే చెప్పింది.

**యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజ్యాతః**
**తత్ర కో మోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః** – 7

ఎవరైతే సర్వం ఆత్మమయం జగత్ అని అర్థం చేసుకుంటాడో అంటే ఎవరైతే ఏకత్వాన్ని దర్శిస్తారో ఆ జ్ఞానికి శోకం ఉండదు, మోహం ఉండదని చెప్పింది. శోకమోహాలు ఉండవు కాబట్టి జ్ఞాని కర్మ చేయడు. జ్ఞాని కూడా కర్మలు చేస్తాడు కదా అంటే అతను కర్తృత్వ భావనతో చేయడు.

**పూర్వపక్షి** – శోకమోహాలు ఉండవు అంది కాని, కర్మ ఉండదు అనలేదు అంటాడు పూర్వపక్షి. జ్ఞానికి జ్ఞానశోకమోహ సముచ్చయం ఉండదు కాని జ్ఞానకర్మ సముచ్చయం చేస్తాడు అంటాడు పూర్వపక్షి.

**జవాబు** – జ్ఞానం పొందితే అజ్ఞానమే ఉండదని చెబుతుంటే, కర్మలు చేస్తాడు అనటంలో అర్థం లేదు. కర్మలు అజ్ఞానంనుంచి పుడతాయి. అజ్ఞాని తను కర్త అనుకోవటంవల్ల కోరికలు ఏర్పడతాయి. ఆ కోరికలు తీర్చుకోవటానికి కర్మలు చేస్తాడు. ఇక్కడ అజ్ఞానమే మటుమాయమయినప్పుడు అజ్ఞానంనుంచి పుట్టిన కర్మ చేసే అవకాశం ఎక్కడుంది? ఈ విషయం మీకు అనేకసార్లు చెప్పాను అంటారు శంకరాచార్యుల వారు.

అజ్ఞానానికి మూడు రూపాలు – తెలియకపోవటం, సంశయం, భ్రమ. కర్మకు అజ్ఞానమే పెట్టుబడి. జ్ఞానోదయానికి ముందు అజ్ఞానంవల్ల పుట్టిన కర్మ, ఆత్మజ్ఞానం తర్వాత పోతుంది. ఇదీ క్రమం.

**పూర్వపక్షి** – సరే విద్య అంటే జ్ఞానకర్మ సముచ్చయం కాదని ఒప్పుకుంటాను. కాని అమృతత్వ ఫలాన్ని ఎలా నిర్వచిస్తారు? విద్య అంటే ఆత్మవిద్యగా తీసుకుంటే జ్ఞానాత్ అమృతత్త్వమ్ అని శాస్త్రవాక్యం చక్కగా సరిపోతుంది అంటాడు పూర్వపక్షి. దీన్నిబట్టి విద్య=ఆత్మజ్ఞానం అని చెప్పవచ్చు అంటాడు.

**జవాబు** – అమృతం అంటే మోక్షమే అవాలని లేదు. అమృతం అంటే దేవలోకానికి వెళ్ళటం అంటే ఆపేక్షిక అమృతత్త్వం కిందికి వస్తుంది అది.

ఇంతవరకూ శంకరాచార్యులవారు పూర్వపక్షి వేసిన ప్రశ్నలకు జవాబులు ఇస్తూ వస్తున్నారు. దీన్ని డిఫెన్సివ్ ఆర్గ్యుమెంట్ అంటారు. అంటే తనను తాను సమర్థించుకోవటం. ఇప్పుడు అఫెన్సివ్ ఆర్గ్యుమెంట్‌లోకి దిగుతున్నారు. అంటే పూర్వపక్షినే ఎదురు ప్రశ్నిస్తున్నారు.

విద్య అంటే బ్రహ్మవిద్యగా తీసుకుంటే, ఇక్కడ ఉపాసకుడు చేస్తున్న గతిప్రార్థనలను ఎలా స్వీకరిస్తారు అంటున్నారు.

**హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్** – 15

బంగారురంగులో ఉన్న పాత్రతో నీ ద్వారం కప్పబడివుంది అంటూ ఉపాసకుడు చేసే ప్రార్థన అసంగతమవుతుంది. ఎందుకంటే జ్ఞాని జీవన్ముక్తుడు, మరణించాక విదేహముక్తుడు; అతనికి ప్రయాణం ఉండదు. ప్రయాణం లేని జ్ఞాని ప్రయాణంకోసం ప్రార్థన ఎలా చేస్తాడు? అందువల్ల ఉపనిషత్తు కర్మ, ఉపాసనల సముచ్చయాన్ని చెప్పిందే కాని కర్మ, జ్ఞానాల సముచ్చయం గురించి చెప్పలేదు. ఆ గతిప్రార్థన శ్లోకాల వివరణ ముందు ఈ విషయమే చెప్పాము. ఇప్పుడు కూడా అదే చెబుతున్నాము అంటూ విరమిస్తారు శంకరాచార్యులవారు. ఇక్కడితో శంకరాచార్యులవారు రాసిన భాష్యం సారం కూడా ముగిసింది.

# ఈశావాస్యోపనిషత్ – సారాంశం

ఈశావాస్యోపనిషత్ చాలా చిన్న ఉపనిషత్తు. ఈ ఉపనిషత్తు శుక్లయజుర్వేదానికి చెందినది. తైత్తిరీయోపనిషత్‌లాగా ఈశావాస్యోపనిషత్‌కు కూడా స్వరం అందుబాటులో ఉంది. అందువల్ల దానికి కూడా క్రమ, జట పాఠాలు ఉంటాయి.

ఈశావాస్యోపనిషత్ శుక్లయజుర్వేదం యొక్క మంత్రభాగంలో వస్తుంది. అందువల్ల దాన్ని మంత్రోపనిషత్ అనికూడా అంటారు. మంత్రభాగాన్ని సంహితభాగం అంటారు కాబట్టి దాన్ని సంహితోపనిషత్ అనికూడా అంటారు. ఈ వేదానికి చెందిన ఇంకొక ఉపనిషత్తు బృహదారణ్యకోపనిషత్. దాన్ని బ్రాహ్మణోపనిషత్ అంటారు. సాధారణంగా ఒక వేదంలో వచ్చిన బ్రాహ్మణోపనిషత్, అదే వేదంలో ఉన్న మంత్రోపనిషత్ యొక్క వ్యాఖ్యానం అవుతుంది. ఆ విధంగా బృహదారణ్యకోపనిషత్, ఈశావాస్యోపనిషత్ యొక్క వ్యాఖ్యానం.

ఈశావాస్యోపనిషత్‌లో 18 మంత్రాలు ఉంటే, బృహదారణ్యకోపనిషత్‌లో 400 పైచిలుకు మంత్రాలు ఉన్నాయి. దీన్నిబట్టి ఈశావాస్యోపనిషత్ ఎంత లోతైనదో, ఎంత గంభీరమైనదో అర్థమవుతుంది. శంకరాచార్యులవారు పది ముఖ్యమైన ఉపనిషత్తులని ఏరి, వాటికి భాష్యం రాశారు. అందులో ఈ ఉపనిషత్తు ఒకటి. ఆ పది పేర్లని తేలికగా గుర్తుంచుకోవటానికి ఒక శ్లోకం రూపంలో చెబుతారు.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

చెప్పటానికి ఈశావాస్యం పేరు ముందు చెప్పినా, దాన్ని ముందు బోధిస్తే అర్థం చేసుకోవటం కష్టం. చాలామంది ఈ ఉపనిషత్తుకు భాష్యం రాసినా కూడా, కొంతమంది ఆచార్యులు దీనిని బోధించటానికి ఇష్టపడరు. ఎందుకంటే దీనిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. మన స్వామీజీ కూడా కనీసం నాలుగైదు ఉపనిషత్తులు నేర్చుకున్నాక దీనికి వస్తే, అద్వైత వేదాంతం అప్పటికి జీర్ణించుకుంటారు కాబట్టి, అప్పుడు తేలికగా అర్థమవుతుంది అంటారు. ముందు నేర్చుకోవాల్సిన వరుసక్రమం – ముండకోపనిషత్, కేనోపనిషత్, కఠోపనిషత్, కైవల్యోపనిషత్ (ఈ పదిలో లేకపోయినా కూడా), తైత్తిరీయోపనిషత్, ఆ తర్వాత ఈశావాస్యోపనిషత్. స్వామీజీ బోధ కూడా ఈ వరుసక్రమంలో ఉంటుంది.

ఈ ఉపనిషత్తు ఇంత కష్టమైనదని పదేపదే ఎందుకు చెబుతున్నాము? ఈ ఉపనిషత్తుకు ఉన్న శాంతిపాఠంలోనే వేదాంతసారం వస్తుంది. అది ముందు నేర్చుకుంటే ఒక్క ముక్క కూడా అర్థం కాకపోగా, తల తిరుగుతుంది.

అంతేకాదు, ఈ ఉపనిషత్తులో వచ్చిన చాలా పదాలకు నిఘంటువులోని అర్థం సరిపోదు. ఉదాహరణకు త్యక్తేన అంటే అసలు అర్థం విడిచిపెట్టబడిన అని వస్తుంది. కాని ఇక్కడ త్యాగేన అని తీసుకోవాలి. అంటే త్యాగం చేయబడిన అని అర్థం తీసుకోవాలి. అలాగే అవిద్య అంటే మామూలుగా అజ్ఞానం. ఇక్కడ కర్మ.

**అవిద్యయా మృత్యుం తీర్త్వా**

దీని వాచ్యార్థం అజ్ఞానంవల్ల మృత్యువును జయించవచ్చు. అజ్ఞానంవల్లనే మృత్యువును జయించగలిగితే, ఇంత కష్టపడి ఇన్ని ఉపనిషత్తులను నేర్చుకోవటం ఎందుకు? ఆత్మజ్ఞానానికి రావటం ఎందుకు?

ఉపనిషత్తు అవిద్య, విద్య పదాలు వేసింది. అలాగే సంభూతి, అసంభూతి పదాలు వేసింది. అవేమిటి? వాటి అర్థం ఏమిటి?

అలాగే ఆత్మ లక్షణాలను వివరించేటప్పుడు కొన్ని పరస్పర వ్యతిరేక లక్షణాలను వర్ణించింది.

తదేజతి తన్నైజతి – అది వెళుతుంది, అది వెళ్ళదు

Ôé‘ÆÔÃ_ న్యానత్యేతి తిష్ఠతి – అన్నింటికన్నా వేగంగా వెళుతుంది, అసలు కదలదు

తద్దూరే తద్వంతికే – చాలా దూరంగా ఉంది, చాలా దగ్గరగా ఉంది

అంతేకాదు, ఆ మంత్రాల అర్థం కూడా స్పష్టంగా, ప్రత్యక్ష అర్థంతో ఉండదు.

అంధం తమః ప్రవిశంతి యేఽ విద్యాముపాసతే – కర్మ చేసినవారు చీకటి లోకాలకు వెళతారు.

ఇలా ఈ ఉపనిషత్తులో అడుగడుక్కీ ఎన్నో అర్థంకాని పదాలు, చిక్కుముడులు, మెదడుకు మేతలు ఉన్నాయి. శంకరాచార్యులవారి భాష్యం లేకపోతే, స్వామీజీ బోధ లేకపోతే ఈ ఉపనిషత్తును ఇలా అధ్యయనం చేయగలిగి ఉండేవారం కాదు. ఈ అర్థంకానివన్నీ చాలా తేలికగా అర్థమయ్యేలా చేశారు వీరిద్దరూ.

ఈశావాస్యోపనిషత్‌కు ఈ పేరు ఎందుకు వచ్చింది?

**ఈశా వాస్యమిదగ్ం సర్వమ్** – ఈశావాస్యోపనిషత్

ఈశ మొదటిపదం కాబట్టి దీన్ని ఈశోపనిషత్ అని కూడా అంటారు. అన్ని ఉపనిషత్తులకూ ఈ సూత్రం వర్తించదు. ఒక్కొక్కదానికీ ఒక్కొక్క కారణంవల్ల ఆయా పేర్లు వచ్చాయి. ఉదాహరణకు ఐతరేయోపనిషత్‌కు ఐతరేయ ఋషి దాన్ని దర్శించటంవల్ల వచ్చింది.

**శాంతిపాఠం**

ప్రతి ఒక్క ఉపనిషత్తుకూ ఒక శాంతిపాఠం ఉంటుంది. అది ఏ వేదానికి చెందినదైతే ఆ వేదానికి చెందిన శాంతిపాఠం ఉంటుంది. బృహదారణ్యకోపనిషత్, ఈశావాస్యోపనిషత్ శుక్లయజుర్వేదానికి చెందినవి కాబట్టి వీటికి శాంతిపాఠం పూర్ణమదః.

మామూలుగా శాంతిపాఠం పఠించేది ఆత్మవిద్య ఎటువంటి ఆటంకాలు కలుగకుండా సాఫీగా సాగేలా చేయమని కోరటానికి, అలా సాగటానికి అవసరమైన శారీరక ఆరోగ్యం, మేధాశక్తిని ఇవ్వమని కోరటానికి. కాని ముందే చూసినట్టుగా ఈశావాస్యం ప్రత్యేకత శాంతిపాఠంనుంచే కనిపిస్తుంది.

**ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఈ శాంతిపాఠం అర్థం అక్షరాలా తీసుకుంటే ఇలా వస్తుంది. అది పూర్ణం, ఇది పూర్ణం; పూర్ణంలోంచి పూర్ణం పుట్టింది, పూర్ణంలోంచి పూర్ణం తీసేస్తే పూర్ణమే మిగులుతుంది. దీన్ని ఇంగ్లీషులో చెబితే,

That is whole, this is whole; from whole, whole has come; When you remove whole from whole, whole alone remains.

పూజ్యస్వామీజీ హాస్యంగా అంటారు. ఇది వింటే 'hole alone remains in the student's mind.'

కాని దీని లోతులు కొలిస్తే వేదాంతసారం అంతా మూడే వాక్యాల్లో వచ్చేసింది. అదెలాగో చూద్దాము.

1. **పూర్ణమదః పూర్ణమిదమ్** – పూర్ణం అంటే అనంతం, అపరిమితం, అపరిచ్ఛిన్నం, సర్వవ్యాపకం. ఏదైతే అంతటా వ్యాపించి ఉంటుందో, అది అపరిమితం, అనంతం. అదః అంటే అది. ఈ సందర్భంలో అది అంటే ఈశ్వరుడు లేదా తత్ పదార్థం. పూర్ణమదః అంటే ఈశ్వరుడు పూర్ణం.

పూర్ణమిదమ్ – ఇదం అంటే ఇది. ఈ సందర్భంలో ఇది అంటే జీవుడు లేదా త్వం పదార్థం.

**తత్ త్వమ్ అసి**

ఇదొక మహావాక్యం. ఛాందోగ్యోపనిషత్‌లో వస్తుంది. ఈ పూర్ణమదః పూర్ణమిదం తత్ త్వమ్ అసిని ఎలా చూపిస్తుంది? దీనికి లక్ష్యార్థం తీసుకోవాలి. రెండు పూర్ణాలు ఉండవు. కాని ఇక్కడ ఈశ్వరుడు పూర్ణం, జీవుడు పూర్ణం అంటే ఒక్క విధంగానే అది

సాధ్యం. ఈశ్వరుడు = జీవుడు అవాలి. ఆ విధంగా ఈ వాక్యం జీవఈశ్వర ఐక్యాన్ని సూచిస్తున్నది.

2. **పూర్ణాత్ పూర్ణముదచ్యతే** – ముందుభాగంలో లక్ష్యార్థం చూశాము. ఇప్పుడు వాచ్యార్థం చూస్తాము.

పూర్ణాత్ – తత్ పదార్థ ఈశ్వరునినుంచి
పూర్ణమ్ – త్వం పదార్థ జీవుడు
ఉదచ్యతే – పుట్టాడు

ఇప్పుడు సోపాధిక దృష్ట్యా ఈశ్వరునినుంచి జీవుడు పుట్టాడని చెబుతాము. ఇప్పుడు శరీరం దృష్ట్యా ఈశ్వరుడు కారణం, జీవుడు కార్యం అయ్యారు.

**పూర్ణాత్ పూర్ణముదచ్యతే** అంటే జీవఈశ్వరుల మధ్య కార్యకారణ సంబంధం ఉంది.

3. **పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

పూర్ణస్య – ఈశ్వరునినుంచి; పూర్ణస్య – జీవున్ని; ఆదాయ – విడదీస్తే, పూర్ణమ్ ఏవ– ఈశ్వరుడే; అవశిష్యతే – మిగిలివుంటాడు.

ఇక్కడ మళ్ళీ వాచ్యార్థం కుదరదు.

సోపాధిక దృష్ట్యా జీవుడు = శరీరి + శరీరం
జీవుడు – శరీరి = శరీరం అవాలి. కాని ఉపనిషత్తు
జీవుడు – శరీరి = శరీరి అంటున్నది.

అదెలా సాధ్యం? అంటే శరీరి లేకపోతే శరీరానికి విడిగా ఉనికిలేదు. బంగారం లేకపోతే ఆభరణానికి విడిగా ఉనికి లేదు; నీరు లేకపోతే అలకు విడిగా ఉనికి లేదు; మట్టి లేకపోతే కుండకు విడిగా ఉనికి లేదు. అదే విధంగా శరీరి లేకపోతే శరీరానికి విడిగా ఉనికి లేదు; ఈశ్వరుడు లేకపోతే జగత్తుకు విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేకపోతే జగత్తు మిథ్య అవుతుంది. ఈ విధంగా ఈ వాక్యం బ్రహ్మసూత్రం, జగన్మిథ్యా అని చెబుతున్నది.

ఇప్పుడు ఈ శాంతిమంత్రాన్ని మళ్ళీ టూకీగా ఒకసారి చూస్తే –

పూర్ణమదః పూర్ణమిదమ్ – జీవ ఈశ్వర ఐక్యమ్
పూర్ణాత్ పూర్ణముదచ్యతే – కార్యకారణ సంబంధం
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే – బ్రహ్మసత్యం జగన్మిథ్యా

ఈ విధంగా వేదాంతసారం అంతా సూత్రభూత శాంతిపాఠంగా వచ్చింది. ఇప్పుడు ఉపనిషత్తు మంత్రాల వివరాలలోకి వెళదాము. ఈ ఉపనిషత్తును నేర్చుకునే ముందు ఈ ఉపనిషత్తును నాలుగు అంశాలుగా చూడవచ్చని చూశాము. అవి –

1. జ్ఞానయోగం నిర్వచనం – మంత్రం 1
2. కర్మయోగం నిర్వచనం – మంత్రం 2
3. జ్ఞానయోగం విచారణ – మంత్రాలు 3–8
4. కర్మయోగం విచారణ – మంత్రాలు 9–18

మొదటి రెండూ సంక్షేప మంత్రాలు అయితే, తక్కినవి విస్తార మంత్రాలు. ఈ విభజన మంత్రాలు వచ్చిన వరుసక్రమాన్ని బట్టి చూశాము.

ఇప్పుడు ఇదే ఈశావాస్యోపనిషత్‌ను ఇంకొక కొత్త కోణంలోంచి చూద్దాము. ఇది ఒక సాధకుని ప్రయాణం సాగాల్సిన తీరులో విభజించి చెప్పబడింది. ఆ విభజన చూద్దాము. అలా చూస్తే ఈ ఉపనిషత్తును 5 భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. కర్మయోగం
2. కర్మయోగఫలం
3. చరమ ప్రార్థన
4. జ్ఞానయోగం
5. జ్ఞానయోగఫలం

ముందే చూసినట్టుగా ఇది ఉపనిషత్తులోని మంత్రాల వరుసక్రమంలో లేదు. మన వీలుకోసం మార్చుకున్న పద్ధతి.

1. **కర్మయోగం** – కర్మయోగం నిర్వచనాన్ని ఉపనిషత్తు రెండవ మంత్రంలో చూస్తాము.

**కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ।**
**ఏవం త్వయి నాన్యథేతో ఽస్తి న కర్మ లిప్యతే నరే ॥** –2

వంద సంవత్సరాలు జీవించాలని కోరుకో. శాస్త్రం విధించిన కర్మలు చేస్తూనే జీవించాలి. కర్మయోగ మార్గం తప్ప వేరే మార్గం లేదని ఈ మంత్రం అర్థం.

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం | = సరియైన కర్మ | + | సరియైన దృక్పథం |
| సరియైన కర్మ | = సాత్త్వక కర్మలు | + | పంచమహాయజ్ఞాలు |
| సరియైన దృక్పథం | = ఈశ్వరార్పణ బుద్ధి | + | ఈశ్వరప్రసాదబుద్ధి |

సాత్త్విక కర్మలు అంటే పరోపకార కర్మలు. పంచమహాయజ్ఞాలు అంటే దైవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. ఈశ్వరార్పణ బుద్ధి అంటే ఏ కర్మ

చేసినా ఈశ్వరునికి అర్పిస్తున్నాననే అంకితభావంతో చేయటం. ఈశ్వరప్రసాద బుద్ధి అంటే చేసిన కర్మకు ఏం ఫలం వచ్చినా ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం. ఇవన్నీ కలిపి కర్మయోగం అంటారు.

ఈశావాస్యోపనిషత్ ఈ కర్మయోగానికి అదనంగా మరికొంత బలాన్ని చేకూర్చదలుచుకుంది. అందువల్ల కర్మకు రెండు రకాల సముచ్చయాలను జోడించింది. కేవలకర్మ చేస్తే వచ్చే ఫలంకన్నా కర్మను ఉపాసనతో కలిపి చేస్తే దాని ఫలం అధికంగా ఉంటుంది. నిజానికి శాస్త్రం మన నిత్యపూజలోనే ఈ కర్మ, ఉపాసనల సముచ్చయాన్ని జోడించింది. మనం నిత్యం పారాయణం చేసే విష్ణుసహస్రనామానికీ, లలితా సహస్రనామానికీ ముందు ధ్యానశ్లోకాలు ఉన్నాయి. ఈ శ్లోకాలను కూడా మనం సహస్రనామాలతో కలిపి గడగడా చదివేస్తాము. కాని ఆ ధ్యానశ్లోకాలను మనస్సులో చదువుకుని, ఆ మూర్తి వర్ణన ప్రకారం మన మనస్సులో ఆ మూర్తిని నిలబెట్టుకుని అప్పుడు సహస్రనామాలను చదవాలి. అప్పుడు అది కర్మ, ఉపాసనల సముచ్చయం అవుతుంది. సముచ్చయం అంటే కలిపి చేయటం.

**ఇక్కడ చెప్పిన సముచ్చయాలు**

1. కర్మ, ఉపాసన సముచ్చయం
2. ఉపాసనాద్వయ సముచ్చయం

ఉపాసనాద్వయ సముచ్చయంలో హిరణ్యగర్భ ఉపాసనను, ప్రకృతి ఉపాసనతో కలిపి చేయాలి. అందులో కూడా కర్మ ఉంటుంది. గృహస్థుకు కర్మ చేయకుండా కుదరదు.

హిరణ్యగర్భ అంటే సమష్టిబుద్ధి. ప్రకృతి అంటే శక్తి. ప్రకృతిమీద ఉపాసనను వేరే ఎక్కడా చూడము. ఇది శక్తి ఉపాసన.

ఇది కర్మయోగం గురించి.

2. **కర్మయోగఫలం**

కర్మయోగఫలం ఏమిటో ముందు ఉపనిషత్తులో వచ్చినది చూద్దాము. కాకపోతే ఈ ఉపనిషత్తు ఏదీ ప్రత్యక్షంగా చెప్పదనీ, నిఘంటువు అర్థం రాదనీ చూశాము. అందువల్ల ముందు వీటికి ఉపనిషత్తు వాడిన పదాలను చూద్దాము.

| | |
|---|---|
| కర్మ | – అవిద్య |
| ఉపాసన | – విద్య |
| హిరణ్యగర్భ ఉపాసన | – సంభూతి, సంభవం, వినాశం |
| ప్రకృతి ఉపాసన | – అసంభూతి, అసంభవం |

ఈ ఉపనిషత్తు చేసే వివరణ కూడా సూటిగా ఉండదనీ, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలనీ కూడా చూశాము. మనము ఆ శ్రమ పడకుండా శంకరాచార్యులవారు, మన స్వామీజీ మనకు వాటిని విడమర్చి చెప్పారు. ఇక్కడ సముచ్చయ ఫలాన్ని మెచ్చుకోవటానికి ఉపనిషత్తు నహినిందా న్యాయాన్ని వాడింది. నహినిందా న్యాయం అంటే ఒకదాన్ని తిట్టటం, దాన్ని తిట్టటంకోసం కాదు, ఇంకొకదాన్ని స్తుతించటంకోసం. ఇక్కడ కేవలకర్మను, కేవల ఉపాసనను నిందించింది, సముచ్చయం చేయటంకోసం.

రెండు సముచ్చయాలు మంత్రాలు 9–14ల్లో వస్తాయి. వాటి సారం చూద్దాము.

| మంత్రం | కర్మ ఉపాసనల సముచ్చయం | మంత్రం | ఉపాసనాద్వయ సముచ్చయం |
|---|---|---|---|
| 9 | కేవలకర్మ చేసినవారు చీకటిలోకాలకు వెళతారు<br>కేవల ఉపాసన చేసినవారు ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతారు | 12 | కేవల ప్రకృతి ఉపాసన చేసినవారు చీకటిలోకాలకు వెళతారు<br>కేవల హిరణ్యగర్భ ఉపాసన చేసినవారు ఇంకా ఎక్కువ చీకటిలోకాలకు వెళతారు |
| 10 | కేవలకర్మ చేసినవారు స్వర్గలోకానికి వెళతారు<br>కేవల ఉపాసన చేసినవారు బ్రహ్మలోకానికి వెళతారు | 13 | కేవల హిరణ్యగర్భ ఉపాసన చేసినవారు అణిమాది సిద్ధులు పొందుతారు<br>కేవల ప్రకృతి ఉపాసన చేసినవారు ప్రకృతిలో లయమవుతారు |
| 11 | కర్మ, ఉపాసనల సముచ్చయం చేస్తే ప్రాకృత పురుషుడు సంస్కృత పురుషుడై, ఆపేక్షిక అమృతత్వాన్ని పొందుతాడు | 14 | ఉపాసనాద్వయ సముచ్చయం చేస్తే అణిమాది ఐశ్వర్యం పొంది, ప్రకృతిలో లయమవుతాడు |

ఇవీ మనం ఉపనిషత్ మంత్రాలనుంచి చూసిన ఫలాలు. ఇప్పుడు వీటిని లోతుగా విశ్లేషిస్తే వీటిని రెండు ఫలాలుగా చెప్పవచ్చు.

1. **జ్ఞానయోగ్యత ద్వారా జీవన్ముక్తి ప్రాప్తి** – కర్మ చేస్తే చిత్తశుద్ధి పొంది, ఉపాసన చేస్తే చిత్త ఏకాగ్రత పొందుతారు. ఈ రెండూ కలిపి చేస్తారు కాబట్టి వీటి ద్వారా జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొంది, అదృష్టం బాగుంటే, ఈ జన్మలోనే జ్ఞానమార్గానికి వచ్చి, శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందుతారు. ఉపాసనలకు వచ్చే ఫలాల్లో ప్రకృతిలయ చాలా ఉన్నతఫలం, కాని దానికన్నా శాశ్వతఫలం మోక్షం పొందటం. దానికి ఈ సముచ్చయం తోడవుతుంది. అలా మోక్షం పొందటానికి ఈ కర్మయోగం సహకారీ సాధన అవుతుంది, సాక్షాత్ సాధన కాదు.

2. **బ్రహ్మలోకంలో క్రమముక్తి** – ఈ ఉపాసకుడు కేవల కర్మఠుడు కన్నా ఒక మెట్టు ఎక్కువ ఉంటాడు, జ్ఞానికన్నా ఒక మెట్టు తక్కువ ఉంటాడు. ఏ కారణంవల్లనో అతను జ్ఞానయోగానికి రాలేకపోతాడు. దానికి కారణం సరియైన గురువు దొరకకపోవచ్చు, అతనికే తన అర్హతమీద నమ్మకం లేకపోవచ్చు. ఏదేమైనా అతను జీవితాంతం కర్మ ఉపాసనల సముచ్చయం చేస్తూ ఉంటాడు కాబట్టి అతను మరణించాక శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళతాడు. అక్కడ అతను సాక్షాత్తూ బ్రహ్మదేవుని దగ్గర జ్ఞానం పొందితే అక్కడ మోక్షం పొందుతాడు. అంటే సగుణబ్రహ్మ ద్వారా నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందితే, మోక్షం పొందుతాడు. దాన్ని క్రమముక్తి అంటారు.

టూకీగా చెప్పాలంటే ఉపాసనతో కూడిన కర్మయోగం చేసి ఈ జన్మలోనే జ్ఞానయోగానికి వస్తే జీవన్ముక్తి, విదేహముక్తి పొందుతారు, రాకుండా బ్రహ్మలోకానికి వెళితే అక్కడ క్రమముక్తి పొందుతారు.

3. **చరమ ప్రార్థన** – దీన్నే గతి ప్రార్థన అని చూశాము. కర్మ, ఉపాసనల సముచ్చయం చేసి, జ్ఞానమార్గానికి రాని ఉపాసకుడు తన చరమదశలో (మరణకాలంలో) చేసే అంతిమ ప్రార్థన ఇది. ఇతను జ్ఞాని కాదు. జ్ఞానికి ప్రయాణం లేదు. జ్ఞాని విదేహముక్తి పొందుతాడు.

ఈ ఉపాసకుడు చేసే నాలుగు మంత్రాలతో కూడిన ఈ ప్రార్థన మొత్తం వైదిక ప్రార్థనల్లోనే శ్రేష్ఠమైనవి. ఇవి మరణకాలంలోనే చేయాలనే నియమం లేదు, ఎప్పుడైనా చేయవచ్చు. ఆ మాటకొస్తే మరణం ఎప్పుడు సంభవిస్తుందో కూడా మనకు తెలియదు. యమధర్మరాజుకు ముందు చెప్పకుండా వచ్చే అధికారం ఉంది.

ముందు ఈ మంత్రాల (15–18) సారం చూద్దాము.

15 – బ్రహ్మలోకానికి, ఆదిత్యమండలంలోంచి వెళ్ళే ముఖద్వారం బంగారు రంగుతో మెరిసిపోతున్న పాత్రతో కప్పబడివుంది. ఓ సూర్యభగవాన్, నా ధర్మాన్ని సత్యంగా పాటించిన నేను బ్రహ్మను చూడటంకోసం ఆ ద్వారాన్ని నువ్వు నాకు తెరువు.

16 – ఓ సూర్యభగవాన్, నువ్వు నీ కిరణాల తీవ్రమైన వేడిని, కాంతిని నాకోసం తగ్గించుకో. నేను అహంగ్రహ ఉపాసన చేశాను. అందువల్ల నువ్వు, నేను ఒకటే. నేను నీ కళ్యాణతమరూపాన్ని చూశాను.

17 – నేను అనేక యజ్ఞాలు, అనేక ఉపాసనలు చేశాను. నా ఈ స్థూలశరీరం అగ్నికి ఆహుతి అయ్యాక, సూక్ష్మశరీరం సమష్టి సూక్ష్మప్రపంచంలో ఐక్యమగుగాక. ఓ మనసా, నేను చేసిన ఉపాసనలు గుర్తు తెచ్చుకో. ఓ అగ్నీ, నేను నీ సాక్షిగా చేసిన కర్మలను గుర్తు తెచ్చుకో.

18 – ఓ అగ్నిదేవతా! నన్ను ప్రకాశవంతమంతమైన శుక్లగతి ద్వారా తీసుకువెళ్ళు. తిరిగిరాని మార్గంలో తీసుకువెళ్ళు. నువ్వే నా సమస్త కర్మలకు సాక్షివి. నేను చేసిన కుటిలమైన పాపాలను కడిగివేయి. దానికోసం నీకు పదేపదే నమస్కారం, మాటలతో చేస్తున్నాను.

ఇప్పుడు ఈ ప్రార్థనల సారం లోతుగా విశ్లేషిస్తే అతని ప్రార్థనని మూడు అంశాలుగా చూడవచ్చు.

1. **పాపనివృత్తి – జుహురాణమేనః** – నేను అనేక కుటిలమైన పాపాలు చేశాను. నేను జ్ఞానయోగానికి రాలేకపోయాను. వచ్చే జన్మలోనైనా జ్ఞానయోగానికి వచ్చేలా చేయి.

2. **ప్రతిబంధనివృత్తి – వాయురనిలమమృతమ్** – నాకు జనన మరణాల వృత్తం వద్దు. నేను మరణించాక నా వ్యష్టిప్రాణం, సమష్టి వాయువులో కలవాలి. అది అన్ని అంగాలకు ఉపలక్షణంగా తీసుకోవాలి. సూక్ష్మశరీరం, సూక్ష్మప్రపంచంలో కలవాలి. అమృతత్వం రావాలి అంటే క్రమముక్తి పొందాలని అతని ప్రార్థన అర్థం.

3. **శుక్లగతి ప్రాప్తి – హిరణ్మయేన పాత్రేణ** – బ్రహ్మలోకానికి వెళ్ళే మార్గం బంగారు రంగుతో మెరిసిపోతున్న పాత్రతో కప్పబడివుంది. ఈ ప్రార్థన తనను శుక్లగతి ద్వారా తీసుకువెళ్ళమని సూచిస్తున్నది. అదికూడా సాధకుడు బ్రతిమాలటం లేదు. తను చేసిన ఉపాసనకు ఫలంగా రావాలని అధికారపూర్వకంగా కోరుకుంటున్నాడు.

4. **జ్ఞానయోగం** – ఈ జ్ఞానయోగం భాగం మొత్తం వేదాంత మంత్రాల్లోనే చాలా ముఖ్యమైన భాగం. అందులోనూ మొదటిమంత్రం ఇంకా చాలా ముఖ్యమైనది.

**ఓం ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।**
**తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనమ్ ॥** – 1

ఈ జగత్తంతా, ఒక్క చిన్నభాగం కూడా వదలకుండా, ఈశ్వరుని చేత కప్పబడివుంది. ఈ జ్ఞానం పొంది, కోరికలను త్యజించి, నిన్ను నువ్వు రక్షించుకోవాలి. ఎవరి సొమ్మునూ ఆశించకూడదు.

మంత్రాలు 3–8 వరకు ఆత్మస్వరూపాన్ని వర్ణిస్తాయి. అవి చాలా ముఖ్యమైన మంత్రాలు కాబట్టి, ముందు ఆ మంత్రాల సారాన్ని చూద్దాము.

3 – ఆత్మజ్ఞానం పొందనివారు ఆత్మ హంతకులతో సమానం. వారు మరణించాక కారుచీకటి లోకాలకు వెళతారు. అజ్ఞానుల నింద ద్వారా జ్ఞానస్తుతి చేస్తున్నది.

4 – ఇంద్రియాలు, మనస్సు, ఆత్మల మధ్య ఒక ఊహాజనితమైన పరుగు పందెమును వివరిస్తున్నది ఉపనిషత్తు. ఆత్మను మనస్సే అందుకోలేకపోతే ఇంక ఇంద్రియాల గురించి

చెప్పేదేమున్నది. అంటే ఆత్మ మనోఇంద్రియ అగోచరం. ఆత్మ నీరుకు, హిరణ్యగర్భకు అధిష్ఠాన దేవత. నిరుపాధిక దృష్ట్యా ఆత్మ ఏకం, అచలం.

5 – ఆత్మ వెళుతుంది, వెళ్ళదు. ఇది ఉపాధి భేదాన్ని సూచిస్తుంది. ఆత్మ చాలా దూరంగా ఉంది, చాలా దగ్గరగా ఉంది. ఇది దృష్టిభేదాన్ని సూచిస్తుంది. అది అన్నింటిలోనూ సర్వాంతర్యామిగా ఉంది, అంతటా సర్వవ్యాపకంగానూ ఉంది.

6 – ఆత్మను మూడు దశల్లో తెలుసుకుంటాము. నాలో ఆత్మ ఉంది, అన్ని శరీరాల్లో ఆత్మ ఉంది, ఆత్మలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి. రెండు, మూడు దశలను ఇందులో చూస్తాము. ఎవరైతే అటువంటి ఆత్మజ్ఞానం పొందుతారో, వారు అభద్రతాభావనను పొందరు.

7 – మూడవదశను మళ్ళీ చూస్తాము. ఎవరైతే ఆత్మలోనే అన్నీ ఉన్నాయనే ఏకత్వాన్ని చూస్తారో, వారికి మోహం ఉండదు, శోకం ఉండదు.

8 – ఇందులో మరికొన్ని ఆత్మ లక్షణాలను చూస్తాము. ఆత్మ సర్వవ్యాపకం, స్వయంజ్యోతి ప్రకాశకమ్, శరీరత్రయ విలక్షణం, పాపరహితం, సర్వజ్ఞం, సర్వేశ్వరం, సర్వాతీతం, సర్వ అధిష్ఠానం.

ఈ మంత్రాల్లో వచ్చిన ఆత్మ లక్షణాలను క్రోడీకరిస్తే వాటిని తొమ్మిది లక్షణాలుగా చెప్పవచ్చు. అవి –

1. **చైతన్య స్వరూపత్వమ్** – ఆత్మనైన నేను చైతన్యస్వరూపాన్ని. **కవి** పదం సూచిస్తుంది దీన్ని. కవి అంటే సర్వజ్ఞుడు అని అర్థం ఇక్కడ.

2. **శరీరత్రయ విలక్షణత్వమ్** –

**అకాయమవ్రణమస్నావిరగ్ం శుద్ధమ్**

అకాయమ్ అంటే సూక్ష్మశరీరరహితం; అవ్రణమ్, అస్నావిరగ్మ్ అంటే స్థూలశరీరరహితం; శుద్ధమ్ అంటే కారణశరీరరహితం. అన్నీ కలిపి శరీరత్రయవిలక్షణమ్.

3. **సర్వప్రేరకత్వమ్** – విద్యుచ్ఛక్తి ఫ్యాన్లు, లైట్లకు శక్తిని ఇచ్చినట్టుగా ఆత్మ దేవతలందరకూ వారి విధులను నిర్దేశించి, ఆ విధులను సక్రమంగా నిర్వర్తించేలా చేస్తుంది. ఆత్మ చేస్తుంది అంటే మళ్ళీ కర్తా అని అర్థం వస్తుంది. సన్నిధి మాత్రం చేతనే ఆయా పనులు అవుతాయి.

**యథాతథ్యతోఽర్థాన్ వ్యదధాత్**

4. **సర్వగతత్వమ్ – పర్యగాత్** పదం సూచిస్తుంది. ఆత్మ సర్వవ్యాపకం.

5. **ఏకత్వమ్ – తన్నైజతి** – ఆత్మ ఎక్కడికీ వెళ్ళదు. ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి ఎక్కడికీ వెళ్ళదు. దీన్నించి వచ్చే ఇంకొక లక్షణం, ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి ఏకం. ఉన్నదొకటే ఆత్మ. ఏకమేవాద్వితీయమ్. ఇక్కడ **ఏకత్వమనుపశ్యతః** అని వచ్చింది.

6. **శుద్ధత్వమ్** – ఆత్మ అన్ని భూతాలలో ఉన్నాకూడా ఆత్మకు మలినాలు అంటవు.

**సర్వభూతేషు చ ఆత్మానామ్**

అన్ని శరీరాల్లో శరీరిగా ఉన్నా కూడా, శరీరానికున్న మలినాలు అంటవు; మనస్సుకున్న రాగద్వేషాలు అంటవు. ఉదాహరణకు కాంతి ఒక పుస్తకంమీద ప్రసరించినా కూడా ఆ పుస్తకానికున్న దుమ్ము కాంతికి అంటదు.

7. **రూపద్వయత్వమ్** – ఆత్మ లక్షణాలను సోపాధిక, నిరుపాధిక లక్షణాలుగా సమాంతర రేఖలుగా వర్ణించుకు వస్తున్నది ఉపనిషత్. ఆ భిన్నలక్షణాలను అర్థం చేసుకోవాలంటే ఈ రూపద్వయం లక్షణాన్ని అర్థం చేసుకోవాలి.

**తద్ధావతోఽన్యానత్యేతి తిష్ఠత్** – అన్నింటికన్నా వేగంగా వెళుతుంది, కదలదు

**తదేజతి తన్నైజతి** – అది వెళుతుంది, అది వెళ్ళదు

8. **సత్యత్వమ్** – ఈ సత్యత్వాన్ని మంత్రం 7 సూచిస్తుంది. ఇది చాలా అద్భుతమైన మంత్రం. శంకరాచార్యులవారు దీన్ని తరచు ఉటంకిస్తూంటారు.

**యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః** – 7

ఇది ఆత్మజ్ఞానంలో మూడవదశను సూచిస్తుందని చూశాము. ఆ మూడవదశ ఆత్మలోనే అన్ని భూతాలు (ప్రాణులు) ఉన్నాయి. ఆత్మలోనే అన్ని భూతాలు ఉన్నాయంటే జ్ఞాని ఈ మొత్తం జగత్తును ఈశ్వరునిగా చూస్తాడు. మొదటి మంత్రంలోనే ఆ విషయం వచ్చింది.

**ఈశా వాస్యమిదగ్ం సర్వమ్** – 1

అంటే అతని దృక్పథంలో మార్పు రావాలి. ముందు చూసిన మూడుదశలనే జగత్తు పరంగా చూద్దాము.

1. ముందు జగత్తును మాత్రమే చూస్తాడు.

2. తర్వాత జగత్తు అంతటా ఈశ్వరుడు ఉన్నాడు అంటాడు. అంటే జగత్తు + ఈశ్వరుడు అంటాడు.

3. దాని తర్వాత ఈశ్వరుడు మాత్రమే ఉన్నాడు అంటాడు.

జగత్తును మాత్రమే చూసే స్థాయినుంచి జగత్తుతో పాటు ఈశ్వరుణ్ణి చూసే స్థాయికి ఎదిగి, ఈశ్వరుడు లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు కాబట్టి ఈశ్వరుడు మాత్రమే ఉన్నాడు, జగత్తు మిథ్యా అనే జ్ఞానానికి వస్తాడు. దీన్ని పారడైమ్ షిఫ్ట్ అంటారు. ఇది తేలిగ్గా అర్థం కావటానికి అల–నీరు దృష్టాంతం చూద్దాము.

1. ముందు ఒక అలను అలగా చూస్తాము.
2. తర్వాత అల అంతటా నీరు ఉందని తెలుసుకుంటాము. అంటే అల + నీరు అంటాము.
3. దాని తర్వాత నీరు మాత్రమే ఉంది అంటాము.

అంటే అలను మాత్రమే చూసే స్థాయినుంచి నీరు మాత్రమే సత్యం అనే స్థాయికి ఎదుగుతాము.

కర్మయోగంలో కూడా ఇలాగే మూడు దశల్లో సాధకుడు తన దృక్పథాన్ని మార్చుకుంటాడు.

1. ముందు కర్మ మాత్రమే చేస్తాడు.

2. తర్వాత కర్మను భగవంతుడుమీద భక్తితో చేస్తాడు అంటే కర్మ + భగవంతుడు అంటాడు.

3. దాని తర్వాత భగవంతుణ్ణి మాత్రమే చూస్తాడు, కర్మను చూడడు. ఏం చేసినా, ఏం చూసినా, ఏం విన్నా, ఏం మాట్లాడినా భగవంతుణ్ణే చూస్తాడు.

కర్మయోగం స్థాయినుంచి జ్ఞానయోగం స్థాయికి వస్తే ఏం చేసినా, ఏం చూసినా, ఏం విన్నా అదంతా ఆత్మే అంటాడు. ఆత్మకు భిన్నంగా వేరే ఏదీ లేదంటాడు.

ఆ విధంగా అజ్ఞానికి ఉన్నదంతా జగత్తు మాత్రమే.

జ్ఞానికి ఉన్నదంతా బ్రహ్మ మాత్రమే. అతనికి ద్వైతదర్శనం భ్రాంతి.

శంకరాచార్యులవారు ఇంత గట్టిగా బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని చెబుతున్నారంటే దానికి ఇలాంటి మంత్రాలే ఆధారం.

9. **మిథ్యాజగదధిష్ఠానత్వమ్** – తాడు–పాము ఉదాహరణ తీసుకుంటే, తాడుమీద పామును ఆరోపిస్తున్నాడు అజ్ఞాని. పాముని అధ్యాస అనీ, తాడుని అధిష్ఠానం అనీ అంటారు. తాడుని చూసి పాము అనుకుంటాడు అతను. అక్కడ నిజంగా పాము లేదు. అలాగే జగత్తును చూసి అది సత్యం అనుకుంటాడు. కాని బ్రహ్మ లేకుండా విడిగా జగత్తుకు ఉనికి లేదని తరువాత తెలుసుకుంటాడు. అంటే బ్రహ్మ మిథ్యాజగత్తుకు అధిష్ఠానంగా అర్థం చేసుకుంటాడు.

మళ్ళీ ఒకసారి టూకీగా ఈ ఆత్మ లక్షణాలను చూస్తే, అవి – చైతన్య స్వరూపత్వమ్, శరీరత్రయ విలక్షణత్వమ్, సర్వప్రేరణత్వమ్, సర్వగతత్వమ్, ఏకత్వమ్, శుద్ధత్వమ్, రూపద్వయత్వమ్, సత్యత్వమ్, మిథ్యాజగదధిష్ఠానత్వమ్.

ఈ ఆత్మ లక్షణాలు నేర్చుకుంటే ఆత్మజ్ఞానం పూర్తి కాదు. నేను = ఆత్మ = బ్రహ్మ అని అర్థం చేసుకోవాలి. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా వాక్యాన్ని నేను (ఆత్మపరంగా) సత్యం, తక్కినదంతా మిథ్య అని అర్థం చేసుకోవాలి. దీనితో జ్ఞానయోగం అయిపోయింది.

5. **జ్ఞానయోగఫలం** – జ్ఞానయోగానికి వచ్చి ఆత్మజ్ఞానం పొందితే కలిగే ఫలం, ఆత్మజ్ఞానం కలుగుతుంది.

**అహం సత్యం జగన్మిథ్యా**

ఇది సాక్షాత్ ఫలం. ఈ జ్ఞానంవల్ల సంసారనివృత్తి కలుగుతుంది. సంసారనివృత్తిని జీవన్ముక్తి అంటారు. అంటే ఇక్కడ, ఇప్పుడే మోక్షం కలుగుతుంది. జీవన్ముక్తి ఫలాన్ని అనేక విధాలుగా నిర్వచిస్తారు. ఇక్కడ మూడు ఫలాలను ఇచ్చింది ఉపనిషత్తు. వాటిని చూద్దాము.

1. **శోకనివృత్తి** – శోకం అంటే రోజంతా ఏడుస్తూ కూర్చోనవసరం లేదు. కాని ఏదో అసంతృప్తి, కొరత, లోటు వెన్నాడుతూనే ఉంటుంది చాలామందిని. ఎన్ని ఉన్నా, ఏదో తక్కువైందనే బాధ.

స్వామీజీ దీనికి పూరీ ఉదాహరణ చెబుతారు. ఒక మూకుడులో ఉన్న నూనెలో పూరీ వేస్తే, ఆ పూరీ పొంగేదాకా అది మూకుడులో అసహనంగా తిరుగుతూనే ఉంటుంది. ఎప్పుడైతే పూర్తిగా పొంగుతుందో, అప్పుడే కుదురుగా ఒకచోట ఉంటుంది. మన మనస్సు కూడా అంతే. ఏదో తక్కువైందనే భావనతో అన్నింటివెంటా పరుగులు తీస్తూ ఉంటుంది. ఎప్పుడైతే పూర్ణత్వం పొందుతుందో, అప్పుడే వెంపర్లాట పోతుంది. పూర్ణమిదం అని నేర్చుకుంటే, ఇంక దేని గురించిన కోరిక ఉంటుంది?

2. **మోహనివృత్తి** – మోహం అంటే తప్పుడు ఆలోచన. రాగం, శోకం బుద్ధిని కప్పివేస్తుంది. అందువల్ల సత్యాన్ని సరిగ్గా తెలుసుకోలేము. అందువల్ల పూర్ణత్వం, ఎప్పుడో భవిష్యత్తులో దొరికే వస్తువు అనుకుంటాము.

వేదాంతం అలా అనుకుంటే అది తప్పు అంటుంది. ఇప్పుడు నువ్వు భోరున ఏడుస్తున్నా కూడా నువ్వు ఆనందస్వరూపుడివి, పూర్ణుడివి అంటుంది. అంటే పూర్ణత్వం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చేది కాదు, అది సిద్ధవస్తువు. నువ్వు ఎప్పుడో పూర్ణుణ్ణి అవుతాననుకుంటే ఎప్పటికీ కాలేవు. అయితే ఇప్పుడు పూర్ణుడివి లేదా ఎప్పటికీ కాదు అంటుంది.

3. **జుగుప్సా నివృత్తి** – జుగుప్స అంటే ద్వేషం, నింద, అభద్రతా భావన అని అర్థాలు చెప్పవచ్చు. ఇవన్నీ భయంనుంచి పుట్టినవే.

**ద్వితీయాద్వై భయం భవతి** – బృహదారణ్యకమ్

రెండవది ఉంటే కదా, దాన్ని చూసి భయపడేది. అద్వైతంలో ఉన్నదొకటే ఆత్మ లేదా బ్రహ్మ. అందువల్ల భయనివృత్తి కలుగుతుంది.

ఈశా వాస్యమిదగ్ం సర్వమ్– భద్రతనిచ్చే ఆత్మే అంతటా ఉంది

| | |
|---|---|
| తేన త్యక్తేన | – అభద్రతకు లోనుచేసే అనాత్మను మిథ్యగా కొట్టివేయి |
| భుంజీథాః | – ఆత్మ ఒక్కటే భద్రతను ఇస్తుంది |
| మా గృధః | – ఆ భద్రతకోసం బాహ్యంగా వెతకకు |

మొట్టమొదటి మంత్రమే ఆ హామీ ఇచ్చాక –

**తత్ర కో మోహః కశ్శోకః –**మోహం ఎక్కడిది? శోకం ఎక్కడిది?

ఇందులో ముఖ్యమైన మంత్రాలు – 1, 2, 6, 7, 8, 15–18.

## శాంతిపాఠం

ఉపనిషత్ నేర్చుకునే ముందు శాంతిపాఠం పఠిస్తాము. అక్కడ గురుశిష్యుల ఆరోగ్యం బాగుండాలని, ఆటంకాలు కలుగకుండా ఉండాలనీ చేస్తాము. ఉపనిషత్ అంతా నేర్చుకున్నాక మళ్ళీ శాంతిపాఠం పఠిస్తాము. మన ప్రార్థన ఆలకించి, పరమాత్మ గురుశిష్యుల ఆరోగ్యం బాగా ఉంచి బ్రహ్మవిద్యను దిగ్విజయంగా నేర్చుకునేలా చేసినందుకు, ఆటంకాలు కలుగకుండా చేసినందుకూ కృతజ్ఞతతో మళ్ళీ పఠిస్తాము.

ఈశావాస్యోపనిషత్ శాంతిపాఠం ప్రత్యేకమైనదని చూశాము. దాని సారం –

1. జీవ ఈశ్వరుల ఐక్యం
2. జీవ ఈశ్వరుల మధ్య కార్యకారణ సంబంధం
3. బ్రహ్మసత్యం జగన్మిథ్యా.

ఈశావాస్యోపనిషత్ ముగించేసరికి ఈ సారం అర్థం అయినందుకు కూడా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాము.

ఓం తత్సత్

# శిష్యుల సందేహాలు – స్వామీజీ సమాధానాలు

1. వేదాంతం, తత్త్వమసి అనీ నువ్వు ఆనందస్వరూపుడవు అనీ బోధిస్తున్నది కాని నా అనుభవం దానికి భిన్నంగా ఉంది. ఈ రెండింటినీ సమన్వయపరచటమెలా?

**జవాబు** – వేదాంతబోధలో ఎంతమాత్రమూ సందేహం లేదు. నువ్వు బ్రహ్మవు, నువ్వు ఆనందస్వరూపుడవు అనేది అక్షరసత్యం. వేదాంతం ప్రమాణం కాబట్టి దాన్ని కొట్టివేయలేము.

మీరు జీవునిగా దుఃఖం అనుభవించటమూ అబద్ధం కాదు. కాకపోతే, ఆ అనుభవాన్నే ఇక్కడ సరిగ్గా అర్థం చేసుకోవాలి. ప్రకృతిసూత్రం ప్రకారం ఆబ్జెక్టు వేరు, సబ్జెక్టు వేరు. అంటే ప్రమేయం వేరు, ప్రమాత వేరు. దుఃఖం అనేది మీకు అనుభవంలోకి వస్తున్న ప్రమేయం. అది మీరు కాదు. మీరు ఈ క్షణంలో భోరున విలపిస్తున్నా కూడా, మీ స్వరూపలక్షణం అయిన శుద్ధ ఆనందం ఎంతమాత్రమూ మారదు. మీకు అనుభవంలోకి వస్తున్నది విషయానందం. అది విషయవస్తువులనుంచి వస్తుంది. స్వరూప ఆనందం అనుభవంలోకి వచ్చేది కాదు. సుషుప్తిలో ఎలా దుఃఖ అభావం ఉంటుందో, అలా మీ స్వరూపం కూడా దుఃఖ అభావం. మీరు సత్, చిత్, ఆనందస్వరూపులని మహావాక్య విచారణ నేర్పిస్తే, నిదిధ్యాసనం ఆ జ్ఞాననిష్ఠలో నిలబడటానికి తోడ్పడుతుంది. ఈ జ్ఞానాన్ని త్వరగా జీర్ణించుకోవాలంటే దేహాత్మబుద్ధిని తగ్గించుకోవాలి.

2. 'అహం బ్రహ్మాస్మి,' జ్ఞానంకన్నా 'సర్వం బ్రహ్మ,' జ్ఞానం శ్రేష్ఠమైనది కాదా? సర్వంలో అహం (నేను) కూడా వచ్చేటప్పుడు, పనిగట్టుకుని 'అహం బ్రహ్మాస్మి,' అని చెప్పటం ఎందుకు? పైగా అలా చెప్పటం అహంకారానికి దారితీయదా?

**జవాబు** – 'అహం బ్రహ్మాస్మి,'లో అహం అంటే మీ శరీరం కాదు, మీ మనస్సు కాదు; వాటిలో ఉండి వాటిని సాక్షిగా చూసే చైతన్యం.

సర్వం బ్రహ్మ అని నేర్చుకోవటం సరియైన జ్ఞానమే కాని, మీ జ్ఞానం అక్కడితో పూర్తి అవదు. దాన్ని పరోక్షజ్ఞానం అంటారు. నేను సాక్షిచైతన్యాన్ని అని తెలుసుకుంటేనే అది పూర్తి అవుతుంది. దాన్ని అపరోక్షజ్ఞానం అంటారు. బ్రహ్మ నిర్వచనం సత్, చిత్, ఆనందం బ్రహ్మ. ఈ మూడింటిలో బ్రహ్మయొక్క సత్ అంశం మాత్రమే బాహ్యజగత్తులో తెలుస్తుంది. సత్ అంటే ఉనికి. ది బుక్ ఈజ్, ది టేబుల్ ఈజ్, ది ట్రీ ఈజ్ వాక్యాల్లో ఉన్న ఈజ్‌నెస్సే ఎక్సిస్టెన్స్ లేదా ఉనికి. వీటిని తెలుగులో చెబితే పుస్తకం ఉంది, బల్ల ఉంది, చెట్టు ఉంది వాక్యాల్లోని ఉనికిని సత్ అంశం అంటారు. అది జగత్తులో తెలుస్తుంది. కాని చిత్, ఆనందం తెలియవు. అవి మనస్సులోనే తెలుస్తాయి.

మనస్సుకు మాత్రమే ప్రతిబింబింపజేసే లక్షణం ఉంది. అందువల్లనే బల్ల, పుస్తకాల్లో చైతన్యం ఉన్నా కూడా వాటికి మనస్సు లేదు కాబట్టి వాటిల్లో తెలియదు. నేను ఉన్నాను అని చెప్పగలగటమే చైతన్య అంశంవల్ల. ఆనందస్వరూపం కూడా జీవియొక్క స్వరూపం. అందువల్ల అహం బ్రహ్మోస్మి జ్ఞానం పొందితేనే అది పూర్తి జ్ఞానం అవుతుంది.

అది అహంకారానికి దారితీయదు, ఎందుకంటే అహం బ్రహ్మోస్మిలో అహం అంటే అహంకారం కాదు, చైతన్యం.

3. ఆత్మజ్ఞానం ఎక్కడ కలుగుతుంది? ఆత్మలోనా? అనాత్మలోనా?

**జవాబు** – ఆత్మజ్ఞానం చైతన్యశరీరంలో కలుగుతుంది. చైతన్యశరీరం ఆత్మ, అనాత్మల మేలు కలయిక. కేవలం ఆత్మ అహం బ్రహ్మోస్మి జ్ఞానం పొందలేదు, ఎందుకంటే అది అకర్తా. నేను బ్రహ్మను అని ఆత్మ చెబితే, అది క్రియ అవుతుంది. అప్పుడు ఆత్మ సవికారానికి లోనవుతుంది.

సరే అనాత్మ చెబుతుందా అంటే, అనాత్మ కూడా చెప్పలేదు. ఏ వ్యవహారం కూడా ఇటు శుద్ధ ఆత్మలోనూ జరగదు, అటూ శుద్ధ అనాత్మలోనూ జరగలేదు. మనస్సు జడమైనా కూడా దానికి ప్రతిబింబింపజేసే లక్షణం ఉంది. ఆత్మను బింబచైతన్యం అనీ, మనస్సును ప్రతిబింబ మాధ్యమం అనీ, అది ఏర్పరచిన ప్రతిబింబాన్ని ప్రతిబింబ చైతన్యం అనీ అంటారు. బింబ చైతన్యాన్ని చిత్ అనీ, ప్రతిబింబ చైతన్యాన్ని చిదాభాస అనీ అంటారు. ఈ చిదాభాస ద్వారా జీవుడు వ్యవహారం నడుపుతాడు. అందువల్ల ఆత్మజ్ఞానం కలిగేది ఈ మూడింటి మేలుకలయికలో – చిత్, చిదాభాస, మనస్సుల కలయికలో.

4. చిత్, చిదాభాస, మనస్సు మూడూ ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సివస్తే, ఒక్క చిత్ గురించే ఎందుకు చెబుతారు?

**జవాబు** – ఈ మూడింటి మేలుకలయిక వల్లనే బ్రహ్మజ్ఞానం లేదా ఆత్మజ్ఞానం పొందుతాము నిజమే కాని ఈ మూడింటిలో చిత్ మాత్రమే సత్యం, తక్కిన రెండూ మిథ్యా. ఈ రెండు మిథ్యావస్తువులు వాడి ఆత్మజ్ఞానం పొందాక, అవి మిథ్య అని అర్థం చేసుకుంటాము. అందువల్ల వాటికి తాత్కాలిక ఉనికి మాత్రమే ఉంటుంది, చిత్ మాత్రమే పారమార్థిక సత్యం.

5. బాహ్యప్రపంచంలో జరిగే అనుభవాలు జ్ఞానికీ, అజ్ఞానికీ ఒక్కలాగే ఉంటాయా?

**జవాబు** – అనుభవాలు ఒక్కలాగే ఉంటాయి కాని వాటికి వారు స్పందించే తీరులో భేదం ఉంటుంది. అజ్ఞాని జగత్తును తన రాగద్వేషాలతో చూస్తాడు కాని జ్ఞాని ఉన్నదున్నట్టుగా చూస్తాడు. తన రాగద్వేషాలను దానికి అంటించడు.

రాగద్వేషాలు మనస్సుకు చెందినవి. మనస్సు, శరీరం అనాత్మ. అజ్ఞానికి ఆ విషయం తెలియదు కాబట్టి, వాటితో మమేకం చెందుతాడు. జ్ఞానికి తను శరీరాన్ని, మనస్సును సాక్షిగా చూసే చైతన్యాన్ని అని తెలుసు కాబట్టి వాటితో మమేకం చెందడు. మనస్సుకు ఏదైనా అయితే 'నేను కలత చెందాను,' అనడు, 'మనస్సు కలత చెందింది,' అంటాడు. అంటే దాన్ని సాక్షిగా చూస్తాడు. అందువల్ల అతను నిత్యతృప్తునిగా ఉంటాడు, పూర్ణానందంతో ఉంటాడు. అజ్ఞాని ఈ దశకు చేరుకోవాలంటే ఆత్మానాత్మ జ్ఞానం పొంది, తన స్వరూపజ్ఞానంలో నిలవాలి.

6. శాస్త్రంలో అనేక అంశాలను అనాది అంటారు. జీవుడు, ఈశ్వరుడు, బ్రహ్మ, మాయ, అజ్ఞానం, కాలతత్త్వం అన్నీ అనాది అంటారు. అద్వైతంలో ఇన్ని అంశాలు అనాది ఎలా అవుతాయి?

**జవాబు** – అద్వైతం పదాన్ని ముందు సరిగ్గా అర్థం చేసుకోవాలి. అద్వైతం అంటే రెండవది లేనిది. దీన్ని పారమార్థిక సత్యం అంటారు. బ్రహ్మ సత్యం వాక్యం పారమార్థిక సత్యానికి చెందినది. పారమార్థిక సత్యంలో ఉన్నదొకటే అద్వైతం, రెండవది లేదు. వ్యావహారిక సత్యంలో, ప్రాతిభాసిక సత్యంలో అనేక అనాదులు ఉన్నాయి. జగత్తు ఒక నియతి ప్రకారం నడవటానికి ఇవి అనాదిగా ఉండాలి. వ్యావహారిక సత్యాన్ని పారమార్థిక సత్యంతో కలపకూడదు.

7. నాకు బ్రహ్మ అనుభవం కావాలని కోరుకోవచ్చా?

**జవాబు** – బ్రహ్మ అనుభవం పొందేది కాదు అని ముందు అర్థం చేసుకోవాలి. ఒకవేళ బ్రహ్మ, అనుభవంలోకి వచ్చింది అంటేనే అది బ్రహ్మ అవదు. ఎందుకంటే,

Ever the experiencer never the experienced

అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవంలోకి వచ్చేది కాదు ఎన్నటికీ

బ్రహ్మజ్ఞానం అంటే బ్రహ్మ అనుభవంలోకి వచ్చే వస్తువు కాదు, నేనే ఆ బ్రహ్మను అని అర్థం చేసుకోవటం. మహావాక్యం బోధించేది అదే.

8. అద్వైతంలో ఈశ్వరుని గురించి ఎలా అర్థం చేసుకోవాలి?

**జవాబు** – అద్వైతం అంటేనే రెండవది లేనిది. **ఏకమేవాద్వితీయమ్.** సత్‌రూపంలో బ్రహ్మ అన్నింటిలోనూ ఉంది. మహావాక్య విచారణ ద్వారా ఆ అద్వైతబ్రహ్మను నేనే అని సాధకుడు అర్థం చేసుకుంటాడు. ఈ జ్ఞానం సంసారబంధంనుంచి అతన్ని విముక్తిడిని చేస్తుంది.

ఈ జ్ఞానాన్ని ఎవరు అందజేస్తారు? నిర్గుణబ్రహ్మ అకర్తా, అవ్యవహారీ కాబట్టి, నిర్గుణబ్రహ్మ అందజేయలేదు. శాస్త్రాలు బోధిస్తాయి. శాస్త్రాలు సాక్షాత్తూ ఈశ్వరునినుంచే వచ్చాయి కాబట్టి వాటికంత పవిత్రత ఆపాదించబడింది, వాటిని ప్రమాణంగా స్వీకరించటం జరిగింది.

**బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు**

మాయాశక్తితో కూడిన ఈశ్వరుడు సృష్టి, స్థితి, లయ కారకుడు. వేదాలు ఈశ్వరుని బోధ. మనం చేసిన కర్మలకు తగ్గ ఫలాలను ఇచ్చేది కూడా ఈశ్వరుడే. అందువల్ల ఈశ్వరుడు కర్మఫలదాత. ప్రకృతి అంతా ఒక నియతి ప్రకారం జరుగుతున్నదంటేనూ, దేవతలంతా వారి పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారంటేనూ దానికి కారణం సర్వ అధిష్ఠానం అయిన ఈశ్వరుడే.

ఈశ్వరప్రార్థన చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది కాని అది ప్రత్యక్షంగా మోక్షాన్ని ఇవ్వదు. మోక్షం వేదాంతశ్రవణం ద్వారానే, అది కూడా గురువు ద్వారానే కలుగుతుంది.

శాస్త్రాలు బ్రహ్మ ఒక్కటే సత్యం అంటాయి. అంటే బ్రహ్మ కాక తక్కినవన్నీ మిథ్య అవుతాయి. ఇంకో విధంగా చెప్పాలంటే నిర్గుణబ్రహ్మ ఒక్కటే పారమార్థికసత్యం, ఈశ్వరుడు వ్యావహారిక సత్యం. ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, వేదాంత విచారణ చేయటానికి ఈశ్వర అనుగ్రహం తప్పకుండా కావాలి. ఇవన్నీ కాదనలేని సత్యాలు. కాని ఈశ్వరుడు, సగుణబ్రహ్మ, వ్యావహారికసత్యంలోకి వస్తాడు. అలాగని ఈశ్వరపూజ మానేయకూడదు.

జ్ఞాని, తను జ్ఞానం పొందాక కూడా ఈశ్వరుణ్ణి కొలవటం మానడు. ఈశ్వరుడు తన హృదయంలో కొలువైవున్నాడని నేర్చుకుంటాడు.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి** – గీత 18.61

9. వేదాంతబోధలో **జగన్మిథ్యా** అనే అంశానికి అంత ప్రాముఖ్యతను ఇస్తారెందుకు?

**జవాబు** – అజ్ఞాని జగత్తు సత్యం అని పొరపాటు పడతాడు. అది బాహ్యంగా కంటికి కనిపిస్తోంది కాబట్టి, దానితో తను వ్యవహారం నడుపుతున్నాడు కాబట్టి అది సత్యం అనుకుంటాడు. కాని నిజానికి బ్రహ్మవినా దానికి విడిగా ఉనికి లేదు. అంతేకాదు, మన అనుభవం కూడా ప్రపంచం శాశ్వతం కాదని అడుగడుక్కీ చూపిస్తూనే ఉంది. అజ్ఞాని శాంతి, భద్రత, ఆనందం జగత్తులో దొరుకుతాయని జగత్తులో వెతుకుతాడు కాని జ్ఞాని అవి తనలోనే ఉన్నాయని అర్థం చేసుకుంటాడు. ద్వైతభావన మూలావిద్యవల్ల ఏర్పడుతుంది. జ్ఞానం పొందితే మూలావిద్య తొలగుతుంది, మూలావిద్య తొలిగితే ద్వైతభావన పోతుంది. ద్వైతభావన కర్మకాండకు మాత్రమే కావాలి.

జ్ఞానకాండకు వచ్చేసరికి బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అని నేర్చుకుంటాడు. ఈ రెండింటిలోనూ ముందు జగత్ మిథ్యా అనే అంశాన్ని బాగా అర్థం చేసుకోవాలి. అప్పుడే జగత్తుమీద ఆధారపడేస్థాయినుంచి, భగవంతునిమీద ఆధారపడేస్థాయికి వచ్చి, తనమీదే ఆధారపడేస్థాయికి

వస్తాడు. అందువల్ల జగత్తు అనిత్యం, అసారం, అసత్యం, అనేకం అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి.

నిజానికి జగత్తువల్ల ఏమీ సమస్య లేదు. జగత్తుమీద ఆధారపడితేనే సమస్య ఏర్పడుతుంది. జగత్తు అందంగా ఉంది, అనుభవాలు ఇస్తుంది, వ్యవహారాలు నడపవచ్చు కాని దానిమీద ఆధారపడకూడదు. కార్డ్‌బోర్డ్ ఛెయిర్‌మీద ఎలాగైతే కూర్చోలేమో అలా జగత్తుమీద ఆధారపడలేము. జగత్తు సత్యం, తన మనశ్శరీరాలు సత్యం అనుకోవటంవల్ల సాధకుడు సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు. ఇదంతా అజ్ఞానంవల్ల ఏర్పడిన పొరపాటు. అజ్ఞానం పోతే, ఈ పొరపాటు పోతుంది.

అప్పుడు కూడా జగత్తు మీద ఉన్న ఈ బంధాన్ని అంత తేలికగా పారద్రోలలేడు సాధకుడు. దానికి శాస్త్రాలు అనేక సాధనలను, ప్రక్రియలను ఏర్పాటుచేసింది. వివేక, వైరాగ్యాలు అందులో ముఖ్యమైనవి. నిత్యానిత్య వస్తువివేకం చేస్తే వైరాగ్యం దాన్ని వెన్నంటే వస్తుంది. అప్పుడు వేదాంతం తేలికగా అర్థమవుతుంది.

10. చైతన్యాన్ని, మనశ్శరీరాలనుంచి ఎలా విడదీయగలము?

**జవాబు** – దీన్ని ఆత్మానాత్మ వివేకం ద్వారా చేయాలి. అనాత్మలోకి జగత్తు, శరీరం, ఇంద్రియాలు, మనస్సు వస్తాయి. అనాత్మ అంటేనే న ఆత్మా, ఆత్మ కానిది. అనాత్మ లక్షణాలు దృశ్యత్వమ్, బాధితవ్యమ్, సగుణత్వమ్, సవికారత్వమ్, ఆగమాపాయిత్వమ్. అనాత్మ పంచభూతాలనుంచి ఏర్పడింది కాబట్టి దాన్ని చూడవచ్చు, అనుభవించవచ్చు. దానికి గుణాలు ఉన్నాయి, అవి మారతాయి, రాకపోకలు ఉన్నాయి.

సాధకుడు అనాత్మకు ఈ పరిమితులు ఉన్నాయి కాబట్టి అవి ఎన్నటికీ శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు అని అర్థం చేసుకోవాలి. ఒక సూత్రం ఆబ్జెక్టుగా కనిపించేదేదీ ఆత్మ కాదు. జగత్తు కనిపిస్తుంది, శరీరం కనిపిస్తుంది, ఇంద్రియాలు విషయవస్తువులను చూస్తున్నాయని తెలుస్తుంది, మనస్సులో వచ్చి పోయే ఆలోచనలు తెలుస్తున్నాయి. అందువల్ల ఇవేవీ ఆత్మ కాదని అర్థం చేసుకోవటమే ఆత్మానాత్మ వివేకం.

ఈ మనశ్శరీరాలకు చైతన్యాన్ని ఇచ్చేది ఆత్మ. మూడు అవస్థల్లోనూ వ్యవహారం నడిపేది ఆత్మ. ఈ శరీరం పోయాక కూడా ఉండేది ఆత్మ అని అర్థం చేసుకోవాలి. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేది ఆత్మ. కాని తమాషా ఏమిటంటే ఇదంతా మనస్సును ఉపయోగించే అర్థం చేసుకోవాలి. మనస్సును ఉపయోగించి మనస్సు మిథ్య, ఆత్మ సత్యం అని అర్థం చేసుకుని, ఆత్మ వైపుకు తిరగాలి. అందువల్ల మనస్సు జ్ఞానికీ, అజ్ఞానికీ ఇద్దరికీ ముఖ్యమే. కాకపోతే అజ్ఞాని మనస్సు చెప్పుచేతల్లోకి జారిపోతే, జ్ఞాని మనస్సును తన చెప్పుచేతల్లో పెట్టుకుంటాడు. అది కూడా ఆత్మజ్ఞానం పొందటానికి.

11. వేదాంతబోధలో ఉన్న రెండు దశలు ఏమిటి?

**జవాబు** – రెండు దశలు – ఆత్మానాత్మ వివేకం, ఆత్మ అద్వితీయత్వ జ్ఞానం. ఆత్మానాత్మ వివేకం అనుమాన ప్రమాణం ద్వారా నేర్చుకుంటే, ఆత్మ అద్వితీయత్వ జ్ఞానం మహావాక్య ప్రమాణం ద్వారా నేర్చుకుంటారు.

చాలామంది రెండవదశకు రాకుండా, మొదటిదశ జ్ఞానాన్నే సంసారంనుంచి బయటపడటానికి అన్వయిస్తారు. ఆత్మానాత్మ వివేకం ఒక ప్రక్రియ. దాన్ని ఒక క్రమపద్ధతిలో, దశలవారీగా చేసుకుంటూ రావాలి. అనాత్మలోని ఒక్కొక్క అంశమూ తీసుకుని, అది నామరూపం మాత్రమే, అది మార్పులకు లోనవుతుంది అంటూ గమనించుకుంటూ రావాలి. 'నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు' అని నోటితే చెపితే చాలదు, వాటి మిథ్యాత్వం అర్థం చేసుకోవాలి.

అంతేకాదు, నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు అంటే నేనెవరు? అది కూడా స్పష్టంగా తెలియాలి. అది జ్ఞానంలోని రెండవదశ. **అహం బ్రహ్మాస్మి** జ్ఞానం పొందితేనే అది పూర్తవుతుంది. జగత్తు మిథ్య అని తెలిశాక కూడా, మీనుంచి జగత్తు ఎక్కడికీ వెళ్ళదు. మీరు జగత్తును వదిలి ఎక్కడికీ వెళ్ళలేరు. బ్రహ్మ అయిన మీరే అనేక నామరూపాలతో ఈ జగత్తుగా భాసిల్లుతున్నారని అర్థం చేసుకోవాలి. దృశ్యప్రపంచం మొత్తం నీనుంచి ఏర్పడిన నామరూపాలు మాత్రమే అని అర్థం చేసుకోవాలి. అప్పుడు సంసారంనుంచి పారిపోనవసరం లేదు. సంసారం మిథ్య, మీరు సత్యం అని అర్థం చేసుకుంటే చాలు.

12. నిధిధ్యాసనం ఎలా చేయాలి?

**జవాబు** – అహం బ్రహ్మాస్మి జ్ఞానాన్ని జీర్ణించుకోకుండా అడ్డుపడే పెద్ద ఆటంకం దేహాత్మ భావన. శాస్త్రం అంత స్పష్టంగా నువ్వు శరీరం కాదు, నువ్వు మనస్సు కాదని చెప్పినా, కొన్ని సంవత్సరాలుగా పాతుకుపోయిన మనశ్శరీరాల అభిమానం అంత తేలికగా పోదు. మీ పూర్వజన్మ పుణ్యపాపాలవల్ల ఏర్పడిన ఈ శరీరం నేను అనుకుంటారు. నేను కర్తను, భోక్తను అనుకుంటారు. ఈ కర్తృత్వ భోక్తృత్వ బుద్ధిని వదులుకోవాలి. అవి జన్మజన్మలుగా వస్తున్న వాసనలవల్ల ఏర్పడ్డాయి.

ఈ కర్తృత్వ భోక్తృత్వ బుద్ధిని పోగొట్టటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. నిదిధ్యాసనంలో కొత్తగా జ్ఞానం పొందరు. పొందిన జ్ఞానాన్ని అణువణువులోనూ జీర్ణించుకోవటానికి శాస్త్రం నిర్దేశించిన ధ్యానం ఇది. అంటే ఇది శ్రవణ, మననాలు చేసి నిశ్చయజ్ఞానం పొందాక చేసే ధ్యానం. ఇది విపరీత భావనలను (దేహాత్మభావనను) పోగొడుతుంది.

శ్రవణం స్థాయిలో నేర్చుకున్న వాక్యాలమీద ధ్యానం చేయాలి. ఉదాహరణకు ఆత్మ అకర్తా, అభోక్తా, ఆత్మ సర్వవ్యాపకం, ఆత్మ అసంగం అంశాలు తీసుకుని నేను అకర్తా,

అభోక్తా, నేను సర్వవ్యాపకం, నేను అసంగం అని ధ్యానం చేయాలి. అంతేకాదు నేను శరీరాన్ని కాదు, నేను మనస్సు కాదు, వాటిని సాక్షిగా చూసే ఆత్మను అని ధ్యానం చేయాలి.

ఈ నిదిధ్యాసనం లేవగానే చేస్తే మంచిదంటారు ఆచార్యులు. అప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉండి, ఈ నిదిధ్యాసనను సమర్థవంతంగా చేయటానికి తోడ్పడుతుంది.

13. సంసారం ఎలా మొదలయింది, దాన్ని ఎలా పారద్రోలాలి?

**జవాబు** – సంసారానికి ప్రాథమిక కారణం మూలావిద్య (మూల + అవిద్య). ఈ మూలావిద్య మాయాశక్తియొక్క ఆవరణశక్తివల్ల ఏర్పడుతుంది. ప్రతిజీవుడు కూడా ఈ ఆత్మ అజ్ఞానం అనే పెట్టుబడితో పుడతాడు. తన స్వస్వరూపమేమిటో తెలియదు. ఆ అజ్ఞానంవల్ల తను పరిచ్ఛిన్నజీవి అనీ, తను అసంపూర్ణుడనీ అనుకుంటాడు.

నిజానికి జీవితంలోని సుఖదుఃఖాలను అనుభవించేది శరీరం. శరీరంలో ఉన్న శరీరీ (ఆత్మ) అసంగం, ఆత్మ పూర్ణం. ఇది తెలియక, శరీర లక్షణాలను ఆత్మకు ఆపాదిస్తాడు. దీన్ని అధ్యాస అంటారు. ఈ అధ్యాస అతన్ని సంసారిని చేస్తున్నది. ఈ సంసారిత్వం పోవటానికి ఒకటే మార్గం. అది ఆత్మజ్ఞానం పొందటమే. ఆత్మజ్ఞానం పొందితే, అజ్ఞానం పోతుంది; అజ్ఞానం పోతే అజ్ఞానజనిత సంసారం కూడా పోతుంది. అందువల్ల సంసారం అనాది అయినా, దాన్ని జ్ఞానంవల్ల పారద్రోలవచ్చు.

14. మోక్షం పొందటానికి ఏం చేయాలి?

**జవాబు** – మోక్షం పొందాలనుకోవటమే ఒక పెద్ద పొరపాటు. మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే సాధ్యవస్తువు కాదు, అది సిద్ధవస్తువు అంటుంది శాస్త్రం. నువ్వు నిత్య, ముక్త, శుద్ధ పురుషుడివి అంటుంది. అందువల్ల మోక్షంకోసం ప్రయత్నించనవసరం లేదు. కాని జ్ఞానమార్గానికి రావటానికి నాలుగు పురుషార్థాలలో ఒకటిగా మోక్షాన్ని చెప్పింది శాస్త్రం.

జ్ఞానమార్గానికి వచ్చి, అహం బ్రహ్మాస్మి జ్ఞానం పొందాక, తను సంసారంలో ఉన్నాననుకోవటం అధ్యాస, తను ముందే ముక్తపురుషుడు అని అర్థం చేసుకుంటాడు. మోక్షం పొందటానికి ప్రయత్నించనవసరం లేదని తెలుసుకోవటమే మోక్షం. అందువల్ల మోక్షం అంటే సాధ్యవస్తువు కాదు.

కొంతమంది మోక్షం అంటే నివృత్తి అనుకుంటారు. ఆత్మకు సుఖదుఃఖాలు అంటవు, అసంగం అని చూశాము. ఆత్మపరంగా అతను ఆనందస్వరూపుడు. సుఖదుఃఖాలు కలిగేది మనస్సుకు; మనస్సు దుఃఖంలో మునిగి తేలుతున్నా, ఆత్మపరంగా అతను నిత్యముక్తుడే. అందువల్ల మోక్షం అంటే నివృత్తి కాదు.

కాని ఈ నిత్యముక్తిని అనుభవించకుండా, మనస్సులోని అహంకారం అడ్డుపడుతుంది. అహంకారం అంత తేలికగా వదులుకోలేరు గాని, అహంకారాన్ని వదులుకుంటే కాని, నిత్యముక్తిని అనుభవించలేరు.

15. ఆత్మజ్ఞానాన్ని తర్కం ద్వారా పొందవచ్చా?

**జవాబు** – నేను ఉన్నాను అని తెలుసుకోవటానికి ఏ తర్కం కావాలి? నేను ఉన్నాను అనటంలో ఏ సందేహం లేకపోతే, ఆత్మ ఉంది అనటంలో కూడా ఏ సందేహమూ ఉండదు. ఆత్మ సత్యం అని తెలుసుకోవటానికి జగత్తును, శరీరాన్ని, మనస్సును మిథ్యగా అర్థం చేసుకోవాలి. నేతినేతి పద్ధతి ద్వారా ఒక్కొక్కదాన్నీ నిషేధించుకుంటూ వస్తే, చివరికి మిగిలేది ఒక్కటే. అది అన్నింటినీ నిషేధిస్తున్న సాధకుడు. ఆ సాధకుడే ఆత్మ. దానికి తర్కం అవసరం లేదు.

తాడు–పాము విషయమే తీసుకోండి. తాడు అక్కడ ఎప్పుడూ ఉంది. తాడుని చూసి పాము అనుకున్నప్పుడు కూడా తాడు ఉంది. అది పాము కాదని త్రోసిపుచ్చాక కూడా ఉంది. అంటే అక్కడ పాముని నాశనం చేయలేదు, పాముని త్రోసిపుచ్చాము. అలాగే అనాత్మను నాశనం చేయనవసరం లేదు. అది జ్ఞానం పొందాక కూడా ఉంటుంది. త్రోసిపుచ్చటాన్ని బాధితవ్యం అంటారు. మిథ్యావస్తువుకే బాధితవ్యం ఉపయోగించగలరు కాని, సత్యవస్తువుకు కాదు. అనాత్మయొక్క మిథ్యాత్వం ఎంత లోతుగా అర్థమయితే, ఆత్మయొక్క సత్యత్వం అంత బాగా జీర్ణించుకోగలగుతారు.

16. ఆత్మ స్వయంప్రకాశకం అయితే, దానికి శాస్త్రం నేర్చుకోవటం ఎందుకు? దానంతట అదే నాకు అర్థమవాలి కదా?

**జవాబు** – ఆత్మ స్వయంప్రకాశకం నిజమే కాని తక్కిన బాహ్యవస్తువులను చూసినట్టుగా, ఆత్మను చూడలేము. తక్కిన వస్తువులను ఇంద్రియాల ద్వారా, మనస్సు ద్వారా చూస్తాము. కాని ఇక్కడ ఆత్మ అంటే ఏమిటో ముందు అర్థం చేసుకోవాలి. ఆత్మ అంటే అన్నింటిని చూసే నేను. ఇంద్రియాలు, మనస్సు అన్నింటినీ చూస్తాయి, కాని ఆత్మను చూడలేవు; ఎందుకంటే ఆత్మే వాటిని చూస్తుంది. ఆత్మ విషయం వచ్చేసరికి ఆత్మ దృక్; ఇంద్రియాలు, మనస్సు దృశ్యం అవుతాయి. ఆత్మను వేరే ఏవీ చూడలేవు. అంతటినీ చూసే ఆత్మను చూపేది శాస్త్రం మాత్రమే. శాస్త్రప్రమాణం ద్వారానే ఆత్మను తెలుసుకోగలము.

17. శ్రవణ, మననాల్లో స్థాయీబేధాలు ఉన్నాయా?

**జవాబు** – విచార సాగరంలో ఈ క్రింది వివరణ వస్తుంది.

**తాత్పర్య నిర్ణయరూప శ్రవణమ్** – శ్రవణం యొక్క ప్రాథమిక అర్థం తాత్పర్య నిర్ణయం. దానికి షడ్లింగ ప్రక్రియ వాడతారు. అవి ఉపక్రమ–ఉపసంహారం, అభ్యాస, అపూర్వత, ఫలం, అర్థవాదం, ఉపపత్తి. ఈ షడ్లింగ ప్రక్రియ ద్వారా వేదాంతంలో ద్వైతం గురించి వచ్చినా కూడా దాని తాత్పర్యం అద్వైతం మాత్రమే అని తెలుస్తుంది.

మహావాక్యాలలోని ప్రతి ఒక్క పదాన్నీ తీసుకుని దాన్ని లోతుగా విశ్లేషిస్తారు. దాన్ని పదార్థ–నిర్ణయరూప శ్రవణం అంటారు. శ్రవణంలో అజ్ఞాన నివృత్తి కలుగుతుంది. వేదాంతం ద్వైతం గురించి బోధిస్తున్నదా, అద్వైతం గురించి బోధిస్తున్నాదా తెలుస్తుంది. దీన్ని మీమాంస ప్రధానం అంటారు.

**న్యాయ ప్రధానం మననమ్** – శ్రుతిలో పరస్పర విరోధాన్ని సూచించే అనేక వాక్యాలు వస్తాయి. వాటిని తర్కం ద్వారా పూరిస్తారు. శ్రవణంలో పదాల విశ్లేషణ చేస్తారు కాబట్టి దాన్ని మీమాంసా ప్రధానం అంటే, మననంలో భిన్న వాక్యాల విశ్లేషణ చేస్తారు కాబట్టి దాన్ని న్యాయ/తర్క ప్రధానం అంటారు.

మననంలో అవస్థాత్రయ వివేకం, పంచకోశం, సృష్టి విచారణ – ఇవన్నీ జరుగుతాయి. మననంలో ద్వైతాన్ని ఖండించి అద్వైతాన్ని నిలబెడతారు. అంటే మననం భేదభావాలను ఖండించుకువస్తుంది. శ్రుతి చెప్పేదానికీ, అనుభవ ప్రమాణానికీ చాలా భేదం ఉంటుంది. జగత్తు ప్రత్యక్షంగా కనిపిస్తుంది కాబట్టి అది సత్యం అనిపిస్తుంది, కాని శ్రుతి దాన్ని మిథ్యగా కొట్టివేస్తుంది; జీవుడు సంసారంలో అవస్థ పడుతుంటే శ్రుతి అతను నిత్యముక్తుడు అంటుంది. ఆ విధంగా అనుభవప్రమాణానికీ శ్రుతి చెప్పినదానికీ మధ్య పెద్ద అగాధమే ఉంది. ఈ అనుమానాలను అనేక ప్రక్రియల ద్వారా, తర్కం ఉపయోగించి, నువ్వు శరీరం కాదు, నువ్వు మనస్సు కాదు, జగత్తు సత్యం కాదు అని నిరూపిస్తుంది. మననం నిస్సంశయ జ్ఞానాన్ని కలుగజేస్తుంది. అంతేకాదు తక్కిన దర్శనాలలోని లోపాలను ఎత్తిచూపి, అద్వైతాన్ని నిలబెడుతుంది.

ఒక్కముక్కలో చెప్పాలంటే శ్రవణం అజ్ఞాననివృత్తి చేస్తే, మననం సంశయనివృత్తి చేస్తుంది.

18. జ్ఞానంవల్ల సంచితకర్మ మాత్రమే దగ్ధమవుతుందనీ, ప్రారబ్ధకర్మ దగ్ధమవదనీ ఎలా చెప్పగలరు?

**జవాబు** – సంచితకర్మ అపౌరుషేయవిషయం. సంచితకర్మ ఉందని తెలిసేది శాస్త్రం ద్వారానే. అది శాస్త్రప్రమాణం కాక వేరే ఏ ప్రమాణానికీ అందదు. అందువల్ల సంచితకర్మ దగ్ధమవుతుందని శాస్త్రం చెబితేనే తెలుస్తుంది. జ్ఞానం పొందాక జ్ఞాని నేను అకర్తా, అభోక్తా అని అర్థం చేసుకుంటాడు కాబట్టి అతనికి ఆగామికర్మలు అంటవు. జ్ఞానం పొందకముందు

వచ్చే ఆగామి కర్మఫలాల్లో కొన్ని ప్రారబ్ధకర్మగా మారతాయి, కొన్ని సంచితకర్మల్లో చేరతాయి. జ్ఞానం పొందాక సంచితకర్మలు దగ్ధమవుతాయి కాబట్టి పునర్జన్మ ఉండదని శాస్త్రం చెబుతున్నది.

ప్రారబ్ధకర్మను తప్పించుకోలేడు, ఎందుకంటే ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఈ జన్మ కొనసాగుతుంది. అది ముగిసిన క్షణమే ఈ శరీరం రాలిపోతుంది. కాని జ్ఞాని ప్రారబ్ధకర్మకు చలించడు, 'నాకే ఎందుకు వచ్చింది?' అనుకోడు. ఎందుకంటే అతను నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు అని అర్థం చేసుకుంటాడు. అంటే శారీరక బాధ తప్పదు కాని గోరంతలు కొండంతలుగా చేయడు. అందువల్ల ప్రారబ్ధకర్మ ఉన్నా, జ్ఞానికి లేనట్టే అవుతుంది.

19. సత్యం–మిథ్యల మధ్య సంబంధం ఏమిటి?

**జవాబు** – సత్య ఆత్మ, మిథ్యా మనశ్శరీరాలు చాలా దగ్గరగా 'ఉన్నట్టుగా' ఉంటాయి. నిజానికి మిథ్యా మనశ్శరీరాలకు సత్య ఆత్మ అధిష్ఠానం. మనశ్శరీరాలను అనాత్మ అంటారు. ఆత్మ–అనాత్మల సంబంధాన్ని సత్యం–మిథ్య–సంబంధం అనీ లేదా అధిష్ఠాన–అధ్యాస–సంబంధం అనీ అంటారు. దీన్ని ఆత్మ–అనాత్మ–వివేకం ద్వారా తెలుసుకుంటారు. ఆబ్జెక్టుగా తెలిసేది ఏదీ ఆత్మ కాదు. ఆత్మ అంటే సబ్జెక్టు.

ఆబ్జెక్టుకు విడిగా ఉనికి లేదు. అంటే సబ్జెక్టు చూస్తేనే ఆబ్జెక్టుకు ఉనికి ఉంటుంది. ఆబ్జెక్టును ప్రమేయం అనీ, సబ్జెక్టును ప్రమాతా అనీ అంటారు. ప్రమాత చూడకపోతే ప్రమేయానికి ఉనికి లేదు. అందువల్ల ప్రమేయం మిథ్య అవుతుంది. అంతేకాదు సత్యం ఒకటే ఉంటుంది. రెండు సత్యాలు ఉండవు. ఆత్మ సత్యం, అనాత్మ మిథ్య. ఆత్మ పారమార్థిక స్థాయికి చెందితే, అనాత్మ వ్యావహారిక స్థాయికి చెందుతుంది.

ఆత్మ సత్యం, జగన్మిథ్యా సిద్ధాంతాన్ని శంకరాచార్యుల వారు అద్భుతంగా వర్ణిస్తారు దక్షిణామూర్తి శ్లోకంలో –

**విశ్వం దర్పణ దృశ్యమాననగరీ తుల్యమ్**

చాలా సందడిగా ఉన్న ఒక బజారులో ఒక పెద్ద అద్దం పెట్టారనుకోండి. ఆ బజారంతా ఆ అద్దంలో చక్కగా కనబడుతుంది. ఇప్పుడు, ఆ అద్దానికీ, ఆ వీధికీ ఉన్న సంబంధం ఏమిటి? అద్దంలో కనబడుతున్న వీధి అద్దంలోనూ లేదు, అద్దం బయటా లేదు, అద్దానికి భిన్నంగానూ లేదు. ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. మనం మాట్లాడేది అద్దంలోని ప్రతిబింబం మాత్రమే. అసలు వీధి కాదు. అద్దం అధిష్ఠానం, వీధి అధ్యాస అవుతాయి. అక్కడనుంచి అద్దం తీసేస్తే ఏమవుతుంది? అద్దంలో ఏర్పడిన ప్రతిబింబం పోయింది. అంటే ప్రతిబింబానికి ఉనికి ప్రతిబింబ మాధ్యమం అయిన అద్దంవల్లనే ఏర్పడింది. అటువంటి సంబంధాన్ని సత్య–మిథ్యా–సంబంధం అంటారు.

ఇదే అంశాన్ని నిరూపించటానికి ఇంకొక ఉదాహరణ చూద్దాము. జాగ్రద్ పురుషుడు తన మనస్సులోని వాసనల ద్వారా స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తాడు. తను స్వప్నంలో ఉండగా అతనికి అది స్వప్నం అని తెలియదు. అందులో కనబడే స్వప్నవస్తువులు, స్వప్నప్రపంచం, స్వప్నకాలం, సమయం – అన్నీ సత్యంగానే ఉంటాయి. నిద్రనుంచి లేవగానే అది మిథ్య అని తెలుస్తుంది. జాగ్రద్ పురుషుడు లేకుండా స్వప్నప్రపంచానికి ఉనికి లేదని గ్రహించాలి. అంటే స్వప్నప్రపంచం మిథ్యా, జాగ్రత్ పురుషుడు సత్యం. మళ్ళీ వీటి మధ్య సంబంధం సత్య–మిథ్యా సంబంధం అయింది.

ఇప్పుడు ఈ తర్కాన్ని జాగ్రద్ ప్రపంచానికి కూడా అన్వయించాలి. వేదాంతం ఈ జాగ్రదావస్థ కూడా స్వప్నమే, ఇది స్వప్నం–2 అంటుంది. ఈ స్వప్నాన్ని కంటున్నది మహాజాగ్రద్‌పురుషుడు, ఆత్మ అంటున్నది. నీ అసలు స్వరూపం ఈ జాగ్రదావస్థలో అవస్థలు పడుతున్న జీవి కాదు, ఈ జాగ్రదావస్థ అనే స్వప్నాన్ని సృష్టించిన ఆత్మవు అంటుంది. నిద్రనుంచి లేస్తే నిద్ర ప్రాతిభాసిక సత్యం అవుతుంది; అలాగే ఈ జాగ్రదావస్థనుంచి లేస్తే, అది వ్యావహారిక సత్యం అవుతుంది.

ఇందాక అద్దం – అద్దంలోని ప్రతిబింబం విషయంలో చూసినట్టుగానే, ఆత్మపరంగా చూస్తే అనాత్మ, ఆత్మ లోపలా లేదు, బయటా లేదు, దానికి భిన్నంగా లేదు.

20. సంసారిత్వాన్ని కలుగజేసే భావాలను సాధకుడు తన మనస్సునుంచి ఎలా పారద్రోలాలి?

**జవాబు** – ముందుగా సంసారంవల్ల కలిగే సమస్యలు ఏమిటో అర్థం చేసుకోవాలి సాధకుడు. అవి మానసిక ఘర్షణ, ఆందోళన, భయం, దుఃఖం, రాగద్వేషాలు, కామక్రోధాలు. తర్వాత ఇవి దేనికి చెందుతాయో అర్థం చేసుకోవాలి. ఇవన్నీ మనస్సు చేసే గారడీలు. ఇవన్నీ మనస్సులో కలిగే ఆందోళనలు.

సాధకుడు నేను మనస్సు కాదు, నేను మనస్సును సాక్షిగా చూసే చైతన్యాన్ని అనే విషయాన్ని బాగా, అణువణువునా జీర్ణించుకోవాలి. స్వప్నంలో ఏం జరిగినా, మంచం మీద పడుకుని ఉన్న జాగ్రద్‌పురుషునికి ఏమీ కాదు. స్వప్నంలో అతనిని ఎవరో పొడిస్తే, రక్తం జలజలా కారితే, ఆ ఖంగారుకు ఇతని లేచి చూస్తే, పడుకుని ఉన్న తన శరీరానికి ఇంతకూడా గాయం అవలేదని అర్థం చేసుకుంటాడు. అలాగే మనస్సులో జరిగే ఘర్షణలేవీ ఆత్మ అయిన అతనికి అంటవని అర్థం చేసుకోవాలి. అతను అనాత్మకు వచ్చిన సమస్యలను పారద్రోలలేడు కాని వాటిని మిథ్యగా కొట్టివేయాలి.

ముఖ్యంగా శరీరానికి వచ్చిన వృద్ధాప్యం, అనారోగ్యాలను అతను పారద్రోలలేడు. అవి ఉంటాయి కాని మనస్సు వాటి గురించి కలత చెందకుండా ఉండేలా మనస్సుకు శిక్షణని ఇచ్చుకోవాలి. వేదాంతం శారీరక బాధను, మానసిక ఆందోళనను స్వీకరిస్తుంది కాని

వాటితో మమేకం చెందవద్దు అంటుంది. తను పారమార్థిక సత్యం అనీ, ఈ సమస్యలు వ్యావహారికస్థాయికి చెందినవనీ అర్థం చేసుకుంటే సంసారానికి చెందిన బాధలు బాధించవు. అవి అంత తేలికగా పోవు, కాని నిరంతరం సాధన చేస్తేనూ, నిదిధ్యాసనం చేస్తేనూ వీటి నుంచి విడివడగలుగుతాడు.

21. వేదాంతం సంసారం అనాది అంటుంది. అనాదిగా వస్తున్నదానికి అంతం ఉండకూడదు. అలాంటప్పుడు సంసారంనుంచి మోక్షం ఎలా కలుగుతుంది?

**జవాబు** – సంసారం అనాది అంటుంది వేదాంతం. అది నిజమే కాని, సంసారం మిథ్య అని కూడా అంటుంది. అసలు అక్కడ లేనే లేని సంసారాన్ని ఊహించుకుంటున్నాము. లేని సంసారం తొలగటం ఎంతసేపు? ఇక్కడ సంసారనివృత్తి కలుగుతుంది అంటే ఆ నివృత్తి పదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. నివృత్తి అంటే నాశనం అవటం కాదు, నివృత్తి అంటే నిషేధించబడుతుందని అర్థం. ఆ నిషేధం కూడా కర్మ ద్వారా కాదు, జ్ఞానం ద్వారా. అంటే అది బుద్ధిలో కలిగే మార్పు.

జ్ఞాని తను నిత్యముక్తుడననీ, సంసారంలో నిజంగా బంధింపబడిలేడనీ అర్థం చేసుకుంటాడు. అతను అర్థం చేసుకున్నంత మాత్రాన, అక్కడ సంసారం తొలగిపోదు. కాకపోతే అతను దానికి బందీ అవడు.

22. నువ్వు చేసిన కర్మకు తగ్గ ఫలాన్ని అనుభవిస్తావు. ఆ ఫలం నువ్వు కోరినది కాకపోవచ్చు అంటుంది శాస్త్రం. నేను చేసిన కర్మకు తగ్గ ఫలం వచ్చేటట్టయితే, భగవంతుణ్ణి ప్రార్థించటం ఎందుకు?

**జవాబు** – మీరు చేసిన కర్మకు ఫలాలు నాలుగు రకాల్లో ఏదో ఒక రకంగా రావచ్చు. అవి మీరు అనుకున్నది అనుకున్నట్టుగా జరగవచ్చు, అనుకున్నదానికన్నా మెరుగ్గా జరగవచ్చు, అనుకున్నదానికన్నా తక్కువగా జరగవచ్చు, అసలు జరగకనే పోవచ్చు. ఉదాహరణకు మీరు తిరుపతి ప్రయాణం పెట్టుకున్నారు. అన్నీ మీరు ప్రణాళిక వేసుకున్నట్టుగా జరగవచ్చు, లేదా ఎవరో మీకు ప్రత్యేక దర్శనం ఇప్పించవచ్చు, మీరు అనుకున్నదానికన్నా చాలా ఆలస్యం జరగవచ్చు, అసలు అనుకోని ఇబ్బంది ఎదురై మీరు ప్రయాణమే చేయకపోవచ్చు.

ఈ నాలుగు ఫలాల్లో ఇలాగే జరగాలని మీరు దేన్నైనా శాసించగలరా? అనుకున్నట్టుగా జరగదని, కర్మలు చేయటం ఆపేయగలరా? కర్మలు చేయకుండా ఉండలేరు, ఉండకూడదు కూడా. శాస్త్రం మంచి ఆశించు, చెడు వచ్చినా స్వీకరించటానికి సిద్ధపడు అంటుంది. ఇక్కడ ప్రార్థనాబలం కనబడుతుంది. మీరు చేయాల్సిందంతా చేశాక, భగవంతునిమీద భారం వేయాలి. 'నేను చేయాల్సింది చేశాను. నేను ఆశించిన ఫలం కాకుండా, నాకు

రావాల్సిందే నువ్వు ఇస్తావని నాకు తెలుసు. నువ్వు పక్షపాతవైఖరిని చూపించవని కూడా నాకు తెలుసు. నాకు ఏ ఫలం వచ్చినా కూడా, దాన్ని నీ ప్రసాదంగా స్వీకరించే మనోధైర్యాన్ని నాకు కలుగజేయి,' అని ప్రార్థించాలి.

ఇలా ఏ పని చేసినా ఈశ్వరార్పణబుద్ధితో చేసి, దానికి వచ్చే ఫలాన్ని ఈశ్వరప్రసాద బుద్ధితో స్వీకరిస్తే, అది షాక్ అబ్సార్బర్‌లాగా పనిచేస్తుంది. అంతా ఈశ్వరేచ్ఛ. అలాగని ఈశ్వరుణ్ణి మనం కాకా పట్టటం లేదు. మానవప్రయత్నం, ఈశ్వరకృప రెండూ అవసరమే. కొండమీదికి వెళ్ళే రైలుకు ముందొక ఇంజను, వెనకొక ఇంజను ఉంటాయి. అలాగే జీవితమనే కొండ ఎక్కే మనకి ముందున్న ఇంజను మన పురుషప్రయత్నం, వెనుకనుంచి తోసే ఇంజను ఈశ్వరకృప.

23. సంసారంలో తొంగిచూస్తే ఏదీ శాశ్వతం కాదు. కచ్చితంగా ఇది ఈశ్వరుని ఉద్దేశ్యం అయివుండదు. ఎక్కడ తప్పు జరిగింది?

**జవాబు** – మన అజ్ఞానంవల్ల తప్పు జరిగింది. మనను సృష్టించినప్పుడే భగవంతుడు మనకు ఒక మాన్యువల్ ఇచ్చిపంపాడు. అదే వేదం. ఒక చిన్న వస్తువునో, కంటిమందునో కొంటేనే అది ఎలా వాడాలో వివరించే మాన్యువల్ ఉంటుంది. అలాంటిది ఇంత విశాల ప్రపంచంలో అద్భుతంగా తిరగాల్సిన ప్రత్యేకజీవి అయిన మనిషికి ఇంకెన్ని సలహాలు, సూచనలు ఉండాలి?

మనిషిగా పుట్టినప్పుడు ప్రాకృతపురుషునిగా పుడతారు. తర్వాత సంస్కరించబడి సంస్కృతపురుషునిగా మారాలి. తర్వాత మీరు మీ ఆత్మస్వరూపం తెలుసుకుని బ్రహ్మగా అర్థం చేసుకోవాలి. మీ ప్రయాణం జగత్తుమీద ఆధారపడేస్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడేస్థాయికి రావాలి; తర్వాత భగవంతునిమీద ఆధారపడేస్థాయినుంచి మీమీదే (ఆత్మమీదే) ఆధారపడేస్థాయికి రావాలి. నిత్యానిత్య వస్తువివేకం చేసి, ఈ జగత్తులో ఏదీ శాశ్వతం కాదని తెలుసుకోవాలి. మనుష్యులు కూడా శాశ్వతం కాదని తెలుసుకోవాలి. అప్పుడు జగత్తునుంచి, ఒక ఇష్టదేవతను ఎన్నుకుని, ఆ ఇష్టదేవతమీద ఆధారపడటం నేర్చుకోవాలి.

తర్వాత ఈశ్వరుణ్ణి మూడు స్థాయిల్లో కొలవాలని నేర్చుకోవాలి. అవి ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. ఈశ్వరుడు ఈ జగత్తంతా ఉన్నాడని అర్థం చేసుకోవాలి. తర్వాత అరూప ఈశ్వరజ్ఞానం పొందాలి. నేను = ఆత్మ = బ్రహ్మ అనే జ్ఞానం పొందాలి. అప్పుడు భగవంతునిమీద ఆధారపడేస్థాయినుంచి మీమీదే ఆధారపడే స్థాయికి ఎదుగుతారు. అప్పుడు జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే భావన పోయి, ఏకం, నిత్యం, సారం, సత్యం బ్రహ్మను నేను అనే దశను చేరుకుంటారు.

24. ఉపనిషత్తులన్నీ బోధించేది జీవ–ఈశ్వర ఐక్యమే అయినప్పుడు, ఇన్ని ఉపనిషత్తులు నేర్చుకోవటం అవసరమా? ఒకటో, రెండో నేర్చుకుంటే చాలదా?

**జవాబు** – ఉపనిషత్తులన్నింటిలోనూ ఉన్న సందేశం ఒకటే అని నిరూపించటానికి శంకరుల వారు నాలుగు వేదాలనుంచి పది ఉపనిషత్తులను ఎంచుకున్నారు.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః**

ఇలా ఒకటే అంశాన్ని అన్ని ఉపనిషత్తులు బోధించే పద్ధతిని గతి సామాన్యదర్శనం అంటారు. అయినా ఇన్ని ఎందుకు నేర్చుకోవాలి అంటే, ఒక్కొక్క ఉపనిషత్తు బ్రహ్మ గురించి ఒక్కొక్క కోణంలో వివరిస్తుంది. ఒకటే కోణంలోంచి చూస్తే సంపూర్ణజ్ఞానం కలగదు.

**<u>తైత్తిరీయమ్</u>**

బ్రహ్మ స్వరూప లక్షణం – **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**

బ్రహ్మ తటస్థ లక్షణం – **తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః॥**

**కేన**

**అన్యదేవ తద్విదితాదథో అవిదితాదధి**

ఆత్మ తెలిసిన వస్తువు కాదు, తెలియని వస్తువు కాదు అంటే అసలు వస్తువే కాదు.

**ఛాందోగ్యమ్**

**త్రీణి రూపాణీత్యేవ సత్యమ్**

కార్యంనుంచి కారణానికి ఎలా వెళ్ళాలో చాలా తేలికగా అర్థమవుతుంది. జగత్తు అనే కార్యానికి మూడు రంగులకు మూడు భూతాలే (అగ్ని, జలం, పృథివి) కారణం. ఇంకొంచెం వెనక్కి వెళితే ఈ మూడు భూతాలకు కారణం బ్రహ్మ.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**కఠ**

**అంగుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి**
**ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే ఏతద్వైతత్**

అంగుష్ఠమాత్రః పురుషః – జీవాత్మ
ఈశానో భూతభవ్యస్య – పరమాత్మ
న తతో విజుగుప్సతే – ఫలం

ఇలాంటి మహావాక్యాలు ఎన్నో వస్తాయి కఠలో.

**ఐతరేయమ్**

**కో౽హమితి**

పరమాత్మ, ఉన్నదంతా జడం కదా, నన్ను ఎవరు తెలుసుకుంటారు అనుకున్నాడుట. అందుకని తనే జీవాత్మగా ప్రవేశించాడు. ప్రవేశించక ముందు ఈ జీవి ఏదో ఒకరోజు నేను కన్ను కాదు, నేను మనస్సు కాదు, ఇవేవీ నేను కాకపోతే నేనెవరు అని అడగకపోతాడా అని పరమాత్మ ఆశించాడుట. అనుప్రవేశశ్రుతి ఇందులో బాగా అర్థం అవుతుంది.

**కైవల్యం**

**మయ్యేవ సకలం జాతమ్**

అహం బ్రహ్మ అస్మి అని ఎవరు తెలుసుకున్నారు? జీవాత్మనా, పరమాత్మనా? రెండూ ఒకరేనా? భిన్నమా? రెండూ ఒకరే అని కైవల్యోపనిషత్తులో తెలుస్తుంది.

| | |
|---|---|
| బ్రహ్మ = జగత్ కారణం | ఆత్మ = బ్రహ్మ |
| నేను = ఆత్మ | నేను = జగత్ కారణం |

ఆత్మజ్ఞానం పొందిన శిష్యుడు సింహంలా గర్జించి చెప్పిన మాట ఇది.

అందువల్ల ఒకటి రెండు ఉపనిషత్తులు నేర్చుకుంటే చాలదు.

25. సాధారణంగా గురువు అంటే సన్న్యాసి స్వామీజీనో, ఒక మహాత్ముడో అయివుంటాడు. కాని వయస్సులో చిన్నగా ఉండి, మాలాగే సాధారణ గృహస్థ జీవనం గడుపుతూ, లోతైన అంశాలను బోధిస్తుంటే, బోధ ఎంత అద్భుతంగా ఉన్నా, గురువుగా గౌరవించటానికి కొంచెం ఇబ్బందిగానే ఉంది. ఎలా ఆయనమీద గౌరవం పెంచుకోవాలి?

**జవాబు** – మీరు ఒక గురువును గౌరవించేది ఆయన ఆకారాన్ని చూసి కాదు, రూపురేఖలను చూసి అంతకన్నా కాదు. మీరు ఒక ఆలయానికి వెళితే, ఆలయం చుట్టూ ఎత్తైన గోడలు ఉంటాయి, కాని మీరు గర్భగుడికే ప్రాధాన్యతనిస్తారు. గురువులో ఉన్న జ్ఞానం అతనిది కాదు. మీకెక్కడిదీ జ్ఞానం అంటే అతను ఇదంతా మా గురుకృప, మా గురువునుంచి నేర్చుకున్నాను అంటాడు. ఆ గురువును మీరెక్కడ నేర్చుకున్నారు అంటే ఆయన మా గురువునుంచి అంటాడు. అలా ఇది మన ప్రార్థన శ్లోకానికి దారితీస్తుంది.

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్**

అందువల్ల మీరు గురువుకు నమస్కారం చేస్తుంటే, అది ఆయన శరీరానికి కాదు, గృహస్థుకు కాదు; ఆయనలో ఉన్న జ్ఞానానికి, ఆయనకు జ్ఞానాన్ని కలుగజేసిన భగవత్ స్వరూపానికి.

నిజానికి ఏ గురువు కూడా నేను గురువును అని గొప్పలకు పోడు. చిన్మయానంద స్వామీజీ అంటారు, 'వారు పెడుతున్న నమస్కారాలు మీకు పెడుతున్నారు అనుకుంటే, మీ పదాలు తడబడతాయి.' పదాల ప్రవాహం సరిగా రాదు. మీరు మీ గురువు బోధను అందించటానికి వచ్చిన ఆయన రాయబారిగా మాత్రమే భావించాలి.

26. పేదరికంలో పుట్టి, శాస్త్రం గురించి తెలియని వాతావరణంలో పుట్టిన ఒక వ్యక్తి ఇంకా పాపాలే చేస్తాడు కాని పుణ్యం చేయలేడు. వేదాంతం నేర్చుకోవాలంటే పుణ్యం చేసుకుని ఉండాలి అంటారు కదా. అటువంటి వారు ఎన్నటికీ పుణ్యమార్గంలోకి రాలేరా?

**జవాబు** – వారే కాదు, నాస్తికులు కూడా, ఎంత పాపం చేసినా, వారి సంచితకర్మల్లో పాపకర్మ మాత్రమే కాదు, కొంత పుణ్యకర్మ కూడా ఉంటుంది. ఇవి జన్మజన్మలుగా ప్రోగేసుకు వచ్చిన ఫలాలు. అందులోంచి వచ్చిన పుణ్యకర్మలు ఏదో ఒక సందర్భంలో వారికి శాస్త్రం నేర్చుకునే అవకాశం ఇస్తాయి. ఆ పుణ్యం ఎక్కువగా ఉంటే, వారు మారి, వాల్మీకి అంతగా ఎదగవచ్చు. అందువల్ల భగవంతుడు ఎన్నో అవకాశాలు ఇస్తూనే ఉంటాడు. ఎందుకంటే వారి పుణ్యం కూడా నిలువవుంటుంది.

27. నా అనుభవంలో నేను నా ఇంద్రియాల ద్వారా వస్తువులను చూస్తున్నాను, శబ్దాలు వింటున్నాను. అవి ప్రమాణాలని నేను నమ్ముతాను. నిర్గుణబ్రహ్మ అని ఒకటి ఉందనే నాకు తెలియదు. ఆ బ్రహ్మ గురించి వేదాల ద్వారా నేర్చుకోమనీ, వేదమే ప్రమాణమనీ అంటారు. వేదాన్ని ప్రమాణంగా ఎందుకు తీసుకోవాలి?

**జవాబు** – గురువు ముందే వేదం ప్రమాణమని చెప్పడు. ముందు బ్రహ్మ గురించి బోధిస్తాడు. బ్రహ్మ జగత్కారణం అని చెబుతాడు. నువ్వు కోరే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యవస్తువుల్లో లేవు. నువ్వు బ్రహ్మజ్ఞానం పొందితే, అవి నీలోనే ఉన్నాయని తెలుసుకుంటావు అంటాడు. అప్పుడు వృద్ధాప్యం బాధించదు అంటాడు.

బ్రహ్మ గురించి ఇంత విన్నాక బ్రహ్మను తెలుసుకోవటమెలా అంటారు? ఇంద్రియాలకు అందదు, తర్కానికి అందదు అంటాడు గురువు. మరి బ్రహ్మ ఉన్నట్టు సాక్ష్యం ఏమిటి అంటే అప్పుడు గురువు ఇంకొక ప్రమాణం ఉందని వేదాన్ని పరిచయం చేస్తాడు. వేదాన్ని శ్రుతి అని కూడా అంటారు కాబట్టి దాన్ని శబ్దప్రమాణం అని కూడా అంటారు.

అందువల్ల ముందు మీకు బ్రహ్మను పరిచయం చేశాకే, వేదమే ఆ జ్ఞానానికి ప్రమాణం అని చెబుతాడు గురువు.

28. బ్రహ్మ నిర్గుణమనీ, నిర్వికారమనీ అంటున్నారు. కాని పురాణాల్లో భగవంతుడు దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు దిగివస్తాడని అంటారు. అంటే భగవంతునికి కూడా గుణాలు

ఉన్నాయా? భగవంతుణ్ణి ఆర్తత్రాణపరాయణుడు అంటారు కదా, అంటే భగవంతుడు కూడా తన భక్తుల దుఃఖాలతో బంధింపబడతాడా? అంటే ఆయన ఎప్పుడూ నిర్గుణం, అసంగం కాదా?

**జవాబు** – శుద్ధచైతన్యాన్ని నిర్గుణబ్రహ్మ అంటారు. కాని ఆ శుద్ధచైతన్యానికి ఒక మాయాశక్తి ఉంది.

బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు

ఈ సగుణబ్రహ్మ సృష్టి, స్థితి, లయకారకుడు. భగవంతుడు రామునిగా, కృష్ణునిగా అవతారాలు ఎత్తుతాడు. అంతమాత్రాన వారు సంసారులు అయిపోరు. వారు జ్ఞానస్వరూపులు. రెయిన్‌కోట్ వాననుంచి రక్షించినట్టుగా జ్ఞానమనే రెయిన్‌కోట్ వారిని రక్షిస్తుంది. వారికి రాగద్వేషాలు అంటవు.

యాదవ కులస్థులు వారిలో వారు కొట్టుకుని, కులనాశనం చేస్తుంటే కృష్ణపరమాత్మ సాక్షిచైతన్యంగా చూస్తుండిపోయాడు. అతను జ్ఞాని కాబట్టి అలా చేశాడు. అందువల్ల సగుణబ్రహ్మ అవతారం ధర్మస్థాపన కోసం, రాక్షససంహారంకోసం తీసుకోబడుతుంది. వచ్చిన పని అయ్యాక, వారి అవతారాన్ని చాలిస్తారు.

29. వైజ్ఞాన శాస్త్రజ్ఞుడు ఏదైనా కనుగొంటే అది మానవాళికంతటికీ ఉపయోగపడుతుంది కాని జ్ఞాని జ్ఞానం పొందితే అతను మాత్రం బాగుపడతాడు. అలాంటప్పుడు పరావిద్య, అపరావిద్యకన్నా గొప్పదని ఎలా చెప్పగలరు?

**జవాబు** – వైజ్ఞాన శాస్త్రజ్ఞుడు కూడా తను ఆ విషయాన్ని కనుగొనేటంతవరకూ అది తను కనుగొనాలనే తపనతోనే చేస్తాడు. అప్పుడు స్వార్థంతోనే వ్యవహరిస్తాడు. జ్ఞానం పొందాక సమాజానికి మేలుచేస్తాడు. వైద్యుడు కూడా అంతే. తను నేర్చుకునేదాకా, తనకు మంచి మార్కులు రావాలనే చూస్తాడు.

అలాగే జ్ఞాని కూడా. తను నేర్చుకునేంతవరకూ శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తూనే ఉంటాడు. తర్వాత సమాజానికి మేలు చేస్తాడు. శంకరాచార్యులవారు సనాతన ధర్మస్థాపనం కోసం ఎంత పాటుపడ్డారు? భారతదేశం అంతా పర్యటించి, ఎందరితోనో వాదోపవాదాలు చేసి, అద్వైతాన్ని నిలబెట్టారు. ఎన్నో స్తోత్రాలు, ప్రస్థానత్రయానికి భాష్యాలు రాశారు. ఎన్నో ఆలయాలు కట్టించారు. ఏ దశలో ఉన్న సాధకునికి ఆ దశకు చెందిన స్తోత్రాలను, భాష్యాలను ఇచ్చారు.

జ్ఞాని కూడా నేర్చుకున్నంతవరకూ తన మంచే ఆలోచించినా, నేర్చుకున్నాక చేసే కర్మలు లోకసంగ్రహం కోసమే చేస్తారు. వారు పూర్ణపురుషులు అని తెలుసుకున్నాక, వారికోసం

వారు చేసేదేం ఉండదు. మన సమీపకాలంలోనే సమాజశ్రేయస్సుకోసం పాటుపడిన వారు స్వామీ చిన్మయానందులవారు, స్వామీ వివేకానందులవారు, స్వామీ దయానందులవారు ఉన్నారు.

30. మనకు ఎన్నో ఆలయాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటిని సందర్శించి, పుణ్యనదుల్లో స్నానం చేస్తే పాపాలు తొలగి, వచ్చే జన్మలో మంచి జన్మ పొందుతాము. అలాంటప్పుడు మంచి జన్మ పొందితే చాలదా? మోక్షమే పొందాలా? ఒకవేళ మోక్షమే పొందాలంటే, జ్ఞానమార్గానికి రావటం తప్ప వేరే మార్గమేదైనా ఉందా?

**జవాబు** – ధర్మార్థకామాలే చాలు, మోక్షం వద్దు అనుకునేవారికి వేదాంతం బలవంతంగా ఆత్మజ్ఞానం బోధించదు. **న బుద్ధిభేదం జనయేత్** అన్నాడు కృష్ణపరమాత్మ. మోక్షం వద్దు, నేను పాపప్రక్షాళణ చేసుకుని మంచి జన్మ పొందుతాను అంటే మీ యిష్టం, ఆల్ ది బెస్ట్ అంటుంది శాస్త్రం. అనారోగ్యం ఉంటేనే మందు వాడాలి.

అర్జునుడు, కృష్ణుడు మంచి స్నేహితులు. ఇద్దరూ కలిసిమెలసి తిరిగారు కాని వారిద్దరి మధ్య ఎన్నడూ ఆత్మజ్ఞానం అంశం రాలేదు. అర్జునుడు అందగాడు, వీరుడు, శూరుడు, సవ్యసాచిగా పేరుపొందిన విలుకాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్మద్రోణులను చూసి, వారు నా స్వజనాలు అనే రాగం పుట్టి, అది శోకమోహాలకు దారితీస్తే, నిస్సహాయ పరిస్థితిలో అర్జునుడు కృష్ణపరమాత్మను శరణు వేడాడు. అప్పుడు గీతాబోధ చేశాడు కృష్ణపరమాత్మ. అందువల్ల అడగందే ఎవరూ ఆత్మబోధ చేయరు.

మోక్షం పొందటానికి ఆత్మబోధ తప్ప వేరే మార్గం లేదు. నాకు మోక్షం వద్దు అంటే, అర్థకామాలనే తీర్చుకోండి, కాని వాటిని ధార్మికంగా తీర్చుకోండి. వేద పూర్వభాగం కర్మయోగాన్ని సూచిస్తుంది. దాని ద్వారా చిత్తశుద్ధి కలుగుతుంది. కర్మయోగం పాటించి, చిత్తశుద్ధి పొందితే, జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. అప్పుడు ప్రపంచం శాశ్వతమైన శాంతి, భద్రత, ఆనందాలను ఇవ్వలేవని మీరు పొందిన వస్తువులలో మూడు దోషాలున్నాయనీ తెలుసుకుంటారు. అవి దుఃఖమిశ్రితత్వమ్, అతృప్తికరత్వమ్, బంధకత్వమ్. అవే వీటికి భిన్నంగా ఉన్న, శాశ్వతమైన ఆనందంకోసం వెతికేలా చేస్తాయి. అంతవరకూ ఆగక తప్పదు.

31. ఈశా వాస్యమిదగ్ం సర్వం అంటే చెడ్డవారిని మంచివారిగా, బాధను సుఖంగా చూడాలి కదా. అది సన్న్యాసికి తప్ప సాధ్యం కాదేమో?

**జవాబు** – ఈశా వాస్యమిదగ్ం సర్వం అర్థం అదికాదు. చెడ్డవారిని మంచివారిగా, మంచివారిని చెడ్డవారిగా చూడమనటం లేదు. ఈశ్వరుడు మంచివారిలోనూ, చెడువారిలోనూ ఉన్నాడు

అంటున్నారు. మంచి, చెడు అనేవి ఆ పదార్థానికి పైపూత. వారందరిలోనూ ఉన్న పదార్థం ఈశ్వరుడే. రుద్రంలో ఆ విషయం వస్తుంది.

**నమో నిషంగిణ ఇషుధిమతే తస్కరాణాం పతయే నమో**
**నమో వంచతే పరివంచతే స్తాయూనాం పతయే నమో**
**నమో నిచేరవే పరిచరాయారణ్యానాం పతయే నమో॥**

ఈశ్వరుడు ధర్మాధర్మాలకు అతీతుడు.

**అన్యత్ర ధర్మాత్ అన్యత్ర అధర్మాత్** – కఠ 1.2.14

మనం పూర్తిగా చెడును కొట్టివేస్తే, ఈశ్వరుణ్ణి కూడా కాదనట్టే అవుతుంది. బంగారపు గనిలో బంగారాన్ని చూస్తే దానిపైన బోలెడంత మురికి ఉంటుంది. అలాగే ఒక దుర్మార్గత్వం అతనియొక్క చైతన్యానికి పైపూత.

తల్లి విషయమే తీసుకోండి. తన కొడుకు ఒక చెడ్డపనిని చేసినంత మాత్రాన అతను తన కొడుకు కాదని చెప్పదు. అతనిలోని చెడుతనాన్ని పారద్రోలటానికి ప్రయత్నిస్తుంది.

**అద్వేష్టా సర్వభూతానామ్** అన్నాడు కృష్ణపరమాత్మ. అతనిచేత మీరు బాధింపబడ్డా అతనిలోని చైతన్యాన్ని చూడాలి.

32. ద్వైతదర్శనం మనకు ఎందుకు కలుగుతున్నది? అది ఎలా పోతుంది?

**జవాబు** – ఆత్మ అజ్ఞానంవల్ల ద్వైతదర్శనం కలుగుతున్నది. నేను ఆత్మను అని తెలియక పోవటమే దానికి కారణం. నేను ఆత్మను అని తెలియక నేను కర్తా, నేను భోక్తా అనుకుంటున్నాము. ఆత్మ అజ్ఞానం పోవాలంటే అది ఆత్మజ్ఞానంవల్లనే పోతుంది. ఆత్మజ్ఞానం శాస్త్రాన్ని శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు ద్వారా నేర్చుకుంటేనే కలుగుతుంది.

# శ్రీ గురుపాదుకాస్తోత్రమ్

అనన్తసంసారసముద్రతార
నౌకాయితాభ్యాం గురుభక్తిదాభ్యామ్ ।
వైరాగ్యసామ్రాజ్యదపూజనాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 1 ॥

కవిత్వవారాశినిశాకరాభ్యాం
దౌర్భాగ్యదావాంబుదమాలికాభ్యామ్ ।
దూరీకృతానమ్రవిపత్తతిభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 2 ॥

నతా యయోః శ్రీపతితాం సమీయుః
కదాచిదప్యాశు దరిద్రవర్యాః ।
మూకాశ్చ వాచస్పతితాం హి తాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 3 ॥

నాలీకనీకాశపదాహృతాభ్యాం
నానావిమోహాదినివారికాభ్యామ్ ।
నమజ్జనాభీష్టతతిప్రదాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 4 ॥

నృపాలి మౌలివ్రజరత్నకాంతి
సరిద్విరాజత్ ఝుషకన్యకాభ్యామ్ ।
నృపత్వదాభ్యాం నతలోకపంక్తే
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 5 ॥

పాపాన్ధకారార్కపరంపరాభ్యాం
తాపత్రయాహీంద్రఖగేశ్వరాభ్యామ్ ।
జాడ్యాబ్ధిసంశోషణవాడవాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 6 ॥

శమాదిషట్కప్రదవైభవాభ్యాం
సమాధిదానవ్రతదీక్షితాభ్యామ్ ।
రమాధవాంఘ్రిస్థిరభక్తిదాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 7 ॥

స్వార్చాపరాణామఖిలేష్టదాభ్యాం
స్వాహాసహాయాక్షధురంధరాభ్యామ్ ।
స్వాన్తాచ్ఛభావప్రదపూజనాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 8 ॥

కామాదిసర్పవ్రజగారుడాభ్యాం
వివేకవైరాగ్యనిధిప్రదాభ్యామ్ ।
బోధప్రదాభ్యాం ద్రుతమోక్షదాభ్యాం
నమో నమః శ్రీగురుపాదుకాభ్యామ్॥ ॥ 9 ॥

Some Important Links of

**ARSHA VIDYA TARANGINI TRUST**

Our books are also available as free downloadable soft copies at
http://www.telugubhakti.com/telugupages/Adwaitam/Adwaitam.htm

Our Gita Classes in Telugu, Audio Files, are available for download at
http://www.telugubhakti.com/telugupages/Adwaitam/BG/BGaudios.htm

**ARSHA VIDYA TARANGINI** conducts Vedanta Online Classes
in M S Teams every Tuesday to Saturday
Time 6.00 p.m to 7.30 p.m
Information of our online classes is available at
http://www.telugubhakti.com/AVTT/onlineclasses.htm

Arsha Vidya Tarangini Online Classes' videos are available at
https://www.youtube.com/channel/UCvN1vYmtiImR1-r9AIVI6QQ/playlists

Name of our YouTube Channel is **ARSHA VIDYA TARANGINI**
you can simply search for **ARSHA VIDYA TARANGINI** in google or YouTube